894.8274
RAM

CE

Chandra Ras

because they snowed

partiality bet-

కవికోకిల గ్రంథావళి - ౪

వ్యాపములు

కవికోకిల

దువ్వూరి రామిరెడ్డి

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10741

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10741

కవికోకిల గ్రంథమాల

పెమ్మారెడ్డిపాళెం - ఎల్లాయపాళెం (పోస్టు)

నెల్లూరు (జిల్లా)

8

ప్రథమ ముద్రణము : 1935
రెండవ ,, : 1945
మూడవ ,, : 1946
నాల్గవ ,, : 1955
ఐదవ ,, : 1959

894.8274
RAM

సర్వస్వామ్యములు : దువ్వూరి వేణుగోపాలరెడ్డివి.

మూల్యం : ఐదురూపాయలు.

AOVA102B131

విషయసూచిక

1. సారస్వతవ్యాసములు.

	పుట	వఱకు
1. కవి	1	3
2. కవిత్వావతరణము	3	10
3. కవిత్వతత్త్వము	10	23
4. కావ్యజీవితము	23	31
5. కవిత్వశిల్పము, అనుకరణము	32	37
6. రసరామణీయకములు	37	46
7. శిల్పసీమలు	46	51
8 కవిత్వప్రయోజనము	52	56
9. కావ్యము, నీతి	56	70
10. మర్మ కవిత్వము	71	88
11. నాటక కళాసంస్కరణము	89	114
12. అల్లసానిపెద్దన, సమకాలీనభావ ప్రతినిధి	115	134
13. నాటకము, చరిత్రము	134	144
14. అలంకార తత్త్వము	145	156

'51

2. తెలుగు కవితలో క్రొత్త తెన్నులు.

	పుట	వఱకు
1. తెలుగు కవితలో క్రొత్త తెన్నులు	157	177
2. అభినవాంధ్ర సాహిత్యము	178	190
3. చిత్ర లక్షణము	191	200
4. సాహిత్యములో రమ్యత	201	207
5. నేటికవిత – ప్రకృతి పూజ	208	214
6 సాహిత్యంలో వైచిత్రి	215	221
7. నా కవితానుభవములు	222	227
8. తిక్కన	228	235
9. "మీరాబాయి" – ఒక విషాదాంతము	236	274

కవిత్వతత్త్వ నిరూపణము

౧. క వి

ఓ కవీశ్వరుఁడా, నీవు సృష్టికర్తవు. నీ సృష్టి లోకోత్తరము; అనన్యపరతంత్రము; ఆనందదాయకము. నీ మహిమ వర్ణనాతీతము. నీ నిర్మాణము దైవసృష్టిని సైత మధఃకరించుచున్నది. నీ కల్పన యాదర్శప్రాయము.

నీ సృష్టియందు లతికలు జంగమములు; శంపాలతలు నిశ్చలములు; కలువకంటులు, కలకంఠకంఠులు; చంద్రముఖులు విద్యుల్లతాంగులు నీ పట్టణములలోఁ జరియించు సామాన్యస్త్రీలు! నీకు పరిచితలైన యువతులెల్లరు సౌందర్యవతులు; హృదయ సమ్మోహన మాత్రాధిదేవతలు! అందరు సీతలు, సావిత్రులు, దమయంతులు, చంద్రమతులు, ద్రౌపదులు, శకుంతలలు.

ఓయి కవితాశిల్పీ, నీచే సమ్మానింపఁబడిన పురుషులందఱు వీరులు, లోకోత్తరకార్య దురంధరులు! భూమిని చాపకట్టుగాఁ జుట్టగలిగిన హిరణ్యాక్షులు; విశ్వమును మూఁడడుగులతోఁ గొలువఁగలిగిన వామన మూర్తులు; రాజలోకమును గండ్రగొడ్డంట నటికి రక్తప్రవాహముచేఁ బితృతర్పణము గావించిన పరశురాములు; ఆల్గరగంగ వేణుగానము గావించిన శ్రీ కృష్ణమూర్తులు, సముద్రమును మథింపఁగల

దేవదానవులు, స్వర్గమందుఁ బ్రవహించు గంగానదిని భూమికి నవతరింపఁ జేయుఁగల భగీరథులు, సృష్టికిఁ బ్రతిసృష్టి గావింపఁ గలిగిన విశ్వామిత్రులు!

నీ పట్టణములోని చంద్రశిలా సౌధములు సూర్య చంద్రుల రాకపోకల నడ్డగింపఁగల యంతటి యున్నతములు, నీ తోటలోనివృక్షములెల్ల ఫలవంతములు, లతలెల్లఁ గుసుమ భరితములు, షడ్ఋతుధర్మము లేకకాలమున నీ యుద్యాన మును సేవించుచుండును, ప్రకృతియంతయు నీ దృష్టికి సచేత నము, మేఘములు, హంసలు, కాముకీకాముకుల ప్రణయ సందేశములఁ గొనిపోవుచుండును!

ఓయీ, నీ సృష్టి కాలబద్ధముగాదు. అనుక్షణ యౌవన పిజృంభణమువలన, కంచెల బిగియుచుండ "ప్రియంవద నిర్దయ ముగ నా కంచెలవల్కలమును బిగించి ముడివేసినది. నీవు కొంచెము సడలింపుము" అని యనసూయతో ముగ్ధముగఁ బలుకుచుఁ బూఁదీవలకు జలసేచనము సేయుచుండిన శకుంతల– దుష్యంతుని కన్నులకు నిర్వాణసామ్రాజ్యమై కనుపట్టిన శకుంతల, నేఁటికిని అదేవిధముగ మా కన్నులకుఁ బొడకట్టు చున్నది! కాని, ప్రకృతి సృజించిన శకుంతల యేమైనది? యౌవ నమును, సౌందర్యమును గాలక్రమముగఁ గోలుపోయినది. జరాభార మామెను శైతము పీడించినది. తుట్టతుదకు ఆ మోహనదేవత, ఆ శకుంతల యనంతకాల సాగరమున బుద్బు దమువలె మజ్జఁగిపోయినది!

ఓ యైంద్రజాలికుఁడా, నీవు కుంచె నొక్కసారి విసరి నంతనె మాయాత్మలు తేలికయై పూలతేకులు తెక్కలుకట్టు

కొని నిర్వ్యాతి పదంబునకుఁ జల్లగ నెగిరిపోవును. మొగము మొత్తినట్లు, కన్నులు మిటారించుకొని మమ్ములను గనుఁ గొనుచున్న ప్రాపంచిక యాధార్థ్యము, మెల్ల మెల్లగ సమసి పోయి యనిర్వచనీయమగు నానంద స్వప్నము అవతరించును! ఓయీ, నీ కలము సోఁకిన ప్రతివిషయము, ప్రతిపదము, ప్రతి భావము, ప్రతిరూపము శాశ్వతమై యమృతమై యొప్పారును! ఒక్కనిమిష మనంతకాల స్వరూపముగఁ గన్పట్టును. భూమి స్వర్గముగఁ బరిణమించును. ఓ కవీ, మానవ జీవితమును ఆనందమఖముగ నొనరింపుము.

---

౨. కవిత్వావతరణము

"బుధే. ప్రబుద్ధోఽసి వాగాత్మని
తత్ బ్రూహి కామచరితం
అవ్యాహతజ్యోతిరార్షం
తే చక్షుః ప్రతిభాతి; అద్యఃకవి రసి"

"నీవు మొదటికవివి" అని బ్రహ్మ వాల్మీకి మహర్షితోఁ జెప్పినటుల రామాయణమునఁ గూర్పఁబడియున్నది. అందు వలన వాల్మీకి యాదికవియనియు రామాయణ మాదికావ్య మనియుఁ గాలక్రమముగఁ బ్రజలు విశ్వసించుచువచ్చిరి. నేఁటికిని విశ్వసించుచున్నారు. బోయచేఁ గూల్పఁబడిన క్రౌంచమును గాంచినప్పుడు వాల్మీకికిఁ గలిగిన శోకావేశమే ప్రథమ కవి త్వావతరణమని లోకప్రసిద్ధి. కాని, నేను వేఱుగఁ దలంచెదను. క్రౌంచ మిథునగాధ వాల్మీకికవియైన విషయమును మాత్రము

తెలుపుచున్నది. రసార్ద్రమైన వాల్మీకి హృదయము క్రౌంచ పక్షి శోకమునకు మతీంత యుద్రిక్తమై శ్లోకరూపమున బయలు వెడలెను. కవితాశక్తి అతని భావమునఁ బిక్కటిల్లుచు పెలి కుఱుకుటకు సమయము వేచియుండెను. అట్టి సమయము క్రౌంచపక్షి యాక్రోశవేదనవలన సిద్ధించినది. అప్పుడు వాల్మీకి నోటినుండి యొక లయాన్వితమైన వాక్యము ఆకాంక్షితము గను, అప్రయత్నపూర్వకముగను బయలువెడలెను. అది యపూర్వము. కావున వాల్మీకి యాశ్చర్యపరవశుఁడై దానినే తలపోయుచుండెను. అంతట బ్రహ్మ ప్రత్యక్షమై ఆ యనుష్టుబ్ శ్లోకములతో రామకథను రచింపుమని యాదేశించెను.

వేదములు ఛందోబద్ధములు, ఛందస్సు వేదాంగము లలో నొకటిగఁ బరిగణింపఁ బడుచున్నది. రామాయణము కన్నను వేదములును వేదాంగములును బూర్వము లనక తప్పదు. ఇట్లగుట వైదిక కవు లేల ఆదికవులు కాకపోయిరి? దీనినిగుఱించి నే నిట్లూహించుచున్నాను. వేదములు విరాట్స్వ రూపుని నిశ్వాసములనియుఁ గావునవే యవి యపౌరుషేయము లనియు ఆర్యులు విశ్వసించియుండినందున ఆ ఛందములు మానవు లనుకరింప సాధ్యములు గావని తలంచియుందురు. కొంతకాలమునకు వాల్మీకి యుద్భవించి, అంతకుమున్ను కథల మూలమునఁ బ్రజలయందు వ్యాపించియున్న రామాయణ గాథను కావ్యముగ రచియించెను. ఇట్లనుటవలన వేదముల కనంతరమును రామాయణమునకుఁ బూర్వమును కవిత్వరచన లేదని చెప్పటగాదు. నన్నయ భారతమునకుఁ బూర్వము

తెలుఁగు దేశమున వ్యాపించియున్న గ్రామ్య సారస్వతము, తరువాత, అభినవమార్గ మవలంభించిన ఆ యుద్గ్రంథముతో పోటీకి నిలువలేక యెట్లునశించెనో, అట్లే రామాయణమునకుఁ బూర్వమున్న చిన్నచిన్న కావ్యములు, గేయములు ఈ బృహత్ప్రబంధముధాటికి నిలువలేక యాత్మహత్య గావించుకొని యుండును. రామాయణమునందు వర్ణింపఁబడిన నాగరకతను గమనించినయెడల ఆకాలమున కవిత్వశిల్పము కొదువపడి యుండెనని చెప్పుట కెవ్వరును సాహసింపరు. సత్యము భూత కాలగర్భమున దాఁగియున్నది. వాల్మీకి ఆదికవియైనను కాక పోయినను, రామాయణ మాదికావ్యమైనను కాకపోయినను సీతారాములు చారిత్రక నాయికానాయకులైనను లేక, వాల్మీకి మహాకవి యగాధ భావసాగరము మథింపగాఁ బైకుబికిన యమృత నవనీతరాసులైనను మనకొక్కటియె! ఇందలి సత్యాసత్యములు చరిత్రకారులకు వదలిపెట్టెదము. వారికి సాధ్యము గాని రసాస్వాదనమునకు మనము పూనుకొందము. రామాయణము శాశ్వతకల్పనయైనది! దాని యధికార మనంతము! సర్వకాలీనము!

కవిత్వము ప్రత్యేకముగ నొక దేశమునకును, ఒక జాతికిని, ఒక నాగరకతకును సంబంధించియుండునదిగాదు. అది విశ్వజనీనమైనది. మొట్టమొదట మానవ హృదయమెప్పుడు రసార్ద్రమాయెనో, అప్పుడే కవితాబీజ మంకురించెను. అప్పుడే మానవుని కల్పనాశక్తియు ప్రతిభయు బయలయ్యెను. అప్పటి నుండియు కవితామహాలత శాఖోపశాఖలుగఁ జీలి మానవ సంఘమునం దల్లుకొనుచున్నది. మానవజాతి యజ్ఞాన నిమ

గ్నమై బాల్యదశయందున్నప్పుడు, రామాయణము, మహా భారతము మున్నగు పెద్దకల్పనలకును, శాకుంతలాది మనోహర నాటక రచనలకును కావలసినంత లోకానుభవమును, సృజన శక్తియు, శిల్పనైపుణియు నలనడి యుండుదనుట స్పష్టము. హైందవసమాజము చాల ఉన్నతదశకు వచ్చిన యనంతరము అట్టికావ్యములు, నాటకములు పుట్టియుండునని నిర్ణయించుటకు వానియందు వర్ణింపఁబడిన సాంఘికాచార వ్యవహారములే తగిన సాక్ష్యములుగ నున్నవి.

మానవునికి భావప్రకటనము గావింపవలసిన యక్కఱ జ్ఞాన మంకురించినప్పటినుండియుఁ గలదు. ఉద్దేశములు వెలి పుచ్చుటకుఁ దగినభాష యుత్పన్నముగాని ప్రథమదశయందుఁ గూడఁ, జేసైగలు, కనుసైగలు మున్నగువానిచేత మనుజులు తమ వ్యవహారములను సాఁగించుకొనుచుండిరి. ఆ కాలమున వారిబుద్ధి యంతగా వికసింపకుండినందువలన వివిధ భావోత్పత్తి కంతయవకాశ ముండియుండదు. కాని, బహిఃప్రకృతి సంబంధమువలన వారిహృదయములందుఁ గ్రమక్రమముగ భావవికసనమును, ఆభావమును బ్రకటించుటకుఁ గావించు ప్రయత్నము వలన భాషయు నభివృద్ధి చెందుచు వచ్చెను. ఉదుములు, మెఱుములు, మేఘములు, వర్షములు, వడగండ్లు, ఉల్కాపాతములు, నక్షత్రములు, సూర్యోదయాస్తమానములు, నదులు, కొండలు మున్నగు నైసర్గికచిత్రములను దర్శించినప్పుడు ఆయా కారణములఁ దెలియమి, ఆదిమమానవులు సంతోషాశ్చర్య భయవిషాదముల వెలిపుచ్చుచుండిరి, నాట్యములు సలుపుచుండిరి, పాటలు పాడుచుండిరి, ప్రార్థనలు

సలుపుచుండిరి. కాని, వారి యాటపాటలకు నియమములు లేవు. మానవసంఘము రానురాను నాగరకత నొందుకొలఁది ఆ యాటపాటలు నియమబద్ధములు గావింపఁబడినవి.

నాట్యము, గానము, కవిత్వము, ఆద్యకళలు, ఇతరకళలు పరికర సాధ్యములు గావున తదనంతరము పుట్టినవి. అన్ని జాతులవారి యాద్యకవిత్వమును బరిశీలించినయెడల సామాన్యముగ నది గేయరూపముగ నుండును. వేదములుగూడ నొకవిధమైన గేయములె, వానిని ఉదాత్తానుదాత్తాదిస్వరములతోఁ జదువకుండిన శ్రుతిహితములుగ నుండవు. ముఖ్యముగ సామవేదమును సామగానమని చెప్పుటయుఁ గలదు. రామాయణముగూడ గేయకావ్యమె. దానిని కుశలవులు గానము చేసినట్లు రామాయణమందు మనము చదువుచున్నాము. నేఁటికిని, అక్షరములులేని "కొడగు" మున్నగు అనాగరక భాషలుగలవు. వానియందు, కవిత్వము గేయరూపమునఁ బ్రచారములో నున్నది. అనాగరక జాతులయందు గేయప్రతిభ మిక్కుటముగ నుండును. వారియం దొక్కఁడొక్కడును కవియె! ఒక్కఁడొక్కఁడును సటకుఁడె! ఈ విషయమును, మనము ప్రత్యక్షముగఁ జూచుచున్నాము. ఏనాది, యెఱుకల, జోగుల, మాలమాదిగజాతులవా రొకసారి యొక క్రొత్త పాట నుగాని వర్ణమెట్టునుగాని వినుట తటస్థించెనేని, మఱునాఁడె అట్టివి యెన్నియో వారు రచించి పాడుచుందురు. హృదయము నాకర్షించు నేవిషయమును గుఱించియైనఁ గ్రొత్తక్రొత్త ఛందస్సులలో, అకృత్రిమముగ వారు పాటలల్లి పాడుచుందురు. కోటప్పకొండనిండ్రాద పోలీసువారికిని, అచ్చట మొక్కుఁబడి

ప్రభల నూరేగించుచుండిన రెడ్లకును బరస్పరము కలహాము సంభవించి హత్యలుజరిగిన విషయమును గుఱించి, బిచ్చమెత్తు జోగుల జాతివారు "ఓరా? చెన్నప్పారెడ్డి, నీ పేరే బంగార్పాకడ్డి" అను వీరరసోద్రేకపూరితమైన యొక గేయమును రచించి పాడుచుండిరి. ఇట్టివి యెన్నియేనియుం గలవు. కలుపుఁదీయు కాలమున నిట్టి చిత్రవిచిత్ర గేయములను మనము యథేష్టనుగ వినవచ్చును. పల్లెటూరి కాఁపులకీ విషయము చక్కగ బోధపడఁగలదు. మధురమైన గ్రామ్య సాహిత్యముతో వారికెక్కుడు పరిచయము గలదు.

ప్రకృతితత్త్వ జిజ్ఞాసయు, శాస్త్రజ్ఞానమును, విమర్శ శక్తియు, మానవసంఘమునందు హెచ్చుకొలది కవిత్వశక్తియుఁ దగ్గిపోవుచుండును. ఎన్నియో ఋక్కులకు కారణభూతములైన యురుములు, మెఱుములు. ఉషస్సులు నేఁడు మనకు సామాన్యములైనవి. వానిని గాంచినప్పుడు మనము ఆశ్చర్య పడుటలేదు. వెఱపొందుటలేదు. ఈకాలమునఁ బిడుగును ఇంద్రునిచేతి శతారధారనుగ మనము తలంచుటలేదు. ఎందువలన? "వాతావరణమున సంచరించు సవ్యాపసవ్య విద్యుత్ప్రవాహములు మేఘముల మూలమున కలసికొన్నప్పుడు భూమిని దాఁకును! అదియే పిడుగు" అని మనము పాఠశాలలోఁ జదివితిమి. స్త్రీల ముఖములకు చంద్రబింబమును సరిపోల్చి పూర్వకవులు సంతసించుచుండిరి. కాని, నేఁటి కవుల హృదయములో నొక మాలిన్యము ప్రవేశించినది చంద్రబింబమునుచూచినంతనే యందలిసౌందర్యము గోచరించుటకుఁ బూర్వమే ఖగోళశాస్త్రములోఁ జదివిన చంద్రవర్ణనము పైను

భూతముఁవలె మనమునందుఁ బొడకట్టును. చంద్రబింబము సుధా కర బింబముగాదు. అందు అగాధములగు పల్లములు, ఎత్తైన కొండలు, అగ్నిపర్వతములు గలవు. చంద్రునిలోని మచ్చ కుందేలుగాదు, మట్టిచెట్టుగాదు; జింకకాదు. ఏకులు వడుకు అవ్వయుఁగాదు. అది అంతులేని చీఁకటి పల్లము! మనమునందు ఈ భావము లుదయించుటతోడనే సుధాకర మండలము నావరించియున్న కవిత్వము నాశనమై పోయినది.

ఇట్లనుటవలన నింకమీఁదఁ కవులు లోకములో పుట్టరా? నూతన కావ్యములు రచియింపఁబడవా, అని కొందఱు ప్రశ్నింపవచ్చును. కవులును బుట్టుదురు. నూత్న కావ్యములును రచియింపఁబడును. కాని, గుణమునందును గల్పన యందును వ్యత్యాస మగుపట్టును. ఇందుకుఁ జాల కారణములుగలవు. పరిస్థితులు మాఱినవి. ప్రజల విశ్వాసములు, భావములు, ఆదర్శములు మాఱినవి. బుద్ధికి బలము హెచ్చినది. భావమునకు బలము తగ్గినది. కవు లేకాలమునఁ బుట్టినను వారి మనఃస్థితి కవిత్వ రచనకుఁ దగినదియే యయ్యును, సమ కాలీన భావములకును, నాగరకతకును, వశవర్తియై యుండును. వాల్మీకి మహాకవి యీ కాలమునఁనే జన్మించి యుండియుండిన రామాయణమువంటి మహాకావ్యమును రచియింపఁజాలఁ డనియే చెప్పవలయును. నాగరక దేశములలో నగ్రగణ్యమగు అమెరికా దేశమునందు నేఁడు రచియింపఁబడు కవిత్వమును జదివినయెడల ఈ రహస్యము కొంతవఱకు తెలిసికొనవచ్చును. ఆకవిత్వమునందు మోటారుకారుల శబ్దము, ట్రాంబండ్ల గడగడలు ప్రతిధ్వనించుచుండును. యంత్రాగారములలోని

పొగ, రస్తాలలోని దుమ్ము ఆ దేశపు గవిత్వమును క్రమ్ము కొనినట్లుండును. ఆ కవితలందు కోకిలాలాపములు వినఁ బడుటకు మాఱు శ్రవణదారుణములైన ర్రైలుబండి కూతలు వినఁబడుచున్నవి!

మన తెలుఁగు కవిత్వమున కీ గతి యెప్పటికినిఁ బట్టకుండుఁగాక!

---

౩. కవిత్వ తత్త్వము

కవిత్వ తత్త్వమును గుఱించిచర్చ లాక్షణికులు తల చూపినప్పటినుండియు జరుగుచున్నది. కవిత్వమన నేమి? అను ప్రశ్న అన్ని దేశములందును, అన్ని కాలములందును అడుగఁ బడుచున్నది. కవులును లాక్షణికులును, విమర్శకులును వారి వారికిఁ దోఁచినరీతిని కవిత్వ లక్షణములను తత్త్వమును నిర్వచించిరి. నేఁడును ఆ ప్రశ్న యంతరింపలేదు. చాల తేలికగ నడుగఁబడి యసంపూర్ణముగఁ ప్రత్యుత్తరము పొందు ప్రశ్నలలో నిది యొకటిగ నున్నది.

ఛందోబద్ధమగు పదసముదాయమె కవిత్వమని యభిప్రాయపడువారును గొందఱుగలరు. కాని, యీ యూహ యవిచార మూలకమైనది. యదార్థకవిత్వమునకు ఛందస్సు అనివార్యముగ ననుగతమగును. అయినను ఛందమును కవిత్వమనుసరింప వచ్చును, లేకపోవచ్చును. నిఘంటువులు, వైద్యశాస్త్రములు, వ్యాకరణములు మున్నగునవి ఛందోబద్ధములై యున్నను వానియందు కవిత్వము పొడసూపకుండు

టయు, కాదంబరి, వాసవదత్త మున్నగు గద్యకావ్యములందు రసస్ఫూర్తి గన్పట్టుటయు నందుకు నిదర్శనము. సంస్కృత లాక్షణికులు గద్యములుగూడ కావ్యముగఁ బేర్కొనిరి. పద్యకావ్యములను రచియించి సహృదయులను మెప్పించుట కన్న గద్యముల రచించి మెప్పించుట కష్టతరమను నభిప్రాయము ఆకాలమున నలవాటులో నుండినటుల, వామనుఁడుదాహరించిన "గద్యం కవీనాం నికషం వదన్తి" అను లోకోక్తివలన మన మూహింపవచ్చును.

కవిత్వమునకు వలయు వస్తుగుణ సామగ్రి యంతయు గద్యపద్యములకు సామాన్యమయ్యును ఛందము పద్యమునకు విశేషము. ఇట్లనుటవలన వాని రెంటికింగల భేదము ఛందస్సు నందేగాదు, దానిననుసరించు మఱికొన్ని గుణములయందుఁ గూడ. గాన లయా సమ్మేళనమువలనఁ గలుగు శ్రుతి మనోహరత్వమును భావప్రేరకశక్తియు ఛందమునందుఁ గలదు. ఛందస్సు కేవలము మానవ నిర్మితమగు కృత్రిమశాస్త్రము గాదు. ఇందుకుఁ బ్రకృతియందె బీజములు గలవు. శోకరసావేశుఁడైన వాల్మీకినోట అప్రయత్నపూర్వకముగ ఛందోబద్ధమగు వాక్యము వెడలుట స్వభావ విరుద్ధముగాదు. కవి హృదయము భావశబలితమై యుద్రిక్తమైనపుడు, భావములు తమంతఁదాము ఉచితమయినభాష వెదకికొని లయాన్వితముగఁ బ్రవహించును. కోపభయాదులచేఁ జిత్తము చంచలమయినప్పుడు మనము మాటలాడుభాషకును, ఉచ్చారణకును, సామాన్య మనస్థితిలో నున్నపుడు మాటలాడు భాషకును జాల భేదము గనుపట్టుచుండును. భావతీవ్రతయు గాంభీర్య

మును ననుసరించి వాక్యమునందు మాటలు చెనుక ముందు ముందు చెనుక లయి యేదోయొక లయాధర్మమున కను గుణముగఁ గుదురు పడుచుండును. "వచ్చెడువాఁ డుల్లుణుఁ డవశ్యము గెల్తువనంగరాదు" అను పద్యపాదమును "ఉల్లు ణుఁడు వచ్చెడుఁవాడు" అని మార్చినయెడల మొదటివాక్య మునఁ బిక్కటిల్లు ఆతురతయు భావతీవ్రతయు రెండవవాక్య మునఁ సన్నగిల్లి చప్పిడియగును. ప్రత్యతియందు బీజరూపము గను అస్పష్టముగను, అసంపూర్ణముగను, సంకీర్ణముగ నున్న రామణీయకమును గేంద్రీకరించి సహృదయుల భావమునందుఁ బరిపూర్ణముగ స్ఫురింపఁజేయుట శిల్పముయొక్క ప్రధాన ధర్మముగావున, కవిత్వమునందు లయాస్వరూపము సర్వాంగ సుందరమై పొడకట్టుచున్నది.

గద్యము పద్యముతోఁ గొంచె మించుమించుగఁ దుల తూఁగుచున్నను, ఛందోలోపము వలన రూపసౌందర్యమును కొంత గోల్పోవుచున్నది. గద్యము రసవంతముగను భావస్ఫో రకముగ నుండవచ్చును. కాని దానిని గద్యకావ్య మందుమే గాని కవిత్వమనము. *కవిత్వమునంగల శ్రుతిరంజకత్వము గద్యమున నుండుటకు వీలులేదు. "మనకు భావము, రసమే

---

* పూర్వము పద్యకావ్యములు చెవికి వినఁబడునటుల పెద్దగఁజదువఁ బడుచుండెడివి. అందువలన కర్ణేంద్రియ ద్వారమునఁగూడ సుఖము నొందుచుండెడి వారము. కాని నేఁడు అలవాటు మాఱినది. చెవులు చేయవలసిన పని కన్నులు చేయుచున్నవి. పెదవులు కదలింపక సవలలు చదువ నలవాటు పడిన మనము పద్యకావ్యములనుగూడ నట్లే చదివి, పొందవలసినంత యానందమును బొందుటలేదు.

గదా ప్రధానము, ఛందస్సుతో నేమిపని?" యని కొందఱు ప్రశ్నింపవచ్చును. అర్థములేని శబ్దముల సంయోగ వియోగ భేదములవలన నుత్పత్తియగు రాగములు మనల నానంద పరవశులఁ గావించుచున్నవి. ఒక్కొక్క రసము నుప్పతిల్లఁ జేయుటకు నొక్కొక్క రాగ మనుకూలించు నని గానశాస్త్రవేత్తలు నిర్ణయించి యున్నారు. వీరణము (వీరంగము) వాయించినపుడు కొందఱికి ఆవేశము పచ్చుటగలదు. యుద్ధపు బ్యాండు విన్నంతనే పిఱికివాని హృదయమునందైన రణోత్సాహము చిప్పిల్లును. ఇట్టి వికారములన్నియుఁ గేవలము శబ్దసంయోగ సారస్యమువలన హృదయమునఁ గలుగు మార్పులేగదా! ఇఁక భావయుక్త పద్యములమాట వేఱుగఁ జెప్పవలయునా?

ఒక ఇంద్రియమునకంటె రెండింద్రియములకు సుఖముఁ గూర్చు వస్తువు ననుభవించునపుడు మన యానందము ఇమ్మడించును. శిల్పముయొక్క పరమప్రయోజనము "సద్వ్యాపర నిర్వృతి"ని గలిగించుటయెగాన నొకేసమయమున నొకటికన్న నెక్కు డింద్రియములకు సుఖము గల్గించునదియె యుత్తమ శిల్పమని మనము నిర్ణయింప వచ్చును. *కావున ఛందోబద్ధమగు కావ్యము నచనముకంటె నెక్కుడు సుఖదాయక మనియె చెప్పవలయును.

సంస్కృత లాక్షణికుల కవిత్వ తత్త్వ నిర్వచనములు కొన్ని యెడలఁ బొక్కీకములుగను అసంపూర్ణములుగనున్నవి.

---

*There is something magical in rhythm. It even makes us believe that the sublime lies within our reach—*Goethe*.

లాక్షణికులు తత్త్వవేత్తలును తార్కికులును కావున వారి బుద్ధి యవయవ పృథక్కరణమునందు నిశితముగఁబ్రవేశించును. వా రొకరూపమయొక్క చుంగాంగ సంయోగతను సమష్టి సౌందర్యమును గమనింపక, యవయవములను, గుణములను ఆత్మను వేఱుపఱచి వానిలో నేవి ముఖ్యములో యను దీర్ఘ చర్చలకుఁ దొడంగి తుదకుఁ దమ యభిమానమునకుఁ బాత్ర మైనదానికిఁ బట్టాభిషేకము గావింతురు. కాని, వానివాని స్థానములందు ఉచితమైనరీతిని అవియవి ముఖ్యములనియు, వానిలో నేవి లోపించినను అంగవైకల్యమో గుణవైకల్యమో లేక ప్రాణాపాయమో సంభవించుననియు వారు తలంపరు.

"తదదోషౌ శబ్దార్థౌ సగుణౌ అనలంకృతీపునఃక్వాపి"

అని మమ్మటుఁడు కావ్యలక్షణమును నిర్వచించెను. కాని, యీ వాక్యమును సాహిత్యదర్పణకారుఁడును, రసగంగాధరకర్త యు విమర్శించి తీవ్రముగ ఖండించియున్నారు. నిర్దోషత్వముచేత కావ్యత్వము సిద్ధించునెడల బ్రౌఢరహితములగు కావ్యములు గూడ సమ్మానార్హములగును. పేరువడసిన యుత్తమ కావ్యము లందేవో కొన్ని దోషములున్నయెడల అట్టికావ్యములు ఆదర ణపాత్రములు గాకపోవలసివచ్చును. ఇట్టి ప్రమాణము నంగీ కరించినయెడల మన కావ్య ప్రపంచము చాల సంకుచితమై పోఁగలదు. ఎట్టి యుత్తమ కావ్యమందైనను ఏదోయొక విధ మైన దోషములు కొన్ని యుండకపోవు. రామాయణ మహా కావ్యమునందు పునరుక్తిదోషములు గలవు. ఎమ్మటాది సంస్కృత లాక్షణికులు రసౌచిత్యముల యుత్కర్షాపకర్షము లను దెలుపుటకు కాళిదాసాది మహాకవుల గ్రంథములనుండి

యుదాహరణములను గ్రహించిరి. కావున అటువంటి కావ్యములు పరిత్యాజ్యములు కావలయునా? బండి ఆకును మేలు రాకును యతి ప్రాసమైత్రి గూర్చెనని అప్పకవివలె పోతన్నను దిట్టిపోసి భాగవతమును నీటఁ గలుపుదుమా! ఏవో కొన్ని వ్యాకరణ విరుద్ధ ప్రయోగములను చేమకూర వెంకన్న యంగీకరించెనని యాతని విజయవిలాసమును, క్త్వార్థక ఇకార సంధులు గలవని ఆముక్తమాల్యదను మనము నిరాదరింతుమా? రసాస్వాదన నిమిత్తము కావ్యముఁ జదువువారికి నిటువంటి దోషములపై బుద్ధి చొరదు. ఈలాటి భాషావిషయక దోషములకంటెను అనౌచిత్యము, నీరసకల్పనము మున్నగు రచనాలోపములు రమణీయతకు భంగము గలిగించును.

మమ్మటుఁడు కావ్యముల కిట్టి కఠినమైన బహిష్కార దండనము విధించునా? ఇది చింత్యము, పూర్వాపరముల యోచించినయెడల ఆయన యభిప్రాయమును మఱికొంత విరివిగ మనము తెలికొనవచ్చును. కావ్యప్రకాశికయందుఁ బ్రారంభమునే మమ్మటుఁడు కవి సృష్టి నిట్లు కొనియాడెను.

"నియతికృతి నియమ రహితాం
హ్లాదైక మయీ, మనన్య
పరతంత్రాం నవరస రుచిరాం,
నిర్మితి మాదధతి భారతీ కవేః"

ఇందలి యొకొక్కపదము నొకొక్క వ్యాసమునకు శీర్షికగ నుండఁదగినంత భావగంభీరముగ నున్నది. కవియొక్క భారతి ప్రకృతి నియమ బద్ధకముగాదు! హ్లాదైకమయమును

నవరస రుచిరమునైన యొక స్వతంత్ర నిర్మాణము! మఱియు లోకోత్తర వర్ణనా నిపుణ కవికర్మ కావ్యమని మమ్మటుఁడు వివరించెను. ఈ యభిప్రాయమును లాక్షణికు లందఱు నేదో యొకవిధముగ నంగీకరించియున్నారు. లోకోత్తరత్వమనఁగా అనుభవసాక్షికమయిన యాహ్లాదగత చమత్కారమని పండిత రాయలును, చమత్కార మనఁగా చిత్త విస్తార రూపమగు విస్మయమని విశ్వనాథుడును వివరించిరి. ఇట్లనుటవలన చమత్కార రహితములగు కేవల శబ్దార్థములకు కావ్యయోగ్యత సిద్ధింపదనియు, అవి ప్రతిభాశాలియగు కవి రచనానైపుణ్యము వలన నలౌకిక రూపగుణ సౌందర్యములను దాల్చి, కావ్య మనిపించుకొొనుననియు మన మూహింపవలయును. లోక సామాన్యమైన రూపములను జూచినప్పుడు మన కేలాటి విస్మయము జనింపదు. దానియందు మన చిత్తము నాకర్షింపఁజాలినంత యసాధారణ విశేష మేదియు గోచరింపదు. కాని, మన మెన్నఁడునుజూచి యెఱుఁగని యొక సౌందర్యవతిని దారిలోఁ గనుగొన్నపుడు, ఆహా! యీమె యెంతరూపవతి? అని యచ్చెరుఁవొందుచుఁ గొంతసేపు నిలఁబడి నిర్వ్యాజముగ నామెతట్టు చూచుచుందుము. అసామాన్య రూపసందర్శనము వలన నిట్టివింతపొడముచుండుట సహజము. కవిత్వమునఁ గూడ నీలాటి లోకోత్తరత లేనియెడల కావ్యము చదువరుల హృదయమును లౌకిక వ్యాపారములనుండి పురల్చి తనయందు లగ్నమగు నట్లొనరింపఁజాలదు. చిత్రకారునికి రంగులకు నెట్టి సంబంధముగలదో కవికిని కవితాసామాగ్రికిని అట్టిసంబంధమె. అంగాంగ సంయోగత, ఔచిత్యము, వర్ణనా సౌందర్యము,

జీవకల్పనము మున్నగునవి కవియొక్క శిల్పనై పుణ్యమునకుఁ జెందినవి. కావున కవి ప్రతిభా శక్తివలన కావ్యమునకు సాధుత్వమును, ప్రతిభా దౌర్బల్యమువలన అసాధుత్వమును సిద్ధించును. ఇట్లనుటవలన కావ్యములు వ్యాకరణదోష భూయిష్ఠములుగ నుండవలయుననుట నామతముగాదు. కాని, భాషావిషయక దోషములకన్న శిల్ప కల్పనాదోషములె రస రామణీయకములకు భంగము వాటిల్లఁజేయునని నామనవి.

*విశ్వనాథుఁ డొక దోషమును ఖండించి మఱియొక దోషమును దెచ్చిపెట్టెను. ఆఁమన 'వాక్యంరసాత్మకంకావ్యం' అని కావ్యలక్షణమును నిర్ణయించెను. ఇది (ఆచార్య దండిమతముతప్ప) పూర్వాలాక్షణికుల మతములకన్న విశాలముగ నున్నట్లు తోచినను, విమర్శించిచూడ నీ వచనము కూడ కవిత్వావరణమును సంకుచితము చేయుచున్నది. ఏలయన: 'విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తిః' అని భరతుని రసలక్షణము. దీనిఁబట్టిచూడ రసము కేవలము మానవచర్యలకు సంబంధించినదని తేలుచున్నది. తిర్యగ్జంతు

---

* నేను "రసరామణీయకములు" అను వ్యాసమునఁ దెలిపినటుల చేతనాచేతన భేదములేక రమణీయ భావము లన్నిటియందు రసముండునను మతము నంగీకరించు పక్షమున "వాక్యం రసాత్మకం కావ్యం" అను నిర్వచనముగూడ నంగీకృతమైనట్లె. అట్లుగాక రసము కేవలము మానవ చర్యలకు సంబంధించినదే యని తలచుఁనెడల ఈ వ్యాసమునందుఁ జూపఁబడిన యభ్యంతరమువలన విశ్వనాథుని నిర్వచనము సంకుచిత మగును.

† "(ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ)"
ఇచ్చట "ఇష్టార్థ" మనఁగా హృద్యార్థము, లేక రమ్యార్థము.

వుల చేష్టలయందు రసాభాసము (రసస్పర్శ) మాత్రము గల దని విశ్వనాథుని యభిప్రాయము. కావున రసమనునది మానవ చర్యాలయందుఁ బూర్ణముగను, పశుపక్ష్యాది మృగాదుల చేష్టల యందు ఆభాసముగను ఉండునని తెలియ వచ్చుచున్నది. కాని, యచేతన వ్యాపారములందు ఏలాటి రసస్పర్శకుఁగూడఁ జోటులేదు. కావున 'వాక్యం రసాత్మకం కావ్యం' అను లక్షణమును మన మంగీకరించినయెడల పాశ్చాత్యుల ప్రకృతి కవిత్వమును, (Lake Poetry, Nature Poetry) సూర్యాస్తమయములు, ఉద్యానవనములు, నదులు, కొండలు, మేఘములు, నక్షత్రములు, చంద్రుఁడు మున్నగువాని వర్ణనములకు కావ్యత్వము సిద్ధింపదు.

'ఉపవన జల చంద్రికోత్సవార్ద్రవలీల లాత్మవిహారంబు లనఁబరగు' అని యుండుటవలనఁ బైనఁ బేర్కొనఁ బడిన యుద్యానాది విషయములు ఉద్దీపన విభావములకు నాధార భూతములుగావున రసవ్యంజకములగును. అట్లగుట 'వాక్యం రసాత్మకం కావ్యం' అను లక్షణములో నివిగూడ నిమిడి యున్నవి, అని కొందరు తలంపవచ్చును. కాని, యీలాటి వర్ణనములు నాయికా నాయకుల వ్యాపారములలోఁ గలసి పోయి వారి చర్యలకు సంబంధ పడినప్పుడె అవి యుద్దీపన విభావములకుఁ గారణములగును. కాని, కవియె యట్టిదృశ్యములను నాయికానాయక సంబంధమపేక్షింపక, తన యాంతరంగిక ప్రేరణమువలన రచియించిన యుద్యాన విషయాది వర్ణనములకు ఉద్దీపనత్వము సిద్ధింపదుగాన, వానిని నీరసములనియె నిర్ణయింపవలయును. ఇదియొక సందిగ్ధ విషయము.

ఇప్పుడు మనము విశ్వనాథుని లక్షణము నంగీకరింపవలసియున్న, సంకుచితమైన రసలక్షణమును మతింత విరివిచేసి, యుద్యానాది వర్ణనములకు గతి కల్పింపవలయును. లేక, పూర్వికుల రసలక్షణ మంగీకరింతుమేని విశ్వనాథుని కావ్య లక్షణమును సంకుచితమైనదని తలంపవలయును.

సాహిత్య దర్పణకారుని కన్నను, సర్వాచీనుడైన పండితరాయలు 'రమణీయార్థప్రతిపాదక శబ్ది కావ్యం' అని రామణీయకమునకుఁ బ్రాధాన్య మొసఁగినందువలన కవితా నర్తకి నాట్యరంగము విశాలమైనది. కావ్యమున మనము చూడ నలసినది చిత్తాకర్షకమగు రామణీయకము. అట్టిగుణమేకావ్యమునందుఁ బూర్ణముగ నుండునో నదియెల్ల సాధువును, ఉత్తమము నగును.

పాశ్చాత్య లాక్షణికులును, కవులును కవిత్వ లక్షణములను వచియించియున్నారు. *భావోత్కర్షతను వెలిపుచ్చు

*(1) Poetry is the spontaneous outflow of powerful feelings. It takes its origin from emotion recollected in tranquility. —*Wordsworth.*

(2) Poetry we will call Musical Thought. —*Carlyle*

(3) Poetry may be defined as the expression of the imagination. —*Shelley.*

(4) (Poetry is) the utterence of a passion for truth, beauty, and power, embodying and illustrating its conceptions by imagination and fancy and modulating its Language on the principal of variety in unity. —*Leigh Hunt*

(5) Poetry is the rhythmic creation of beauty, —*Allan Poe.*

టయె కవిత్వమని వర్డ్సువర్తును, షెల్లీయు (Wordsworth, Shelley) అభిప్రాయపడిరి. కాని, యీ లక్షణము సందిగ్ధముగ నున్నది. భావోత్కర్షతను బ్రకటించుటయంతయు కవిత్వమగునా? ఇదియె యథార్థమైనయెడల గోపోద్రిక్తుడైతిట్టెడి వాని మాటలను, సభ్యుల హృదయము చెలరేగునటుల నేదోయొక రాజకీయ విషయమును గుఱించి యుపన్యసించు నాయకుని వాక్యములును కవిత్వము కావలసివచ్చును. కేవలము భావప్రకటనము కవిత్వముకానేరదు.

కార్లయిల్ పండితుడు (Carlyle) గానాన్వితమైన యాలోచన కవిత్వమని నుడివియున్నాడు. ఈ లక్షణము సత్యమునకుఁ గొంచెము సమీపముననున్నది; అయిననుపూర్ణ సత్యముగాదు. కార్లయిలు పండితుడు గానాన్వితమైన యాలోచన యనుటలో కావ్యమునందు భావములకును శిల్పమునకునుగల సంబంధము నించుక సూచించెను. ఇంతకంటెను లే హంటుగారి (Leigh Hunt) నిర్వచనము మఱికొంత సత్య సమీపవర్తిగనున్నది. ఆయన కవిత్వమునకు సత్యసౌందర్యముల స్పర్శను గలిగించెను. కాని, యమెరికాదేశపుఁ బ్రఖ్యాత కవి యగు ఆలన్ పో (Allan Poe) గారి నిర్వచనమునందు కవిత్వ లక్షణము పరిపూర్ణత నొందినది. ఆలన్ పో గారిని అమెరికా దేశపు పండితరాయలని చెప్పవచ్చును. 'రామణీయకమును లయారూపమున సృజించుటయె కవిత్వము' అని ఆయన తెలిపియున్నాడు. ఈ లక్షణము ప్రాచ్యపాశ్చాత్యులకుఁ బరమసమ్మతమైనదిగ నుండవచ్చును.

కవిత్వప్రభవమును దెలిసికొన్నఁ గొంతవఱకు కవిత్వ

స్వభావమునుగూడ మన మూహింపవచ్చును. సహజమైన ప్రతిభయె కవిత్వమునకుఁ గారణము. ఇతరములు సంస్కా-రములు. అవి కవిత్వమునకు వన్నెదెచ్చును. *నవనవోన్మేషణ శాలినియగు ప్రజ్ఞయె ప్రతిభ యని భామహుఁడు నుడివి యున్నాఁడు. ఇట్టి శక్తి కవియందు లేనియెడల నాతని రచన లన్నియు నిర్జీవములుగ నుండును. అట్లయిన కవికి పాండిత్య మక్క-అలేదా? కవుల పాండిత్యమునకును పండితుల పాండి త్యమునకును జాలభేదమున్నది. కవుల పాండిత్యము సహజ మయి ప్రతిభాంత ర్భూతమయి యుండును. పండితుల పాండి త్యము విశేషగ్రంథపఠనము వలనను శిక్షవలనను నలవడు విషయజ్ఞానము.

కవి యందఱివలె నూరకుండక రమ్యమైన భావప్రపంచ మునేల సృజింపవలయును? ఇది కవియొక్క యాంతరంగిక ప్రేరణము; శమనాతీతమైన సౌందర్యపిపాస; అనివార్యమైన రసావేశము! భావోన్మాదము; కవి హృదయైకవేద్యము. 'తుమ్మువచ్చినను నవ్వువచ్చినను పట్టరాదు' అనెడి సామెత యొకటికలదు. కవి ఆవేశముగూడ నిట్టిదియె. మనోహరమైన దృశ్యమును జూచినపుడు మన మానందము నొందుదుము. అంతట మన యనుభవమును నితరులకుఁ దెలుపవలయు ననుకోరిక యొకటి పుట్టును. వినినవారు సంతసించుచుండ మన యానందమును వర్ణించి వర్ణించి సంతృప్తి నొందుచుందుము.

---

*"ప్రతిభా అపూర్వ వస్తునిర్మాణక్షమా ప్రజ్ఞా; తస్యా విశేషో రసావేశ వైశద్య సౌందర్య కావ్యనిర్మాణ క్షమత్వం.

లోచనవ్యాఖ్య-అభినవ గుప్త పాదాచార్యులు

కోరిక పుట్టిన వెనుక దానిని దీర్చుకొనినిదే మన మనసు కుదుటఁబడియుండదు. మన యనుభూతి నితరులకుఁ జెప్పుటకుఁ జేత కానియెడల నొకవిధమైన యతృప్తి గలుగును. మన భావములను పదిమంది స్నేహితులకు వెల్లడిచేయనిదే ఆనందము పరిపూర్ణమైనటులఁ దోఁపదు. అందువలననే మన మేదైన సంతోషవార్త వినినప్పుడు దానిని నందఱికిఁ జెప్పుచుందుము. ఇది సామాన్యమైన మానవ స్వభావము. కాని, కవియందిట్టి స్వభావ మతి బలీయముగనుండును. నిశితములును, శిక్షిత ములును, సంయమితములును. అందువలననే యుత్పతన క్షమ ములును నైన కవి మనోవిక్రృతులు తొట్టతుదకు నిర్భరములై లయాన్వితవాగ్రూపమునఁ బ్రవహించును. భావోద్రేకము గలిగినప్పుడు ఆయా వికారములకుఁ దగినటుల వాక్యములు వెడ లుట మానవులకందఱికి సహజమైనను, కవియందు మఱొక విశేషము గలదు. కవి వాక్యములు ఏవోకొన్ని నిర్మాణన్యా యముల కనుగుణముగ మూర్తీభవించుచుండును.

ముత్తెపుఁజిప్పలో వానచినుకు పడినప్పు డది మంచి ముత్యముగ మాఱును గాని, కాకిచిప్పలోఁ బడినప్పుడు మార్పు నొందదు. ఎందువలన? ముత్తెపుఁజిప్పయందుఁగల సృజనశక్తి కాకిచిప్పయం దుండకపోవుటవలన. నీటిబొట్టు ముత్తెపుఁజిప్ప కడుపులోఁ బడినప్పుడు అందొక వికారము పుట్టును. అందు వలనఁ జిప్ప లోపలిభాగమున కంటుకొనియున్న పింగాణిరంగు వానచినుకుపైఁ జుట్టుకొని దానినొక యమూల్యమైన ముత్యముగ మార్చివేయును. ఇటులనే బహిఃప్రపంచసంగతి

వలన కవి మనమునఁ గొన్నివికారము లుప్పతిల్లి అవి యాతని రసార్ద్రిభావములండలి యింద్రధనుర్వర్ణములతో వెలికుఱికి లోక మోహన స్వరూపమును దాల్చును. కవిభావ మేవస్తువు పైఁ బ్రసరించునో యదియెల్ల రూపాంతరము నొందును. అని ర్వాచ్యమైన సౌందర్యము దాని నాశ్రయించి యుండును. ఎన్నియో వస్తువులను పలుమాఱు చూచియుందుము. కాని, అవి మన చిత్తముల నాకర్షింపఁజాలక పోయియుండవచ్చును. ఆ వస్తువే కవిభావముతో మొలాముచేయఁబడినప్పుడు ఱిది వఱకు లేని క్రొత్తందనమును జక్కందనమును వహించి మన దృష్టి నాకగొనును. ఎన్నిమాఱులు ఆషాఢమాసమునందలి మేఘములను మనము చూచియుండలేదు? ఆమేఘమె కాళిదాసమహాకవి కావ్యాంబరమున భావకిరణ శబలితమయి పొడకట్టి మనలను ఆనందపులకితులను జేయుట లేదా? ఇదియే కవిత్వేంద్రజాలము!

---

౮. కావ్య జీవితము

నిర్జీవములగు కావ్యములు సహృదయానురంజకములు గానేరవు. అట్టివి చచ్చుబిడ్డలు. అవి నిరాదరణ పాత్రములై యెట్టకేలకు నశించిపోవును. కొందఱి కవుల యొక్కయు కావ్యములయొక్కయు పేరులు కవుల చరిత్రలందు మాత్రమె భద్రపఱుపఁ బడియుండును. కాని, మఱికొందఱి కవుల నామములు అనుదినమును స్మరింపఁబడుచున్నవి. వారి కావ్యములు నిరంతరము ప్రజల హృదయములపైఁ ప్రభుత్వము చేయు

చున్నవి. రామాయణము, మహాభారతము, భాగవతము, అభి
జ్ఞానశాకుంతలము, ఉత్తర రామచరిత్రము, మేఘసందేశము
మున్నగు కావ్యములును నాటకములును, షేక్స్‌పియరు మహా
కవి రచియించిన నాటకములును (అందు ముఖ్యముగ విషా
దాంతములు) స్వదేశములందేగాక పరదేశములందుగూడ
సమ్మానింపఁబడుచున్నవి. ఎందువలన? అవి యుత్తమశిల్ప లక్ష
ణముల కనన్యసాధారణ లక్ష్యములయి ప్రధానకావ్యప్రయో
జనమగు సద్యఃపరనిర్వృతినిఁ గలిగించుచున్నవి. కావున నిట్టి
యానంద ముప్పతిల్లఁజేయు ప్రతికావ్యమును సజీవమని మనము
తలఁపవలయును. కావ్యములను ప్రౌఢవంతములుగఁ జేయు
చిచ్ఛక్తియేది? ఇందుకు సంస్కృతలాక్షణికు లేమి ప్రత్యుత్తర
మిత్తురో దానిని మొదటఁ దెలిసికొందము.

౧. రీతిరాత్మా కావ్యస్య.

--వామనుఁడు.

౨. వక్రోక్తిః కావ్యజీవితం.

—కుంతకాచార్యుఁడు

3. అలంకారా స్త్వలంకారా గుణా ఏవ గుణాః సదా
ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్యజీవితం.

—క్షేమేంద్రుఁడు

౪. కావ్యస్యాత్మా ధ్వనిరితి బుధైర్యః సమామ్నాతపూర్వః

—ఆనందవర్ధనాచార్యులు.

౫ శబ్దార్థౌ మూర్తిరాఖ్యాతౌ జీవితం వ్యంగ్యవైభవం.

—విద్యానాథుఁడు.

౬. యే రసస్యాంగినో ధర్మాః శౌర్యాదయ ఇవాత్మనః.

—మమ్మటుఁడు.

౭. వాక్యం రసాత్మకం కావ్యం.

—విశ్వనాథుఁడు.

పై లాక్షణికులలో వామఁనుఁడు రీతియు, కుంతకా చార్యుఁడు వక్రోక్తియు, క్షేమేంద్రుఁడు ఔచిత్యమును, ఆనందవర్ధన విద్యానాథులు ధ్వనియు, మమ్మట విశ్వనాథులు రసమును, కావ్యజీవితమని నిర్వచించియున్నారు. కాని, వీని యన్నిటిలో నిశ్చితమైన ప్రమాణమేది? ఆలంకారికు లిట్లు భిన్నాభిప్రాయులై నపుడు సహృదయుల యంతరాత్మయె కడపటి ప్రమాణముగఁ దలంపవలయును. పై మతములను విమర్శించి చూడ లాక్షణికుల తీర్మానములు, *ఏనుఁగును జూచుటకై పొరుగూరికిపోయి వివాదములు పెంచుకొన్న గ్రుడ్డివారి రూపజ్ఞానముగ నున్నది.

రీతి, రసపోషణమున కనుకూలమైన పర్ణసంఘట నము; కావునఁ గావ్యాంగమునకు సంబంధించినది. అంగము

---

*కొందఱు గ్రుడ్డివారు ఏనుఁగును చూచుటకై పొరుగూరికి పోయిరి. వారిలో మొదటివాఁడు తొండమును తాఁకి, ఏనుఁగు తనచేయివలె నున్న దనియు, రెండవవాఁడు కాలునుతాఁకి ఏనుఁగు స్తంభమువలె నున్నదనియు, మూడవవాఁడు పొట్టనుతాఁకి ఏనుఁగు గాదెబొట్టవలె నున్నదనియు, నాల్గవ వాఁడు తోఁకనుతాకిఁ ఏనుఁగు కఱ్ఱవలె నున్నదనియుఁ దలంచి తమ యూరికి తిరిగి వచ్చుచు దారిలో తాము చూచిన విషయములను సరి పోల్చుకొనిరి. ప్రతివాఁడును సత్యమే చెప్పినను వారిజ్ఞానము పాక్షిక మైనందున భేదాభిప్రాయములు గలిగి వివాదములు పెరిగి తిట్టుకొన సాఁగిరి. అంతలో ఏనుఁగును చూచిన మరియొకఁడు వచ్చి వారు చెప్పిన దంతయు సత్యమేయనియుఁ, బరిపూర్ణసత్యము తేలుటకు వారొకరొకరు తాకిన యంగములను గలిపి చూడవలయుననియుఁ దెల్పెను.

జీవితమున కాశ్రయమగునుగాని, తానే జీవితము కాఁ జాలదు.

వక్రోక్తి యొకవిధమైన అలంకారము. అలంకార మస్ఫుటముగ నున్న వాక్యములకుఁగూడ (అనఁగా అలంకారము తర్కముచే మాత్రము సాధింపఁబడి, దాని మూలమున రాఁదగిన సౌందర్యము. 'యఃకౌమార హరః' అను శ్లోకమునందువలె *అభావ మయినపుడు) కావ్యత్వము సిద్ధించుచున్నదిగాన, అలంకారములు కొన్ని యెడల నావశ్యకములయ్యు, ఔపచారికములు గావునను, వానికి జీవత్వము లేదు.

ఔచిత్యము అన్నిశిల్పములకుఁ బరమావశ్యక మగు నియమము. ఇది రసపోషకము. సౌందర్యమున కొక యంగము.

ధ్వన్యాత్మకముగాని వాక్యము సైతము కావ్యమని నిరూపింపఁబడియుండుటచేతను, వ్యంగ్యవైభవము ఉత్తమ

---

*శ్లో. యఃకౌమారహరఃసవీవ హివరస్తా వీవ చైత్రక్షపా
స్తేచోన్మీలిత యూలతీ సురభయఃప్రౌఢాఃకదంబానిలాఃా,
సాచైవాస్మి తథాపి తత్ర సురతవ్యాపార లీలా విధౌ
రేవా రోదసి వేతసీ తరుతలే చేతఃసముత్కంఠతే.
(మమ్మటోదాహృతము.)

పరస్పర విరుద్ధములగు విభావనావిశేషోక్తుల సాంకర్య మిందు స్ఫుటముగ నున్నదని విశ్వనాథుని యభిప్రాయము. కాని. యీశ్లోకమును మనము చదువునపుడు మనకుఁ గలుగు ఆనందము అలంకార మూలక మైనదికాదు. రసమూలకమైనది.

కావ్యలక్షణమని పలువురచే నంగీకరింపఁబడి యుండుటచేతను, ఉత్తమ మధ్య మాధను కావ్యవిచారము. జీవత్కావ్యము సిద్ధించిన పెనుక జరుగు చర్చ యగుటచేతను, ధ్వనిని కావ్య సౌందర్యాపాదకము లగు నుత్తమ గుణములలోఁ నొకటిగ గ్రహింపవచ్చును.

రసము కేవలము మానవచర్యలకు సంబంధించినదే యైనమెడల అవ్యాప్తిదోషమువలన కావ్యాత్మ కానేరదు.

అట్లయిన నిఁక కావ్యాత్మ యెట్టిది? ఆత్మ అంత స్సారభూతమయినది. ఇదమిత్థమని వర్ణించుటకు నలవిగానిది. కావునఁనే భిన్ననిర్ణయములకుఁ బాత్రమయినది! ఉపనిషత్తులు బోధించు ఆత్మ వేఱు; ఆ యాత్మ అవాఙ్మానసగోచరము. కావ్యాత్మ ఇంద్రియ గోచరమును అనుభవసాక్షికము నగు సౌందర్యస్ఫురణము. పాంచభౌతికమయిన ప్రకృతి చిత్సం బంధమువలనఁ బ్రాణవంతమగునట్లు, కావ్యసామగ్రి కవి ప్రతిభతోడ సంయోగమునొంది జీవనూర్మిని దాల్చు చున్నది. కావ్యమునకు కవిప్రతిభయె జీవితము. కావ్యము నందలి చిత్ప్రకాశము సౌందర్యస్ఫురణముగ గోచరించును. శిల్పనైపుణ్యమును కవితాసామాగ్రియు నవిభాజ్యముగ నొకదానియం దొకటి లీనమయినపుడు సజీవవిలసనము కావ్యమునందుఁ దేలియాడుచుండును. అది సహృదయ హృదయైకవేద్యము. గాలి కంటి కగుపడక యున్నను స్పర్శేం ద్రియమువలనఁ దెలిసికొనఁబడునటుల, కావ్యాత్మ యిట్టిదని వచియింపనలవిగాకున్నను ఆనందజనకశక్తివలన నూహింప సాధ్యమగును.

ప్రతిభావంతులగు కవుల రచనలను మనము విమర్శించి చూచితిమేని, అవి చిరంజీవములగుటకుఁ గారణములు మనకు గోచరింపకపోవు. వానియందు కాలమును ధిక్కరించు శాశ్వతగుణమేదియో యొకటి తప్పక యుండితీరును. ఉత్తమ కృతుల విమర్శనమువలనఁ దేలిన సామాన్యాంశముల నిటఁ బొందుపఱచుచున్నాను :

(౧) అంగాంగ సంయోగత.

(౨) అనురూపత.

(౩) వస్తువునందలి సర్వజనీన స్వభావము.

(౪) కవి వ్యక్తిత్వము.

అంగాంగ సంయోగత ప్రతి రూపమునకును ఆవశ్యకమైన నియమము. విచ్ఛిన్నావయవ సమూహము సమష్టి రూపజ్ఞానము బుట్టింపనేరదు. కావున 'సంయోగత' శిల్పశాస్త్రమునందుఁ బ్రధాన సూత్రము. ఈ సూత్రమునకు లోఁబడని కావ్యములు నిర్జీవములుగ నుండును. ఉత్తమ కావ్య నిర్మాణమునం దీనియవసరము బహుజాగరూకతతోఁ ననుసరింపఁబడును.

ఉచితానుచిత జ్ఞానము లేనివాఁడు కవి కానేరడు. అనౌచిత్యము రసభంగమునకుఁ బ్రధానహేతువు. కాండజ్ఞానము, కళాభిరుచియు లేనందునను, లోభమువలనను, కవి యనౌచిత్యదోషమునకుఁ బాల్పడుచున్నాఁడు. అది వఱకు వ్రాసికొనియుంచిన రసవంతములగు పద్యములందలి లోభముచేతఁ గొందఱు కవులు అనవసరముగను, అసందర్భముగను తమ కావ్యములయందో, నాటకములయందో

వానిఁ జొప్పించి రసభంగమునకు సహాయబడుచున్నారు. అట్టివారియందు కళాభిరుచి లోభ తిరస్కృతమై యడఁగి యుండును. మఱియు కవి మొట్టమొదటఁ దన ప్రతిభ కను రూపమైన వస్తువును, రసమును రూపమును గుర్తెఱిఁగి యేర్పఱచుకొనవలయును. ఇది చాల ముఖ్యము. కొందఱు కవులు కొలఁది యెఱుఁగక కొండను కాఁగిలించుకొనఁబోయి భగ్నమనోరథు లగుటయు, మఱికొందఱు తమ ప్రకృతి కనుకూలింపని రసములఁబోషింపఁ బ్రయత్నించి చెడఁగొట్టు కొనుటయు మనము చూచుచున్నాము. కాళిదాసు శృంగార మును బోషించుటలో నసదృశుఁడు. భవభూతి కరుణయం దద్వితీయుఁడు కాని, ఆయన ప్రతిభ నాటక రచన కనుకూ లించునది గాదు. కావుననే యుత్తరరామ చరిత్రము దృశ్యప్రబంధమునకన్న శ్రవ్యప్రబంధముగ నెంచఁబడు చున్నది. సర్ వాల్టర్ స్కాటు మొట్టమొదట కవిత్వము ప్రాయుచుండెను. కాని, యంతకన్నఁ దన ప్రతిభ నవలలు రచియించుట కనుకూలించునని యెఱిఁగి, యపూర్వ కథా సాహిత్యమును నిర్మించెను. రవీంద్రనాథ టాగూరునందు గేయ ప్రతిభ మిక్కుటముగ నున్నది. ఆయన వేలకొలఁది చక్కని గీతములను రచియించెను. కాని, మయికేలు మధు సూదనదత్తువలె 'మేఘనాథవధ' వంటి పెద్ద కావ్యమును రచియింపలేదు. ఒకొక్కక కవి అంతఃప్రకృతి యొకొక్కక విధమయిన కావ్యకల్పనకుఁ దగియుండును. కావున వారి వారి కనుకూలమైన త్రోవలు వెదకికొనుట విజయమునకు మూల సాధనము. అందుకు భిన్నముగఁ బ్రవర్తించువారు ఏటికి నెదు

రీఁదినట్లు శ్రమకుఁ బాత్రులయ్యు గమ్యస్థానము చేరఁజాలరు. ఉత్తమ కవులెల్లరు తమ ప్రకృతి కనుకూలించిన రచనలయందె శక్తిసామర్థ్యములను పినియోగించి కృతకృత్యులైరి.

కావ్యము చిరంజీవముగ నుండవలయునన్న అందలి వస్తువుగూడ సర్వజనీన స్వభావమును, దదనుగుణమయిన మనోవికారములను వెల్లడించుట కనుకూలమైనదిగనుండవలయును. ఏలయన, దేశ కాలపరిస్థితులకు లోఁబడిన సంకుచిత విషయములును, భావములును అన్ని కాలములయందు నందఱిని రంజింపఁజేయఁజాలవు. ఆచార వ్యవహారములు, భాషలు వేఱైనను మానవుల మనోవికారములు అంతటనొకేవిధముగ నుండును. సుఖదుఃఖములు, మంచిచెడ్డలు, జన్మమరణములు సర్వసామాన్యముగ మానవజాతికంతయు సహజము. శృంగార వీర కరుణాదిరసము లందఱకు ననుభోగ్యములుగ నుండును. అట్టిరసములాదర్శప్రాయముగఁ జిత్రింపఁబడినపుడు దేశకాలపాత్రాతీతములై సర్వజనానురంజకములుగ నుండఁగలవు. ఇంగ్లీషు నాటకములు చదివి మనమానందించుచున్నాము; సంస్కృత నాటకములను జదివి పాశ్చాత్యులు సంతోషము నొందుచున్నారు. ఎందువలన? నోటిగుండవెడలు భాష రెండు దేశములవారికి వేఱయ్యును హృదయములోనుండి వెడలు మనోవికారముల భాష మానవజాతికంతయు సామాన్యము. కావున నొక కావ్యము చిరంజీవముగ నుండవలయునన్న సర్వజనీన స్వభావ ద్యోతక వస్తు సంవిధాన కల్పనా చమత్కృతితో నొప్పియుండవలయును. ఇందుకు

భారతాది మహాగ్రంథములును, శాకుంతలాది నాటకములును నిదర్శనములు.

కవి వ్యక్తిత్వము ఆతని రచనలయందుఁ బరిస్ఫుట ముగ నంకితమైయుండును. ఒకే విషయమును పలువురు కవులు కావ్యములుగ రచియించిరేని వానియం దొకటొక్కటియుఁ బ్రత్యేకరూపగుణవిశిష్టముగ నుండును. ఒక్కొక్కరియందు కళానైపుణ్యమును, ప్రతిభయు, నభిరుచియు భిన్నభిన్న ముగ నుండుటవలన వారి కృతులందు నైత మట్టి భేదములు గనుపట్టుచుండును. సర్వసామాన్య వస్తువైనను, అది కవి యంతఃప్రకృతితో సమ్మిళితమయి రూపాంతరమునొంది, కావ్య కుటుంబమునకుఁ జేరినదయ్యుఁ బ్రత్యేకత వహించి యుండును. కవి తనకు మాత్ర మిష్టమైన వస్తువును భావమును మనోవస్థను సర్వజనీనముఁ జేయుటకుఁ బ్రయత్నించుట కన్న, సర్వజనీన వస్తుభావ మనోవస్థలను దన వ్యక్తిత్వముచే నంకితముఁ జేయుట మేలు. అనఁగా అన్ని ప్రకృతులకు సామాన్యమైన భావావస్థలకు రూపముఁగల్పించి యే ప్రకృతినైన రంజింపఁ జేయవచ్చునుగాని, యొక ప్రకృతికి మాత్రము సమ్మతమైన దానిని సర్వజనీన మొనరించుట యసాధ్యము.

మహాకవుల కావ్యములందుఁ బైన చర్చింపఁబడిన నాలుగంశములు ననివార్యముగ నుండును. ఇంకను వివర్శించుకొలఁది యెన్నియైన సూక్ష్మాంశములు తేలవచ్చును. కాని, గ్రంథ విస్తర భీతిచే వానినిఁ జర్చింప మానుకొంటిని.

౫ కవిత్వశిల్పము—అనుకరణము

కవిత్వము లలితకళలకుఁ జేరినది కావున, నిచ్చట శిల్ప విచార మనివార్యమైనది. శిల్పము నిదర్శక మనియు నాదర్శక మనియు రెండు విధములు. కొంచెమైనను భేదము లేక ప్రకృతి ననుసరించునది మొదటిది. వలసినంతవఱకు ప్రకృతి ననుసరించి దానిని మించిపోవునది రెండవది. మొదటిది మాతృకకు సరియైన నకలు; రెండవది, స్వతంత్ర కల్పనము. శిల్పులు భూమ్యాకాశములందు సంచరించు రససిద్ధులు. కావున వారి సృష్టియు మర్త్యలోకమునకును స్వర్గలోకమునకును సంబంధించి యుండును. నిదర్శనాదర్శక శిల్పములలో రెండవది యుత్తమమైనది. ఒకరూపమును పొల్లుపోక యనుకరించి చిత్రించుట నయనేంద్రియము యొక్కయు బుద్ధియొక్కయుఁ గార్యము. కాని, అందు శిల్పకారుని భావనాప్రదర్శనమునకుఁ జోటులేదు. అనుకరణమునందు నూతనసృష్టి యుండదు గాన అది యుత్తమ శిల్పము గానేరదు.

శిల్పము అనుకరణమా? లేక సృష్టియా? అను విషయమును గుఱించి చాల అభిప్రాయ భేదములు గలవు. వానిని గొందఱు అనుకరణ మనియు, మఱికొందఱు సృష్టి యనియుఁ బలుపలు విధములుగఁ దలంచుచున్నారు. శిల్పము అనుకరణమని తీర్మానించిన వారిలోఁ బ్రథముఁడు గ్రీసు దేశస్థుఁడైన అరిస్టాటల్ అను తత్త్వ శాస్త్రజ్ఞుఁడు. అప్పటి నుండియుఁ బాశ్చాత్యులెల్లరును శిల్పము ప్రకృతియొక్క

యనుకరణ మనియే విశ్వసించుచుండిరి. కాని; *అరిస్టాటలు నిర్వచించిన అనుకరణము (Imitation) నకును మన మిప్పుడు అనుకరణ మను మాటకుఁ జేసికొను నర్థమునకును జాలభేదమున్నది. ఆయన యుపయోగించిన పదము విశాల భావగర్భితముగ నున్నదని ఆయన యొనరించిన నియమముల వలననే మనము తెలిసికొనఁ గలము.

శిల్పము తన మాతృకను ఉన్నదియున్నట్లు అనుకరిం పక యింద్రియములకు గోచరించినవిధమునఁ బునర్నిర్మాణము చేయుననియు, ఆదర్శప్రాయ మగు మానవజీవితము, ప్రవర్తనములు, చర్యలు మున్నగునవి శిల్పమునఁ బ్రతిబింబించు చుండు ననియు అరిస్టాటలు చెప్పియున్నాడు. ♦ఇందువలన శిల్పి యనుకరించువాఁడు గాఁడనియు, రసార్ద్రమైన యాతని భావమున నింద్రియములద్వారా ఏవేవి యంకిత మగునో వానిని మాత్రమే మూర్తీభవింపఁజేయు ననియుఁ?

*అరిస్టాటలు కవిత్వతత్త్వ నిర్వచనములను సంపూర్ణముగఁ దెలిసి కొనవలయునన్న ప్రొఫెసర్ బుచ్చెరుగారి "Aristotel's theory of poetry and fine art" అను గ్రంథమును జదువవలయును.

♦ (1) The art may imitate things as they ought to be.

(2) A work of art reproduces its original not as it is in itself, but as it appears to the senses.

(3) A work of art is in idealised representation of human life—of character, emotion, action, under forms manifest to sense.

—*Aristotle.*
(Butcher's translation.)

దేలుచున్నది. శకుంతలనాటకములోని కథ షుమారు ఆరు సంవత్సరములకాల పరిమితి గలదిగాఁ దోఁచుచున్నది. కాని, కాళిదాసమహాకవి దానిని రెండుమూడు గంటలలోఁ బ్రదర్శింపఁబడుటకు వీలగు నాటకముగ రచించెను. ఏయే కథాభాగములు గ్రహించిన యెడల కథావిషయమునకు లోపము వాటిల్లక, శిల్పధర్మమునకు విరుద్ధము గాక యుండునో అట్టిరీతిని ఉచితమైన సన్నివేశములను గల్పించి, ఆది మధ్యాంతములు గల యొక మనోహర దృశ్యమును రచించెను. లోక సామాన్యము లగు మానవచర్యలను గ్రహించి, వానిని లోకోత్తర వర్ణనాచమత్కృతి వలన అపూర్వమును, ఆదర్శ ప్రాయమునైన యొక విచిత్ర సృష్టినిగ మార్చివేసెను. ఇట్టి నిర్మాణమును సృష్టియందుమా? లేక యనుకరణ మందుమా? దీనిని అనుకరణ మనుటకంటె ప్రతిసృష్టి యనుటయే సమంజసము. అరిస్టాటలు గ్రంథమును చాల శ్రద్ధతో తర్జుమాచేసి, చక్కగ విషయము బోధపడుటకొఱకు విపులమైన వ్యాఖ్యానము వ్రాసిన ప్రొఫెసరు బుచ్చెరుగారు, అరిస్టాటలు ఉపయోగించిన 'అనుకరణము' అను పదమునకు, 'నిర్మాణము' 'ప్రతిసృష్టి' అను అర్థములు కలవని వ్రాసియున్నారు.*

మమ్మటాచార్యులు తవిత్వమును నియతికృత నియమ రహిత మనియు, అనన్య పరతంత్రమనియుఁ నిర్మితి యనియుఁ

---

* 'Imitation' so understood is a creative act. It is a Rivalry of Nature, a completion of her unfulfilled purpose, correction of her failures.

—*Butcher.*

జెప్పియుండుటవలన సంస్కృతలాక్షణికులకుఁగూడ, శిల్పము స్వతంత్రసృష్టి యను నిర్వచనము సమ్మతముగ నున్నట్లు దోఁచుచున్నది.

అపూర్వ వస్తునిర్మాణమునందు కావ్యశిల్పము ప్రకృతి సృష్టిని మించుచున్నది; కావునఁదే కళకు ప్రత్యేకమైన స్థితి కలిగినది. జంగమ వల్లులు, నిశ్చల చంచలా లతికలు, నొక్కిన పాలుగాఁయు చెక్కిళ్ళు, పుప్పొడికట్టల నొరసి కొనుచు ప్రవహించు తేనె వాకలు, ఆకసము నంటుమేడలు మున్నగునవి కవికల్పనములు; వాస్తవజగత్తులో లేనివి.

లఘువిభాతి

చలువగల వెన్నెలఁ చెలువునకు సౌరభము
గలిగినను, సౌరభముఁ జలువయుఁ దలిర్పం
బొలుపెసఁగు కప్పురపుఁ బలుకులకుఁ గోమలత
నెలకొనిన, సౌరభము జలువ పసయుం గో
మలతయును గలిగి జనముల మిగులఁ బెంపెసఁగు
మలయ పవనంపుఁ గ్రొదమలకు మధురత్వం
బలవడిన, నీడు మఱి కలదనఁగవచ్చుఁ గడు
వెలయఁగల యీ సుకవి పలుకులకు నెంచన్.

ఈపద్యమునందు పింగళి సూరనార్యుఁడు ప్రకృతిపై నొక పంతము వేసినాఁడు. వెన్నెల చెలువునకు సౌరభము గలుగవలయును! కప్పురమునకుఁ గోమలత నెలకొనవల యును! పైగుణము లెల్లను గల మలయపవనమునకు మాధుర్య మలవడవలయు! అప్పుడుమాత్రమే అది సుకవి

పలుకులకు ఈడనవచ్చును! కోటి సంవత్సరములు తలక్రిందయి తపసుజేసినను ప్రకృతి యిట్టి యపూర్వ వస్తు గుణ సమ్మేళన మొనరింపలేదు. కావున సుకవిపల్కులకు అసంపూర్ణమయిన సృష్టి యెట్లు ఈడనవచ్చును? వస్తుగుణములను అపూర్వముగ నేర్చి కూర్చుటయందు కవి అత్యంత నిపుణుఁడు. ఈ నైపుణ్యము భావనకు సంబంధించిన మహిమ. కవి కల్పనములు కొన్నియెడల అలౌకికము లైనను చదువరులకు బోధపడకపోవు. ఏలయన: సంయోగము క్రొత్తదైనను వస్తువులుమాత్రము పూర్వపరిచితములె. తాను సృజించిన వస్తువు స్వభావికమా, లేక యస్వాభావికమా యను విచారము కవి కనవసరము. ఇట్టివస్తువు భావప్రపంచమున నుండిన నెంత రమ్యముగ నుండును అను తలంపె కవికి ముఖ్యము; రసనిష్పత్తికి సాధక మగునేని నెట్టి యలౌకికేంద్రజాలమునైనఁ బన్నవచ్చును. ఏలయనఁగా కవిసృష్టి యానందమాత్ర ప్రయోజనము గలది.

ఆదర్శప్రాయమగు రూపమును జిత్రించు చిత్రకారుఁడు ఏదో యొక బహిరాకృతినిఁ దన రచనకు ఆలంబముగఁ గొనఁడు. ఆ రూపమును తాను భావనచేసిన తన మనమునందుఁ బ్రతిబింబించిన విగ్రహమును పటముపైఁ జిత్రించును. అటులనే కవియు భావనా కల్పితమైన చర్యలను వాగ్రూపమున వెలిపుచ్చును. ఒక యుదాహరణము: చిత్రకారుఁ డొకఁడు రతీదేవి స్వరూపమును లిఖింపవలయునని తలంచి యొక సౌందర్యవతిని ఆదర్శముగఁ దీసికొని తత్ ప్రతిబింబకముగఁ జిత్రించును. రతీదేవి స్వరూపమునందు

స్త్రీసౌందర్య పరమావధిని మూర్తిభవింపఁజేయవలయునని ఆతని యుద్దేశము. తాను రచియించిన రూపమునకన్న రమణీయవతి యగు మఱొకకాంత గాన్పించిన యెడల చిత్ర కారుఁడు పూర్వచిత్రమును జించి పాఱవైచి, క్రొత్తరచనకుఁ బూనుకొనవలయును. ప్రకృతి పరిణామ శీలము; రూపము లను సృజించుచుఁ బోవుచుండును. స్త్రీసౌందర్య పరమాదర్శ మును సృజించుటకుఁ బ్రకృతి యెన్ని నమూనాలను వ్రాసి చింపివేయవలయునో, యెన్ని వేల సంవత్సరములు పట్టునో యెవరి కెఱుక? నిపుణుఁడైన చిత్రకారుఁడు స్వయముగ సౌందర్యమును ధ్యానించి తదనుసరణముగ లిఖించిన చిత్రము చిరంజీవముగ నుండఁగలదు. శకుంతలాది యద్భుతసృష్టు లీ తెగకుఁ జేరినవే.

---

౬. రస రామణీయకములు.

'విభా వానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః' అని భరతముని రసలక్షణము నిర్వచించెను. అప్పటి నుండియు రసస్వరూప విచార చర్చ నిరంతరముగఁ జరుగుచు వచ్చినది. వ్యాఖ్యాతలును ఆలంకారికులును వారివారికిఁ దోఁచినట్లు భిన్నభిన్నముగ భరతసూత్రమును వివరింపుచు వచ్చిరి. సూత్రమునకు అనుకూలమును బ్రతికూలము నగు నెన్నియో మతములు బయలుదేరినవి.* కాని వానినెల్ల

---

*మతభేదముల వివరములను, వాద ప్రతివాదములను దెలిసికొనఁ గోరువారు కావ్యప్రకాశికను, రసగంగాధరమును జదువవలయును.

నిచ్చట వివరింప నవసరము లేదు. సంస్కృతలాక్షణికుల వాదప్రతివాదములవలనఁ దేలిన సారాంశములను క్రిందఁ బొందుపఱచుచున్నాను :

(౧) విభావము (ఆలంబనోద్దీపనములు), అనుభావము (సాత్వికము అనుభావము సండె చేరియున్నది.), వ్యభిచారి యని భావములు మూడు విధములు.

(౨) విభా వానుభావ వ్యభిచారి సంయోగమువలన నొకభావము పరిపూర్ణతనొంది 'స్థాయి' అని పేరొక్కనఁ బడుచున్నది.

(3) ఆ స్థాయిభావము, చర్వణమువలన రసత్వమునొందుచున్నది.

(౪) భావత్రయ సంయోగము వలన రూపాంతర పరిణామము గలుగుచున్నది. (దధ్యాదులవలె)

(౫) * భావ్యమాన భావత్రయములో నేదైన నొకటి రసమగును.

పై సారాంశములను వలసినచోట్ల గ్రహించి విమర్శించెదము.

పాంచ భౌతిక ప్రపంచమును మనము శబ్ద స్పర్శ రూప రస గంధముల వలనఁ దెలిసికొనుచున్నాము. ఇంద్రియములు సాధనమాత్రములు. వాని నుపయోగించునది బుద్ధి. మన మనస్సు పరాయత్తమైనపుడు దగ్గర నిలుచుండు

* భావ్యమానో విభావ ఏవ రసః అనుభావ స్తథా.
వ్యభిచార్యేవ తథా పరిణమతి.
ఇవి రసగంగాధరమునం దుదహరింపఁ బడినవి.

వారిసిఁ గూడ (చూచుచుండియు) కనుఁగొన లేము. ఇంద్రియ ములు గొంపోవు సూచనలను బుద్ధి గ్రహించునప్పుడె జ్ఞాన ముదయించుచున్నది. అది యెట్లన: మన మొక పుస్తక మును జూచి దానిని పుస్తకమని గుర్తింతుము. నయనేం ద్రియములు కొనిపోయిన రూపమును ఇదివఱకు స్మృతియం దడఁగియున్న పుస్తక రూపముతో సరిపోల్చి, దానివంటిదే ఇది కావున 'ఈ రూపము పుస్తకము' అని బుద్ధి నిర్ణయిం చును. కాని, యీవ్యాపారము అమిత త్వరితముగను అలక్ష్య తముగను జరుగుచుండును గావున సామాన్యముగఁ దెలిసి కొనుట కష్టము. మొట్టమొదట బుద్ధికి పుస్తక రూపజ్ఞా నము లేనియెడల అట్టి వస్తువును జూచినపుడు 'ఇది ఫలా నిది' యని నిర్ణయించుటకు వీలులేదు.

వస్తు స్వభావ జ్ఞాన ముదయించిన వెంటనే ఆలో చనయు, దాని వెంట భావమును (మనోవికారమును), తరువాతఁ గోర్కెయు, దానితోడ సంకల్పనమును, అనంత రము కార్యమును బుట్టుచుండును. ఉదాహరణము: మన మొక దారిలో నడుచుచుండఁగా నొక పుట్ట యొద్ద, కాలికి మూరెఁడు దూరమున పామును జూచితి మనుకొందము. దానినిఁ జూడఁగనె పైన వివరించిన విధమున వస్తుస్వభా వజ్ఞానము గలుగును. పాము దగ్గరనున్నందువలనఁ గలుచు నని తలంతుము (ఇది ఆలోచన), తలఁచిన వెంటనే భయము గలుగును (ఇది భావము), తరువాత దానినుండి తప్పించు కొనవలయునని కోరిక పుట్టును(ఇదికోరిక), దానిని నెఱవేర్చు కొనుటకు ధృఢసంకల్పము గలుగును (ఇది సంకల్పము),

అనంతరము వెనుకకుఁ బరుగెత్తి తప్పించు కొందుము (ఇది కార్యము). అట్లుగాక మనము చూచినది నిరపాయకరమగు నీళ్ళపామని తెలిసికొన్నయెడల భయము శమించి యూరక నిలుచుందుము. ఇంద్రియ సందేశమును బుద్ధి గ్రహింపలేని యెడల భావములు పుట్టవనియు వ్యతిరేకముగ గ్రహించినగ యెడల వ్యతిరేక భావములే కలుగు ననియు నిందువలన మనము తెలిసికొనవచ్చును. వస్తువు లెట్లు అనుకూల ప్రతి కూలములో వాని వలనఁ గలుగు భావములుగూడ నట్టివియె. వస్తువుల సుఖదుఃఖ భావజనకతా పరిమితికి సమముగ ఆకర్షణ వికర్షణములు పుట్టును.

ప్రతి వస్తువును జిత్తము నందొక భావమును రేఁపును. అట్టిభావములు ఆనుకూల్య ప్రాతికూల్యముల ననుసరించి సుఖ దాయకములుగనో క్లేశ దాయకములుగనో యుండును. సుఖ దుఃఖ తారతమ్యముల కనురూపముగ భావములు కొన్ని దుర్బలములుగను, మఱికొన్ని తీవ్రములుగ నుండును. భావములవలె రసములును అనంతములు. అయినను ఇందుఁ బ్రధాన రసములు తొమ్మిది. వానియొక్క సాంకర్య సాజాత్య భేద సంబంధముల వలన రసములు వివిధములగు చున్నవి.

ఒక్కొక్క భావము తనకనురూపమైన రసమును బుట్టింపఁ గలుగునెడల భరతాదులు భావత్రయ సంయోగము నేల బోధించి రని కొందఱు శంకింపవచ్చును. ప్రధాన రసములు పుట్టుటకు విభావానుభావ వ్యభిచారి సంయోగ మావశ్యకము. ఏలన, భిన్న ప్రకృతులందు నొకే విభావము

పరస్పర విరుద్ధములగు రసములఁ బుట్టించును. పులిని చూచి నపుడు పిఱికివానియందు భయమును, శూరునియందు శౌర్యమును బొటమరించును. భావానుభావములకుఁ గారణ కార్య సంబంధము గలదుగాన, భావము తీవ్రముగ రేఁగి నప్పుడు అనుభావములు తప్పక పుట్టును. మనము గ్రహింపని యెడలఁ బులిని చూచినవానికిఁ గలిగినది పిఱికితనమా లేక శౌర్యమా యని నిర్ణయింపఁ జాలము. గడగడ వడఁకుచుఁ గంటనీరు వెట్టుచుఁ బరుగెత్తఁబోయి తొట్రుపడుచుండుటఁ గని అతడు భీతిల్లెననియు, లేక, బొమలు ముడివైచి, పండ్లు పటపటఁ గొఱుకుచుఁ, గత్తిదూసి పులిపైకి దూకుటనుగని, యాతనియందు శౌర్యము దొనికినదనియు మన మూహింప వచ్చును. వీనికి వ్యభిచారి భావమును దోడ్పడినఁ బ్రధాన భావము పరిపూర్ణత నొందును. అనఁగా మూఁడు చిన్న దీపపు వత్తు లొకటిగఁ జేరినపుడు వేడిమియుఁ, గాంతియు హెచ్చు నటుల, మూఁడుభావములు చేరి యొక్కస్థాయి భావమయి తీవ్ర తను దాల్చును. కావున పరిస్ఫుటమగు రసము బుట్టింప వలయునన్నఁ బ్రధానభావమునకుఁ బరిపోషకముగ ననుభా వాదులు గూడ వలయును.

ఇఁక రసస్వరూపమును జర్చింతము. స్థాయి భావమో లేక మఱియేదైన నొక భావమో చర్వితమగునపుడు రస త్వము నొందుచున్నది. అనఁగా ఆభావమును సహృదయుఁడు తన హృదయమునందు నిలిపికొని పలుమాఱు భావించుట వలన ఆనంద ముప్పతిల్లును. రసము ఆనందమాత్ర గ్రాహ్యము. కావున, భావము అనుభవయోగ్యమైనది.

రసము అనుభవ సిద్ధమగునది. భావచర్వణము, రసానుభవము నేకకాలమున జరుగుచుండును.

వస్తువునందు భావములేదు; కాని భావస్ఫోరక హేతువున్నది. అట్టులనే కావ్య సమర్పిత విషయములు అనుభవ రసికుల హృదయములందు భావముల స్ఫురింపఁజేయును. ఉదాహరణము: నీటియందు తాయి రువ్వఁబడినప్పుడు తరంగములు రేగును. నీటియందు లీనమైయున్న యలలు కారణములవడుటవలన వ్యక్తములయినవి. అట్టులనే మన మనసు నందు వాసనారూపముగ లీనమైయున్న సుఖక్లేశాది భావములు కావ్యగత హేతు ప్రేరితములై స్వరూపములు దాల్చి యనుభూతము లగుచున్నవి.

అట్లయిన కావ్యమునందు రసములేదా? కావ్యమునందు భావ ప్రేరకవిషయములు గలవు. ఆ భావములె అనుభూతము లగునప్పుడు రసత్వము నొందుచున్నదని యిదివరకే తెలిసికొనియుంటిమి. అట్లయిన కావ్యము రసవంతముగనున్నదని యేల చెప్పుదురు? సామాన్యమైన వాడుకనుబట్టి. బియ్యము అన్నమునకు వలెనే భావమునకును రసమునకును గొంత భేదముగలదు. అప్పుడె యెసటిలో బియ్యమును బోసి ప్రొయ్య మంటపెట్టు వంటవానిని 'నీ వేమి చేయుచున్నా' వని యడిగిన, 'నేను అన్నము వండుచున్నా' సని జవాబుచెప్పును. అన్నమే యైనయెడల వండనక్కఱలేదు, ఈ సందర్భమున బక్వము కాని బియ్యము మెట్లు అన్నమని పేరొక్కఁబడినదో అటువలెనే కావ్యము గూడ, అంత్యఫలము దృష్టియందుంచుకొనఁబడి, రసవంతమని యూహింపఁబడుచున్నది.

రసము మానవచర్యలకే సంబంధించియుండుననియు, తిర్యగ్జంతువుల చేష్టలయందు రసస్పర్శ గలదనియు, అచేతన వస్తువర్ణనములు రసాభాసము లనియు, ఆలంకారికులు చెప్పు చున్నారు. ఇది చింత్యము. ఏలయన, అచేతన వస్తువులు గూడ రమణీయ భావముల ప్రబోధించును. అవి యనుభవింపఁబడునప్పుడు ఆనందము పుట్టును. సుఖానుభవ యోగ్యమగు ప్రతిభావమును రసత్వము నొందఁగలదు, క్రౌంచపక్షి శోకము వాల్మీకిని అశ్రుగద్గద కంఠుని గావించినది. గొల్ల పిల్ల బుద్ధుని హృదయమునఁ గరుణారస మొలకించినది. ఉషస్సులను దర్శించిన వైదికఋషులు ఆనంద నిర్మగ్నులై వాని నత్యద్భుతముగఁ గొనియాడిరి. ఆషాఢమేఘము నీరస భావద్యోతకమైనయెడల, కాళిదాసుఁడు దానినిఁ దన కావ్య మునకు ఆలంబముగఁ గొనునా? అయిన మఱియొకటి. మానవచర్యలు హృదయమునకు దగ్గఱివిగావున వాని మూలకముగ భావోత్కర్షత గలిగింపవచ్చును.; కాని యింత మాత్రమునకె తదితరములు నీరసములని శాసించుట సాహసము. తేలెలో మెదిపిన వస్తువేదైనను రుచిప్రట్టించునటుల ఏభావమైనను సౌందర్యవాహకమై సుఖానుభోగ్యమగును. రస నీరసత్వములు కావ్య సమర్పితవస్తువుల చేతనాచేత నత్వమునకు సంబంధించియుండక కేవలము అలౌకిక కల్పనా చమత్కృతియొక్క భావాభానములపై నాధారపడి యుండును. రసమునకుఁ జమత్కారమె ప్రాణమని విశ్వనాథుఁడు నుడివియున్నాఁడు. కల్పనా చమత్కృతిలేనిదే వాక్యమునకు- కావ్యత్వము సిద్ధింపదు. కావునఁ ప్రతి కావ్య

మును స్వగత చమత్కార తారతమ్యమున కనురూపముగ రసవంతముగ నుండనలయు ననియె నిర్ణయింపవచ్చును. పండితరాయలు రసమునందు రామణీయకమున్నదని నుడివి యున్నాఁడు. అంతకన్న రామణీయకమునందు (రమణీయ భావమునందు) రసమున్నదని చెప్పుట సమంజసముగనుండును.

లోకమున శోక బీభత్సాదిభావములు మనకుఁ గష్ట మును గలిగించును. అట్టివి కావ్య సమర్పితము లైనపు డెట్లు ఆనందముఁ గలిగించుచున్నవి? ఎట్లన, అటునంటి భావములు శిల్ప నిపుణుఁడగు కవి హృదయమునుండి వెడలి సహజ కర్క-శత్వమును బోనాడి, లోకోత్తర రమణీయములై అద్భుతా నంద సంజనకములయి సహృదయులకు సుఖానుభోగ్యము లగుచున్నవి. కావునను విషాదాంత నాటకములుగూడ నను భవింపఁబడుట. కావ్యగతమైన ప్రతిభావమును రుచికర ముగ నుండును. ఇందుకు కవియొక్క శిల్పకల్పనా నైపుణ్య మును, భావనేంద్ర జాలమును గారణము.

రామణీయకము ఇట్టిదని నిర్వచించుటకు సాధ్యము గాని భావము. ఒకేరూపము చూచు వారి హృదయ పరి పాకము ననుసరించి కొందఱికి సుందరముగను మరికొందఱికి నసహ్యముగను దోఁపవచ్చును. ఇది యందఱికిఁ దెలిసిన విషయమె. లంబొడి వారికిని యెఱుకల వారికిని జాల యింపుగనుండు గవ్వలదండలు దంతపు కడియములు మన యూఁడువారికి నేవ పుట్టించును. వీరికి రమ్యముగ నుండు కాసులదండలు తాపళములు మున్నగునవి ఆంగ్లేయ స్త్రీలకు

మోటు నగలుగఁ దోఁపవచ్చును. అట్లయిన, సౌందర్యము వస్తుగతమా లేక మనోగతమా? ఈ విషయమై తుద ముట్టని చర్చలు జరిగియున్నవి. జగన్మిథ్యావాదులు (Idealists) సౌందర్యము మనోగతమనియు, జగత్సత్యవాదులు (realists) సౌందర్యము వస్తుగతమనియుఁ దీర్మానించియున్నారు. కాని, యిరువురి వాదములందును సగము సగము సత్యము గలదు. రూపమునందు సౌందర్య భావము రేఁపు శక్తి లేని యెడల భావజ్ఞత యుండియు నిరుపయోగము. అట్టి భావము ప్రేరించు శక్తి రూపమునందుండియు దానిని దెలిసికొనఁగల యనుభవజ్ఞానము బుద్ధికి లేసియెడల రూపగత సౌందర్యమును నిరుపయోగము. అనఁగా అటువంటి మందబుద్ధికి రూపమునందు సౌందర్యము లేనట్లె తోఁచును. ఇంద్రియ వ్యాపార మందఱికి నొకే విధముగ జరుగుచుండును; కాని తత్సందేశములను జక్కఁగ నర్థము చేసికొనుటపై జ్ఞాన మాధారపడియున్నది. కావుననే యాలంకారికులు సహృదయుల హృదయములందు మాత్రమే కావ్యము రసముపుట్టింపఁ గలదని పలుమాఱు నొక్కి చెప్పియున్నారు. భావ స్ఫోరక శక్తి బుద్ధి యందును గలదు. కావున రెండును ముఖ్యములె.

రామణీయక మనునది యేకవస్తువుగాదు. అది సమష్టి భావము. రోజాపువ్వు రమ్యముగ నున్నదనుటలో, దాని యాకారము, రంగు, పరిమళము మున్నగునవి చేరియున్నవి. సౌందర్యమును గ్రహింపవలయునన్న సింహావలోకము చేయవలయును. అనఁగా సమష్టి దృష్టితోఁ జూడవలయును.

ఆకారము మన సమష్టి దృష్టికి నందక మించిపోవునంత పెద్ద దైన యెడల దానిని మెచ్చుకొనఁబాలము.

సౌందర్యమున కేదో యొక లక్షణమును గల్పించి దానిని బందిఖానాలో వేయుటకంటె స్వేచ్ఛగ వదలుట మేలు. ప్రతి మానవుని బుద్ధి నిర్ణయమే సౌందర్యమునకుఁ బ్రమాణము. అది ప్రత్యేకము. సామాన్య వస్తువులలోఁ గూడ ననంత సౌందర్యమును దర్శించిన మహానుభావు లెందరోగలరు.

"In all poor foolish things that live a day
Eternal beauty wandering on her way"

అని సుప్రసిద్ధ ఐరిష్ కవి ఈట్సు గానము చేసి యున్నాఁడు.

---

౭. శిల్పసీమలు

లలితకళలన్నియు, నొకే మూలసూత్రమునకు బద్ధము లైయును, ఒకే యంత్యప్రయోజనము గలవైయును వాహక భేదముల ననుసరించి వానివాని యధికార సీమలును భిన్న ములుగ నుండును. కళలన్నియు నొకే విధమైన శక్తి పరి మితులు గలిగియున్నయెడల; గానము, కవిత్వము, చిత్ర లేఖనము, భాస్కర్యము మున్నగునవి పృథగ్భావము భజింప నవసరముండదు. ఒక్కొక కళయందు నితరకళలలో లేని యానుకూల్యమును గుణమును హెచ్చుగ నుండుటచేతఁ గళలన్నియు మనకు నావశ్యకము లైనవి.

గానమున రాగము ప్రధానము. తక్కిన గుణము లన్నియు రాగమునకు లొంగియుండును. కవిత్వమున రామణీయకము ముఖ్యము; ఇతర గుణములు దానికిఁ బోషకము లుగ నుండును. భాస్కర్యమునందు నిమ్నోన్నత స్థలములును ఘనిష్టతయుఁ జక్కఁగఁ బ్రదర్శింపఁబడును. చిత్రకళ మూల మున వివిధ పర్ణములతో సూక్ష్మాతి సూక్ష్మములైన వివర ములనుగూడఁ జిత్రించి దృశ్యమును కన్నులకుఁ గట్టినట్లు చేయగలము. కావున నొక్కొక కళకు నొక్కొక విష యము ప్రధానముగ నేర్పడినది. కవిత్వమునకుఁ బ్రతిక్షణ భిన్నములగు మానవచర్యలును, చిత్రలేఖనమునకు విశాల దృశ్యములును, భాస్కర్యమునకు విగ్రహరచనయు ననుకూల వ్యాపారములు. ఇట్లగుటవలన, కళలన్నిటిని పృథఁకరించి వాని వానికిఁ గల సంబంధమును ప్రదెంపిపై చుటకు నేను సాహసింపను. కళలన్నియుఁ బరస్పర సాపేక్షకములు. కవిత్వమునఁ గొంత చిత్రలేఖనము చిత్రలేఖనమునందుఁ గొంత కవిత్వమును అవిభాజ్యముగ మిళితమైయున్నది.

చిత్రకారుఁడు స్థలపరిమాణ బద్ధములగు రంగుల నుపయోగించును. కవి కాల పరిమాణ బద్ధములగు శబ్దముల నుపయోగించును. చిత్రకారుఁడు రూపమునకుఁ జర్యను వశవర్తినిఁ జేయును. కవి చర్యకొఱకు రూపమును వర్ణించును. చిత్రకారుఁడు అనంత కాలమునుండి యేదో యొక క్షణమును (అనఁగా ఆక్షణములో జరుగు కార్యమును) గ్రహించి దానికి శాశ్వతస్థితిఁ గల్పించును. కవి క్రమముగఁ బ్రతిక్షణమునం జరుగు కార్యముల వర్ణించుచుం బోవును.

ఇంతింతై వటు డింతయై మఱియుఁ దానింతై నభోవీథిపై
సంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
సంతై చంద్రునికంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
సంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్థియై.

ఈ పద్యమందు అనుక్షణ వర్ధమానమైన వామనుని స్వరూపము వర్ణితమైయున్నది. ఈ విషయమును స్ఫురింపఁ జేయుటకుఁ జిత్రకారుని కన్నను కవికి ననుకూల్య మెక్కువ. ఏ నిమిషమున జరుగుచున్న కార్యము (విజృంభణము) చిత్రించినయెడల ముందుజరిగిన విషయమునుఁ ఇంకముందు జరుగఁబోవు విషయమును సూచితమగునో అట్టి చర్యను మాత్రము చిత్రకారుఁడు చిత్రింపవలయును. చిత్రమును మ్యాజికు లాందరు బొమ్మకును, కవిత్వమును బయస్కోపు బొమ్మల కును బోల్చవచ్చును.

చిత్రకారుఁ డొకరమణీయ రూపమును లిఖించి మన లను నానంద పరవశులను జేయును. మనకానంద మెట్లు కలిగినది? ఆరూపముయొక్క సర్వావయవములు సమష్టి యాకారమున కనురూపముగను, రమ్యముగను చిత్రింపఁ బడియుండును. అవి యెల్లను సమష్టిగా నొకేసమయమున గోచరించును. అప్పుడా రూపసౌందర్యమును మెచ్చుకొనుట వలన ఆనందము మనకుఁ గలుగును. కవియునొక సౌందర్య వతిని వర్ణింపవలయునన్న నేమి చేయవలయును? చిత్ర కారునివలెఁ బ్రత్యంగముఁ దాను వివరముగ వర్ణించి అట్టి యానందమును మనకుఁ గలిగింపఁ గలఁడా? ఎన్నటికిఁ గలి గింపలేఁడు. ఎందువలన? కవి యొకొక్కయవయవమును

ప్రత్యేకముగ వర్ణించును. శరీరవర్ణనము వివరముగఁ బూర్తి యుగువఱకు నిరువది ముప్పది పద్యములు పట్టును. ఆ పద్యములన్నిటియందు నిమిడియున్న అవయవ వర్ణనమునంతయు నొక్కచోటికిచేర్చి యొక యాకారముగ నిర్మించి సమష్టి సౌందర్యమును గ్రహించుట యసాధ్యమైన యుద్యోగము. అంగములను విడివిడిగ కత్తిరించి వేఱుపఱచి వాని యంద చందముల మనము కనుగొనఁజాలము. కావున, కవి యెల్ల ప్పుడును సమష్టివర్ణనముచేయుట యుపయోగకరము. చిత్రకారుఁడు ఆనందకార్యమును చిత్రింపక తత్కారణ భూత మగు రూపమును ప్రత్యక్షముచేయును. కవి కారణమును వర్ణింపక కార్యమును (కారణమైన రూపమును జూచుట వలనఁ గలుగు ఆనందమును) వర్ణించును. అట్లయిన అవయవ వర్ణనము కవికి నవసరము లేదా? కొంతవఱకు అనవసరము గలదు. అటువంటి వర్ణనములు సమష్టివర్ణనమును సార్థక పఱచు నట్లుండిన నదియొక విశేషము.

అలరుం దండలఁ దమ్మి దుద్దులను గ్రీవాలంకృతుల్ చేసి కా
మలతోఁ దెచ్చిన కల్వలం జెవులఁ గ్రమ్మన్మాటి, వాసంత పు
ష్ప లతావ్యాప్తఁ గేరుచుక్ నయన నిర్వాణమ్ముఁ గావించు నా
కలకంఠింగని గౌతముం డెదను జిక్కింబట్టు యత్నంబునన్.
గోరంటాకురసానఁ బాణితలముల్ గోకుల్ పదాబ్జంబులుక్
సారాగోక కిసాల రోచి రుదయ స్థానమ్ములై రక్తిమల్
వాఱుం, గాఁటుక చీఁకటిం గనులక్రేవంజేర మోహంబు గో
భారాజ్యంబును నేలు రాణియయి దైవాఱుం గురంగాంక్షియుక్.

(కడపటి వీడుకోలు)

మొదటి పద్యమున 'నయసనిర్వాణమ్ము గావించుట' అనువాక్యమునందుఁ గార్యమువర్ణితమైనది. ఎంత సౌందర్యవతియైన కాంతను జూడనిదే గౌతమునికి అంతటి యానందము గలిగియుండునా! అని మన మూహించుచుందుము. కవి సూక్ష్మముగ స్ఫురింపఁజేసిన భావములను అవలంబముగఁ గొని మనము మఱికొంత భావింప మొదలిడుదుము. అనంతర మా భావములే ఘనీభవించి మనకొక సుందర స్వరూపము పొడగట్టును. రెండవ పద్యమున 'శోభారాజ్యంబును నేలు రాణి' అనువాక్యమున సమష్టివర్ణనము చేయఁబడియున్నది. అందుకుఁ దక్కిన వర్ణనములు పోషకములుగ నున్నవి.

చెలువుగ వ్రాసి దిద్ది విధి చిత్తము రంజిల జేపమిచ్చెనో?
పొలుపులఁగూర్చి మానస విభూతిని గౌతుకియై రచించెనో?
మెలఁతుక మేనిఁజూడఁ బరమేష్ఠి ప్రభావము నెంచిచూడనా
నెలఁతుక దోఁచు నొండు తరుణీమణి సృష్టియటంచు నామదిఁ.

*(శాకుంతలము)

పై పద్యమునం దంతయు సమష్టివర్ణనమే. దుష్యంతుని యీమాటలవలన శకుంతల అసదృశ లావణ్యావతియనియు లోకమోహన సౌందర్యవతియనియు మన మూహింపగలము.

పై చర్చయంతయుఁ జిత్రకారుఁడును కవియు రూపగత సౌందర్యము నెట్లు స్ఫురింపఁజేయువలయునను విషయమునకు సంబంధించినది. కాని, చర్యను వర్ణింపవలసి వచ్చి

*మహామహోపాధ్యాయ వేదము వెంకటరాయశాస్త్రిగారి తర్జుమా.

నప్పుడు కవి కేవలము సమష్టివర్ణనముతో సంతుష్టిపడి యుండరాదు.

ఏవిహంగముగన్న నెలుఁగించుచును సారెకునుసైకతంబులఁగూడఁదాఁడఁ
దారి కన్గొని యది తనజోడుగాకున్న మెడయెత్తి కలయుంగ మింటినరయు
నరసి కన్నీటితో మరలి తామరయొక్క పదన మెండఁగ సరోవారి నద్దు
నద్ది క్రావఁగనైఁప కట్టిట్లు కన్గొని ప్రతిబింబ మీక్షించి భ్రమసియుఱుకు

నుఱికి యెఱకలు దడియ వేఱొక్కతమ్మి
కరుగు నరిగి రవంబుతోఁ దిరుగు తేంట్లఁ
బొడుచు ముక్కున మఱియును బోవువెనక
సంబఁడియుఁబాసి వగ నొక్కచక్రవాకి.

(మనుచరిత్ర)

పై పద్యమున విరహచంచలయైన యొక చక్రవాకి చర్యలు వర్ణింపబడినవి. కవి యెచ్చోటనైనను 'ఆ చర్యలు మనోహరములుగ నున్నవి' అని చెప్పలేదు. ఎందువలన? అవసరములేదు. ఆ చక్రవాకి చర్యలు మన భావమునకుఁ దట్టిన వెంటనే అవి హృద్యములుగ నున్నవని మనమే యెఱుంగుదుము కార్యకారణములను రెంటినిఁ జెప్పుట రచనా కౌశలమునకు లోపము. ఒకటి తెలిసిన మఱియొకటి తప్పక తెలియఁగలదు. కథానియమబద్ధుఁడై కవి వదలిపెట్టిన వివరములను పాఠకుఁడు తన సొంతభావముతోఁ బూరించుకొనవలయును. కావున నె పాఠకులు సహృదయులుగ నుండవలయుననుట.

ఆ. కవిత్వ ప్రయోజనము.

కావ్య ప్రయోజనములను గుఱించిన మన యాలంకారి కుల మతము ఈ క్రింది శ్లోకము వ్యక్తపఱచుచున్నది.

శ్లో॥ కావ్యం, యశసేఽర్థకృతే, వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యఃపరనిర్వృతయే కాన్తాసమ్మితతయోపదేశయుజే.

ఇందు "సద్యఃపరనిర్వృతయే" అనునది ముఖ్య ప్రయోజనము. ఆనందాస్పదమయిన రసోత్పాదకత్వమే లలిత కళల గంతవ్యము. శాస్త్రముయొక్క కార్యము వస్తు తత్త్వ పరిశోధనము, శిల్పముయొక్క పని వస్తువు నావరించిన మనోహరత్వమును మూర్తీభవింపఁ జేయుట. మొదటి దాని ఫలితము విజ్ఞానము. రెండవ దాని ఫలితము ఆహ్లాదము.

కవి యేమనోవస్థలోఁ దనకావ్యమును రచియించెనో ఆ యవస్థనే సహృదయుఁడా కావ్యమును జదివినప్పుడు పొందును. సంకుచితములైన ప్రపంచసీమలను భేదించుకొని మనస్సు విశాలమయిన భావప్రపంచమున అనిర్వచనీయమైన యానందము ననుభవించును. కావ్య జగత్తునందుఁ జిత్తము లగ్నమైనపుడు అదియు బాహ్యప్రపంచము వలె యదార్థముగ దోఁచును. ఒకనాడు నే నభిజ్ఞాన శాకుంతలముఁ జదువుచుండ, మనోహరారణ్యముల సంచరించినట్లును శకుంతల పూఁదీవలకు నీరుపోయుచుండ నేను ప్రత్యక్షముగఁ జూచినట్లును, ఆమె నత్తవారింటికి వీడ్కొలుపుటకు నీటి కాలువవఱకు వచ్చిన కణ్వమహర్షి యు ననసూయా ప్రియం

వదలు మున్నగు సఖులలో నేను గూడ నొకఁడనియు దలపోసి వారి సుఖ దుఃఖములను నేనును బంచుకొనుచుంటిని. కణ్వుని యాక్రోశము నాకర్ణపుటముల గింగురుమని మాఱు మ్రోయు చుండెను. కాని నేను చదువుచుండినది నాటకమనియుఁ గాళిదాసుని యసదృశమైన రచనా చమత్కృతియుఁ బ్రతిభయు నన్నటుల ముగ్ధుని గావించినదనియుఁ దెలిసికొనుటకు నాకుఁ జాలసేపు పట్టెను. మనసు సామాన్య శ్రుతిలోఁ బడిన వెనుక, కల గని నిదుర లేచిన యనంతరము స్మృతి లేశములు స్ఫురించునటులఁ గణ్వుని సంసారము నా భావమునకుఁ బొడకట్టుచుండెను. హెన్రీవుడ్ అనునామె రచియించిన 'ఈస్టిను' అను నవలలోని కడపటి యధ్యాయమును, 'ఒథెలో' నాటకములోని 'హత్యారంగమును' జదువుచుండినపుడు నాకుఁ దెలియకయే నేను గన్నీరు నించుచుంటిని. ఈయవస్థ నాకెంత సేపుండెనో తెలియదు. తెలిసినప్పుడు, నేలపై జారిపడిన వాఁడు తన్నెవరైనఁ జూచుచున్నారాయని యటు నిటు పరికించునటుల లజ్జాకరమైన నాస్థితిని ఎవరైనఁ గాంచుచున్నారాయని పాఱఁజూచి అచ్చట నెవరును లేకుంట నెఱింగి తృప్తిపడితిని. కావ్యాలోకము ఆ సమయమునకు సత్యమని తోఁపనిదే మనకు సహానుభూతి యెట్లు గనుగును?

జర్మను కవిశేఖరుఁడగు గెతె కావ్య ప్రయోజనము లను గొంచె మించుమించుగ మన యాలంకారికుల వలెనే నుడివియున్నాఁడు.

"Each age has sung of beauty,
He who perceives is from himself set free"

మానవసంఘమున యథార్థమగు నాగరకత హెచ్చు కొలఁది ప్రజలయందు సౌందర్య పిపాసము నభివృద్ధి నందు చుండును. అట్టికాలమున సామాన్యజనులుగూడ, లలిత కళల నభిమానించుచుందురు. ఇది యెంతయు సహజము. కాళి .దాసుని కాలమున హైందవ సంఘము చాల నాగరక స్థితి యందున్నదనుటకు ఆనాఁటి యాచార వ్యవహారములును, కళాకౌశలమును, సాక్ష్యములుగ నున్నవి. అందుకు కాళి దాస మహాకవియె మొదటి తార్కాణము! కవుల కావ్యము లందు సనుకాలీనమయిన సాంఘిక పరిస్థితులు, తదభ్యుదయ పరిణామములు ప్రతిబింబించుచుండును. సారస్వతము సంఘముయొక్క యుచ్చ నీచస్థితులను దెలియఁ జేయు 'భారమితి' యని చెప్పవచ్చును.

కాళిదాసుని కాలమునఁ జిత్రలేఖనము, నృత్యము, సంగీతము, నాటకము మున్నగు లలితకళలు చాలఁ వ్యాప్తిలో నుండినవి. మాళవికాగ్నిమిత్రమునం గల యంతర్నాటిక యఁదు కాళిదాసు ఆకాలపు రాజకుటుంబముల నృత్యవినోద ములను చూపించినాఁడు. శకుంతలను అత్తవారింటికిఁ బంపు సమయమున వనస్పతు లొసఁగిన యాభరణములచేతఁ దమ సకియ నలంకరింపఁబోవుచు ననసూయ 'మే మింతవఱకు భూషణముల నుపయోగించి యెఱుఁగము. అయినను జిత్ర రువు ప్రాఁత యలవాటునుబట్టి నీ యంగములయం దాభరణ వినియోగము చేసెదము' అని పలికెను. వనమున నివసించు ఋషి కుమారికలె చిత్రలేఖనముసం దంత నిపుణులై యుండ, నిఁక నాగరక యువకులమాట వేఱ చెప్పవలయునా? ఆద

ర్శక కవుల కావ్యము లండైనను దేశ కాలములు తమ పద చిహ్నముల ముద్రింపకపోవు, రామాయణ మహాభారత ములు ఆయాకాలమునాఁటికి హైందవ సంఘముయొక్క ఆద ర్శక ప్రతికృతులని తలంపనచ్చును.

మన మనోవికారములను, భావములను శిక్షించి, సంస్కరింపఁగల యనుభవములు మాటిమాటికి లోకమునఁ దటస్థింపవు. ఒకవేళ తటస్థించినను, అవి పరిపూర్ణముగను, ఆదర్శక ప్రాయముగను నుండవు. కాని, అట్టి యనుభూతు లను కావ్యములందు మనము యథేచ్ఛముగఁ బొందవచ్చును. కవిత్వ సంపర్కమువలన సంకుచితభావము తొలఁగి యఖండ జీవముయొక్క పరతటము నంటఁగలను. క్రమముగ మన స్వభావము సున్నితముగ మాఱి తిలకించు ప్రతి వస్తువునందు సౌందర్యమును గుర్తించి యానందింపఁగల యభిరుచి హెచ్చును. కావున కావ్యము మానవప్రకృతి నుద్ధరింపఁగల యొక మనోహర సాధనము.

సంఘముయొక్క సంయోగతను బోషించుటకుఁగూడ గావ్యము లమోఘ సాధనములు. అట్టి ప్రబంధముల యందలి సర్వజనీన భావములు ప్రజనందఱిని నేక సంప్రదాయ బద్ధు లను గావించి, సంఘముయొక్క యైక్యమును బలపఱచును. రామాయణ, మహాభారతములు లేకుండిన హైందవ సంఘు మేమై యుండునో! హిమవత్పర్వతము మొదలు కన్యాకుమారి పఱికిఁ గల యీ విశాల భారతదేశమున నీ రెండు జాతీయ కావ్యములను జదువని, వినని హైందవుఁడుండునా? ఎన్ని శతాబ్దములనుండి యీ కావ్యద్వయము మన సంఘమును

బాలించుచున్నది! కాలము మాఱినది, చక్రవర్తులు గతించిరి. రాజ్యములు బంతులవలె నొకరిచేతినుండి మరియొకరి చేతికి దుమికినవి, మతములు పుట్టి చచ్చినవి, చచ్చిపుట్టినవి, అన్య దేశ నాగరకతా సంఘర్షణము గలిగినది. ఆచార వ్యవహారములు మాఱినవి. పూర్వార్యావర్తమో రూపము మార్చుకొని క్రొత్తదేశమైనది కాని, మన జాతీయకావ్యములు ప్రాతపడలేదు, వాని యధికారమింకను మొక్కవోలేదు. హైందవ జీవన ప్రవాహమునకు ఆ కావ్యములు తటములవలె నున్నవి. కాలమా, నీవు చచ్చితివి! రామాయణ మహాభారతములు చావలేదు; అవి చిరంజీవములు!

---

౯. కావ్యము : నీతి

మతము, శాస్త్రము, ధర్మము, లలితకళలు మున్నగునవి వానివాని కుచితమైన రీతుల మానవ శిక్షణమునకుఁ దోడ్పడు సాధనములు. కొన్ని బుద్ధిని ఉత్తేజన మొనరించునవి. మఱికొన్ని హృదయమును పరిపక్వపఱచునవి.

ప్రతియుగమునందును ప్రతిసంఘమునందును కాలమున కంటె ముందు నడచు ప్రతిభావంతులు, విప్లవకారులు, దూరదృష్టి గలవారు కొంద ఱుదయించుచుందురు. అట్టి మహనీయుల భావములు, సృష్టులు ఆ యుగమునకు, ఆ సంఘమునకు ఆదర్శకములుగ నుండును. ఆపురుషపుంగవులు మార్గదర్శకులు; అస్పుటముగను, అవ్యక్తముగనున్న భావికాలమును మనకన్నులకుఁ బొడకట్టునట్లు చేయఁగల మహిమా

వంతులు. వారి పలుకుబడివలన మానవసంఘము క్రొత్త క్రొత్తదారులు ద్రొక్కుచుండును. జాతీయత అట్టి యుదార హృదయుల భావసంపర్కముచేత సంతర్జాతీయతగఁ బరిణమించుచుండును. బుద్ధుడు, వాల్మీకి, ఏసుక్రీస్తు, మహమ్మదు మున్నగు మహాపురుషు లీతరగతికి సంబంధించినవారు. వారి జీవితమే యొక యుత్కృష్టమైన కావ్యము. వారి ప్రవర్తనమే నీతికి ఆదర్శకము.

ప్రతియుగమునం • దొకొక్కభావము ప్రముఖమై యుండును. అది యాధ్యాత్మికమైనను, సాంఘికమైనను, రాజకీయమైనను, లేక మఱి యింకేవిధమైన మానవచర్యకు సంబంధించినదిమైనను గావచ్చును. ఆభావములందుఁ బ్రజల యాంతరంగిక దృష్టి లగ్నమై యుండును. ఇట్టిభావము సార్వజనీనముగ నుండక తప్పదు. దానిని కవియో, చిత్ర కారుఁడో, ప్రవక్తయో, తన సృష్టిమూలమున బయలుపఱుచును. మన మెల్లర మానాయకుని ననుసరింతుము. ఎందువలన? మనయందు అస్పష్టములుగను నిగూఢములుగను నున్న భావములను ఆయన వెలిబుచ్చును. ప్రజాబాహుళ్యము యొక్క భావములు ఆతని సృష్టియందు ఆదిశేషావతారము దాల్చి రెండువేలనాలుకలతో మాటలాడుచుండును. ఆయన కును మనకును సహానుభూతి గలదు. కావుననే యీ నాయ కుఁడు మనలనాకర్షించును. అట్టి మహనీయుల యుద్దేశములు, సంభాషణములు, ప్రవర్తనములు విశ్వశ్రేయమును జేకూర్చు చుండును. ఏది విశ్వశ్రేయమును సంపాదింపఁగలదో యది నీతిబాహ్యముగ నుండనేరదు.

లలితకళలు జాతీయ జీవితమునందు అంతర్వాహినులై ప్రవహించు భావముల రమణీయాభివ్యక్తులే. కావున, వాని యందు ముఖ్యములును, సర్వజనాదరణీయములును అగు భావములను ఆకర్షించి, శిల్పులు తమ రచనాచమత్కృతి వలన వానిని ఆదర్శకములుగ నొనరింతురు. ఇట్లనుట వలన మానవసమాజమును కళలును పరస్పర సాపేక్షకము లని మన మూహింపవలయును. తాత్కాలికములైన భావములుకొన్ని ప్రజలను శిల్పులను ఆకర్షింపవచ్చును. అట్టివి క్షణికములు. కాని, కాలపారంపర్యముగ నొకజాతి యందు అస్థిగతమై మజ్జలో నాటుకొనియున్న భావములను మూర్తీభవింపఁజేయుట జాతీయశిల్ప మనఁబడును. అదియే లోకాదరణపాత్రము. తన వ్యక్తిత్వమును బోఁగొట్టుకొనక చిరంజీవముగ నుండును. తాత్కాలికములైన విజాతీయానుకరణములు మన స్వభావమునకుఁగూడ విజాతీయములే కావున సత్యపటుత్వము కొఱఁతపడి కళాప్రపంచమునందు నిరాదరింపఁబడును.

ప్రాచ్యపాశ్చాత్యశిక్షణ మార్గములందుఁ బరస్పర వైరుధ్యము గోచరించుచున్నది. ఒకరికి శాంతియు నిరాడంబరమైన జీవనము ప్రధానము. మఱియొకరికి, తృష్ణ, చిత్త సంక్షోభము, ఆటోపము ముఖ్యము. నేతిచేఁ దడుపఁబడిన అగ్నిహోత్రముపలె భోగము లనుభవింపఁబడుకొలఁది వృద్ధిచెందుచుండుననియు, కావున భోగముల నియతముగ గ్రహింపవలయుననియు నొకరిమతము. భోగముల వీలై నంతవఱకు వృద్ధిపొందించి వాని ననుభవింపనిదే నాగరకత

గాదని మఱియొకరి యభిప్రాయము. ప్రాచ్యులకు జీవితము పరమార్థమును సాధించుటకై ఏర్పడిన యొకయుపకరణము. పాశ్చాత్యులకు, జీవితమే యొక పరమార్థము. కావున యిట్టి మార్గభేదములు రెండు ఖండములయొక్క. లతితకళల యందు నస్థిగతముగ నంకితమైయున్నవి. ప్రాచ్యశిల్పము నందు రూపయథార్థ్య మంతముఖ్యముగాదు. ఏలయన, వారిశిల్పము చాలవఱకు సాంకేతికము. సాంకేతికశిల్ప మెప్పటికి కొన్ని శిల్పసమయములకుఁ గట్టువడియుండును. అజంతాగుహాలయంబలి రేఖాచిత్రములు ఈతరగతి శిల్పము నకుఁ బ్రబలమైననిదర్శనములు. మనశిల్పము ధ్యానమూలక ము; వారిశిల్పము ప్రకృత్యనుకరణము.

'కళలయందు రసరామణీయకములె ప్రధానములు. కాని, నీతికిని ఆధ్యాత్మికభావములకును నేమిసంబంధము గలదు? అని కొందఱు విమర్శకులు ప్రశ్నించుచున్నారు. ఇది మనకు నవీనమును విజాతీయమునునైన సందేహము. ఆస్కార్ వైల్డ్ (Oscar Wilde) అను నొక ఆంగ్లేయ విమర్శకుఁడు *కళ లన్నియు నీతిబాహ్యములనియు, నీతియనునది యేదోకొద్ది పాటి తెలివితేటలు గలవారికేగాని, ప్రతిభావంతులకు నీతి యనవసరమనియు చెప్పియున్నాఁడు. ధర్మశాస్త్రములయందు వలె కావ్యములందు నీతిబోధ యనవసరమనుటయే ఆయన యుద్దేశమైనయెడల మే మిరువురము ఏకాభిప్రాయులమే. కాని నీతికిని కావ్యమునకును ఏలాటి సంబంధములేదని

* All the arts are immoral. To morals belong the lower and less intellectual spheres. —*Intentions.*

వాదించువారికిని నాకును భిన్నాభిప్రాయము గలదు. ఈ విషయమును గొంచెము చర్చింతము.

కావ్యమందు రామణీయకము ముఖ్యము; తక్కిన గుణములు అందుకు పోషకములుగ నుండవలయును. రామణీయకమనునది ప్రతిభావంతుఁడైన కవియొక్క రచనా నైపుణ్యమునకు సంబంధించినది. గుణమెప్పుడు తనకాలంబనమైన వస్తువును ఆశ్రయించియుండునుగాన, వస్తుగుణములు రెంటికిని ప్రాధాన్యము గలదు. ఒకవేళ నీతిబాహ్యమైన వస్తువు రమణీయమై యుండినయెడల షేక్సిపియరు (Shakespeare) మహాకవి సృజించిన క్లియోపాట్రా (Cleopatra) కన్యవలె మానవలోకమున కుపద్రవము గలుగఁజేయును. శకుంతలవలె అనుభోగ్యము గాదు.

మఱియొక పూర్వపక్షము గలదు: 'శిల్పముకొఱకే శిల్పము' (Art for art) అనఁగా శిల్పమున కేలాటి బాధ్యతలు లేవు. కవి భావోద్రేకమువలనఁ దనకిష్టమైనరీతిని గానము చేయును. అల్లుచేయుట యితరులకొఱకుఁగాదు; తనసంతోషమునకు. కోకిలకూయుట యెవరిని ఆనంద పెట్టుటకొఱకు? ఈ వాదము మొట్టమొదట వినుటకు ఇంపుగానే యుండును; కాని విమర్శించుకొలఁది యందలి లోపములు బయలుపడును. కోయిలకూఁతను విని మన మానందించుచున్నాము; నిజమే, దానికూఁత మధురముగ నుండుటవలనను ఆ కూఁత మనకు సమ్మతమగుటవలనను మనము సంతోషించుచున్నాము. అది తన కిష్టము వచ్చినట్లు కూయుటవలనఁ గాదు. కాకిగూడ తనకిష్టమువచ్చినట్లే కూయును. దానిని మనమేమాత్ర మాద

రించుచున్నాము? అటులనే కవి చేయు గానము మానవ సమాజము నుద్ధరించుటకు యోగ్యమైనదిగ నుండుటనలననే గౌరవింపఁబడుచున్నది 'నాకు నోరున్నది. తిట్టుటకు చాల మాటలు దెలియును. కావున నేను తిట్టుకొనుచుందును' అని చెప్పి వీధులవెంబడి తప్పుదారి కూఁతలు కూయుచుఁ దిరుగు చుండిన 'ఆతనికి పిచ్చి పట్టిన' దని పిచ్చివారి ఆసుపత్రికి పంపుదుము. సమాజ మెట్లు తనయందలి వ్యక్తికి బాధ్యమొ, వ్యక్తికూడ సమాజమునకు బాధ్యుఁడు.

కవి యొకమూలఁ గూర్చుండి తన సంతోషముకొఱకు నొక కావ్యము రచియించుకొని దానిని బదిలముగ నింట దాఁచుకొని యుండినయెడల నేలాటి యిబ్బంది లేదు. అట్లు గాక కవిరచనలు వ్యాప్తిలోనికివచ్చి, లోకజీవనము పై నధికారము చేయుచుండును. కావున నందఱికంటెను కవికి బాధ్యత యెక్కువ. ఉత్తమకవి సృష్టియం దా కాలపు మానవ సంఘమునందలి సమంచిత భావములు మూర్తీభవించి యుండును. ఆతని రచనలందు భవిష్యద్వాణి రహస్య మర్మర రవములతో సంభాషించుచుండును.

మానవ జీవితమునకును శిల్పమునకును సహజమైన సంబంధము గలదు. జీవిత ప్రయోజనము ననుసరించి శిల్ప ప్రయోజనము కూడ నిర్ణయింపఁబడుచుండును. మన జీవితమును గుఱించి ఉమ్రఖయ్యాం (Omar Khayam) అను పారసీక కవి యిట్లు నుడివియున్నాఁడు.

One thing is certain and the rest is lies:
The flower that once has blown for ever dies.

* * *

Many knots unravelled by the road.
But not the knot of human death and fate;
There was a door to which I found no key,
There was a veil past which I could not see.

* * *

While you live, drink;
for once dead, you never shall return.

ఉమ్రఖయ్యాము కొంచె మించుమించుగా చార్వాక మతస్థుఁడు. 'వికసించిన పూవు మరల వికసింపఁబోదు. మరణించిన మానవుఁడు మరల తిరిగి రాఁబోఁడు. ప్రాణముండఁగనే భోగము లనుభవించెదము. చచ్చిన వెనుక యేమగునో ఆ విషయము నాకు తెలియదు. ఆ ముడిని నేను విప్పఁజాలక పోతి' నని చెప్పెను. అట్టివారికి జీవితము భోగమాత్ర ప్రయోజనము. జీవితము ననుసరించి శిల్పము గూడ విషయభోగముల ప్రతిబింబముగ నుండును.

కాని, మన విశ్వాసములు వేఱు. ధర్మార్థ కామ మోక్షములను నాలుగు పురుషార్థములను మానవజీవితము సాధింపవలయునని మన పెద్దలు నిర్ణయించిరి. వారు ఇహ పరముల రెంటికిని సమాన గౌరవమును చూపియున్నారు. సన్న్యాస మనునది అతీత ధర్మము. లోకసామాన్యము గాదు. ధర్మార్థ కామమోక్షములు పరస్పర సాపేక్షములు కావున, మన కవిత్వ ప్రయోజనము, జీవితాదర్శకము ను

సరించి బ్రహ్మానంద సోదరమైన పరనిర్వృతిగ నిర్ణయింపఁ బడినది. కావ్యము లనఁగాఁ బసిబిడ్డ లాడుకొనుటకై మన మిచ్చు రంగుల బొమ్మలుగావు; అనాగరకతా దోషము పాపుకొనుటకు మేజా బల్లలపైఁ బ్రదర్శింపఁబడు భూషణ గ్రంథములనుగా కావ్యములను మన మెప్పుడు తలంపలేదు. మన జీవితమునందు కావ్యములు మిళితమై పోయినవి. ఆర్య సాంఘిక జీవన స్రవాహమునకు రెండు తటములుగ నున్న రామాయణ మహాభారతములే యిందులకు దృష్టాంతము. సీత, దమయంతి, సావిత్రి, ద్రౌపది మున్నగు పౌరాణిక సతీ రత్నములు భారతదేశమునం దెందఱు పతివ్రతల సృజింప లేదు? సంసారమందు నిర్భర దారిద్ర్యమును, కష్టపరంపర లను ననుభవించుచున్న సతీమణులకు దమయంతి, ద్రౌపది, చంద్రమతి మున్నగు నిల్లాండ్ర చరిత్రము లెంత యూఱట నొడగూర్చియుండ లేదు. ఈ నారీవతంసము లందఱు వ్యాస, వాల్మీకి మహాకవుల భావప్రపంచమునఁబుట్టి పెంపొందిన ఆదర్శక సృష్టులేకదా! అట్టి కవులెన్నఁటికైన నిరాభ్ధ్యులగుదురా? వారి రచనలు నీతి బాహ్యములగునా?

కీట్సు (Keats) అను ఆంగ్లేయకవి Beauty is truth, truth beauty అని చెప్పియున్నాఁడు. మన పూర్వికులు సత్య సౌందర్యములకు శ్రేయమునుగూడఁ జేర్చిరి. కావ్యము విశ్వశ్రేయము చేకూర్చునదిగ నుండవలయును. అనీతి దాయకమైన దేదియు లోకకల్యాణము నాపాదింప లేదు.

ఇఁక నీతియన నేమి? దాని నెవరు కల్పించిరి? దాని వలనఁ బ్రయోజన మేమి? అను నీ విషయములు మనసున

కెక్క-నిదే కావ్యములందు నీతి యావశ్యకమా? లేదా? యను సందేహమును మనము తీర్చుకొనలేము. నీతి యనుపదమును విశాల భావము గల దానిగా నూహించి నేనిచట ప్రయోగించుచున్నాను. దేశకాల పాత్రములకు లోబడి నీతులు భిన్నములుగ నుండవచ్చును. ఒక సంఘమువారికి నొక దేశమువారికి ననుకూలమయిన నీతులు మఱియొకరికి విరుద్ధముగ దోపవచ్చును. కాని, యిట్టి పరస్పర విరుద్ధములైన నీతులందు నంతర్వ్యాపియగు నుద్దేశ మొక్కటియే. అది యేదన : మానవ జీవితోద్ధరణము, లోకయాత్రా సౌకర్యము. నేనిచట బ్రయోగించిన నీతి అను పదమును దేశకాల పాత్రాచార వ్యవహారములకు వశవర్తియయి సంకుచితమయిన నీతినిగ నర్థముచేసికొనఁ గూడదు. అన్ని నీతులకు జన్మకారణమయిన యావశ్యకతనుగఁ దలంప వలయును. ఇది జగదేకము.

సంఘ సమష్టికిని దదంశమైన వ్యక్తికిని భిన్నభిన్న వ్యక్తులకును గల ప్రవర్తన సామరస్యము, ఆనుగుణ్యము నీతి యనఁబడును. ఈనీతి మానవుల యావశ్యకతనుబట్టియు ననుభవము ననుసరించియు, క్రమక్రమముగ రూపముదాల్చి సంఘయంత్రమును నడుపుచుండును ఈ నీతులు సకల విధములైన మానవచర్యలకు సంబంధించియున్నవి. ఇట్లనుట వలన, విశేష సంఖ్యాకులగు ప్రజల యభిప్రాయము ఘనీభవించి నీతిగను శాసనముగను మాఱును. కాని, నీతిశాసనములకుఁ గొంత భేదముగలదు. రాజాధికార ముద్రగలది శాసనము, సంప్రదాయ సిద్ధమయి మానవుల భావములను

బరిపాలించునది నీతి. నాగరకత హెచ్చుకొలఁది అధికార ముద్రాంకితములగు శాసనములకంటె స్వయమారోపితములగు నీతులే మనుష్యసంఘమును బాలించుచుండును. విరుద్ధ శాసనమునకు లొంగియుండుట దాస్యమైనను స్వయంకృత నియమమునకు వశవర్తియై యుండుట స్వాతంత్ర్య మనఁ బడును.

నీతులును శాసనములును (స్వయంకృతములైనను, పరకృతములైనను) సంఘమును శాసింపనియెడల వ్యక్తి స్వాతంత్ర్యము నశించి మానవజాతికిఁ బ్రళయము సంభవించును. కావున నీతి మానవులయం దన్యోన్య ప్రవర్తనానుగుణ్యమును బోషించును.

కళలు సాంఘిక జీవితముయొక్క యుచ్ఛ్వాస నిశ్వాసముల యాదర్శక లేఖనములని యిదివఱకే తెలిసిన్నొసి యుంటిమి. కావున జీవిత మొక వంకను, కళలు వేఱొక వంకనుఁ బ్రవహింప నేరవు. సాధారణ జీవితమునందు నేవేవి నీతిబాహ్యములుగను, నేనము పుట్టించునవిగనుండునో అట్టివి కళలయందును నింపుగొలుపవు. అట్లగుట కావ్యమునకును నీతికిని సంబంధ మెట్లు తెగిపోవును?

ధర్మశాస్త్రములు వేఱు; కావ్యములు వేఱు, వాని వాని ప్రయోజనములును భిన్నములు, పాలనాదండము చేత బట్టుకొని 'సత్యంవద' 'ధర్మంచర' అని వేదములు శాసించును. కవి 'సత్యంవద' అని శాసింపక హరిశ్చంద్రుని సృజించెను. 'సత్యమేవజయతి' అను ధర్మవాక్యమునకు హరిశ్చంద్రోపాఖ్యానము లక్ష్యము. ఆకథను జదివినవారికి

హరిశ్చంద్రునిపై భక్తి గౌరవములు గలుగకపోవు. మన మెవరిని ఉత్తములని మెచ్చుకొందుమో వారి ననుకరింప వలయుననియో, వారివలెఁ బ్రవర్తింపవలెననియో మన మభిలషింతుము. ఈకోరిక మనయందు సహజముగఁ బుట్టును. సత్కావ్యములయందు ఇట్టి యున్నతాశయములను, ఆసలను బ్రేరించు శక్తిగలదు. *బలాత్కార నీతిబోధనమునకు కావ్యము లెన్నఁడును బూనుకొనఁగూడదు. అట్టివి కావ్యములుగాక మనుధర్మ శాస్త్రములవంటి స్మృతులుగ మాఱును. కళలయందలి నీతి యంతర్లీనమై యలక్షితముగ మన హృదయముఁ బ్రవేశించును. దాని పదచిహ్నము లదృశ్యములు. ఇట్లు రచించుట కళానైపుణ్యము.

కావ్య మర్థింపవలసినది రససౌందర్యము లేకదా! అంతర్లీనమైన నీతియైనను వానికెటుల నుపకరించును? అను సంశయము కొందఱికుఁ గలుగవచ్చును. నీతిస్పర్శలేనిదే సౌందర్యము పరిపూర్ణముగాదని నాయుద్దేశము. ఈ దృష్టితో మనము విమర్శింపఁబూనినయెడల ఏ దేశము యొక్క యుత్తమశిల్పమునందుఁగాని యనీతిపరత్వము గోచరింపదు. ఒకచిత్రకారుఁడు రమణీయవతియగు కాంతను విగతవస్త్రనుగఁ జిత్రించి మనకుఁ జూపినయెడల ఆ సౌందర్యమునంతయు మ్రింగివేయుఁగల యసహ్యముపుట్టి మొగము చిట్లించుకొందుము. ఎందువలన? ఆ చిత్రపటమునకును జీవితము

---

*The office of poetry is not moral instruction, but moral emulation; not doctrine, but inspiration

G. H. Lews,
'The Inner Life of Art'

నందు మన కలవాటుపడియున్న యౌచిత్యమునకును వైరు
ద్ధ్యము సంభవించినది. అందలి రమ్యత సర్వజనోపభోగ్య
మగు నంతలేదు. సభ్యముగ ఇట్టి చిత్రములు ఆహ్లాదమును
గలిగించి మనసు నుద్ధరించుటకు మాఱు, ఇంద్రియచాపల్య
మును, అసభ్యములగు మనోవికారములను బ్రేరేపించు
చుండును. అట్లుచేయుట యుత్తమకళయొక్క ధర్మముకాదు.

అట్లయినయెడల మానవచర్యలకు సంబంధింపని
వనములు, కొండలు, మేఘములు, ఉషస్సులు, సూర్యాస్త
మయములు మున్నగు దృశ్యముల ప్రతిలేఖనములు కాంచు
వారలకు ఆనందము గలగించునుగదా! అట్టి చిత్రమునందుఁ
గూడ నీతి అంతర్లీనమై యున్నదా? అని కొంద అడుగ
వచ్చును. అట్టి చిత్రములు అనీతిస్ఫోరకములు గాకుండుట
చేతనే వానియందలి రామణీయకమును ప్రతిబంధకము లేక
మన మనుభవింతుము. నీతి సౌందర్యమునకు హేతువుగాదు;
పరిపూర్ణతకు ఆవశ్యకమైన యొక ఔచిత్యము.

కావ్యమునందు శిల్పనైపుణ్యము హెచ్చుకొలఁది
యందలి కథాభాగమునకుఁ జదువరుల హృదయము నాక
ర్షించు శక్తియు హెచ్చుచుండును. గుణ మెప్పుడు వస్తువు
నాశ్రయించియుండును. గావున నితరకళలయందు వలెనే
కావ్యమునందును వస్తుగుణములు రెంటికిని వానివానికిఁ
దగిన ప్రాధాన్యము గలదు.

మానవుని ప్రతికోరికకును రెండుదిక్కులు గలవు.
మొదటిది వాంఛాపరిపూర్తి; రెండవది తజ్జనితమైన యుప
యుక్తి. ఒక యుదాహరణము: మిఠాయినిఁ జూచినపుడు తినఁ

గోరిక పుట్టును. ఇది జిహ్వాచాపల్యము. మనదృష్టి కోరిక తీర్చుకొనుట యందే లగ్నమయి యుండునుగాని, దాని యుపయోగమును గుఱించిన తలంపు సాధారణముగఁ గలు గదు. కాని, మనము తలంచినను, తలంపకపోయినను మిఠాయి తినుటవలన రెండులాభములు చేకూఱినవి. ఒకటి : కోరిక తీఱుటవలన గలుగు తృప్తి ; రెండు : దేహపుష్టి. ఇచ్చట మిఠాయిలోని మాధుర్యము రుచిచూచుటవలనఁ గోరిక తీరినది. ఆమాధుర్యము, ఆహారవస్తువు నాశ్రయించి యుండుటవలన దేహమునకు బలము కలిగించినది. కాని, మాధుర్యము మాత్రము కోరిక తీర్చునదిగా నుండి తదాశ్రయవస్తువు అనారోగ్యకరమై యుండినయెడల దాని ప్రతిఫలమును మనము తప్పక యనుభవింతుము. ఈ సాదృశ్యమును కావ్యములో గససౌందర్యములకును, కథాభాగమునకును వాని ననుభవించు మానవసమాజమునకును నన్వయించి చూడుఁడు ; అంత్యఫలితము మీరే యూహింపఁగలరు.

మానవస్వభావ నిర్మాణమునందుఁ బరిస్థితులు చాల ముఖ్యములని మనస్తత్వ శాస్త్రజ్ఞులెల్లరు నొప్పుకొన్నవిషయమే! కావ్యములం దట్టి పరిస్థితులు గలవు. ఇంద్రియగోచరములగు విషయములు మనల నెట్లు లోఁగొనునో, కావ్యాంతర్గత విషయవర్ణనముకూడ నట్లే మనల వశవర్తులఁ జేసికొనును. కావున కావ్యములతోఁ గవికిఁ గల సంబంధము కన్నను దానిని జదివి యానందించు లోకుల కెక్కుడు సంబంధము గలదు.

మతమును శిల్పమును ఒక పూవులోఁబుట్టిన రెండు రేకులని చెప్పవచ్చును. వానిరెంటికి మిక్కిలి సమీప బాంధవ్యము గలదు. ఒక దానినొకటి యపేక్షించి యవియన్యోన్య సహకారమువలన నభివృద్ధి చెందినవి.

వైదిక ఋషుల భావమును, కవిత్వ కల్పనాశక్తియు సమ్మిళితమయి, యందుండి యపూర్వ సృష్టులు బయలుదేరినవి. పౌరాణిక ప్రపంచమంతయు నిట్టి మతకవిత్వ సాంకర్యముయొక్క యద్భుత సృష్టియేకదా! ఇట్టి కల్పనలు లేకున్న మానవజీవిత మెంత సంకుచితముగ నుండియుండెడిదో!

మతమును, శిల్పమును ఆనంద సాక్షాత్కారమునకై పాటుపడుచున్నవి. గంతవ్య మొకటి; మార్గములు భిన్నములు.

'ఆనందా దేవ ఖల్విమాని భూతాని జాయంతి,
ఆనందా దేవ జాతాని జీవంతి.
ఆనందం ప్రయాన్త్యభి సంవిశంతి.'

ఈ భూతసృష్టియంతయు నానందమునుండి యుత్పన్నమగుచున్నది. ఆనందమున వర్ధిల్లుచున్నది. ఆనందము దిక్కునకే ప్రవహించుచున్నది. తుదకాయానందమును బ్రవేశించుచున్నది. శిల్పిసృష్టియు నిట్టిదే. భక్తుఁడును శిల్పియు నేది 'సత్యం శివం సుందర'మో దానిని దర్శించుచున్నారు. ఈయంతస్తునందు నిద్దఱికిఁగలభేదము నశించినది. కవి భక్తుఁడు, భక్తుఁడు కవి; శిల్పము మతము నొక్కటియే యైనవి.

మొదటి యనాగరక దశయందు మానవుఁడు పశుప్రాయుఁడై కామ్యసౌఖ్యములతో సంతృప్తిపడియుండును.

అంతకు మించిన సంతోషము నతఁ డెఱుఁగడు. రెండవ దశ యందుఁ బ్రాపంచిక జ్ఞానము కొంత యుదయించి, మనో వికృతులు శిక్షితములయి శాస్త్రములు, శిల్పములు మున్నగు వాని మూలమున నానందముఁ బొందును. మూఁడవ దశ యందు రానురాను ఆతనిజ్ఞానము విశేషముగ నభివృద్ధినొంది పూర్వమున కన్న శాశ్వతమైన యానందము నన్వేషింప మొదలిడును. అదియే యమృతానందము.

'ఏకం రూపం బహుధా యఃి కరోతి.....
తమ్ ఆత్మస్థం యేఽను పశ్యంతి ధీరా,
తేషాం సుఖం శాశ్వతం నేత రేషామ్.

ఒక రూపమును బహురూపములుగ నెవ్వఁడొనరించు చున్నాఁడో, ఆత్మస్థుఁడైన ఆపరమాత్మను ఏ ధీరులు దర్శించుచున్నారో వారు శాశ్వత సుఖమును బొందుదురు. అన్యులు పొందరు. *శిల్పము తన యాదర్శకమును క్రమక్రమ ముగ మాఱ్చుకొని, యెట్టకేల కీ శాశ్వత సుఖమును మాన వుల కందింపఁగల యంతటి యున్నతపదవి నారోహించినం గాని, కృతకృత్యము కానేరదు.

సంపూర్ణం

---

*Fine art is not real art till it is in this sense free, and only achieves its highest task, when it has taken its place in the same sphere with religion and philosophy.

—*Hegel*
'Philosophy of Fine Art'

మర్మ కవిత్వము

పాశ్చాత్య దేశములందు శాస్త్రవిజ్ఞానము పెచ్చు పెరిగి లలితకళలస్థానమును సైతము నాక్రమింపఁజొచ్చెను. కావ్యములందు మనోమోహనమయిన దివ్యానుభూతికి మూఁట మేధోవ్యాపారము అధికారస్థాపనము గావించెను. ఆతరుణమున ఫ్రాంసుదేశమునందు నిందుకుఁ బ్రతీకారముగ నొక కవితోద్యమము బయలుదేఱెను. ఆయుద్యమకారకులు సమకాలీన కవిత్వముతోఁ దృప్తిపడియుండక, యింద్రియ ముల సంతస్సుఖములఁ గావించి, యగాధమును విశాలము నైన సూక్ష్మ ప్రపంచమును జొచ్చి, యందల యనిర్వచ నీయమయిన సత్యమును సౌందర్యమును గానముచేసిరి. ఈ తెగకు సంబంధించిన కవులను పాశ్చాత్యులు మర్మ (Mystic) కవు లనియు, సాంకేతిక (Symbolists) కవు లనియు నామకరణము గావించిరి. బాడిలేర్ అను ఫ్రెంచి కవి ఇటువంటి కవిత్వమునకు మొదటమార్గము సిద్ధపఱచెను. అనంతరము వెర్లైన్, మ్యాలర్మే అను కవులు సుప్రసిద్ధులైరి. ఈ మర్మకవిత్వము యూరపుఖండమునందుఁ దన ప్రకృతి కనుకూలించిన దేశములందెల్ల వేరు నాఁటుకొనెను. జర్మనీదేశమందు డెమ్మెల్ అను యువక కవియు ఆతని యనుచరులును, అయిర్లాండునందు ఈట్సు, యే. యి.

ఆర్థరె సిమ్మన్సు, *జేమ్సు హెచ్. కజిన్సు మున్నగు కవులును ఈ మర్మకవిత్వసంప్రదాయమునకు సంబంధించినవారు.

మర్మకవిత్వము సామాన్యముగ గీతి (Lyric) రూపమున నుండును. ఆ గీతములందు గానమునకును భావమునకును సమానగౌరవము గలదు; ఒకవేళ గానమే ప్రాధాన్యము వహించినదనిగూడఁ జెప్పుటకు వీలున్నది. కావ్యరూపములలో గీతమే యుత్తమోత్తమ మని కొందఱి యాధునికుల యభిప్రాయము. మర్మకవులు తక్కువపదములతో నెక్కువగానమును, సూచనలను గర్భీకరింతురు. పాల్ వెర్లైన్ ఈ తెగ కవిత్వమునకు లక్షణముగఁ గ్రిందిగీతము లు రచించెను.

Music, Music before all things
The eccentric still prefer,
Vague in air, and nothing weighty,
Soluble, yet do not err,
Choosing words, still do it lightly,
Do it too with some contempt.

* * *

Music always, now and ever
Be they verse the thing that flies
From a soul that's gone escaping,
Gone to other loves and skies.

ఈ కవిత్వమునకు మర్మకవిత్వ మని యేల పేరు రావలయును? ఈ కావ్యములందు సామాన్యప్రజల కగమ్య

---

*వీరిప్పుడు మదనపల్లి థియొసాఫికల్ జాతీయకళాశాల ప్రిన్సిపాల్‌గా నున్నారు.

గోచరమునైన విషయము లుండును. సాధారణముగ నీ తరగతి గీతముల వస్తువు ఆధ్యాత్మికవిషయముగ నుండును. కవియొక్క యాంతరంగికానుభవమును విశ్వజనీనతయు గీతములయం దంకితమై యుండును. కవులయం దాధ్యాత్మిక స్వభావము నిర్నిద్రము. కావున వారు బహిరింద్రియ నిర్ణీతములైన సీమలనుదాటి సూక్ష్మప్రకృతినిఁ బ్రవేశించి యందుఁ గలిగిన యనుభూతిని ధ్వనిమూలకముగనో, సూచనగనో, సాంకేతికముగనో వెలిపుత్తురు. ఈ మర్మకవిత్వము కేవలము ఆత్మానుభవజనితముగను, ఆత్మోపభోగమునై యున్నది. జీవనమునొక్క యవ్యవహితమట్టు ఈ గీతములందుఁ బొడకట్టుచుండును. యూరపుదేశపు సామాన్యజనులకు ఆధ్యాత్మికగంధము శూన్యము. కావున వారి కీకవిత్వము మర్మముగఁ దోఁచినది. బాడిలేర్ కవిత్వము ఆధునిక పాశ్చాత్యమర్మకవిత్వమునకు మార్గదర్శకమైనదని యిది వఱకుఁ దెలిపియుంటిని. ఆతని రచనలోఁ జాలప్రసిద్ధమైన ఈక్రింది పద్యములలోని యగాధాశయములను గమనింపుడు:

Earth is a temple, from whose pillared mazes
Murmurs confused of living utterences rise;
Therein man thro' a forest of symbols paces,
That contemplate him with familiar eyes.
As prolonged echos, wandering on and on,
At last in one far tenebrous depth unite,
Impalpable as darkness, and as light,
Scents, sounds, and colours meet in unison.

ఈ తెగ కవులలో మఱిల (ఫెంచివారికిని ఐరిషువారి

కినిఁ గొంత భేదము గలదు. అయ్యది దేశకాలపరిస్థితులకు సంబంధించినది. ఐరిషుకవుల కుండినంత ప్రకృతిసాంగత్యము ఫ్రెంచికవులకు లేదు. అందువలన వారి కావ్యములందుఁ గొంత కృత్రిమత పొడకట్టుచున్నది. మనకు సమకాలీనుఁడైన ప్రసిద్ధ ఐరిషుకవి, *ఈట్సు రచియించిన ఈ పేరిన తేనెగడ్డను చవిచూడుఁడు:

In all poor foolish things that live a day
Eternal beauty wandering on her way,

ఈకవి తన యాత్మానుభూతిని పై రెండు పాదములలో నిమిడ్చియున్నాఁడు; అనంతసౌందర్యమును బ్రతివస్తుఫునందు సందర్శించినాఁడు.

'.....సత్కవీశ,
భావలోచన మెరపుగాఁ బడయకున్నఁ
గాంచనేర వంతర్లీన కాంతిసరణి.'

—కృష్ణివలుఁడు

సత్యము! సత్కవీశునిభావలోచనముగాక, అంతర్లీన కాంతిని సౌందర్యమును తక్కిన కన్నులు చూడఁగలుగునా?

మర్మకవిత్వమునం దొకవిధమున యస్పష్టతయు ననూహ్యమైన భావనేంద్రజాలమును గోచరించుచున్నది. ఆ గీతములందు భావములు అంటీయంటక-చిక్కీచిక్కక-దక్కీదక్కక-మనతో దాఁగుడుమూత లాడుచుండును. 'ఆకావ్యము నుండి నీవేమి గ్రహించితివి?' అని యితరులు ప్రశ్నించినపుడు

*వీరికి నోబెల్ వాఙ్మయ బహుమానము వచ్చినది.

'ఏమో నేను జెప్పజాలనుగాని, యొక విధమైన యవ్యక్త మాధుర్యమును, ఆనందమును అనుభవించితిని'అని చెప్పుటకు మాత్రము సాధ్యమగును. కళయొక్క పరమావధియు నిట్టి యనిర్వచనీయమైన రసానుభూతిని గలిగించుటయే యని యన్ని సంప్రదాయములకు సంబంధించిన రసజ్ఞులును, శిల్పులును నిర్ణయించిన విషయమే. 'When one art can fully be explained by another then, it is a failure' అని రవీంద్రుడు కళయొక్క యనిర్వచనీయతను బోధించెను. 'It (art) is to be felt, not to be explained.' శిల్పము అనుభవింపఁదగినదిగాని, వివరింపనలసినదిగాదని డాక్టరు అవనీంద్రనాథ టాగూరు నుడివియున్నాఁడు. ఇట్లనుటవలన ఉత్తమశిల్పము నందు వివరించి చెప్పనలవిగాని యొకవిధమైన రసస్ఫురణము గలదని మనము తెలిసికొనవచ్చును.

అడయారునందు జేమ్సు హెచ్. కజిన్సుగారియింట నేను మూడు చిత్రపటములను జూచితిని. ఒకటి నందలాలు వసువు రచియించిన 'శివనాట్యము.' మఱి రెండు కజిన్సుగారు జపానునుండి తెచ్చినవి. వానిలో నొకదానియందు జపాను స్త్రీలు మంచుకాలమునఁ గాగితపు గొడుగులు వేసికొని సంచరించుట చిత్రింపఁబడియున్నది. మఱియొకదానియందు కేవలము సన్ననిగీతలతో-నవియు నేడెనిమిదింటితో, నొక జపాను దేశపు స్త్రీముఖము అత్యద్భుతముగ లిఖింపఁబడియున్నది. ఈ మూడుచిత్రములు నాహృదయమునుహరించినవి. మర్మకవిత్వము (Mystic poetry) యొక్క రహస్యము ఆ చిత్ర

పటముల మూలమున నేరుగ నామనమున నంకితమైనది. అంతవఱకు ఆకవిత్వములోని యస్పష్టత (Vagueness) యొక్క గుణమును నేను పూర్ణముగ గ్రహింపలేకుంటిని. శివనాట్యమును, మంచుకాలమున జపానుస్త్రీల సంచారమును చిత్రింపఁబడిన పటమును సాధారణమైన బొమ్మలపటములవలె పరిస్ఫుటముగ రంగులు పూయఁబడినవి కావు. వానిలోని యాకృతులు మనకు అస్పష్టముగఁ బొడకట్టును. ఆ యస్పష్టత శిల్పకళానైపుణ్యముయొక్క పరసీమయని తలఁపవలయునేగాని, అల్పకౌశలముగల చిత్రకారుల వచ్చీరాని బీరకాయపీచుఁదనముగాదు. అట్లు చిత్రించుటకు శిల్పి చాల కళాభిరుచి గల వాఁడుగను, చేయితిరిగినవాఁడుగను, వర్ణసమ్మేళనాదివిషయములందుఁ బరిపూర్ణజ్ఞానము గలవాఁడుగను నుండవలయును. ఆ పటములయందలి రూపములనుఁ దిలకించినపుడు మన మన స్సు గాలిలోఁ దేలిపోవునటులఁ దేలికయై చిత్రసారూప్యమును బొందినట్లుండును. ఆరూపము ఏదో యొక యగాధ రహస్య వాతావరణమున, వెన్నెలరాత్రియందుఁ దేలియాడు మేఘశకలములవలెఁ బొడకట్టును. చూడఁజూడ నవి గాలిలోఁ గరగిపోవుచున్నవా యేమి? యను సంశయముగూడ పొడమును. ఇట్టియస్పష్టతామాధుర్యమే నాకు మర్మకవిత్వమునఁ దోఁచుచున్నది. రేఖలతో లిఖింపఁబడిన పటమును గాంచినపుడు 'ఎన్ని కొద్ది గీరలతో నెంత సుందరమైన యాకృతిని నేర్పరియైన చిత్రకారుఁడు సృజింపఁగలఁడు? అను నాశ్చర్యము

Acc No. 10741

దోషకమానదు. జపానుకవుల *'హొక్కు' కవిత్వమునందు వలె ఈ చిత్రపటమునందును అనవసర కళాప్రదర్శనము నాకగపడలేదు. అయినను అందు సౌందర్యమును నిరాడంబరత యుఁ దొలకాడుచున్నవి. అట్టియస్పష్టతయు సంక్షిప్తతయుఁ కేవలము అనల్పకళానైపుణ్యసాధ్యములని నేనుగ్రహించితిని.

మర్మకవిత్వమునందలి యస్పష్టతనుగుఱించిన కొందఱి యభిప్రాయముల నిట సంకలించితిని :

I. And the very perfection of such poetry often appears to depend, in part, on a certain suppression or vagueness of mere subjects, so that the meaning reaches us through ways not distinctly traceable by the understanding —*Yone Noguchi.*

---

* జపాను కవిత్వ పద్య భేదములందు 'హొక్కు' అనునది చాల చిన్నపద్యము. అది పదు నేడు నేకాచ్క్ర శబ్దముల పరిమితిగలది. ఈ పద్యములలోని విషయము జపానుదేశస్థులకుఁదప్ప, ఇతరులకు సాధారణముగ బోధపడనంతటి సంక్షిప్తముగ నుండును. అందువలననే జపానువాఙ్మయ విమర్శకులు 'కవి యెట్టివాఁడొ పాఠకుఁడును నట్టివాఁడుగ నుండవలయును' అని చెప్పుట. హొక్కుపద్యముల రచించుట చాల కష్టమనియు, బాషో అను సుప్రసిద్ధ 'హొక్కు' కవి తన జీవితమునందు మూడు నూర్ల పద్యములను మాత్రమె రచియింపఁగలిగెననియు, యోన్నొగూచి తెలిపియున్నాఁడు. విషయముఁ దెలుపుట కొక ఉదాహరణము ననువదించితిని :

కాలిపోయెను శాల ; రాలెడుపూవు
లెంత నిశ్చలశాంతి నెసగెడు నిపుడు !

తనయిల్లు కాలిపోవు సమయమున రాలెడుపూవుల నిశ్చలశాంతిని గమనింపఁగల కవి మనోవస్థయే యీ పద్యమునందలి విశేషము.

2. Vagueness is often a virtue; a god lives in a cloud, truth cannot be put on one's finger tip —*Walter pater,*

3. I think there should be nothing but allusions. The contemplation of objects, the flying image of reveries evoked by them are sunk.....To name an object is to take the three quarters from the enjoyment of the poem, which consists in the happiness of guessing little by little, to suggest that is the dream. —*Jues Huret.*

ఈ లక్షణములు ముఖ్యముగ గీతకవిత్వమున కన్వయించును.

మర్మకవిత్వమును టాల్‌స్టాయి 'శిల్పమనగేమి?' అను తన గ్రంథమందుఁ జాలతీవ్రముగ ఖండించియున్నాడు. అందు కా కవిత్వమునఁ గల యగమ్యగోచరత్వము కారణము. అయినను టాల్‌స్టాయి తర్కమంత సహేతుకముగఁ దోఁపదు. ఆయన ప్రజాపక్షవాది. కావున సామాన్యజనుల కర్థముగాని శిల్పము వ్యర్థమనియు నింద్యమనియు ఆయనయభిప్రాయము. ఈ యపూర్వమైన మానదండమును గల్పించి టాల్‌స్టాయి రషియాదేశమునందలి వేగాక యూరపుఖండమునందలి యన్ని దేశముల లలితకళలను దానితోఁ గొలిచి, సరిపడనివానిని తన విపరీతపు విమర్శనమునకు గుఱి గావించెను. ఒక పెద్దసౌధమునుగాని, క్రైస్తవుల ప్రార్థనాలయమునుగాని దిలకించినప్పుడు వానిసౌందర్యముఁ దోఁచుటకుఁ బూర్వమే 'ఈ కట్టడము లెందరి పాటకపుజనులనిట్టూర్పుల తోడను, గన్నీటితోడను, కడుపుమంటలతోడను రూపొందినవో' యను కారుణ్య మా దయార్ద్రాలి మెత్తనిమనసును

తడిసేయును. కావున టాల్ స్టాయి నిర్వచనములందుఁ గళా న్యాయనిర్ణయమునకంటె గరుణారసమె యెక్కుడుగా నుండును. ఒక కళయొక్క శ్రేష్ఠత్వము దాని నర్థముచేసి కొనఁగల ప్రజలసంఖ్య ననుసరించియుండుననియు, నట్లుగాక యెవరో కొందఱభాగ్యవంతులకును, కేవలము శిల్పాభిరుచి గలవారికిని మాత్రమే పనికివచ్చు కళ యొకకళ గాదనియు ఆయన సిద్ధాంతీకరించెను. ఇది చాల యన్యాయ్యమును, శిల్పత త్వమునకు పరమవిరుద్ధమైన తీర్మానముగను నున్నది.

మన మొక కావ్యమును జదువునపుడు హృదయము రసాతిరేకమైనదా? లేదా? యనుదాని ననుసరించియు, ఐన యెడల దానితీవ్రతనుబట్టియు ఆ కావ్యముయొక్క గుణా గుణములను నిర్ణయింతుము. ఒకప్పుడు కావ్యము రమ్యమైన దయ్యుఁ జదువరి హృదయము సంస్కారపక్వము గానియెడల రసోత్పాదనము గాకపోవచ్చును. ఈ రెండు సందర్భములయం దును కృతికిని చదువరి స్వభావమునకుం గల సంబంధము ముఖ్యము. కాని, 'ఇతరు లెందఱీకావ్యమును జదివి యానం దించిరి?' అను ప్రశ్నపై అతని యనుభూతి ఆధారపడి యుండవలసిన యక్కఱ లేదు. చిత్రముల విషయముగూడ నిట్లే యూహింపవలయును.

టాల్ స్టాయి సిద్ధాంత మంగీకరింపఁబడినయెడల లోక మునందలి చాల యుత్తమోత్తమములగు చిత్రములు, కావ్య ములు, శిల్పములు, కట్టడములు ధ్వంసముకావలసి యుండును. ఒక రచనయొక్క రసవత్తతయు, కళానైపుణ్యమును, సూక్ష్మ

బుద్ధిగ్రాహ్యము లగు గుణ విషయములును హెచ్చుకొలఁది వాసిని గ్రహించి తదనురూపానందమును బొందు రసికుల సంఖ్యయు తగ్గుచుండును. కావుననే కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతలము జంగమ కథలవలె సామాన్యప్రజానురంజకము కాకుండుట. రసజ్ఞత కుశాగ్రముగ నుండనిదే యుత్తమమైన కళాసృష్టిని మెచ్చుకొనుటకు సాధ్యముగాదు. అట్లు మెచ్చుకొనుటకు శిక్షితమైన అభిరుచియు అవసరము. అట్టి రసజ్ఞత ప్రజాసామాన్యమునందు నభివృద్ధి చెందియుండదు. వారికిఁ దగిన శిల్పము లుండనేయున్నవి. ఇంకను గావలసినయెడల అట్టివి వేనవేలుగఁ గల్పించి క్రమక్రమముగఁ బ్రజల యభిరుచిని శిక్షించి యుత్తమశిల్పముల మెచ్చుకొనునట్లొనరింపఁ బచ్చును గాని, యాదర్శమును మాత్రము జనబాహుళ్యమునకుఁ దెలియఁగల క్రిందిమెట్టులోనికి దింపరాదు. మేఘసందేశములోని రామణీయకము ఒక పల్లెటూరికాఁపునకు గోచరింపని కారణముచేత దానిని సరస్వతిదేవి యుంకపీఠమునుండి క్రిందికిఁ ద్రోయవలసినదేనా ?

కాళిదాస భవభూతులు సమకాలీనప్రజల యభిరుచిననుసరించి వారి నాటకములను రచియింపలేదు. అట్లే వారు రచియించి యుండినయెడల అవి యెల్లకాలమునకు నాదర్శప్రాయములుగనుండనోపవు. ప్రజల యభిరుచిమాత్రమే వెనుకవానిమొగము చూచువారుండరు. కాని శకుంతలనాటకము కాళిదాసుని యభిరుచి ననుసరించి సృష్టింపఁబడిన దగుటచేతనే చిరంజీవమైనది. ఈ నిషయము కవులకుఁ దెలియనిదిగాదు. తన నాటకములోని సారమును భవభూతిమహాకవి

తెలిసికొని, సమకాలీనుల యజ్ఞాన జనిత మైన నిరాదరణము నిట్లు తూలనాడెను.

యేనామ కేచి దిహ నః ప్రథయం త్యవజ్ఞాం
జానంతి తే కిమపి తా న్ప్రతినైష యత్నః
ఉత్పత్స్యతేఽ స్తిమమ కోఽపి సమానధర్మా
కాలో హ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ.

ఈ విశాల ప్రపంచమునందు ననంతకాలమునఁ దన తోడి సమాన ధర్మముగలవాఁ డెవ్వఁడైన జన్మించి, తన నాటకమును చదివి యానందింపఁడా! యను తలంపు భవ భూతిని నూరడించినది. ఎంతసహనము! ఎంత స్వార్థ త్యాగము! నేటి కవులు అప్రయాస లభ్య జనరంజకత్వ మునకయి తమ శక్తిని వ్యర్థపుచ్చుచున్నారు.

మాలర్మ్మి ప్రభృతుల కావ్యములలోని సూచనలను, అస్పష్టతను దోషములుగఁ బరిగణించి టాల్‌స్టాయి ఖండిం చుటయందుఁ దప్పలేదు. ఏలయనఁగా: ఆయనకుఁ దోఁచి నట్లును, ఆయన భావించినట్లును దాపటికము లేక విమర్శిం చెను. ఇది చాల గొప్పతనము. కాని, సామాన్యప్రజల మన స్తత్వమును బ్రమాణముగఁ గొని, ఆకావ్యములలోని విష యములు వారి కగ్రాహ్యములు గాన దోషము లని తీర్మా నించుట సాహసము.

మన దేశమునందు 'మర్మకవిత్వ' మనాదియైనది. దానిని మర్మకవిత్వమని పేర్కొనక ఆధ్యాత్మిక కవిత్వమని వ్యవహరించెదను. ఏలయన, ఆలాటి రచనలను మర్మకవిత్వ ముగ మన మెన్నఁడును భావించినది లేదు. హైందవజనసా

మాన్యమునకు అవి మర్మములు గావు. పంచేంద్రియగోచర మగు స్థూలప్రపంచమున కన్న భిన్న మగు మఱియొక యంతఃప్రకృతి గలదనియు, నశించునది పాంచభౌతిక శరీరమే గాని యాత్మ గాదనియు, జన్మాంతరము గలదనియు, నేమియుం దెలియని కూలివాని మొదలు సకలశాస్త్ర పారంగతుఁడగు పండితుని వఱకు హిందూదేశమున నందఱును విశ్వసింతురు. ప్రతిదినము మనయింటికి బిచ్చమునకు వచ్చు దాసరిగూడ -

"మనది తనది యనుచు నరుడా, మాయలో బడబోకురా
మనఁ మొందిన మనది తనది మంటలో యే మౌనురా!
బంకమట్టి యిల్లురా యిది బగ్గిబుగ్గి యౌనురా
ఆత్మ యొక్కటె బ్రహ్మరూప మ్మంతటా తానుండురా."

అని పాడుచుండును. కావున మనవారు ఆధ్యాత్మిక గీతములను, కీర్తనలను మర్మ కవిత్వ మని పేరొక్కొనలేదు.

మొట్టమొదట ఆర్యావర్తమున వేదములయం దీయాధ్యాత్మిక కవిత్వము జన్మించి, యుపనిషత్తులయందుఁ బరిపూర్ణత నొందినది. అనుక్షణము విస్తరించుచుండిన వైదికకవి యాత్మ బహిఃప్రపంచమునఁ దనివినొందక, అంతర్ముఖేంద్రియమై యగాధమైన యమృతానందమున నోలలాడి ఆ యను భూతిని వెలికి నిట్టూర్చినది.

"శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రా, ఆయేధామాని దివ్యాని తస్థుఃవేదాహ మేతం పురుషం మహాన్త మాదిత్యవర్ణం తమసః పరస్తాత్"

అని వైదికఋషి ఘోషించినాఁడు. ఇంతటి మహాసందము వెలికుఱుకక కవిహృదయమున నెట్లుదాఁగియుండగలదు? పిపీలికాది బ్రహ్మపర్యంతముగల ప్రాణికోటులను 'అమృత

సంతానములారా' యని సంబోధించినాఁడు. ఎంత ప్రేమ! ఎంతయానందము! ఎంతసత్యము! తాను దర్శించిన తేజస్సు అప్రాకృతము. కావున నది వర్ణింపనలవిగానిది. సామ్యముచే మాత్రము నూహింపసాధ్యమైనది. అదియు విలోమమార్గ మున—

"సత్రత సూర్యోభాతి న చంద్రతారకం
నేమా విద్యుతో భాంతి కుతోఽయ మగ్నిః
తమేవ భాంత మనుభాతి సర్వం తస్య భాషా
సర్వ మిదం విభాతి."

ఆత్మానుభవజన్యమైన యిట్టి యపూర్వసత్యములను వైదిక ఋషులు వర్షించిరి. వారు ఆధ్యాత్మిక కవిగురువులు, ప్రథములు.

వివిధమత సంప్రదాయములయందును ఇట్టి కవిత్వ మంకురించి శాఖోపశాఖలుగ నభివృద్ధినొందినది. వైష్ణవ కవుల కీర్తనలయందు రసమాధుర్యములు పొంగిపొరలినవి. ఇందుకుఁ గొన్ని కారణములు గలవు. వైష్ణవులకు భక్తి ప్రధానము, ప్రేమ యాలంబము. ఆత్మకును బరమాత్మకును గల సంబంధమును రాధాకృష్ణుల ప్రేమలీలలుగ సంకేతించి వారు సంకీర్తనము చేసిరి.

విరహిణియైన నాయిక యెన్ని యవస్థలకుఁ బొల్పడునో, తన్ను రాధనుగను సర్వేశ్వరుని కృష్ణునిగను సంకేతించుకొన్న భక్తుఁడును అన్ని యవస్థల ననుభవించును. నాయకుని నెడఁబాసిన నాయిక పునఃసమాగముకొఱ కెట్లు త్వరపడుచుండునో, అటులనే పరమాత్మ విశ్లేషమును సహిం

పఁజాలని భక్తుఁడును వేదనఁ బొందుచుండును. ఇట్టి పార వశ్యము సాధారణముగ నందఱిభక్తులకుఁ గలుఁగునది గాదు. ఇది భవముయొక్క పరపారము నంటు కడుపటియవస్థ. పన్నిద్దరాళ్వారులలో నమ్మాళ్వారులకే యీదశ కలిగెను. చైతన్యుఁడును నట్టియవస్థ ననుభవించెను. రామకృష్ణ పరమ హంసయు నట్టి విశ్లేషవేదన నొందెనని వివేకానందస్వామి నుడివియున్నారు. నమ్మాళ్వారులు రచించిన "తిరువాయి మొజ్ఞి" అంతయుఁ గొంచె మించుమించుగ విరహిణీ గీతము లని చెప్పవచ్చును. మీరాబాయియు, మహారాష్ట్రదేశపు భక్తులును అట్టి కీర్తనలను రచియించిరి.

తెలుఁగు దేశమున మఱియొక విధమైన యాధ్యాత్మిక కవిత్వము ప్రచారములోనికి వచ్చినది. పోతులూరి వీర బ్రహ్మము, ఆతని శిష్యుఁడగు సిద్దయ్య, వేమన్న మొదలగు తత్త్వజ్ఞాను లీ సంప్రదాయమున ముఖ్యులు. బ్రహ్మంగారి కాలజ్ఞాన కీర్తనలను వేదాంత కీర్తనలను తఱుణాయి దాస రులు పాడుచుండగ మనము చాలమాఱులు వినియుందుము. భక్తిగీతములందువలె వానియం దంతరసము చిప్పిల్లుటకు వీలులేదు. అయినను అవి నీరసములుగ నుండవు. ఇచ్చట నొకటి రెండు ఉదాహరణములు అప్రస్తుతములు గావని తలంచెదను.

1. తెలుసుకొండి యన్నలార, తేట తెరువు బట్టాబయలు
నట్టనడుమా పుట్టాలో గురునాథూ డున్నాడు,
మూడుచుట్లా కోటలోన ముప్పయిముగ్గూ రున్నారన్నా
ధ్యానాము కోటాకు ఎక్కూ పెడితే తలుపూలు దీసేమన్నారు.

ఇంపుకాదూ మెప్పూగాదు ఎన్నరాని యీ బ్రహ్మపదవి
చప్పరించీ చూడండన్న సారా మున్నాది.

2. తనకు బొండెకు ఎపుడొ తగులాట మాయెను
వీరెవ్వరో గురుడ! వా రెవ్వరో!
పుట్టి బూరగమాను పూసి లెస్సా కాసి
గట్టిగ కొమ్మలు కదిలాడగా
నుడిగాలి దెబ్బకు తొడిమజాఱిన పండు
తొడిమాతో యేమైన నుడివిపోయిందా ;

తనకు బొండెకు.....
వీ రెవ్వరో గురుడ.....

3. చిత్తాస్వాతులు రెండు సంధింప ముత్తెపు
చిప్పాలో పడ్డాది చిను కొక్కటి,
ముత్యమై నీళ్ళల్లో మునిగీ పొయ్యేనాఁడు
చిప్పతో యేమైన చెప్పిపోయిందా?

తనకు బొండెకు.....
వీ రెవ్వరో గురుడ.....

వేమనపద్యములలోని భావములను గ్రహించి కొందరు, వానినిఁ గీర్తనలలో నిమిడ్చిరి. అట్టికీర్తనలె యిప్పుడు తెలుఁగుదేశమునందుఁ జాలవఱకు వ్యాపించియున్నవి.

సమకాలీనమైన ఆధ్యాత్మిక కవిత్వమునుగుఱించి కొంత విచారించి యీ వ్యాసమును ముగించెదను. బెంగాలు దేశమున రవీంద్రనాథ టాగూరును, ఆయన కవిత్వమార్గమును మెచ్చుకొని దాని నవలంబించు సత్యేంద్రనాథదత్తు మున్నగు నితర యువక కవులును ఆధునికకవిత్వ సంప్రదాయమునకు సంబంధించినవారు, ఈ తెగకు రవీంద్రుఁడు మార్గ

దర్శకుఁడు. కావున మొట్టమొదట ఆయన కవిత్వమునుగుఱించి తెలిసికొందము. రామమోహనరాయలు కలకత్తా నగరమున బ్రహ్మసమాజమును స్థాపించినపెనుక బెంగాలీ సారస్వతమున నూతన జీవసంచలనము ప్రారంభమయి, దినదినాభివృద్ధి గాంచినది. బ్రహ్మసమాజపు ప్రార్థన మందిరములందుఁ జదువుటకును, మతప్రచారము గావించుటకును క్రైస్తవుల పాటలు (Psalms) వంటి గీతములు రచియింపఁబడినవి. ఈ గీతారచనమే బెంగాలుదేశపు ఆధునిక కాధ్యాత్మిక కవిత్వమునకు బీజము. రవీంద్రుఁడు బాల్యమునందే ఇంగ్లీషు కావ్యములను జదివెను. అందు ముఖ్యముగ కీట్సు, షెల్లి, బ్రౌనింగు అను ఇంగ్లీషుకవుల కవిత్వములలోని సారమును దనివి దీఱ నాస్వాదించెను. కాళిదాసుని శాకుంతలము, కుమారసంభవము, మేఘసందేశము రవీంద్రుని హృదయ మును ప్రబలముగ నాకర్షించిన వనుటకు ఆయన 'ప్రాచీన సాహిత్యము' అను గ్రంథమునఁ గావించిన తత్సంబంధము లైన విమర్శనములే సాక్ష్యములుగ నున్నవి.

చైతన్యుఁడు, జయదేవుఁడు మున్నగు వైష్ణవభక్తుల కీర్తనలను టాగూరు గానము చేసిచేసి, యానందించెను. ఆ కీర్తనల యధికారము ఆయన రచించిన 'భానుసింహపదా వళి' యను గీతములందు సుస్పష్టముగ నంకితమై యున్నది.

కీట్సు సౌందర్యమును బోషించిన కవి. షెల్లి యింద్రి యాతీతములైన ఆధ్యాత్మిక విషయములను గానము చేసిన తపసి. రవీంద్రుని కవిత్వమందు కీట్సు రచనలలోని రామ ణీయకము, షెల్లీ కావ్యములలోని యాధ్యాత్మిక తృష్ణయు,

వైష్ణవ గీతములలోని భక్తిపారవశ్యమును- వీని మూటిని ఆత్మసాక్షాత్కరించుకొని మించిన స్వకీయ ప్రతిభావ్యక్తిత్వములును సామరస్యము నొందినవి. కావున రవీంద్రుని యాధ్యాత్మిక కవిత్వము ప్రాచ్యపాశ్చాత్య మన స్తత్వముల కనుగుణమైన సంధిస్థానమై యున్నది.

'తుమి యేన్ ఒయ్ ఆకాశ్ ఉదార్
ఆమి యేన్ ఎయ్ అసీమ్ పాథార్
అకుల్ కొరేచె మారుఁ కానే తార్
ఆనందపూర్ణిమా'

(ప్రాణ ధ్యానము)

[నీవు ఏశాలమైన ఆ యాకాశమువు
నేను సీమారహితమైన యీ సముద్రమును
వాని రెంటిమధ్య ఆనందపూర్ణిమ
తాండవించుచున్నది.]

ఆంగ్లేయ సారస్వత సంబంధమువలన బెంగాలునందు వలె తెలుఁగుదేశమున నైతముఁ గొంత యాందోళనము గలిగినది. యువక కవులు సంప్రదాయసిద్ధములైన పురాతన పద్ధతులను ద్యజించి స్వతంత్రముగఁ గ్రొత్తదారులు త్రొక్క సాగిరి. ఇప్పుడు తెలుఁగుదేశమున నాంగ్లేయ వాఙ్మయ పరిచితి గల యువక కవు లందఱు కొద్దిగనో గొప్పగనో (Romantic) కవు లనుటకు యోగ్యులు. రవీంద్రుఁడు 'నోబెల్' బహుమానముచే సత్కరింపఁబడి యీ తని కావ్యములు హిందూదేశమంతటను వ్యాప్తిచెందిన యనం తరమున తెలుఁగు రొమాన్టిక్ కవిత్వము ఆధ్యాత్మిక కవిత్వ

ముగఁ బరిణమింప మొదలు పెట్టెను. తత్పరిణామ చిహ్నములు ఇప్పు డిప్పుడు తెలుఁగు కవుల రచనలయందు బొడకట్టుచున్నవి. కాని, యిది ప్రథమదశ యగుటవలనఁ గొందఱి రచనలయందు అనవసర పదాడంబరత్వమును, కళా కౌశలమువలనఁ బ్రాప్తమైన భావనేంద్రజాలముగాక, భావ ప్రకటనము గావింపఁజాలని గజిబిజితనమును గోచరించుచున్నది. ఈ లోపము మొట్టమొదట అనివార్యమైనది. కావున సహింపఁదగినది. ఇందుకు లక్ష్యములుగ సమకాలీనుల కావ్యములనుండి కొన్ని యుదాహరణములను సంకలింపవచ్చును గాని, అనవసర వివాద హేతువుగఁ బరిణమించు నని మానితిని.

సంపూర్ణము.

నాటక కళా సంస్కరణము.

—o—

ఉపోద్ఘాతము

సంఘసమష్టి తనయందలి వ్యక్తిని నైతిక బంధములఁ జిక్కించుకొని యెట్లు అధికారము చేయునో, ఒక్కొక్కప్పుడు వ్యక్తియుఁ దన సంకల్ప బలముచేత సంఘసమష్టిని తన యభిప్రాయమువంకకుఁ ద్రిప్పుకొనుచుండును. ఇందుకు మన సాంఘికజీవితమునందు లెక్కలేని నిదర్శనములను జూచుచున్నాము. సంఘమునకును, అందలియంశమైన వ్యక్తికిని బరస్పర సంబంధము గలదు. కావున నొకజాతి నాగరకమైనదని చెప్పుటలో నాటికి తొంభైమంది మనుష్యులైనను నాగరకులుగ నుందురని మన మూహింతుము.

జాతీయ జీవితమార్గము కొండదారివలె నిమ్మోన్నన్న తముగ నుండును. వాతావరణములోని మార్పులను భారమితి (Barometer) సూచించునటుల శిల్పము జాతీయ జీవితమునందలి నీచోచ్చదశలను దెలియఁజేయుచుండును. కవులు స్వతంత్రముగ వస్తుకల్పనము చేయుచున్నను, సమకాలీన భావములును, ఆచార వ్యవహారములును వారి రచనలయందుఁ బ్రవేశించియుండును. కాళిదాసుని నాటకములను మునమ చదివినయెడల ఆ కాలపు నాగరకతను మనము కొంచె మించు మించుగ నూహింపఁగలము. వాల్మీకిమహాకవి

లోకోత్తర వీరుఁడైన శ్రీరాముని చరిత్రమును సృజించి నప్పటికిని, సమకాలీనమైన హైందవ సంఘముయొక్క నాగరకతయు ఆచార వ్యవహారములును అందు నంకితమైయుండక తప్పవు.

ప్రస్తుతవిషయమునకు వత్తము: మన తెలుఁగుజాతి చాల మంది కవులకును, శిల్పులకును, నటకులకును ఆకరమై యున్నది. వారి రచనలు, సృష్టులు, అభిప్రాయములు భావి సంతతికి మన కళాభిరుచిని, కల్పనానైపుణ్యమును, ఔచిత్య గౌరవమును, మీఁదుమిక్కిలి మన శిక్షణమును, డెలియఁ బఱచును కావున ఇప్పటి కవులును, తక్కుంగల శిల్పులును సమకాలీన ప్రజా బాహుళ్యమయొక్క యభిశిక్షితమైన యభిరుచి యడుగులకు మడుఁగులొత్తి సునాయాస లభ్యమయినఁ గీర్తికొఱకు పాటుపడుటయే వారి బాధ్యతయని తలంచు కొనక, భావిసంతతులకుఁగూడ మన శిల్పసిద్ధిపైని గౌరవ ముండునటులు, తమ యభిరుచిని మఱికొంత సభ్యముగను, ఔచిత్యదృష్టిని మఱికొంత నిశితముగను అలవఱచుకొనుట యావశ్యకము.

సుమారొక సంవత్సరముక్రిందట ఒంగోలునందుండిన నామిత్రులు రావుసాహెబ్ డాక్టరు శేషాద్రిరెడ్డిగారికి (ఇప్పుడు స్వర్గస్థులు) అతిథినైయుచ్చట రెండు మూఁడు దినములు గడపితిని. ఆయూరియందు స్థాపింపఁబడియున్న యొక నాటక సమాజమువారిచేఁ బ్రయోగింపఁబడిన * "సుమతి"

---

* ఆ నాటకము పేరునుగుఱించి నాకు సంశయము గలదు. సుమతి యని జ్ఞప్తి, కవిపేరును మఱచిపోతిని.

అను నాటకమును చూచుట మా కిపుడుకుఁ దటస్థించినది. రెండు మూఁడు గంటల వినోదము కొఱకును, ఆ వినోద మున అలక్షితముగ మిళితమైన రీతిని సమకూఁచుచుండు భావ శిక్షణము కొఱకును మనము సాధారణముగ నాటకశాలకుఁ బోవుచుందుము. చేతిడబ్బు వదలించుకొని, నిద్రలేమి మున్నగు శ్రమలకుఁ బాల్పడియు మనము నాటకము చూచుట కవిచేతను నటకులచేతను "మీరు సభ్యతా శూన్యులు! మీరు మృగప్రాయులు" అని చెప్పక చెప్పించు కొనుటకుఁ గాదు. సహృదయుల భావములు దూషింపఁబడు టకు గాదు! కాని, దురదృష్టవశమున మా కానాఁ డట్టి యసభ్యవినోదము ప్రాప్తించినది. ఆ నాటకమునందలి యనౌ చిత్యముల నుదహరించి సభ్యలోకమునకు విసుగుపుట్టించి నా యభిరుచినిగూడ దూష్యముగ నొనరించుకొనుటకు నా కిష్టము లేనప్పటికిని 'శిల్పము' కొఱకు అట్లు చేయక తప్పినది కాదు. మేము నాటకశాలయం దున్నంతవఱకు జఱిగిన కథ యీ క్రిందివిధముగ నున్నది: భాగ్యవంతుఁడైన బ్రాహ్మణయువకుఁ డొకఁడు ఒక భోగమునాని నుంచుకొని తన యాస్తినంతయుఁ గొల్లగొట్టుకొనును. కొంతకాలము నకుఁ దన భార్యనుగూడ ఆ సానికిఁ బరిచారికనుగ నియమించును. అటుపైని కొల్లఁగొట్టుటకు విటునియొద్ద నొక గవ్వ యైనను లేదని తోఁచిన వెంటనే ఆసాని యాతని విడనాడి, మఱియొకనిని దగులొక్కొనును. రెండవ విటుఁడును ఆభోగ ముదియు నేక శయ్యాగతులయి యుండునప్పుడు పరిత్యక్తుఁ డైన మొదటి విటుఁడు వచ్చి చూచి "బ్రతికి చెడిన వాని

వై రాగ్యావేశముతో" ఆసానిని దిట్టుటకుఁ బ్రారంభించును. భోగమువారిని దిట్టుటయే సంఘ సంస్కరణము యొక్క ప్రధానసూత్రమని తలంచువారును కొందఱు గలరని, అట్టి కోటిలో మన నాటక రచయితనుగూడ చేర్చుకొని నాటకము నందలి ఆ సంవిధానమును సహించినను, సహింప నలవిగానివి మఱికొన్ని బయలు దేరినవి. ఆ నాటకశాలయందు స్త్రీలు చాలమంది యుండిరి. ఆతిట్లు భోగమువారికి సంబంధించినవే కాక సామాన్యముగ స్త్రీజాతికంతటికి సిగ్గును రోఁతను బుట్టించునట్లు తోఁచినవి. *"సాని వాకిటిలో నొకనిని, ముందువాకిటిలో మఱియొకనిని పెట్టుకొని చిత్తకార్తిలో కుక్కలవలె.....వారి.....సొరకాయలవలె నుండును; అవి.....కావు, రోగములబొందలు" మొదటి మాటతో నిప్పులంటింపఁబడి రెండవమాటతో కిరసనాయిలు పోయఁబడి, మూఁడవమాటతో భగ్గని మండిన నా హృదయము సంయమన సాధ్యముకాక పోయినది. ఏవో రెండు మాటలని నాటకశాల వీడివచ్చితిని. రెడ్డిగారును నావెను వెంట వచ్చిరి. బయటికివచ్చి మనము స్థిమితపఱచుకొను నప్పటికి నా యొడలంతయుఁ గంపించుచుండెను. నాటకము ముగిసినవెనుక మా దుర్ణయమును గుఱించి ఆ సమాజము యొక్క కార్యదర్శి యుపన్యసించెనని వింటిమి.

మఱునాఁటి యుదయమున ఆ సమాజములోని యొక సభ్యుఁడు, తాము రాత్రి ప్రదర్శించిన నాటకమును, చింతామణియను నాటకమును దీసికొనివచ్చి, ఆ నాటకము చింతా

* నాటకము నాయొద్దలేదు. జ్ఞప్తియున్నటులు వ్రాయుచున్నాను.

మణివలె నున్నదనియు, అందులో లేనిబూతులు ఇందులో గూడ లేవనియు, మేము నాటకశాలనుండి వెడలినచ్చిన యనంతరము చాల నీతిప్రదమైన కథ జరిగినదనియుఁ జెప్పెను. మొదటి విషగుళికతోడనే మా జీర్ణశక్తి నాశనమైనది? ఆపైని విరివిగాఁ బంచిపెట్టబడిన నీతిఖాద్యములు మే మొక వేళ గైకొన్నను నిరుపయుక్తములై యుండును.

తరువాత ఆ రెండు నాటకములలోని సంవిధానములను నేను జూచితిని. సుమతినాటకము చింతామణికిఁ బ్రతిబింబముగ వ్రాయఁబడి యున్నదనుటకు సందియములేదు. నే నిప్పుడు చింతామణిని సమర్థించుటకుఁ బూనుకొనలేదు. కాని, ఆ రెండు నాటకములను సరిపోల్చినప్పుడు మాత్రము, నభ్యతయందు చింతామణియే మెఱుఁగుగనున్నది. చింతామణికారుఁడు రచనా నైపుణ్యముతో వెల్లడించిన బూతులను సుమతి నాటకరచయిత జట్కాబండివారి సభ్యతలోనికిదింపి, శృంగార రసమును సిరాబుడ్డిలో ఊరవేసినాఁడు. ప్రకరణమున కిట్టి వస్తువు ఆవశ్యకమని అలంకారశాస్త్రము యొక్క మఱుఁగు సొచ్చినను, అభిరుచి విషయకమైన చర్చ వచ్చినప్పుడు, దానిని కవియొక్క చిత్తసంస్కార పరిపాకములకు సంబంధించినదిగ మన మెఱుంగుదుము. మృచ్ఛకటికము ప్రకరణమయ్యు సహృదయులకు ఏపపుట్టించు బూతుకూఁతల మట్టునకు దిగలేదు. అట్లనుటవలన సంస్కృతమునందు, అధమములైన ప్రహసనములు లేవని నేను నుడువుటలేదు. కాని, అవి సహజముగ నిరాదరింపఁబడినవి. నింద్యవిషయ మేభాషయందున్నను నింద్యమే. భావమువలన

భాషకు గౌరవము కలుగుచున్నది గాని, భాషవలన నింద్య భావమునకుఁ గూడఁ బ్రశ_క్తి గలుగదు.

నేను సుమతి నాటక ప్రదర్శనమును చూచినప్పటి నుండియు, నాటక రచయితలయందును, నటకులయెడను, ప్రేక్షకులయందును నా కొకవిధమైన శ్రద్ధపుట్టినది. అప్పటి నుండియుఁ గొందఱి యాధునిక కవుల నాటకములను జనరంజకములని ప్రజలచేఁ దలంపఁబడు పుటికొన్ని నాటకములను సుప్రసిద్ధులని తలంపఁబడు నటకులచే ప్రదర్శింపఁబడుచుండి నప్పుడు చూచుచుంటిని. జనరంజకత్వమునకుఁ గారణములను, అందుకై కవులును నటకులును జేయుచున్న వ్యాపార రహస్యములను, మోసములనుగూడ గ్రహించి నా యభిప్రాయములను ఈ వ్యాసమూలమునఁ బ్రకటింపఁ దలంచితిని. ఇట్లు చేయుటవలన, నే నెందఱెందఱి యనుమానములకు, విమర్శనములకుఁ బాత్రుఁడను కానున్నానో నే నెఱుంగుదును. ఈ వ్యాసమునందు నే నెచ్చటనైనను నిదర్శనపూర్వకముగ నాయభిప్రాయములను వెలిపుచ్చవలసివచ్చినప్పుడు, ఎవరినైన నాటక రచయితలను నటకులను సమాజములను విమర్శించి దృష్టాంతములుగఁ గైకొనుట నాకు వారిపైగల ద్వేషముచేఁ గాదు. కాని, శిల్పముపైఁగల గౌరవముచేత, నేను కొన్ని నాటకములలో అనౌచిత్యములకు నుదాహరణములను గైకొంటిని గావున, ఆనాటకములెల్ల అనౌచిత్యభూయిష్టములనియు, ఆయా నాటక రచయితలు కల్పనానిపుణులు కారనియుఁ బాఠకమహాశయులు తలంపరాదు. ఆ గ్రంథములపైనను ఆకవులపైనను నా కత్యంతగౌరవము కలదు. నటకుల

విషయమైగూడ నేనిట్లే మనవిచేసికొనుచున్నాను. కాఫున నేను నిర్మలహృదయముతోడను శిల్పదృష్టితోడను రచియించిన యీవ్యాసమును నాటక కళాభిమానులెల్లరును అన్యథా తలంపక నా సదుద్దేశమును గ్రహింతురని నాప్రార్థనము.

నాటక కవి.

ఇప్పుడు వెలువడుచున్న నాటకములలో 100 కి 90 నాటకములు 'నాటక'మని పేరొకానుటకుఁ దగినవి కావు. ఒకకథలోని కొన్నిసీనులను ఒకటిగా జోడించినంతనె అది యొకనాటక మగునని కొందఱు నాటకరచియితల యుద్దేశమైయుండును. నాటకమునకు ఆదిమధ్యాంతములు కలవనియు, సంధిబంధమును, సంయోగతయు సడలినయెడల నాటక శరీరము విచ్ఛిన్నావయవ సమూహమువలె నుండుననియు వీరెఱుఁగరు. ఒకవేళ నెఱింగియు ఆచరణమున నసమర్థులైయున్నారు. ఇప్పటి కొన్ని నాటకములలో, 'మేకపోతుమెడచన్నులు, ఆఱవవ్రేలు' మున్నగు రచనావిశేషము లగపడుచున్నవి. ప్రజలకన్నులలోఁ దేలికగా దుమ్మ్రికొట్టుట కలవాటుపడి రంగ సంప్రదాయములను చక్కగాఁ దెలిసినకవులు .అట్టి రచనావిశేషములు నాశ్రయింతురు. వానితో నాటకసమష్టికి నవసరమైన సంబంధమేమియుండదు. నిరుపయోగములును, విపరీతములును నైన అట్టియవయవములను గత్తిరించినను లోప మేర్పడదు. ఇది రచనానూన్యాన తయైనను, లేక ప్రేక్షకులను సులభముగ వలలోవేసికొనుటకు కవి ప్రయత్నపూర్వకముగ నొనరించిన వంచనయైనను

గావలయును. ఒక ఉదాహరణము: రామదాసు నాటకములో 'అహమక్కసీను' లవకుశలో 'చాకలివానియింటిసీను' వానిని వేఱుపఱచి, అట్టిసీనులు ప్రత్యేకముగఁ బ్రదర్శింపఁ బడినపుడు హాస్యరసోత్పాదకములయి వినోదము కలిగింప వచ్చును. కాని ఆనాటకములందు ఆయాకథాభాగమున వాని కంతప్రాముఖ్యము లేదు. మొగమునకు ముక్కు అందమని యెఱిగిల్పి మూఁడెడుముక్కునుజేసి. యొక మానవ విగ్రహ మున కంటించి నట్లున్నది. నాటక శరీరమందు అంగాను గుణ్యము చాల ముఖ్యము. కేవలము లోభముచేత అనుచిత మైన కల్పనలకుఁ బూనుకొనుట నింద్యము.

ధర్మవరము రామకృష్ణాచార్యులవారి నాటకరచన తోడఁ గ్రొత్తక్రొత్తనాటకలక్షణములేర్పడినవి. సంక్షేపముగ భావమునుఁ బ్రకటించుటయన్న ఆకవి యెఱుంగని పరమ రహస్యము. రెండుమూఁడు మాటలలోఁ జెప్పఁదగిన భావ మును అచ్చులో నరపేజీకిఁ దక్కువగాఁ జెప్పఁడు. దుఃఖము యొక్కపరిమాణము వాక్యముల దీర్ఘత్వము ననుసరించియు, సంఖ్య ననుసరించియు నుండునని తలంచికాఁబోలు బాహు కునికిఁ గొండవీటి చేంత్రాడువంటి స్వగతమును గల్పించి ప్రేక్షకులపై ఆయనకుఁగల కసియంతయుఁ దీర్చుకొన్నాఁడు. ప్రవాసిపెట్టిన పద్యములు గ్రంథస్థములు కాకపోయినయెడల విస్మృతములగు నను తలంపుతో బాహుకుఁడు చంద్రుని దూషించు కథా భాగమున నిక్షేపించినాఁడు. వీనినన్నిటిని తలదన్ను చాపల్యము మఱియొకటి గలదు. ప్రహ్లాదనాటక మున లీలావతి పాడునట్టి 'రారా-ధీలోలా-నాబాల' అను

పాటయందు, 'సుకుమారా-గుణశాలి' అను పాటయందును 'రామకృష్ణకవిరత్నముఁ బ్రోవ' అనియు 'కవి రామకృష్ణ' అనియుఁ, కవిగారు తన పేరును ఇముడ్చుకొన్నారు. అచ్చట ఒక చుక్కగుర్తును బెట్టి జ్ఞాపికలో 'లీలావతి యీ పాట చదువునప్పుడు అంకితము పేరును తీసివేయవలయును' అని యైన హెచ్చరించలేదు. నటకులును ఆ యంకితముయొక్క యనౌచిత్యమును గ్రహింపలేదు. లీలావతి పాత్రము ధరించిన యొక నటకుఁడు 'రామకృష్ణకవిరత్నము'అని పాడుచుండగా విని నేను ఆశ్చర్యపడితిని. లీలావతిని ఇంద్రునివలె చెంగు పట్టుకొని రామకృష్ణకవి కాలమునకు లాగవలయునో, లేక కవినే లీలావతి కాలమునకు నెట్టవలయునో, తోఁపకున్నది. అట్లు చేసినను లీలావతి రామకృష్ణకవిపేరు నేల స్మరింప వల యునో నా కనూహ్యముగ నున్నది. నాటకములో కవి దాఁగియుండవలయునేకాని ముక్కు వెళ్ళఁబెట్టవలసిన యావ శ్యకతలేదు. అట్టినాటకములనాదరించు నభిరుచిగల మనము కాళిదాసాదుల నాటకముల నెట్లు మెచ్చుకొనగలము?

'నాటకము చాల బాగుగానున్నది' అని యనిపించు కొనుటకు మఱియొకయుపాయము గలదు. స్థానికమైనను అస్థానికమైనను దేశభక్తి దేశానుసారము మున్నగుభావము లను వెండ్రుకపట్టు మాత్రమైనను సందు కల్పించుకొని బారెడుపొడుగు ఉపన్యాసములోఁ బొదిపి ప్రవేశపెట్టుట; హిందువులు మహమ్మదీయులు కలిసియున్న నాటకకథయైన యెడల [ఆ కథ జరుగు కాలమందు అట్టిభావములు ప్రజ లలో లేకున్నను] హిందూ మహమ్మదీయ మైత్రిని గుఱించిన

యుపన్యాసము నొక పాత్రమునోటఁ జెప్పించి నాట్యశాలను రాజకీయోపన్యాస మందిరముగ మార్చుట; పుట్టినదాది అడవులలోఁ గాలము పుచ్చుచు, గ్రంథములలో వర్ణింపఁ బడిన లక్షణములచేత గుఱ్ఱమును గుర్తించిన కుశలవులు మాతృదేశాభిమానమును గుఱించి నేఁటికాలపు భావముల వెడలఁగ్రక్కు ఉపన్యాసముల బలాత్కారముగ ప్రేక్షకు లపైఁ గురిపించుటచూడ, "ఆంధ్రపత్రిక" వాల్మీకి ఆశ్రమమునకుఁ గూడఁ బంపబడుచున్నదా యను భ్రాంతి పొడమ చున్నది. దేశకాలపాత్ర విరుద్ధమైనను పురాతన వస్తువు నకు ఆధునికవాసన దగిలించుట చాలమంది నాటక రచయి తల కభ్యాసమైయున్నది. ఇది యొక వ్యాపార రహస్యము.

చాలమంది నాటకకవుల రచనాలోపములను, పాట . లును బద్యముదును గప్పిపుచ్చుచున్నవి. నాటకములోని కల్ప నను బృథక్కరించినయెడల ఆ లోపములు బయలుపడును. ఎట్టినాటకమునై నను జక్కఁగా బాడఁగలిగిన యొకరిద్దఱు నటకుల నాశ్రయించి ప్రసిద్ధికి రావచ్చును. అల్లూరు నాటక సమాజమువారు రామదాసు నాటకమును బ్రదర్శించు చుందురు. పర్వత రెడ్డి రామచంద్రారెడ్డిగారు (ఆ సమాజ మునఁ బ్రధాన నాయకపాత్రము ధరించు నటకుఁడు) కబీరు పాత్రమును ధరింతురు. ఆ ప్రదర్శనములను జాలమంది కొని యాడుచుందురు. రెడ్డిగారు నాట్య ప్రపంచమున ఆర్జించిన పేరు ప్రతిష్టలకు ఆ నాటకము పట్టుఁగొమ్మ. ప్రజల ప్రశం సకు నాస్పదమైన విషయము నెఱుంగవలయునని చాలమంది యభిప్రాయములను గనుగొంటిని. కోంచె మించుమించుగ

అందఱును ఈ క్రింది విధమున జబాబిచ్చుచుందురు. 'రామ చంద్రా రెడ్డి హిందూస్థాని పాటలను జక్కఁగా పాడఁగలడు. నాటకము ప్రారంభమునుండి తుదివఱకు పాడుచున్నను, కొంచెముగూడ ఆయనగొంతు రాఁబుపుట్టదు. ఆయన పాడు చున్నపుడు మఱికొంతసేపు పాడుచుండిన పాగుగానుండునని తోఁచును. నా మట్టుకు నేను రెండుమూరులు Once more, అన్నాను.' రామచంద్రారెడ్డిగారిని గుఱించి చెప్పఁబడిన దంతయు యథార్థమె. కాని నాటకము ఏ విధముగ మెచ్చుకొనబడవలయును? షేక్స్పియరు మహాకవియొక్క ప్రతిభ, గ్యారిక్కు ననుసరించి యుజ్జీవింపవలయునా? లేక యాతని రచనలకు స్వతంత్రమైన యంతస్సారముగలదా? చదువరు లూహింపఁగలరు. బూటకపు టాదారముల నాశ్ర యించి ప్రసిద్ధికెక్కిన నాటకములు ఆశ్రయచ్యుతి గలిగిన వెంటనే విస్మృతములగును. ప్రేక్షకుల యభిరుచిననుసరించి వ్రాయఁబడు నాటకములు వారియభిరుచి మాఱువఱకే గౌర వింపఁబడును తర్వాత నధఃపతనము.

పాత్రోచితమైన భాషనుపయోగించు టావశ్యకము. మహోపాధ్యాయ, కళాప్రపూర్ణ వేదము వేంకటరాయ శాస్త్రులవారు బొబ్బిలినాటకమున బుస్సీ దొరపాత్రమునకు వ్యాకృత భాషనే యుపయోగించిరి. కోలాచలము శ్రీని వాసరావుగారు రామరాజు నాటకమున పటానునకు ఉత్తమ భాషనే యుపయోగించిరి. వారిని ఉత్తమ పాత్రలనుగఁ జ్ఞతించి అట్టిభాష నుపయోగించి యుందురు. కాని, ప్రద ర్శనమునందు వారి వేషములకును వారిభాషలకును జాల

వైరుధ్యము గోచరించుచుండును. దాని నొప్పుకొన్నను, ఆ పాత్రముల హైందవపురాణ పరిచితి చూఁడ చిత్రముగనున్నది. బుస్సీదొర 'స్తంభము నుండి పైకురికి' అను పద్యమును చదువును. పటాను సంస్కృతపద భూయిష్ఠమైన పొడవగు సమాసములతో సప్తమారుతములను జిల్లరదేవుళ్ళను తన్నుఁ జంపుటకుగా ఆహ్వానించును. హైందవేతరజాతులకు సంబంధించిన యుత్తమ పాత్రములచే నుత్తమభాషను మాట్లాడించుట యొకవిషయము. కాని, వారికి మనశాస్త్ర పురాణములయందుఁ బరిచయము గలిగినట్లు వ్రాయుట వేఱొకవిషయము. మహమ్మదీయుల యుత్తమ పాత్రత్వమునకు హైందవ పురాణ పరిచయము ఆవశ్యకముగాదు. దుఃఖము కలిగినప్పుడు తమ తమ మనస్సులలో నెలకొని యున్న దైవమునో దేవతలనో స్మరించుట స్వాభావికముగనుండునుగాని, అట్టిసమయమున మహమ్మదీయుఁడు పౌరాణిక దేవతలను తలంచుట విరుద్ధముగఁ గనుపట్టును. బుస్సీదొర బైబిలునుండి యుపమానమును గ్రహించినయెడలనుచితముగ నుండెడిది. పటాను ఖొరానునందో లేక మఱియేవిధమైన మహమ్మదీయ పురాణమునందో పరిచితమైన దేవతలను ప్రవక్తలను ఆహ్వానించియుండిన మెఱుఁగుగనుండెడిది.

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రచియించిన గయోపాఖ్యానమున కృష్ణార్జునుల దెప్పిపొడుపులు, ఆత్మగౌరవముపై దృష్టిగల యే పెద్దమనుష్యుఁడును మాట్లాడియుండఁడు. ఇక కృష్ణార్జునుల మాటయేల? సంవాదములలో

అంతమాత్రము గాటులేనిదే ప్రజలకు రుచింపదు. పాపము! కవియేమిచేయును? శతావధానులు పిశుపాటి చిదంబర శాస్త్రులుగారు, గయోపాఖ్యానమును జూచి దానిని మించ వలయునను కోరికతో శ్రీరామాంజనేయమను నాటకమును వ్రాసి శ్రీరామునికిని ఆంజనేయునకును వైరము గల్పించి యిరివురిసంవాదమును ముదిరిన కొండమిరపకాయ పాకము లోనికి దింపినారు. రామకృష్ణాచార్యులవారు ప్రమీలార్జునీయనాటకమును రచించి, నాగరక విద్వాంసులచే వ్రాయఁబడు నాటకములలో బూతు ఎంతవరకు నొప్పుకొనఁ దగ్గది యనువిషయమును దృష్టాంతపూర్వకముగ దృఢపఱచినారు. వ్రాయుకొలఁది యిట్టి యుదాహరణములకు లెక్కయుండదు. రెండుమూఁడు ఊరక మచ్చుచూపితిని.

నటకులు

కొంచెము మించుమించు ఇరువది యిరువదియైదు సంవత్సరములకుఁ బూర్వము తెలుఁగుదేశమున, నాటకవృత్తి నవలంబించినవారే నాటకము లాడుచుండిరి. (మరల నిప్పుడు కూడ) ఆకాలమున నాటకములన్నను, నటకులన్నను ఒక విధమైన యనుమానము, హీన్యమును దోఁచుచుండెడిది. ఇందుకుఁ గారణము లేకపోలేదు. ఆనటకులలోఁ జాలవఱకు దేశద్రిమ్మరులు, తల్లిదండ్రులను, దారపుత్రాదులను వదలినవారుగనో లేక యితరుల సంసారములను జెడఁగొట్టిన వారుగనో యుండిరి. వారు ప్రదర్శించుచుండిన నాటకము లెల్లను వారి సొంతసృష్టులు. ఈకాలమున పాపట్ల కొంతయ్య

గారు రచియించిన నాటకగీతావిశ్వకోశమువంటిది వారికిఁ గూడ నొకటి యుండినది. ఇదివరకు రచియింపఁబడినవి, యిపుడు రచియింపఁబడునవి, యిఁకమీఁద రచియింపఁబడఁ బోవు సర్వనాటకములకును అందు పాటలు గలవు. రేపటి రాత్రి నాటకము వేయవలయునని యనుకొన్నయెడల, ఈ నాఁటిప్రొద్దున నాటకపాత్రములును, సీనులను వారే తీర్మానించుకొని సందర్భానుసారముగ పాటలు చొప్పించి స్వంత కవిత్వముతో నాటకమును తుదముట్ట ఆడివేయుదురు. ఇట్టి దురవస్థనుండి నాటకములను రక్షించినందులకు నేఁటికాలపు శిక్షిత నాటకసమాజములవారు ప్రశంసాపాత్రులు!

పూర్వపునటకులకన్న నేఁటికాలపునటకులకు బాధ్యత యెక్కువ; ఏలయన—ఇప్పటినటకులు విద్యావంతులు, నాగరకులు. ప్రేక్షకులుకూడ నట్టివారే. కావున నటకులు నిర్బాధ్యముగఁ బ్రవర్తించుటకు వీలులేదు. వారు గమనింపవలసిన విషయములు చాల గలవు. కాని, వ్యాసవిస్తర భీతిచే నిచ్చట కొన్నిటినిమాత్రము వ్రాయుచున్నాను.

తాను ధరింపఁబోవు పాత్రమును, కవి పోషించినవిధమును, ఆపాత్రయొక్క గుణగణములను, మనస్తత్వమును నాటక బంధమునందు ఆపాత్రమునకుఁగల స్థానమును ప్రయోజనమును, తన కార్యప్రవృత్తికి హేతువైన భావమును నటకుఁడు మొట్టమొదట గుర్తెఱుఁగవలయును. వాడు మాటాడు ప్రతిమాటకును అర్థము చక్కఁగఁ దెలిసియుండవలయును. అర్థము తెలియనిదే భావోదయముగాదు; భావోదయము కానిదే తాను అభినయించు పాత్రముయొక్క యవస్థయందు

సహానుభూతి యుండదు. నటకుఁ డెప్పుడును పాఠ మందిచ్చు వానిపై (Prompter) ఆధారపడియుండఁగూడదు.

నాటకమునకు అభినయము (చేష్ట) ప్రధానము. కార్య ప్రచలనము లేనియెడల నాటక మనిపించుకొనక యొక యుపన్యాసమగును. *కార్యప్రచలనమును, అభినయమును అడ్డగించుపాటలను పద్యములను నటకు లంగీకరింపరాదు. కాని పాట పద్యములపైని చాపల్యముచేత కవి యుద్దేశింపని చోటులలోఁగూడఁ గ్రొత్తక్రొత్త పద్యములను బాటలను జేర్చి కార్యగతికి భంగము గలిగించుకొందురు. ఏల? అభినయలోపమును సంగీతముచేఁ బూరించుకొనుటకు ఒకదాని యందలి లోపమును భిన్నమగుమఱియొక దానితోఁ బూరింపఁ బ్రయత్నించుట ♦చింతకాయ బహుమానమువలె నున్నది.

---

*ఇది నాటకరచనకు సంబంధించినవిషయము, "ఇందుకు నటకులు బాధ్యులుకారు. నాటకలక్షణమునకు సరిపోవునదియు తమ ప్రతిభను జక్కగఁ బ్రకటించుకొనుటకు అనువైన పాత్రపోషణము కలదియునగు నాటకమును నటకులు ప్రదర్శనమున కేర్పఱచుకొనవలయును. కాని యిప్పటినటకులపద్ధతి వేఱుగ నున్నది. ఏ నాటకములోఁ బాటలు పద్యములు మెండుగనుండునో అదియే యుత్తమనాటకమని వారి యభిప్రాయము; అట్టినాటకములవలన నటకులకు వచ్చుకీర్తి నాట్యపరమైనది కాదు, గానపరమైనది.

♦ఒకరాజునకు ఒకరైతు నిమ్మపండును దెచ్చి బహుమతివేసెను. దానిని జూచుచుండిన మఱియొకఁడు పొడవాటి చింతకాయను దెచ్చి రాజునకు సమర్పించెను. రాజు చిఱునవ్వుతో "ఇదియేమి బహుమాన?" మని ప్రశ్నించెను. అందున కాతఁ డిట్లు జవాబు చెప్పెను: "లావువాని పొడుగులో నున్నది, ప్రులుసునకు దానమ్మా మొగుడు."

నాకు సంగీతముపై ద్వేషబుద్ధికలదని నా మానవత్వ
మును సంశయింపబోకుఁడు. తగవుకాని-చోట మంచిదియైనను
చెడ్డదిగఁ దోఁచును. ఒకవేళఁ బౌరాణిక నాటకములలోని
నాయికానాయకులు పాటలు పాడినప్పుడు అనిష్టముగనైన
మన్నింపవచ్చును. పౌరాణికనాయకులు అమానుషశక్తి
సంపన్నులగుటవలన వారిజీవితము మనజీవితముకన్న భిన్నము
గను, ఊహ్యాముగను, గొన్నియెడల నలౌకికముగను గను
పట్టుచుండును. మానవసహజములగు సుఖదుఃఖములను వా
రనుభవించునప్పుడే మనము వారితో నేకీభవింతుము. కాని,
చారిత్రక సాంఘిక నాటకములలోని నాయకు లట్లుగాదు.
వారు మనుష్యులు. అమానుషశక్తి వారియొద్ద నించుకేనియు
లేదు. కావున వారి సుఖదుఃఖములతో మనకుసమీప బాంధ
వ్యము గలదు. అందులో ముఖ్యముగ సాంఘిక నాటకముల
నాయకుల ప్రవర్తనము ప్రస్తుతపు సాంఘికజీవితముయొక్క
ఆదర్శక ప్రతిబింబముగ నుండును. అంగడివీధిలో గుడ్డల
వ్యాపారముచేయుచుండ మనము ప్రతిదినమునుజూచుచుండిన
సుబ్బిశెట్టియు జిల్లాకోర్టులో మనము చూచుచున్న ప్లీడరు
వెంకోజీరావుగారును మనము ప్రతిదినమును ఇంటిలో సంభా
షించుచున్న తల్లిదండ్రులు, ఆలుబిడ్డలు స్నేహితులు మున్నగు
వారు స్టేజిమీఁదకువచ్చి "తులువా పలువా" యనియు
"ఛీఛీ, పోపో" యనియు ఫార్సీమెట్లకు అనువుగ విఱిగెడి
అర్థములేని పాటలతో సంవాదములు సలుపుకొనుచుండఁ
జూచినప్పుడు వారిని బిచ్చివారి ఆసుపత్రికిఁ పంపింప బుద్ధి
పుట్టునుగాని అందలి యానందము ననుభవింపఁజాలము.

గొంతులేని నటకులకు, పాటను సైతము మ్రింగివేయగల హార్మోనియము శ్రుతి మేలుచేసి పుణ్యము గట్టుకొనునట్లు, అభినయ చాతుర్యము కొఱతపడిన నటకులకు పాటలు అభయప్రధానము చేయుచున్నవి. ఇట్లనుటవలన నటకుఁడు బొంగురుగొంతువడి సంగీతజ్ఞాన శూన్యుఁడై యుండవలయు నని నా సిద్ధాంతముకాదు. నాటకమున సంగీతము అభినయ మునకుఁ గేవలము ఔపచారికముగ నుండవలయును; కార్యగతికి నేలాటి యభ్యంతరముఁ గల్పింపరాదు.

నేడు కొందఱు నటకులు పద్యములు చదువుటలో నొక యపూర్వపద్ధతిని గనిపెట్టినారు. ఒక పద్యమును రెండు మాఱులు చదువుట. సీసపద్యమైనయెడలఁ బ్రతిచరణమును రెండు రెండు మాఱులు చదువుట. మొదటి తూరి రాగముకొఱకుఁ జదువుట! రెండవతూరి అర్థముకొఱకుఁ జదువుట! తా నొక సభయెదుట నటించుచున్నాఁడనియు తానుజేయు అభినయము, తాను పలుకు మాటలు సభాస్తారులు గ్రహించిరో లేదో యను విచారము, తర్కము, నటకుని కెప్పటికి నుండగూడదు. అట్లుండినయెడలఁ దాను నటకుఁడు కాక, విద్యార్థులకు ఉక్తలేఖనము చెప్పు బడి పంతులవంటివాఁ డగును. రామకృష్ణమాచార్యుల నాటకములలో భూమికలు ధరించు నటకులందు పునరుక్తిదోష మొక గుణముగ పొలసినది. ఇందులకు మార్గదర్శకుఁడు కవియె. పద్యములోని భావమునే గద్యములోను పాటలోను గూడఁ జెప్పును. పాపము, ప్రేక్షకుల గ్రహణశక్తి ననుమానించి కాఁబోలు రెండుమూఁడు విధముల నయ భయముల

తోడ, కవిగారు తనభావములను వారి మనస్సులోనికిఁ బిచి కారి చేయును.

"భామవేషగాడికి మఱింత నెయ్యి పొయ్యండి. తిత్తి పూదేవాఁడికి పప్పుకూడా కావాల్నా" అను ప్రాఁత భాగవతుల పాత్రగౌరవములు ఇప్పటి నాటకసమాజములలో గూఁడఁ బొడకట్టుచున్నవి. ఏ నాటకమందైనను, ఆయాస్థలముల ఆయాపాత్రము ప్రముఖమనియు, ఎంతనీచపాత్రమైనను తన నియోగమును జక్కగాఁ నిర్వర్తించినయెడలఁ బ్రశంసార్హమనియు, నటకునికివచ్చు పేరుప్రతిష్ఠలు తానుపోషించు పాత్రయొక్క యుదాత్తగుణములనుసరించికాక, పాత్రోచితాభినయ చాతుర్యమువలన ననియు, నటకు లెఱుంగరు. ఒకవేళ యెఱింగియుఁ జాపల్యమును జిక్కఁబట్ట లేకున్నారు. ప్రతినటకునకును దాను నాయకపాత్రమును ధరించిన నేగాని సుప్రసిద్ధుఁడు గానేరఁడను అపోహ గలదు. ఇట్టి దుర్భిప్రాయముచేతనే చిల్లరపాత్రములను అభినయించిన కొందఱు తమ పాఠములను జనువక ఉదాసీనులయి నాటకము యొక్క సమష్టిరంజకత్వమునకు లోపమువాటిల్లఁ జేయుదురు. ఒకొక్కప్పుడు చెడగొట్టుదురు.

తాను ధరింపబోవు పాత్రముయొక్క గుణపోషణమునకు, స్వభావమునకు తన మనస్తత్వము సరిపోవునా లేదాయను విచారము నటకుని కుండవలయును. మొట్టమొదట తాను తన మనస్సును స్వభావమును పృథక్కరించుకొనుట యావశ్యకము. తన స్వభావమునందు గాంభీర్యమును

Tragic element ను లేని నటకుఁడు పాత్రమును స్వభావ సిద్ధముగ అభినయింపలేఁడు.

భూమికా ధారణమును గురించి యించుక వ్రాయ వలసియున్నది. పాత్రోచితగౌరవమును బోషించునది వేషము. వేషమునుబట్టి సాధారణముగ మన మొక మను ష్యుని స్వభావశీలాదులను, అభిరుచిని, శిక్షణము మున్నగు వానిని గురించి కొంచె మెచ్చుతక్కువగఁ దెలిసికొనఁగలము కాని చాలమంది నటకులు పాత్రోచితవేషములు ధరించుట లేదు. సావిత్రి, సీత, దమయంతి మున్నగు పౌరాణిక నాయికలు మోచేతుల క్రిందికి జాఱుచుండు జాకెట్టులు, ఎఱ్ఱనిపట్టుతోఁ జేయఁబడిన "బో" అమర్పబడియున్న టోపా, ఉల్లిపొరలవంటి సిల్కులు ధరించుచుందురు. వారి వేషములను జూచినప్పుడు గౌరవమునకు మాఱు లాఘవము మన మనస్సులలో నుత్పత్తియగును. వారి కులుకు బెళుకులు మూతి త్రిప్పుటలు మున్నగు ఱోకు లక్షణములు బజారీజంతలకుఁగూడ సిగ్గుపుట్టించును. చేటికలు నాయికల తల దన్ననట్లు అలంకరించుకొందురు. వారిలో నాయిక యెవతయో చేటిక యెవతయో గుర్తించుటకుఁ గొంత సంభాషణము జరిగినఁగాని సాధ్యముగాదు. హిరణ్యకశిపుఁడు మున్నగు రాక్షస నాయకులు పదియాఱవశతాబ్దమున రోమను వీరులు ధరించు ఉడుపులను వేసికొందురు. ఆ యుడుపులలోని చీలికలకు, కత్తిరింపులకు ఏలాటి యర్థముండదు. ఇతర రాజపాత్రలు పదునెనిమిదవ శతాబ్దము

నాఁటి ఖ్రెంచివిగ్గులను ధరించుకొని సర్వకాల సర్వావస్థల యందుఁ దలలు విరియబోసికొని తిరుగుచుందురు.

కవికల్పనమును దమయిష్టమువచ్చిన రీతిని కత్తిరించు అలవాటు నటకులకు మిక్కుటముగ నున్నది. కవి నటకుల కన్నఁ దక్కువప్రతిభ గలవాఁడయినప్పుడును, కథ కొంచెము దీర్ఘమైనప్పుడును నాటకమిట్టి శస్త్రచికిత్సకుఁ బొల్పుడు చున్నది. కాని యిట్టిక త్తిరింపు జరిగినవెనుక నాటక మెట్లు స్వరూపలోపమును బొందకయుండునో, సంయోగత చెడిన ఆ నాటకమును సహృదయరంజకముగ నటకు లెట్లు ప్రదర్శింపగలరో తోఁపకున్నది. వీనినన్నిటిని దృణప్రాయ మొనరించు సాహసము మఱియొకటి కలదు. తెలుఁగు నాటకములలో భిన్నమగు మరియొక భాషను జొప్పించుట ! ఇది కవి యొనరించిన పాపముకాదు. నటకులు Stage effect కొఱకు (అందేమి Stage effect ఉన్నదో గోచరించుటలేదు. Effect కు మాఱు defect కనబడుచున్నది.) స్వచ్ఛమైన యుర్దూ భాషను ఎవరిచేతనైన వ్రాయించుకొని గుడ్డిపాఠముజేసి సభాస్థులపైఁ గసిదీర్చుకొందురు. సుప్రసిద్ధనటకులని పేరు వహించిన వారు కూడ సామాన్య ప్రజల కన్నులలో దుమ్ము కొట్టుటకు వీలయిన యీ యథమమార్గము నవలంబించు చుండిరన్న, ఇఁక ఈ రంగసంప్రదాయముల పయిని మమతపోవని నటకు లుండుట యరుదు. పఠానువేషము దరించిన రాఘవాచార్యుల వారిపద్ధతి నవలంబించియే కాఁజోలు పర్వతరెడ్డి రామచంద్రారెడ్డిగారు కబీరుపాత్ర మును ధరించి రామదాసుతో ఉర్దూభాషలో మాటలాడు

దురు. పాపము! రామదాసునకు ఉర్దూభాష శ్రుతపాండిత్యమే కావున చెప్పినమాటల నెటులో అర్థము చేసుకొనునే కాని, ఉర్దూభాషలో తిరిగి జవాబుచెప్ప భాషాజ్ఞానము లేక తెలుఁగుతోో మాటలాడును. తెలుఁగువారు ఉర్దూభాష చక్కగా నేర్చుకొనునంతవఱకైన నటకులిట్టి చాపల్యము వంకకుఁ బోకుందురని నా ప్రార్థనము.

మహమ్మదీయ పాత్రోచితమైన భాష నుపయోగింప నిష్టమైనయెడల మహామహోపాధ్యాయ వేదము వేంకటరాయ శాస్త్రిలవారు ప్రతాపరుద్రీయమున వలీఖాను ప్రభృతుల కును బొబ్బిలియుద్ధనాటకమున హైదరుజంగు మున్నగువారికి నుపయోగించిన మిశ్రభాష రమ్యముగ నుండును; కాని, పతాను మొట్టమొదటి ప్రవేశమున స్వచ్ఛమైన యుర్దూ భాషయును కడపటిసీనులలో అందుకు విరుద్ధముగ సంస్కృత పద భూయిష్టమైన సమాసములను మాటలాడుట విపరీతముగ దోఁచును.

ఒకొక్కప్పుడు నటకులు సామాన్య ప్రేక్షకులను నవ్వించి చప్పటలు కొట్టించుటకు, అవసరమైన యభినయము చూపి కవి యుద్దేశించిన రసమునకు విరుద్ధమైన రసము నుప్పతిల్లఁజేయుదురు. ఒక్కయుదాహరణము: హిరణ్యకశిపుని యొద్దకు చండామార్కులు విద్యాపారంగతుఁడైన ప్రహ్లాదుని దీసికొనివచ్చి పరీక్షచేయుఁడని చెప్పుదురు. రాజు పరీక్షచేయును. ప్రహ్లాదుఁడు విష్ణువునేస్మరించును. హిరణ్యకశిపుఁడు కోపగించుకొని గురుపుత్రులతట్టు చూచును. అంతట వారికి వడఁకురోగముపుట్టి కాలుసేతు లతితీవ్రముగ వడఁకింతురు.

ఈయసామాన్యమైన యభినయ కౌశలము చూచినంతనె కొందఱు ప్రేక్షకులు పొట్టలుపిసుకుకొని నవ్వుదురు. ఈ మెచ్చుకోలుచేఁ బ్రోత్సహింపబడి చండామాగ్కులు మఱి కొంత తీవ్రముగ వడఁకుదురు. పాపము! వారి నిస్సహాయ తకుఁ బ్రేక్షకుల మనస్సులో కవి కరుణారస ముప్పతిల్లజేయ వలయునని తలంచెనుగాని, నటకుఁడందుకు భిన్నమైన హాస్యరసమును బుట్టించెను. ఇతరులను నవ్వించుటకు నాట్య కళా కౌశలము అనసరము లేదు. చీలమండలవఱకు గుడ్డ కట్టుకొని యుండినయొకఁడు స్టేజిపైకివచ్చి మోకాళ్ళవఱకు గుడ్డ నెగఁదీసికొన్నయెడల ఆవైచిత్ర్యమునకుఁ జాలమంది నవ్వుదురు.

నటకులు కవులవలెనె వారి వారి శిల్పనైపుణ్యము చేత లోకము నుద్దరింపఁ దగినవారు. వారిబాధ్యతయుఁ గొంచెముకాదు. కావున ప్రజాసామాన్యము యొక్క యభి రుచికి వాసు తమ శిల్పమును దింపుటకంటెఁ బ్రజల యభి రుచిని గ్రమక్రమముగ సంస్కరించుటకుఁ బ్రయత్నము సల్పవలయును.

నాటకశాల

నాట్యరంగ మెప్పటికిని యాదార్థ్యభ్రమను గొల్ప వలయును కాని, మన ముపయోగించు పర్దాలకును, మనము ప్రదర్శించు నాటకములకును దేశకాలపరిస్థితి వైరుధ్యము కనుపట్టుచున్నది. సారంగధరునో లేక కృష్ణార్జునులనో మద్రాసు మౌంటురోడ్డులో తిరుగుచున్నటుల ప్రదర్శింతుము.

కన్యాశుల్కములోని గిరీశమును రాజాంతఃపురములో సంచరించు చున్నటుల చూపింతుము. పిడుగునకు బియ్యమునకు ఒకే మంత్రము వేయుటవలన అట్టివైరుధ్యము సంభవించుచున్నది. పౌరాణిక నాటకములాడినను లేక చారిత్రక సాంఘికనాటకము లాడినను మొదటిపర్దా, వీథి, అంతఃపురము, దర్బారు, అడవి అను నీ అయిదు పర్దాలనే యుపయోగింతురు; ఒకనాటకములోని నాయకుఁడును ప్రతినాయకుడును ఒకే యంతఃపురములోనో, లేక యొకేదర్బారులోనో మార్చిమార్చి కనఁబడుచుందురు. నేఁడు నాటకశాలలో అగపడుచున్న పర్దాలు సీనులును ఇరువదియవశతాబ్దపు సంకర శిల్పముయొక్క ప్రతికృతులు.

ఇట్టివైరుధ్యము సంభవింపకుండుటకుఁ గొన్ని ప్రయత్నములు చేయవచ్చును. నాటకములను పౌరాణికముల నియుఁ జారిత్రకములనియు సాంఘికములనియు విభజించి ఒకొక్క నాటక సమాజమువారు ఒకొక్క వర్గమునకు సంబంధించిన నాటకములకుఁదగిన యుపకరణముల నేర్పఱచుకొని నాట్యకళయందు త్తమ సిద్ధిని పొందవచ్చును. అట్లుగాక సమాజము భాగ్యవంతమైనయెడల ఆమూఁడువిధములైన నాటకములకు ఆయాదేశ కాలపరిస్థితులకు సంబంధించిన పర్దాలును ఇతరోపకరణములను సేకరించి తరువాత అట్టి నాటకములఁ బ్రదర్శింపనలయును. కాని, యిట్టిప్రయత్నములు జమీందారుల పోషణమున నభివృద్ధియగుచుండు మైలవరం సమాజము, ఏలూరు సమాజము మున్నగువానికే యొకవేళ సాధ్యము.

పౌరాణిక నాటకముల పర్దాలకు సీనులకు రామాయణ మహాభారతములందుఁ గానవచ్చు రాజప్రాసాదాది శిల్ప వర్ణనముల నాదర్శకముగఁ గొనవచ్చును. చారిత్రక నాటకములకు బౌద్ధ మొగలాయి శిల్పములను గ్రహింపవచ్చును. వర్తమాన స్థితిగతులఁ దెలుపు సాంఘిక నాటకములకు నేఁటికాలపు సంకరశిల్పముపయోగపడును. ఏదియెట్లున్నను, ప్రస్తుతము నాట్యరంగము ఆపాదమస్తకము మార్పు నొందవలయును.

ఏ నాటక సమాజమువారైనను పదునైదు నాటకములను అవకతవకగ నాడుటకంటె నొకటిరెండు నాటకములనైనను సరియైన యుపకరణములతో యోగ్యముగఁ బ్రదర్శించినయెడల అదియే యశస్కరము. సంఖ్యకన్నను రాశికన్నను, గుణమే ప్రధానము. ఇంగ్లండులో అయిదాఱు సంవత్సరములు విద్యనభ్యసించి మరల హిందూదేశము చేరిన నామిత్రుని అచ్చటి నాటకవిషయములను గుఱించి ప్రశ్నింపఁగా ఆయన యిట్లుచెప్పెను: "నేనొక నాటకము ఆఱునెలలకుఁ బూర్వమునుండియు ప్రదర్శింపఁబడుచున్నదని విని యొకనాఁటిరాత్రి చూడఁబోయితిని. అప్పటికిని ప్రేక్షకులు క్రిక్కిరిసియుండిరి. నాప్రక్కను గూర్చుండియున్న యొక పెద్దమనిషిని విచారింపఁగా ఆయన ఇట్లు చెప్పెను– 'ఇంక ఆఱునెలలవఱకు నాడినఁగాని చూడదలఁచుకొన్నవా రందఱును చూడలేరు, ప్రతిదినమును క్రొత్తప్రజలే వచ్చుచుందురు'. కంపెనీవారు ఈనాటకమును సంవత్సరముపాటు ఆడనిడే పర్దాలు మున్నగువానికై వారు వెచ్చించిన పెట్టుబడి

ద్రవ్యముపోను లాభము మిగులదు.” నాటకరంగమున యూదార్థ్యభ్రమకల్పించుటకెంత ద్రవ్యమైనను యూరపి యను నాటకసమాజములవారు ఖర్చుపెట్టుదురఁట! అంత ద్రవ్యమును మనము వెచ్చింపలేకపోయినను వెచ్చించు ద్రవ్యమైనను ఉచితముగ వినియోగించు టావశ్యకము.

ప్రేక్షకమండలి

ప్రేక్షకమండలిలో అన్నివిధములైన శిక్షణముగల మనుష్యులుందురు. బహిర్వేషములను చూచి “వీరు నిక్కువమైన కళాభిరుచిగలవా”రని యూహించుట యసాధ్యము. నేనట్లూహించి చాలమాఱులు పొరపడితిని. ప్రేక్షకునికొక దురభ్యాసముగలదు. అది దురభ్యాసమేకాదు, దురభిరుచియు. ఒకనటకుఁడు శ్రావ్యముగఁ బద్యమునో పాటనోపాడిన వెంటనే (Once more, once more) అని కేకలువేసి చప్పట్లు తట్టును. హాల్వా తీపుగానున్నదని అజీర్ణవ్యాధి పుట్టువఱకుఁ దినవలయునని వీరిమతము కాబోఁలు! ముక్కు ఒకవేళ అందముగా నున్నదని మఱికొండుముక్కులు చేయించుకొని చెంపలకతికించుకొనుటకు వీరిష్టపడుదురా? పునరుక్తి యితరశిల్పములం దెంతదోషమో అంతకన్న నాటకకళయందును మహాపాతకము. శ్రుతిచాపల్యముచేత నొకపద్యమునకుఁ జెప్పఁబడిన (Once more) ను మన్నించెదమను కొన్నను సీనునకంతయు (Once more) చెప్పు ప్రేక్షకుల యభిరుచి మన్నించుటకు వీలుకానిది. అల్లూరు నాటకసమాజము వారు రామదాసు నాటకమును నాగరకులకు ఆకర్షమైన

యొకపురమునఁ బ్రదర్శించినపుడు అచ్చటి ప్రేక్షకులు అహామక్కుసీను పునరభినీతము గావలయునని ప్రార్థించిరఁట!! నటకుని సద్యఃప్రేరితమైన యభినయములోని యౌచిత్యమును సౌకుమార్యమును సూక్ష్మతను గ్రహించుటకంటె పాటలోని మాధుర్యమును జవిసూచి యానందించుట తేలిక. కావునఁ జాలమంది మెచ్చుకోలు పాటపద్యములకు సంబంధించియుండును. నేనుజూచినంతవఱకు మెచ్చుకోఁదగిన అభినయమునకు (Once more) చెప్పిన ప్రేక్షకులు చాల అరుదు. చేయికదలింపనేరని నటకుఁడుగూడ రాగయుక్తముగ పాడెనేని ప్రేక్షకమండలి యాతని నద్భుతమైన నటకునిగ శంకించి బంగారు పతకములు దానముచేయుచుండును.

ఇఁకమీఁద నెన్నటికైనను కవి నటక ప్రేక్షకుల సహకార సాహాయ్యములచేతనే నాటకశిల్పము సంస్కరింపఁబడవలయును; అభ్యున్నతి నొందవలయును. ఈమువ్వురును వారి వారి బాధ్యతను జక్కగఁ గుర్తెఱిగి ప్రవర్తింతురేని నాటక కళకు మంచిదినములు రానున్నవని నాతలంపు.

ఈ వ్యాసమునందలి నాయభిప్రాయములు నాట్యశిల్పమును నిబద్ధీకరించు బిరుసు సిద్ధాంతములుగావు. స్నేహపూర్వకమైన సలహాలు; కావుననే దిద్దుకొనుట కనుకూలములు.

అల్లసాని పెద్దన:

సమకాలీన భావ ప్రతినిధి

సమకాలీన భావములు సాంఘిక పరిస్థితులు కావ్య దర్పణమునందుఁ ప్రతిఫలించుచుండును. కవి స్వతంత్రుఁడయి పూర్వాచార బద్ధుఁడు కాకపోయినయెడల రచనాపద్ధతి యందును కావ్యవస్తు నిర్ణయమునందును భావ ప్రకటనము నందును దన కాలమునందు వ్యాప్తిలోనుండు పద్ధతులను గ్రహించును; లేక క్రొత్తభంగుల నావిష్కరించును. లక్షణములు ప్రతిభావంతులైన కవులరచనల పరిశీలనము వలనఁ దేలిన సామాన్యధర్మములే కావున, అట్టి కవులను అన్యాలక్షణములు బంధింపలేవు. ఒకొక్కప్పుడు వారి రచనలు పూర్వ సంప్రదాయములకన్న బిన్నములుగనుండి మార్గదర్శకములగును; ఒకొక్క కాలమునకు ఒకొక్క సంప్రదాయము రూఢియై యుండును. ఒక కాలముయొక్క సృజనశక్తి తగ్గిన యనంతరము సంప్రదాయము కరుడుకట్టును.

శాస్త్రముకాని శిల్పముకాని ఏకాలమందైనను అప్పటికన్న నభివృద్ధిచెందుటకు వీలులేనంత పరిపూర్ణత చెందియుండదు. నిర్దోషతయును బరిపూర్ణతయును ఈ లోకమునకు సంబంధించిన గుణములుగావు. కవి కేవలము క్రొత్త పద్ధతులను గనిపెట్టవలయునను దీక్షతో పద్మాసనము వేసికొని కూర్చుండఁడు. ప్రాచీన సంప్రదాయములు నిస్సారము

లయి పండిన పండ్లవలె కాలక్రమమున వృంతచ్యుతము లగును. కాలాఁ దిరుగనేర్చిన బిడ్డ రక్షకత్వగర్వము వహిం చిన ముసలి దాది పట్టియుంచినను పెనఁగులాడి పట్టు వద లించు కొనునటుల స్వతంత్రమైన కవి హృదయము సంకుచిత నియమ బద్ధముగాక యెదురు తిరుగును. అసంతృప్తి కలిగి నప్పుడు అజ్ఞాతముగనే కవిప్రతిభ అనుకూలమైన ప్రచల నావరణము నేర్పఱచుకొనును. ఈకార్య మాతనియందు అప్రయత్నముగనే జరిగిపోవుచుండుట వలన స్వాభావికముగ నుండును: కవి నిరంతరము నేక సంప్రదాయ బద్ధుఁడే యైన యెడల రచనలయందు వివిధత్వముండదు. ఇట్లనుట చేత కవి నియమరహితుఁడని చెప్పుటగాదు. స్వయంకల్పిత నియమ ములు కలవు. నియమబద్ధముగాని శిల్పమునందు ఔచిత్య ముండదు. అరాజకత్వముండును. స్వాతంత్ర్యముకూడ నియమబద్ధమె.

జాతీయ జీవిత ప్రవాహమును ఆనకట్టులుకట్టి నూతన మార్గముల మరలింపఁగల నాయకులు, కవులు, చారిత్రక మహాపురుషులు ప్రతిదినమును పుట్టుచుండరు. అట్టివారిని సృజించుటకుఁ బ్రకృతికూడ కొంతకాలము వేచియుండి శక్తిని సంపాదించుకొనవలయును. అట్టి ప్రతిభావంతులు పుట్టి నప్పుడు ఆకాలమునకు వారివాక్కు ప్రాతినిధ్యము వహించును.

ఆంధ్రదేశ రాజకీయ చరిత్రమునందు కృష్ణదేవ రాయల రాజ్యకాలమొక సువర్ణఘట్టము. హరిహర రాయ లచేఁ బ్రారంభింపఁబడిన విజయనగర సామ్రాజ్యము కృష్ణదేవ రాయలనాఁటికిఁ బరిపూర్ణతనొంది, భోగభాగ్యములఁ దులఁ

దూగుచు నడిమింటి సూర్యునివలెఁ బ్రకాశింపఁజొచ్చెను. తెలుఁగు శౌర్యము, తెలుఁగుకీర్తి నల్దడలఁ బ్రసరించెను, ఆకాలమునందు ఆంధ్రసారస్వతమును కళలును విశేషముగ వృద్ధిచెందినవి. "గులాబిపూవు లంతటను అమ్మబడుచున్నవి. ఆప్రజలు గులాబిపూలను ఆహారముకంటె ఆవశ్యకములయి నవిగా భావించుచుండిరి." ఇఁక విజయనగర ప్రజల నాగరకతయు సౌందర్య ప్రీతియు భోగలాలసత్వమును వేఱుగఁ జెప్పవలయునా?

పరస్పర భిన్న ప్రకృతులుగల రెండు నాగరకతలకు సంబంధము గలిగినప్పుడు రెంటి యందును గొంత మార్పు గలుగును. బలిష్ఠమగు నాగరకత దుర్బలమగుదానిని ద్రుంగి వైచి, తనయందు జీర్ణించుకొనును. అట్లుకాక రెండును తుల్యబలయుతము లయ్యెనేని ఇచ్చిపుచ్చుకొనుటలు, అనుకరణములు, ఆత్మీకరణములు జరుగుచుండును. భిన్ననాగరకతల సంఘర్షణము అభివృద్ధికి అత్యంతావశ్యకము. ఈ కాలమున ఆంధ్రదేశమునందు హిందూ మహమ్మదీయ నాగరకతలకుఁ గొంత సంబంధమును స్పర్ధయుఁ గలిగినది. "ప్రాతయొక రోత, క్రొత్తయొక వింత" యనునట్లు మొగలాయీల భోగప్రియత్వము విజయనగర ప్రజలకు నచ్చినది. మహమ్మదీయ స్త్రీల రవికెలు పావడలు ఆంధ్రకాంతల మనముల నాకర్షించినవి.

విజయనగరము సుమారు నూటనలుబది చదరపు మయిళ్ళ వైశాల్యముగల గొప్ప పట్టణము. ఆంధ్రసామ్రాజ్యమునకు రాజధాని. సింహళమునుండికూడ సామంత నృపా

లురు రాయలకు కప్పములను చెల్లించుచు రాయబారులను పంపుచుండిరి. పోర్చుగీసు సిపాయిలుకూడ కృష్ణదేవరాయల దండయాత్రలందు పాల్గొనుచుండిరి. వ్యాపారము నిమిత్తము వివిధదేశముల ప్రజలు ఆపట్టణమున నివాసమేర్పఱచుకొని సుఖజీవనము సల్పుచుండిరి. చక్కని నీటివసతి యేర్పడుట వలన ఎచ్చట చూచినను పైరుపచ్చలు చెట్టుచేమలు ద్రాక్ష తోటలు బలిసియుండినవి. విజయనగరమను మూసయందు వివిధసంప్రదాయములు, ఆచారములు, నాగరకతలు కరఁగి నూతన నాగరకతగ కరుడు కట్టుచుండినది. కృష్ణదేవరాయల దండయాత్రలలో పాల్గొనని కుటుంబము విజయనగరమున నుండియుండదు. విజయగర్వ మొకవంకయు, విరోధిపట్టణములు కొల్లగొట్టుటవలన ప్రాప్తించిన ద్రవ్య మొకవంకయుఁ బ్రజల ఆత్మగౌరవమునకు సుఖజీవనమునకు సాయపడుచుండినవి. దేశానురాగము స్వభాషానురాగము పొటమరించినది. తెలుఁగు మాటకుఁ జెల్లుఁబడి హెచ్చినది. "దేశభాషలందుఁ దెలుఁగులెస్స" యను నానుడి పుట్టినది.

ఇట్టి సందర్భములలో సంఘమునందు స్వాతంత్ర్యప్రీతియుఁ బూర్వాచారవైముఖ్యమును హెచ్చినదనుట యతిశయోక్తిగాదు. ఈమార్పు ఆనాఁటి సారస్వతమునందును గోచరించవలయును. రాయల యాస్థానమునందు అల్లసాని పెద్దన, నంది తిమ్మన, అయ్యరాజు రామభద్రుఁడు, పింగళి సూరన, ధూర్జటి, మాదన, రామరాజభూషణుఁడు, తెనాలి రామలింగన్న అను అష్టదిగ్గజము

లుండిరని ప్రతీతి కలదు. వీరి సమకాలీనతలోఁ గొంత కాలవిపర్యాసదోష మున్నది. ఒకవేళ ఉండిరనుకొన్నను, వీరిలో నెవ్వరి రచనయందు ఆనాఁటి పరస్పర భిన్నాదర్శక సంఘర్షణమును నూతన దృక్పథమును గనఁబడుచున్నది? పెద్దన మనుచరిత్రమునందు. కృష్ణదేవరాయలకు పెద్దనపైఁ బ్రీతిగౌరవములు మిక్కుటము. కావుననే—

సీ. "ఎదురైనచోఁ దన మదకరీంద్రము డిగ్గి
కేలూఁతయొసగి యెక్కించుకొనియె;
మనుచరిత్రం బందుకొనువేళఁ బురమేఁగఁ
బల్లకిఁ దన కేలఁ బట్టి యెత్తె;
బిరుదైన కవిగండపెండేరమున కీవె
తగుదని వాదు పాదమునఁదొడిగెఁ
గోకట గ్రామాద్య నేకాగ్రహారము
లడిగిన సీమల యందునిచ్చె;
గీ. ఆంధ్రకవితా పితామహ యల్లసాని
పెద్దనకవీంద్ర! యని నన్నుబిలిచె...."

ఇట్టి సత్కారమును గౌరవమును కృష్ణదేవరాయలు మఱే కవికినిఁ జేసియుండలేదు. పెద్దన రాయలకుఁ బ్రియస్నేహితుఁడు కూడ. రాజు వేఁటకు వెడలునప్పుడు కవీంద్రుని వెంటఁబెట్టుకొని పోవుచుండెనఁట * కడపజిల్లా

---

* గూడూరులో సబ్‌రిజిస్ట్రారుగా నుండిన నీలం గోవిందరాజులు నాయుడుగారు, బి. ఎ., బద్వేలియందున్నప్పుడు ఆసరస్సును దర్శించిరని నాతోఁజెప్పిరి. వారియొద్ద పెద్దన వంశవృక్షముకూడ కలదు. ఈ నాయుడుగారి రిప్పుడు స్వర్గస్థులైరి.

బద్దేలియందొక సరస్సుగలదు. పెద్దన వేఁటకువచ్చినప్పుడా సరస్సులో స్నానము చేయుచుండెనని యచ్చట ప్రజలు చెప్పుకొనుచుందురఁట.

"ఆంధ్రకవితా పితామహుఁడ"ని కృష్ణదేవ రాయలు పెద్దనను సంబోధించుట కేవలము ప్రీతి మూలక మనియుఁ, దక్కినవారి రచనలకన్న అందు ముఖ్యముగా నందితిమ్మన కవిత్వమునకన్న పెద్దన కవిత్వమేమంత రస వంత మనియుఁ గొందఱు వితర్కింతురు. అది కేవలము ప్రీతిమూలక సంబోధనముగాదు. పెద్దన కవిత్వమునందు సౌకుమార్యము, తెనుఁగుమాటల తియ్యందనము, తేలిక మాటలలో నియమింపఁబడిన భావగాంభీర్యము, ప్రకృతి రామణీయక ప్రీతియు, నవ్యతయుఁ గలవు. పెద్దన ప్రబంధపు నమూనాను సృజించినవాఁడు కాకపోయినను, ఆంధ్రీకరణము గాక స్వతంత్ర కథావస్తువును గ్రహించి కావ్యము రచించి నూతన సంప్రదాయ మేర్పఱచెను. శ్రీనాథుని నైషధము ఆంధ్రీకరణమయ్యును స్వతంత్ర ప్రబంధమువలె నొప్పారుచు పెద్దనకు మార్గము సిద్ధపఱచెను.

ఇతివృత్తము మార్కండేయ పురాణము నుండి గ్రహింపఁబడినది. తన మనమును ఆందోళనపఱచుచున్న భావయుద్ధమును ద్వైధీభావమును ప్రతిఫలింపఁజేయుట కనువైన కథనే కవి యేర్పఱచుకొనెను. మూర్తీభవించిన రెండు ఆదర్శములు మన కన్నులయెదుటఁ బొడకట్టు చున్నవి. ఒకటి: హృదయములేని నైతిక కర్కశత్వము; రెండు: భోగలాలసత్వము. మొదటిదానియందు ఆచార

పరాయణత్వమును రెండవ దానియందు మానుషత్వమును గలవు. కవి యీ రెండు ప్రకృతులను సృజించి శీలపోషణ మునందుఁ దారతమ్యము జూపించి యొకదాని కొకటి భిత్తిగ నొనరించెను.

ఆంధ్రదేశమునందు భిన్నమతములు ప్రబలుటవలన వైదిక మతమునందును వర్ణాశ్రమధర్మములందును బ్రజలకుఁ గొంత అశ్రద్ధ జనించినది. మాధవ శాయణులు వేద భాష్యమును రచించియు రాజకీయ విషయములందుఁ బాల్గొనియు వైదికమతమును గొంతవఱకుఁ బునరుద్ధరించిరి. కాని, కాలక్రమమున ఆ యుద్యమముగూడ సన్నగిల్లినది. దేశపరిస్థితులు సౌమ్యముగ లేవు; మాటిమాటికి యుద్ధములు, కొల్లలు, సర్వజన సామాన్య కష్టములు కలుగుచున్న సమయములందు నీతులు ఆచారములు వర్ణాశ్రమధర్మములు నిర్వర్తింపఁబడుటకు వీలులేదు. యుద్ధకాలములందు వర్ణసాంకర్యము సామాన్యము.

ఒక జాతిగాని సంఘముగాని బలశౌర్యములు గలిగి పరాక్రమవంతమై యితర జాతులపై దండయాత్రలు వెడలి జయముగాంచినప్పుడు ఆవిజయఫలము ననుభవించుచు వారు భోగపరాయణులయ్యెదరు. వైరాగ్యము మందునకైన లభింపదు గృహస్థ జీవితమె ఆదరణీయమగును. మతము అభ్యాస వశమున అర్థములేని యాచారముగ మాత్రమయుండునేగాని, పైనందిన జీవితమునందు దాని యావశ్యకత అంతముఖ్యముగ దోఁపదు. కృష్ణదేవరాయల రాజ్యకాలమునందొకప్పు డిట్టి పరిస్థితులు సమకూడినవి. పెద్దన హృదయమును వంశపారం

పర్యాముగ వచ్చు ఆచారప్రీతి యొకవంకకు, నూతన గతులు మఱొక వంకకు ఆకర్షింపఁజొచ్చినవి. ఈ గుంజులాటయె వరూధినీ ప్రవరుల వ్యవహారమునందు మనకు గోచరించును.

కవికి ఎవరిపై ప్రీతియెక్కువ? వరూధినియందా లేక ప్రవరునియందా? ఈ విషయము గనుగొనుటకు సాధ్యమగునా? ఈ రెండు పాత్రలను కవి చిత్రించిన విధమును విమర్శించితిమేని ఈరహస్యము బయలు పడును. కవుల కిట్టి పక్షపాతముండునా? ఏల యుండకూడదు? వారును మానవులే! వారికిని రాగద్వేషములు కలవు, ఇష్టానిష్టములు కలవు. మానవుని లోపత్వమునందును అసంపూర్ణతయందును కవికి సానుభూతికలదు. అపుడే యాతఁడు మానవ స్వభావమును గురించినవాఁడగును. పీడించుటయు వేధించుటయు నీతియుతమైనను నీతిబాహ్యమైనను రసార్ద్రహృదయుని చిత్తమును గాయముసేయును, "ధర్మమునిర్వర్తింపవలయును: పరధర్మము కంటె స్వధర్మము శ్రేయము" అని చెప్పఁబడినది. ఎఱుకలవాని ధర్మము పక్షులను జంపి జీవించుట. అయినను, వాని కటుకటమ్మునకు గుఱియైన క్రౌంచముయొక్క దుస్థితిని జంటపక్షి యొక్క శోకావేగమును గాంచినప్పుడు నవనీత సదృశమైన వాల్మీకిచిత్తము కరఁగి ధారలుధారలుగ స్రవించినది. యజ్ఞముసేయుట అధర్మముగాదు; బలిపీఠముఁదెచ్చిన గొఱ్ఱెపిల్లను బుద్ధభగవానుఁడు చూచినప్పుడు ఆ మహాపురుషుని హృదయము కరుణారస తరంగితమై దానిని కాపాడుట కుద్యుక్తుఁడాయెను. ధర్మము హృదయములేని యంత్రము, మానవుడు హృదయముగల

యంత్రము. రాముఁడు స్వప్రయోజనమును సాధించుట కొఱకు అక్రమముగ వాలిని సంహరించెను. వాల్మీకి యీవిషయము నెఱుంగును; ఆక్రోశ నినాదముచే దిక్కులు మాఱ్రమోగించుచున్న తారపై ఆ మహాకవికి మిక్కుటమైన సహానుభూతికలిగి, రాముఁడు జవాబు చెప్పుటకు వీలులేని ప్రశ్నలను ఆమెచేతను వాలిచేతను నడిగించెను. తరువాత రాముని ధర్మైకపరత్వమునకు హానికలుగునని శంకించి తాను వత్తాసివచ్చి రాముఁడు దేవుఁడు • గావున ఆయనచేసినదంతయు ధర్మమనిచెప్పి పై పెచ్చు వాలిచేత గూడ నొప్పించెను? వ్యాసుఁడు పాండవ పక్షపాతి; వారు ఇడుమలు పడిరన్న కనికరముచే వారి పత్నులకు సున్నపు పూఁతలుకొట్టి మాలిన్యమును మాయించెను. తమ సృష్టులను తామె మోహించిన వారు కూడ కలరు? వీరిలో పైగ్మ్యాలియన్ అను గ్రీకు శిల్పి ముఖ్యుఁడు. ఆతఁడొక రమణీయవతియగు స్త్రీ విగ్రహమును చలువరాతితో నిర్మించి ఆ సౌందర్యమునకు ముగ్ధుడయి మోహించి తన పడకటింటఁ బెట్టుకొనెనఁట!

ప్రవరుఁడు నీతిశాస్త్రమునందు నిర్ణయింపఁబడిన కొలతలకు సరిపోవునట్లు కత్తిరింపఁబడిన తోలుబొమ్మ. వరూధిని విద్యుల్లతవలె మనకన్నుల యెదుట సంచరించు జీవన్మూర్తి! బయాస్కోప్ చిత్రము. వరూధిని చైతన్యము పరిస్ఫుటముగ గోచరించుటకు ప్రవరుఁడు సృజింపఁబడెను. కవికి ఆతనిపై సానుభూతిలేదు. "బుద్ధి జాడ్య జనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్!" అని ప్రవరుఁడు తన లోకజ్ఞాన

శూన్యతను ఆత్మదూషణప్రాయముగ ఒప్పుకొనెను. ఈ వాక్యము వేఱుసందర్భమునఁ జెప్పఁబడినప్పటికిని ఆతని శీలమును ఆ వాక్యార్థము నిరంతర మాపాదించియే యుండును. పాదలేపము కరిఁగిపోయిన యనంతరము తన నిస్సహాయ తను గుఱించి దుఃఖించునప్పుడు మన కథానాయకుని సంగతులు మఱికొన్ని బయలుపడును. తల్లిదండ్రులకుఁ దానొక్కఁడె యల్లారు ముద్దుబిడ్డ. పెండ్లియయి శిష్యులకుఁ బాఠముచెప్పు వయస్సు వచ్చినప్పటికిని, తన్నుఁజూడనిదె తండ్రి యొక నిమిషమైన యోర్వకొని యుండలేఁడు. అసర సందెవేళ ఈ బిడ్డ బయట కాలుపెట్టిన యెడల బూచులు పట్టుకొను నను శంకచే వాకిలి దాటనీయక తల్లి యెల్లప్పుడు రక్షించుచుండును. ప్రవరుఁడు తల్లిదండ్రుల ప్రేమాతిశయముచేతను అనావశ్యకమగునంత జాగ్రత్త చేతను, నిస్సహాయుఁడుగను లోకజ్ఞాన రహితుఁడుగను జేయఁబడిన అమాయకుఁడు. వరూధిని చెలికత్తె యాతఁడు "గోలయుఁ బాలుఁడు" అని కనిపెట్టినది.

ప్రవరుఁడు మృగమదసౌరభము మోసికొనివచ్చు మందమారుతము వలన అచ్చోటు జనాన్వితమని తెలిసికొని చేరఁబోయి యొక దేవకన్యను గాంచెను. ఆమెయె వరూధిని. ఆ యువతి యసమాన రూపలావణ్యవతి; సౌందర్యమునుగాంచి యానందించుటయు దానిని మెచ్చుకొనుటయు అనీతికరము గాదు కాని, మన నీతిమంతుని చిత్తము సౌందర్య ప్రతిరోధకమైన కవచమునందు మగ్గిపోయినది; పాపా

ణత్వమె ధీరత్వమైన యెడలఁ బ్రతిమంటప స్తంభమును ధీరుఁడే!

నిరుపమాన సౌందర్యవతులైన కామినులయెదుట లోకమే యెఱుఁగని ఋశ్యశృంగునివంటి ఆజన్మ మునీశ్వరులును, అపారసంకల్పశక్తిసంపన్నులైన విశ్వామిత్రులవంటి యోగీశ్వరులును చలించిరి. ఇంతయేల? "బమ్మకైనఁబుట్టురిమ్మ తెవులు" ఇట్లు చిత్రించినవారు మానవ స్వభావముయొక్క లోతుపాతుల నెఱింగిన మహాకవులు. నీతిశాస్త్రమునకు వెఱచి శిల్పమును ద్యజించినవారు గారు. ఆ కాలమునందు ఆర్యసంఘ మింతటి యాచారబద్ధముకాదు కాఁబోలు!

ప్రవరుఁడెట్లు చిత్రింపఁబడియుండినఁ బ్రౌఢవంతుడుగ నుండెడివాఁడు? ఆయన యింతకుముం దెన్నఁడును వరూధినివంటి యందక త్తెను జూచియెఱుఁగడు; చూచినప్పుడు ఆశ్చర్యపడి యుండవచ్చును. అనంతరము మానవప్రకృతికి సహజమగు కోరిక పుట్టియుండవచ్చును. మఱుక్షణము నందె - ఆలి మగనికి అన్యకాంతలపై మనసు తగ్గులుట యోగ్యముకాదు. తుచ్ఛసుఖములు "మీసాలపై తేనియ" లని విరక్తిపుట్టియుండవచ్చును. మరల ఆ లతాంగి రామణీయకమునకు వశుఁడయి, "అప్సరస, అందును నేను వలపింపలేదు, నన్ను నలచినది, అనన్యగృహీత, నేనేల భోగింపరాదు?" అని తన మనమును సమాధాన పెట్టుకొని యుండవచ్చును. మఱునిముసమునందె "ఇంతకాలము అవిచ్ఛిన్నముగ నెఱవేర్పఁబడిన నాబ్రహ్మచర్యము నేల నేఁడు భంగముచేసికొనవలయును?" అని నిరతము తనమనములో వర్తించి అను

కూలవతియైన యిల్లాలిని అన్యాయము సేయుటగాఁ దలంచి, ప్రయత్నపూర్వకముగఁ దనకోరికలఁ జిక్కఁబట్టవచ్చును. ఇట్టి పరస్పర భావసంఘర్షణమునుండి ధీరుని సంకల్పము నిర్మలమయి దృఢమయి యెట్టకేలకు జయము నొందును. ప్రవరుని యీ మనోనాటకము మనకుఁ జూపట్టినచో యాతని పై మనకు సానుభూతి కలుగును; లేకయున్న అతఁడు పాషాణ హృదయుఁడని దూషింతుము.

పెద్దన కీ శిల్పనైపుణ్యము కొఱవడి యుండినదా? కొఱవడియుండిన అంతటి మానుషత్వముగల వరూధిని నెట్లు సృజింపఁగలడు? అట్లయినఁ బ్రవరుని ఏల యిట్లు యంత్ర విగ్రహముగఁ దీరిచెను? ఒకటిరెండు కారణములు కలవు. పెద్దన రాజసము కలవాఁడు. "రమణీ ప్రియదూతిక తెచ్చి యిచ్చు కప్పురవిడె మాత్మకింపయిన భోజన ముయ్యోలమం చము" కావలసిన భోగప్రియుఁడు. పోతనవలె "హాళికులైన నేమి?" యని స్వశ్రమార్జితము పట్టెఁడన్నము తినుటకు వలయు త్యాగశక్తికలవాఁడు కాఁడు. కావుననే రాజా శ్రితుఁడు. పూర్వాచార ప్రియమైన పండితాభిప్రాయమును బొత్తిగ నిరశించుటకు వీలులేనివాఁడు. అందువలన, పండిత లోకమును సంతృప్తిపరచుటకు ప్రవరుని ఆవిధముగఁ జిత్రించెను. జీవితయాత్ర సునాయాసముగ జరిగిపోవుట కిట్టి రాజీయే అవసరమేమో!

పెద్దన ప్రవరుని అంతటి కర్కశహృదయునిగ సవరింపక పోయినయెడల మనుచరిత్ర అధమకావ్యమని దూషింపఁ

బడియుండెడిది. వరూధినిపైఁ గనికరము చూపెనని ఇప్పటి కిని పెద్దనపైఁ గత్తినూఁతు నీతిమంతులు గలరు !

"కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబుల"

అని పెద్దన వ్రాసెను. మన యాలంకారిక సంప్రదాయము ప్రకారము ఒకవేళ ప్రవరుఁడు ధీరుఁడైనఁ గావచ్చునేమో కాని, పాపము! వరూధిని మాయలాఁడి యెట్లయినది! మాయతాఁడియయ్యును సతియయ్యేనేని దోషములేదుగదా, తెలుఁగు కవులు సంస్కృత కవులవలె పదప్రయోజనము పాటించువారు కారనియు, పెద్దన 'సతి'ని కేవలము స్త్రీ పర్యాయపదముగ వాడెననియు సమాధానము చెప్పుకొన్నను వరూధిని పన్నిన మాయలేవి? ఆమె వలచినది; వలచుట మాయలాఁడితన మెనయెడల ఆమెయు మాయలాఁడియె. పెద్దన గారాబపు తిట్లు తిట్టుచున్నాఁడు కాఁబోలు! లేక మొగమాటపు తిట్లో!

వరూధిని కన్యక - అనన్యగృహీత - నిష్కల్మషమైన ప్రేమగలది; మొట్టమొదట ఎవనిని ప్రేమించెనో అతనినే వివాహమాడినది [గంధర్వుని మోసము తెలియదుగావున] ధనమార్జించుటకొఱకుఁ బ్రవరుని ప్రేమించుట లేదు. లేని ప్రేమ నటించుట లేదు. జారిణికి ఇంతటి గాఢానురాగ మెక్కడిది? "ఇందునిభాస్యవాఁ డనఁగ నింద్రుఁడో చంద్రుఁడో యా యుపేంద్రుఁడో" అని చెలికత్తెలు ఆతనిపై లాఘవము పుట్టించుటకు యత్నించినను "పూఁతపసిండివంటి పలప్రుంబచరించుకులంబునీతికిఁ, దేఁతగదమ్మ" అనిదుర్నీతులు బోధించినను చెవినిబెట్టక ప్రవరునే వరించినది. ఆమెయచ్చర

కొలమున నుద్భవించినను ప్రవర్తనము భిన్నము. తుదకు పేశల హృదయ ఆత్మహత్మకూడ చేసికొన ప్రయత్నించినది. వరూధిని ప్రవరుని వరించునప్పటికిఁ గన్యాత్వము చెడినది కాదు. "ఆవధూటి ప్రథమసురతంబు గంధర్వపతి గరంచె" అని చెప్పఁబడియున్నది.

వరూధిని ప్రవరుల సంగమము తన కిష్టమయ్యును కవి వదలివేసెను. అందుకు పరిహారముగ మాయాప్రవరుని మూలమునఁ గొంత రహస్య సంతృప్తిగాంచెను. కవి చంద్ర వర్ణనమునందు [సందేశమునకుఁ దావుండదు గదాయని] తన యభిప్రాయమును వెల్లడించెను. "ప్రకృతి నచ్చుంబడైన సన్మార్గి యెన్నటికిం గూటమిపంక వచ్చు **వికృతిఁ** మగ్నుండుగానేర్చునే" అని వెల్లడించెను. ప్రవరుఁడు శుద్ధప్రకృతికిఁ గలిగిన వాఁడేయైనయెడల వరూధినీ సంగమముపలన వచ్చు వికృతికి భయపడవలసిన యవసరముండదు, అది క్షణికము. ప్రవరుఁడు అసంతృప్త హృదయమును సంతోషపెట్టి యోదార్చి పోయి యుండవచ్చును.

రావణుఁడు సీత నెత్తుకొని పోయినప్పుడు రాముఁడు పలవించెను. ఆ శోకవేదనకుఁ జెట్లుకూడ తలలువాంచి యల్లాడెను. ప్రకృతియంతయుఁ గన్నీరునించెను. పెద్దనకూడ దుఃఖిత యగు వరూధినిపైఁ బ్రకృతి కనికరించినదని వర్ణించెను. కర్మసాక్షియగు సూర్యభగవానుఁడు ప్రవరుని పాషాణహృదయత్వమునకు వెక్కసమంది రోషభీషణ స్ఫురణ వహించెను:

తరుణి ననన్యకాంత, నతిదారుణ పుష్ప శిలీముఖ వ్యధా
భరవివశాంగి సంగభవు బారికి నగ్గము సేసి క్రూరుఁడై

యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయదీధితిన్!

ప్రవరుఁడు క్రూరుఁడు-మహీసురాధముఁడు- అహం కార యుతుఁడు—శెబాష్! పెద్దనా, ముసుఁగులో దాఁగు కొని నీ అక్కసు వెళ్ళబుచ్చినావు! కసిదీర్చుకొన్నావు! ఈ సహానుభూతియె, యీ హృదయ వైశాల్యమె నిన్ను మహా కవి పట్టమునకు అర్హుని జేయుచున్నది.

వరూధిని ప్రశ్నలలో వాద నైపుణ్యము మెఱయు చున్నది; ప్రవరునివి చప్పిడిజవాబులు, 'యజ్ఞకోటులం బావను లౌటకుఁ ఫలము మా కొఁగిళ్ళ సుఖించుటేగదా! క్రతువు లొనరించుట స్వర్గభోగములకొఱకు, స్వర్గమునందు అవశ్యాను భోక్తవ్యమును ధర్మమును యోగ్యమునైన రంభాది భోగ ములు ఇచ్చటయేల నిషిద్ధములయ్యెను? అశ్రమముగ సశరీర స్వర్గసుఖము సమకొనియుండ వ్రతోపవాసములఁ గృశుఁడ వయి ఆత్మ నలఁచుట యెందుకు?' అని వరూధిని ప్రశ్నించు చున్నది.

పెద్దన కళానైపుణ్యమును గుఱించి యొకటి రెండు విషయములు సూచించి యీ వ్యాసము ముగించెదను. ఈ కవికిఁ బ్రకృతి రామణీయక ప్రీతి విశేషముగనున్నది. పద లాలిత్యము-అందు ముఖ్యముగఁ దెలుఁగుమాటల తియ్యని పోకడలు ఈతనియొద్ద నేర్చుకొనవలయును. 'అల్లసానివాని యల్లిక జిగిబిగి' అను పూర్వ విమర్శ కాభిప్రాయము నానుడియై యున్నది. పెద్దన కవిత్వము లలితముగఁ దీర్చి దిద్దఁబడి యున్నదనుటకు సందియము లేదు. "నిలుకడ

వలయుఁగృతికి" అను అప్పకవి వచనమునందుఁ గళారహస్య మున్నది. ఒక మనుచరిత్రమే కాదు-కొంచెమించుమించు పూర్వకావ్యములలో చాలవఱకు నిలుకడగా రచింపఁబడినవే. "ఏ౯కైక దినప్రబంధఘటికా సద్యశ్శత గ్రంథకల్పను" అని రామరాజభూషణుఁడు తన్ను గుఱించి చెప్పుకొనియున్నను వసుచరిత్రము ఒక్క దినములో వ్రాయఁబడిన ప్రబంధము కాదు. కడపటి సపరణయయి పూర్తియయిన దనుటకు గొన్ని సంవత్సరములు పట్టియుండును; అనఁగా తన జీవిత కాలమునంచు రెండుమూడు కావ్యములకన్న నెక్కుడుగ రచించియుండఁడను. [నెఱనడి కుదురుట్కై వ్రాయఁబడు కాపీ సుస్తకములవంటివి యెన్నియేని ఉండవచ్చును, అవి లెక్క లేదు.] ఆ కాలమున రాజాస్థానములె కవులకు శరణ్య ములు. ఆస్థానపండితులు సనశల్య పరీక్షచేయు బిరుసు విమర్శకులు. ఇట్టి అగ్నిపరీక్షలో తేరి తెప్పరిల్లిన కావ్యములె గౌరవ యోగ్యము లగుచుండెడివి. ఇట్లనుట వలనఁ బూర్వ కావ్యములన్నియు నీతరగతికిఁ జెందినవని కాదు.

ఇప్పటి పరిస్థితులు వేఱు: వార్తాపత్రికలు మాసపత్రి కలు ప్రబలినవి. ఆపత్రికల పుటలు నిండుటకు విషయములు కావలయును. కవులును, వ్యాసకర్తలును ఏదో యొక మొగమోటమిచేత ఏదియైన కొంత [కాగితములు నిండు టకు] వ్రాసిపంపవలసి యుండును. కాగితముపైని సిరాతడి యారకముందె ఖండకావ్యము పోస్టులోఁబడును. ప్రూఫ్లులు సరిచూడక పూర్వమె [అవకతవకగా చూచి యని యర్థము]

పత్రికలలో ముద్రింపఁబడును. పత్రికాధిపతులు మంచి సెబ్బరలు పరిశీలించి ముద్రించుటకు వీలులేదు. అట్లయిన వారిస్పుటల నియమమునకు హాని గలుగును. ఇట్టి పరిస్థితులలో నిలుకడ నియమ మెట్లు లొనసాఁగును? తన గ్రంథము తొందరగ ప్రకటింపఁబడవలయునను అక్కఱ పెద్దన కుండి యుండదు.

Take time for thinking ; never work in haste,
And value not yourself for writing fast ;
A rapid poem with such fury writ ;
Shows want of judgment not abounding wit.

* * *

A hundred times consider what you have said ;
Polish, repolish, every colour lay,
And sometimes add, but often take away.

—*John Dryden.*

అను ఇటువంటి రచనా నియమమును పెద్దన చాల జాగరూకతతోఁ బాటించినట్లున్నది.

ద్రౌపది, కైకేయి, చిత్రాంగి మున్నగువారివంటి నాయికలు మన సారస్యతమునందు అరుదు. కొంచె మించు మించు నాయికలందరు ముగ్ధలు. మౌగ్ధ్యము రమణీయముగ నుండవచ్చును; కన్యకలందరు ముగ్ధలుగ నుందురను ప్రకృతి నియమము లేదు. వరూధిని ప్రాగల్భ్యముగల కన్యక. తానే వలచినది. ఎట్టకేలకు "నిక్కముదాపనేల ధరణీసురనందన యింక నీపయిం, జిక్కెమనంబు" అని తన భావమును బహిరంగముగ వెల్లడించెను. ఇట్లు చెప్పుట స్త్రీసహజమా?

కాంతలు తమ ప్రేమాతిశయము హావభావములచే సూచింతురు. పాపము! వరూధిని సైత మల్లె చేసినది కాని, ప్రవరుని మనస్సు ఒత్తిడిపడునది గాదు. ఆలసించిన యాతఁడు మోరకించుకొని పోవచ్చునను అనుమానముచే ప్రేమను వచించినది.

వరూధిని ప్రవరునివలె కఠోరహృదయ గాదు. భావోద్రేకము కలది. పేశలమైన మనస్సు - సౌందర్యపిపాస మిక్కుటము-ప్రవరుని సౌందర్యమున కచ్చెరు వందినది-వర్ణించినది-ఇంకను తనివి సనక యాతని ప్రేమించినది. వరూధినీ ప్రవరుల సందర్శనమును కవి అద్భుతముగ వర్ణించెను. వరూధిని "అబ్బురపాటుతోడ నయనాంబుజముల్ వికసింప కాంతి పెల్లుబ్బి కనీనికల్ వికసితోత్పల పంక్తులఁ గ్రుమ్మరింపఁగా, గుబ్బ మెఱుంగుఁ జన్గవ గగురొప్పెడువఁ" బ్రవరుని గాంచినది. మరియు "ఝళంఝళత్కటక సూచిత వేగపదార విందయై లేచి కుచంబులుం దుఱుము, లేనడు మల్లలనాడ నయ్యెడం బూచిన యొక్కపోఁక నునుబోదియ జేరి విలోకన ప్రభావీచికలం దదీయ పదవీ కలశాంబుధి వెల్లిగొల్పి" నది. ఇంకను "మునుముఁ బుట్టెడు కొంకు లౌల్యము నిడఁ మోదంబువి స్తీర్ణతం, జొనుపం గోరుఁలు కేళ్ళ్ర్ద్రిప్ప మదిమెచ్చుల్ తెప్పలల్లార్ప నత్యనుషంగస్థితి తేచ్చ పాటొసఁగ నొయ్యారంబునం జంద్రికల్, దనుకం జూచి" నది. ఈపద్యములందుఁ బ్రతిక్షణ వ్యాప్తమైన కార్యసంచలనము జీవకళావిలసనము నిబిడీకృతమై యున్నది. ఇట్టి పద్యములు ఆంధ్రసారస్వత మకుటమునందుఁ బ్రకాశించు

జీవమణులు. ఈ చాకచక్యమునందు పెద్దన తిక్కనకు మాత్రమె రెండవవాఁడు.

నిర్జన ప్రదేశమందుఁ బ్రభపునిఁ గాంచినపుడు వరూధినికి మొట్టమొదట కన్యా సహజమైన సిగ్గుపుట్టినది; పుట్టి, పూచిన పోఁకచెట్టు చాటునకు పోయినది! ఇంక నే చెట్టు చాటునకు బోయినను ఆమె సౌందర్యము ప్రవరుని కగపడదు. కావునే సిద్ధహస్తుఁడగు కవి సందర్భానుసారముగఁ బోఁక చెట్టును దెచ్చి పెట్టినాఁడు.

"ఇంతలు కన్నులుండ" అను పద్యమునందు లోకోక్తియుఁ జమత్కారమును ధ్వనితముగఁ బ్రవరుని నేత్రసౌందర్యమును వర్ణింపఁబడినది. పద్యములోని మాటలు తేట తెలుంగైనను భావము గంభీరముగను బ్రౌఢముగ నున్నది.

పొంగిపొరలివచ్చు ప్రేమప్రవాహమును ఆపుకొనలేక వరూధిని ఆ ఛాందసుని "పాలిండ్లు పొంగారఁ బైయంచుల్ మోవఁగఁ" గౌగిలించుకొనినది. ఆ బ్రాహ్మణుఁడు ఓరమోమిడి హా శ్రీహరీ! యని అంసద్వ్యయమంటి పొమ్మని త్రోసిపుచ్చెను. వీలైనయెడల అంసద్వ్యయమంటి యుండఁడు! సమయమునకుఁ జేతికట్టి మఱచినచ్చెను. పాప మా వనజగంధి మేని జవ్వాజిపసఁ! గందంబించు నొడలుగడిగికొని పాప పరిహారముగ సంధ్యవార్చినాఁడు. వరూధిని యొక్కయా యస్త్రమునకూడ నిరుపయోగమైనది. తన సౌందర్యము నిరాకరింపఁబడినందుకుఁ గోపమును, కోరికతీఱనందుల కసహనమును, స్త్రీజన సహజమైన అలీకనిందారోపణ నైపుణ్యమును, కొంచెము లేతపాకములోఁబడిన గయ్యాళితనమును,

కసిదీర్చుకొను నిచ్చయు వరూధిని మనమునందుఁ జెలరేఁగి
ముప్పిరిగొన్నవి; దుఃఖము పొంగిపొరలి వచ్చినది.

"పాటున కింతులోర్తురె? కృపారహితాత్మక, నీవు త్రోవ ని
చ్చోట భవన్నఖాంకురము సోఁకెఁ గనుంగొను...."

తన యమ్మల పొడిలోని మన్మథాస్త్రములన్నియు వ్యయమైనవి. తుట్టతుదకీ యస్త్రమొక్కటి నిలిచి యుండినది. ఇది యమోఘము కావచ్చును. అయ్యో! దేవుఁడా, యీ యస్త్రముకూడ ఆతతాతిపైఁ దగిలి మొక్కఁ బోయినది.

నాటకము : చరిత్రము

నెలదినములకు పూర్వము * కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు కళాప్రపూర్ణ వేదము వేంకట రాయశాస్త్రిగారి "ప్రతాపరుద్రీయము"లోని కథ చారిత్రక కము కాదని ఒక విమర్శనము గేయముగ వ్రాసి "పజా మిత్రలోఁ బ్రకటించిరి. ఆ విమర్శనము ప్రతాపరుద్రీయ నాటకమును గుఱించి వ్రాయఁబడినప్పటికిని, అందలి విషయము నాటక రచయితల కందఱకు సంబంధించి యున్నది. కావున ప్రస్తుతము చర్చనీయముగా ఏర్పడినది.

వాఙ్మయ వివాదములలోఁ బ్రవేశించుట నాప్రకృతికి విజాతీయమైన పని. అందులో ఇప్పుడు నాకు ఓపికగాని,

*. ౧౯౩౫ మేనెల ౫ తేదికి ముందు నెలనాఁడు.

తీఱికగాని యసలే లేదు. అయినను ఈవిషయము చాల ముఖ్యమని నాకు తోఁచినందువలన, సారస్వత ప్రపంచమున పలుకుబడి కలవారు ఒకప్పుడు పొరపడునుకేని (పొరపడుట మానవ సహజమేగద!) ఆపొరపాటు తత్త్వదర్శనమునకును, సారస్వత పురోభివృద్ధికిని ఆటంకముగ ఏర్పడవచ్చునను భయముతో ఈవ్యాసమును వ్రాయఁదలపెట్టితిని.

దృశ్యశ్రవ్య కావ్యములకు రచనా విధానమునతప్ప అంత్య ప్రయోజనమునందు ఏవిధమైన భేదము లేదు. లలిత కళల ప్రయోజన మేదో దృశ్యకావ్యప్రయోజనముకూడ నదియె- సద్యఃపరనిర్వ్రతి.

నాటకము సామాజికుల రసానుభూతికి హేతువయి, హృదయాహ్లాదము, వినోదము కలిగించిన చాలునా? లేక, యింక నేదియైన సాంఘిక ప్రయోజనమును, ఉపదేశమును అశింపవచ్చునా? ఇట్టి ప్రశ్నలకు ప్రాచ్యపాశ్చాత్య విమర్శకులు భిన్నభిన్నముగ ప్రత్యుత్తరము లిచ్చియున్నారు. అయినను నాటకమును సాంఘికోద్ధరణము కొఱకు ఉపయోగింపవచ్చునని తీర్మానించిన విమర్శకుల సంఖ్యయే హెచ్చు. నాటకములయందు ఉపదేశముండవచ్చునుకాని, ఆయుపదేశము రసాత్మకమయి, ప్రత్యేకముగ ఒక యుపదేశమని యనిపించుకొనక, అలక్ష్యముగ సామాజికుల హృదయములోనికి ప్రవేసింపవలయును. ఇట్లు నిర్మించుట కళానైపుణ్యము. కవి వాక్కును హ్లాదైకమయమని నిర్ణించుచు ప్రయోజనములను లెక్కించునప్పుడు "కాంతాసమ్మితతయోపదేశ యుజే" అని మమ్మటుఁడు చెప్పెను. దీనినే పాశ్చాత్య విమర్శకులు

"Delightful instruction" అని నుడివి యున్నారు. "ఆనంద మున ఉపదేశమును మెదిపి మానవసంఘోద్ధరణమునకు కావ్యము తోడ్పడవలయు" నని హోరేస్ కవి చెప్పెను. విక్టరు హ్యూగో, ఇబ్సన్ మొదలు బెర్నార్డ్‌షా వఱకుఁ గల పాశ్చాత్యనాటక రచయితలు నాటకమును మానవసంఘ శ్రేయఃసునకుగా వినియోగించిరి.

"Art for art's sake", అనగా, కళ ప్రయోజన నిరపేక్షకముగ నుండవలయునను వాదమొకటి కలదు. ఇది మన దేశమునకు క్రొత్త. కావ్యము ఆనందమాత్ర ప్రయోజన మయ్యును, విశ్వశ్రేయమును చేకూర్చునదిగ కూడ నుండ వలయును అని మనలాక్షణికుల మతము. విశ్వశ్రేయ మను మాటయందు సాంఘిక ప్రయోజనత్వము ధ్వనించుచున్నది. ప్రయోజన నిరపేక్షకవాదుల సిద్ధాంతప్రకారము కవి నిర్బాధ్యుఁడు. తన యానందమును పట్టలేక పాడుకొనుచుండును. సంఘమునందు తన రచనల మూలమున కలుగు అనుకూల ప్రతికూల ప్రవర్తనములతో కవి కేలాటి సంబంధము లేదు. కోకిల ఏమి ప్రయోజనము నాశించి గానము చేయునున్నది? సెలయేరు ఎవరిని సంతృప్తి పఱచుటకు బిలబిల ధ్వనులతో ప్రవహించుచున్నది? అని వీరు ప్రశ్నించెదరు.

చింతా దీక్షితులుగారు ఈకోయిల, సెలయేటివాదము లను ఇమిడ్చి సొగసుగా వ్రాసిన గేయములను నేనెప్పుడో చదివినట్లు జ్ఞప్తియున్నది. ఇట్టి ప్రశ్నలడుగువారు కోయి లకు, సెలయేటికి ప్రయోజనము నాశించు జ్ఞానమున్నదా? లేదా? యని విచారించినట్లు కనఁబడదు. కోకిలపాట మన

రుచించుట అది ఆనందముతో పాడుచుండుట వలనగాదు; దాని కంఠస్వరమున మాధుర్య ముండుటవలన. కాకికూడ అట్టి ఆనందముతోనేగదా పాడును! దాని గానము మనకేల రుచింపదు?

కవి నిర్జనారణ్య ప్రదేశమున కూర్చుండి తన యిచ్చ వచ్చినట్లు పాడుకొనిన చిక్కేమియులేదు. ఏనీతియు, నియమము అవసరములేదు. తానేతుమ్మి తానేదీవించుకొనవచ్చును. కాని, కవి మానవ సంఘములో నొక వ్యక్తిగనుండి, తన కావ్యవస్తువు మానవసంఘము నాశ్రయించి యుండునెడల, తానెట్లు నిర్బాధ్యముగ పాడుకొనఁగలడు?

ఈవాదమునందు అనుభవ వ్యతిరేకమైన అసత్యము ఒకటికలదు. కవి ఆనందముపట్టలేక పాడుకొనునా? కవి రచించునప్పుడు తన మనస్సులోనుండు ఒత్తిడిని ఆనంద మనవచ్చునా? లేక వేదన యనవచ్చునా? మనస్సు తొక్కలు విప్పుకొనినిదే (mental relaxation కలుగనిదే) ఆనందము జనింపదు. రచనా సమయమున కవి మనస్సు చక్కగ శ్రుతి చేయఁబడిన వీణాతంత్రివలె బిరబిగిసికొని యుండును; ఏ మాత్రము తగిలినను తెగును; ఆసమయమున నెవ్వఁడైన పిలిచినయెడల అమాంతముగ వానిపైనఁబడి గొంతు నులిమి వేయవలయునను కోపము పుట్టును. ఒకప్పుడు మంచముపై కూర్చుండి వ్రాయుచున్నామా? లేక క్రిందకూర్చుండి మంచముపై నోటుబుక్కు పెట్టుకొని వ్రాయుచున్నామా? యను జ్ఞానముకూడ నుండదు. కలలో పద్యములు, నిదుర మేలుకొనునపుడు పెదవులపై పద్యములు, రేయుంబవళ్ళు నాలు

గ్రైదు దినములవఱకు ఏకధారగా ఆవరించియుండు ఇటువంటి యున్మాదావస్థను, సూక్ష్మ మానసిక ప్రళయమును ఆనంద మందుమా? బాధయందుమా? ప్రసవవేదనపడుచుండు తల్లిని చూచి, "ఈమె యెంత ఆనంద మనుభవించుచున్నది!" అని తలంచువా రుందురా? ప్రసవించిన తదుపరి తల్లి బిడ్డను చూచుకొన్నపుడు ఆనందమనుభవించును. ప్రాసెస్ ఎప్పటికి ఆనందకరముగ నుండదు. ప్రాసెస్‌ను రిజల్టును కలగుమ్మటం చేయుటవలన ఈభ్రాంతి కలుగుచున్నది.

మానవావస్థానుకృతి అభినయము. అభినయము ప్రధానముగా గలది నాట్యము. నాటక రచయిత ప్రకృతిని యథాతథముగ అనుకరింపడు. సామాన్యముగ మానవ జీవితమునందు సంభవించు ప్రతిసంఘటనమూ, ప్రతివిషయము కళయందు మూర్తీభవింపజేయుటకు తగినంత ముఖ్యమైనదిగను, ఆవశ్యకమైనదిగ నుండదు. ప్రకృతిపరిపాలనమునందు శక్తి అనవసరముగ వ్యయింపబడుచుండును. కవి కళాదృష్టితో అనావశ్యకములైన వివరములు వదలిపెట్టి, ఏర్చికూర్చి, చేర్చితీర్చి, కొన్ని సంవత్సరముల కాలపరిమితిగల కథను మూడు నాలుగు గంటలలో ముగియు నాటకముగ నిర్మించును. ప్రకృతి అంతగ పాటింపని పొదుపును కవి జాగరూకతతో అభ్యసించును. కొంచెమించుమించు నాటకము ప్రకృతియొక్క యుత్తమ పునర్నిర్మాణమని చెప్పవచ్చును.

"అద్దములోవలె ప్రకృతిని (నాటకములందు) ప్రతిఫలింపజేయుట" అను పేక్స్పియరు సూక్తికి మెఱుంగుపెట్టి

నట్లుగను, వాఖ్యాన ప్రాయముగను పరాసు మహాకవి అద్భుత నవలా రచయిత విక్టరు హ్యూగో ఇట్లు వ్రాసెను :

"It seems to us that someone has already said that the drama is a mirror wherein nature is reflected. But if it be an ordinary mirror, a smooth and polished surface, it will give only a dull image of objects with no relief, faithful but colourless; everyone knows that colour and light are lost in a simple reflection. The drama, therefore, must be a concentrating mirror, which, instead of weakening, concentrates and condenses the coloured rays, which makes a mere gleam a light, and of a light a flame. Then only is the drama acknowledged by art."

నాటకవస్తువు పౌరాణికమైనను, చారిత్రకమైనను, సాంఘికమైనను కవి తన భావనాగ్నిచేత కరగించి పరిశుద్ధము చేసి, కల్పనాశక్తియను అచ్చులో అసామాన్యమూర్తిని తయారుచేయును. ఈమూర్తి ప్రకృతికంటె భిన్నముగనున్నను, దానికి వ్యతిరేకముగ నుండదు. ఇట్లనుటచేత కథను తమ కల్పనకు అనుకూలముగ మార్చనలసిన ఆవశ్యకము కవికి కలదు. కార్యకారణ సంబంధము నాటకమున పరిస్ఫుట ముగనో, వ్యంగ్యముగనో గోచరింపవలయును; ఏదియును కారణరహితముగ సంభవింపఁగూడదు. కావున, కవి ఆది మధ్యాంతములుగల నాటకమును సృజించునప్పుడు, కథలో నెన్నియో మార్పులు చేయనలసియుండును. కవి చేతి కావ్యవస్తువు ప్రతిమాకారుని చేతి బంకమట్టి వంటిది.

ఈవిషయమును ఎడ్‌గార్ యూలఁపో అను అమెరికా కవీంద్రుఁడు ఇట్లు చెప్పియున్నాఁడు:

"In the hands of the true artist the theme is but a mass of clay, of which anything may be fashioned at will or according to the skill of the workman. The clay is, in fact, the slave of the artist. It belongs to him."

రామాయణము, మహాభారతము ప్రసిద్ధములైన కావ్యేతిహాస గ్రంథములు. ఇవి చారిత్రకములని విశ్వసించువారు అప్పటికిని ఇప్పటికిని గలరు. అట్టికథల తీసికొని నాటకములు రచించిన భాసుఁడు, కాళిదాసు, భవభూతి, భట్ట నారాయణుఁడు మున్నగు కవులు మూలకథలను ఎట్లు మార్చి నదియు మన మెఱుంగుదుము. షేక్స్పియరు తాను రచించిన చారిత్రక నాటకములోని పాత్రలను యథార్థచారిత్రక పురుషులకంటె భిన్నమైన స్వభావశీలములు గలవారినిగ చిత్రించెను. ఇది ఆవశ్యకమైన యొక శిల్పలక్షణము. తెల్లని కాగితముపై నల్లనిగీఁతయు నల్లని కాగితముపై తెల్లని గీఁతయు గీచిన స్ఫుటముగ నగపడును. ఏకవర్ణమయ్యేనేని రెండిటికింగల భేదము గోచరింపదు. అందువలననే కవియు చారిత్రక నాటకములందు సైతము వివిధప్రకృతులు గల వారిని ఒకచోట ప్రవర్తింపఁజేసి, స్వభావ తారతమ్యమును స్ఫురింపఁజేయును.

నాటకమునందు కథకంటెను మానవస్వభావ చిత్రణమె ముఖ్యము. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాది చిత్తవికారములు సర్వజనీనములై, సర్వ కాలీన

మ్మలై, మానవసంఘమ్మపై నధికారము సల్పుచుండును. అట్టి మానవ స్వభావ శీలములను, మానసిక రహస్యములను కవి నాటకరంగమున మూర్తీభవింపఁజేసి సామాజికులను ఆనందపరవశులఁ గావింపవచ్చును.

"Poetical works belong to the domain of our permanent passions; let them interest these, the voice of all subordinate claims is at once silenced."

అని శాశ్వతములగు మనోవికారముల ప్రాముఖ్యమును మ్యాథ్యూ ఆర్నాల్డు కవి వివరించెను.

ఒకప్పుడు ఫ్రెంచినాటక రచయిత యగు మోలియర్ కవిని విమర్శకులు, "నీ నాటకములు లక్షణవిరుద్ధములఁ"ని తూలనాడిరఁట. అందుకు "సామాజికులను సంతోషపెట్టుటకు ఏ నాటకలక్షణము లావశ్యకములో అంతకన్న భిన్నములైన లక్షణములతో నాకేమిపని?" అని ఆయన జవాబు చెప్పెనఁట! నాట్యకళా ప్రపూర్ణుఁడగు బళ్ళారి టి. రాఘవాచార్యులవారు ఒకయుత్తరమున, "నేను నాటకమును సామాజికుల దృష్టితో చదివెదను." అని వ్రాసియుండిరి. నాటకయోగ్యతను ఒరయుటకు ఇంతకన్న శ్రేష్ఠమైన నికషోపలము మఱియొకటి యుండదని నా యుద్దేశము.

చరిత్రయొక్కయు, నాటకము యొక్కయు ఉద్దేశములు ప్రయోజనములు వేఱు; చరిత్ర జరిగినది జరిగినట్లుగ చెప్పును. జరిగిన దన్నంతమాత్రమునచే సకల సబ్బండును చరిత్రకారుఁడు గ్రంథస్థము చేయును. మంచిచెడ్డల ననుసరించి అతఁడు విషయములను ఏర్పఱచకూడదు. ఎంతవఱకు

జరిగియుండవచ్చునో, ఎట్లు జరిగియుండిన చిత్తాకర్షకముగ నుండునో దాని నూహించి కవి కావ్యమును వ్రాయును. చారిత్రకవిషయము సైతము కవితాస్పర్శచేత రూపాంతరము పొందును. ఇట్లు వారిరువురి మార్గములు భిన్నమైయుండగా కవి చరిత్రకారుఁడు కానందుకు మనమేల యాతనిని ఎత్తి పొడువవలయును?

మనము నాటకశాలకు పోవునది పురాణములు, చరిత్రములు నేర్చుకొనుటకు కాదు. రెండుమూడు గంటలకాలము నిరపాయకరమగు నానందము ననుభవించుటకు. చారిత్రక విషయములు తెలుసికొనవలయునన్న అందుకు తగిన గ్రంథములు గలవు. ప్రతాపరుద్రీయములోని కథ చారిత్రకము కానందువలన అది ప్రదర్శింపఁబడినప్పుడు సామాజికుల ఆనందమున కేమైన కొఱతయుండునా? వీరగాఁడు, యుగంధరుఁడు చారిత్రక పురుషులు కాకపోయినను వారిచేష్టలు, మాటలు మనకు సంతోషము గల్గించును.

చౌదరిగారు ఢిల్లీ యెక్కడ, గంగ యెక్కడ? అని ప్రశ్నించినారు. నాటక ప్రపంచమును యథార్థ ప్రపంచ దృష్టితో చూడఁజనదు. నాటకము కొన్ని కవి సమయముల కును కళానియమములకును లోఁబడియున్న అనన్య పరతంత్రమైన సృష్టి. చిత్రకారుఁడు గోడపై తెలుపు, నలుపు రంగులతో లిఖించినచిత్రము చదునుగా (Flat surface) నుండినను, వెలుఁగు నీడలవలన మిట్టపల్లములను స్ఫురింపఁ జేయును. నల్లగానుండుచోటు పల్లము, తెల్లగానుండుచోటు మిట్ట అను చిత్రసమయమును మన మంగీకరించి యున్నాము.

ఏలయన, చదునుగానుండు తలమున మిట్ట పల్లములు చూపుట అసంభవముగాన, విధిలేక కొన్ని సంకేతములను అంగీకరించితిమి.

అట్లే నాటకములందుఁగూడ కొన్ని సంకేతములు, సమయములు రూఢియైనవి. నాటకప్రపంచమున కాలము స్థలము సంకుచితమై యుండును. అచ్చట మన భావము సంచరించువఱకు అందలి పరిస్థితులు స్వాభావికముగను, యథార్థముగను ఉండునట్లు తోఁచును. బహిఃప్రకాశము యొక్క వృద్ధిక్షీణతల ననుసరించి కంటిలోని పాప (రంధ్రము) సరియొత్తు కొనునట్లు, ప్రకరణము ననుసరించి సరియొత్తుకొను శక్తి మన భావమునకు కలదు. అందువలననే నాటక ప్రదర్శనము మనకు ఉపభోగ్య మగుచున్నది.

సునిశితమైన విమర్శకదృష్టితో నాటకము చదువునపుడు అసంభవములుగా కనఁబడునవి నాటక ప్రయోగమును చూచునప్పుడు అట్లు తోఁపవు. అప్పటి మన భావస్థితి వేఱు.

చరిత్రమును నాటకకర్త ఎంతవఱకు మార్చవచ్చును? అను విషయమును గుఱించి ఫ్రెంచి, జర్మను కవులయు, విమర్శకులయు అభిప్రాయములను ఈ క్రింద నుదాహరించు చున్నాను:—

"It is besides most commonly asked how far the poet may venture in the alterations of the true story, in order to the fitting of it for the stage. Upon which we find different opinions among both the ancient and modern critics; but my opinion is that we may do it, not only in the circumstances, but in the principal

action itself, provided he makes a very good play of it. For, as the dramatic poet does not much mind the time, because he is no chronologist, no more does he, nor the epic poet, much mind the true story because they are no historians. They take out the story so much as serves their turn and change the rest not expecting that anybody should be so ridiculous as to come to the theatre to be instructed in the truth of history".

—*Francois Hedlin's*
"The whole art of the Stage"

"In short, tragedy is not history in dialogue. History is for tragedy nothing but a storehouse of names wherewith we are used to associate certain characters. If the poet finds in history circumstances that are convenient for the adornment or individualising of his subject, well, let him use them. Only this should be counted as little a merit as the contrary is a crime....."

"The dramatic poet is no historian, he does not relate to us what was once believed to have happened, but he really produces it again, not on account of mere historical truth, but for a totally different and nobler aim. Historical accuracy is not his aim, but only the means by which he hopes to attain his aim; he wishes to delude us and touch our hearts through the delusion."

—*G. E. Lessing's*
"Dramaturgy."

ఈ యభిప్రాయములు ముఖ్యములు కావున కొంచెము దీర్ఘములైనను పూర్ణముగ నుదాహరించితిని. పఠితలు వ్యాసగత విషయములను ఆలోచించి వారివారి బుద్ధికి సూటియగు పర్యవసానము తేల్చుకొందురుగాక!

అలంకార తత్త్వము

కావ్య లక్షణములను విధించు గ్రంథములకు అలంకార గ్రంథములని యేల పేరువచ్చినది? ముఖ్యములైన రసధ్వనులుండగా అలంకారముల కేల యింత ప్రాముఖ్యమొ యాయబడినది? "తదదోషౌ శబ్దార్థౌ సుగుణా వనలంకృతి పునఃక్వాపి" అను నిర్వచనము ప్రకారము అనలంకృతములైన శబ్దార్థములకును కావ్యత్వము సిద్ధించునుగదా.

లక్షణ గ్రంథములు అలంకార గ్రంథములని పేరు పడునప్పటికి అలంకారమను పదము కటకాంగదముల వంటిదను సంకుచితార్థమున రూఢికాలేదు. ఈయర్థము వామనుని కాలమున ప్రారంభమయి మమ్మటుని కాలమునకు బాగుగ రూఢమైనది. అయినను తరువాతి వారుకూడ అలవాటువలన లక్షణ గ్రంథములను అలంకార గ్రంథములని వ్యవహరించుచుండిరి. కావ్య శోభాకరములైన హేతుగుణములన్నింటికిని అలంకారనామము సార్థకమగును.

భామహుని కాలమున, మాధుర్యము, ప్రసాదము, ఓజస్సు అను కావ్యశోభా హేతువులకు గుణములను పేరు రాలేదు. కావ్యమునకు శరీర సామ్యము తెచ్చిపెట్టిన యనంతరము సాదృశ్య పరిపూర్ణతకొఱకు, శరీరము, ఆత్మ, గుణములు, అలంకారములు మున్నగునవి పృథక్కరింపబడినవి.

కావ్యశోభాకరధర్మములు అలంకారములని దండి మతము. వామనుడు దండి యభిప్రాయము ననుసరించి యించుక మార్పుతో "కావ్యం గ్రాహ్యమలంకారాత్" అనియు "సౌందర్యమలంకారః" అనియు నిర్వచించెను. సౌందర్యము సౌందర్యాపాదక హేతువుల సమష్టి ఫలము. ఒక్క కటకాంగదములవలననే సౌందర్యము చేకూరదు

వామనుని కాలమున గుణములకు ప్రాముఖ్యము కలిగినది. అలంకారములకు ప్రత్యేకత పొడచూపినది. కావ్యమునకు శోభ నాపాదించు ధర్మములు గుణములనియు తదతిశయ హేతువులు అలంకారములనియు గుణశూన్యమైన కావ్యము అలంకారయుతమయ్యు శోభావహము కాదనియు వామనుని యభిప్రాయము.

సంస్కృతలక్షణ గ్రంథములు క్రీస్తువెనుక నాలుగైదు శతాబ్దుల మధ్య ప్రభవించి క్రమక్రమముగ వ్యాపింప జొచ్చినవి. లక్షణ గ్రంథముల అధికారము హెచ్చినవెనుక రచింపబడిన కావ్యములు చాలపరకు స్వతంత్ర రచనా విధానమును గోల్పోయి అలంకార గ్రంథములలోని లక్షణములకు ఉదాహరణ ప్రాయములైనవి.

లాక్షణికులు తార్కికులుగావున అలంకారములు వారి పృథక్కరణశక్తి ననుసరించియు, సూక్ష్మాతి సూక్ష్మ భేదగ్రహణ బుద్ధిననుసరించియు కాలక్రమమున పెచ్చు పెరిగినవి. మనము ఏ మాట మాటాడినను అది యేదో యొక యలంకారమగును. అలంకారములు శరీరముకంటే

NARLA MEMORIAL LIBRARY V.R.NARLA D.P.R.I. Acc No.

భిన్నములని వానిని తీసివేసిన అసలు కవితాతత్త్వమే అదృశ్యమగును.

భరతముని కాలమున "ఉపమా రూపకం యమకంతథా, కావ్య స్యైతేహ్యలంకారాశ్చ త్వారఃి పరికీర్తితాఃి" అను ప్రమాణము ననుసరించి ఉపమ, రూపకము, దీపకము అను మూడు అర్థాలంకారములును యమకమను శబ్దాలంకారమును గుర్తింపబడినవి. రుద్రటుని కాలమున "వాస్తవ మౌపమ్య మితిశయుఃి శ్లేషఃి" అను నాలుగు అలంకారములు గుర్తింపబడినవి. తర్వాత ఉపమాలంకారము బహువికారములను పొందినది.

"ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్రభూమికా భేదాక్, రంజయతి కావ్యరంగే నృత్యంతీ తద్విధాంచేతఃి"

అలంకారములు పరిమితపదజాలముతో అపరిమిత భావచ్ఛాయలను ప్రకటించుట కేర్పడిన భావ ప్రకటన సాధనములు. వాని రమణీయతకు కారణము భావగాఢత్వము, శబలత్వము; తన్మూలమున రసత్వమును.

వాల్మీకి కాళిదాసాది మహాకవులు ఉపమాలంకారమునే విశేషముగ వాడిరి. "ఉపమా కాళిదాసస్య" అను నానుడి లోకమున గలదు. ఉపమయె అన్ని యలంకారములకు మూలకందము. అలంకారములు కావ్యశరీరమునకు భూషణములను శాస్త్రీయ సాంప్రదాయానుసారముగ వచ్చు మాటలటుండనిచ్చి, భావ ప్రకటనమునకు సంబంధించినంత వఱకు అలంకార ప్రయోజనము నారయుదము. కవి చెప్ప దలచుకొన్న భావము స్ఫుటముగ సూటిగ పఠిత హృదయ

మున ప్రవేశపెట్టుటకు ఉపమాద్యలంకారములు తోడ్పడును. కొంతసేపు తర్కించి విమర్శించి వివరించినగాని మనసునకు పట్టని విషయములు సైతము అలంకారద్వారమున సునాయాసముగ మనమున హత్తుకొనును.

" ఉప్పుకప్పురంబునొక్క పోలికనుండు
చూడఁజూడ రుచుల జాడ వేఱు;
పురుషులందు బుణ్య పురుషులు వేఱయా."

అరగంటసేపు ఉపన్యసించి వివరింపవలసిన విషయమును సాదృశ్యబలమున కవియొక వాక్యమున సాధించినాడు. భాషపొదుపునకు అలంకార మొక సాధనము,

భాషస్థూలము. భావములు సున్నితములు. ఏ భాష యంధైనను పదజాలము పరిమితము. భావచ్ఛాయలపరిమితములు. కావున పరిమితపదజాలముతో అపరిమిత భావములను ప్రకటింపవలసియున్న యెడల ఏవో కొన్ని సంకేతములు, సమయములు, శబ్దశక్తులు అక్కఅనుబట్టి సహజముగ ఉద్భవించును.

కవిత్వము భాషకు అలంకారము. కావ్యము భాషాలత పూచిన నెత్తావిపూలగుత్తి; భాషాపయోనిధి మథింపగా పైకిదేలిన అమృతకలశము. కావ్యమునందు భాషయు భావ ప్రకటనము ఉత్తమస్థితి నందియుండును. కావ్యమున కవికి లోకోత్తర భావచ్ఛాయలు ప్రకటింపవలసిన యవసరము కలదు. కాని పదజాలము పరిమితము. ఈ భాషాలోపమును పూరించుటకై కవిపడిన బాధకు ప్రతిఫలముగ ఉపమాలంకారము పుట్టినది.

ఒకడు చలినీటిని తాకె ననుకొనుడు. ఆ నీటి చల్ల దనమును గుఱించి ఆతడిట్లు చెప్పును: చల్లగా నున్నవి. ఎక్కువ చల్లగా నుండెనేని ఎక్కువ - మిక్కిలి - చాలా - యెంతో అను విశేషణములనుప యోగించును.

ఈ విశేషణములన్నియు సమానార్థకములె. తార తమ్యమంతగా స్ఫురింపదు. అయినను వాడనుభవించిన చల్ల దనమును వర్ణించుటకు ఈ విశేషణములలో నొకటియు చాలదు. అంతటవాడు లోకానుభవజ్ఞానము వలన మిక్కిలి చల్లగానుండు వస్తువు మంచుగడ్డ యొకటి యున్నదని తెలిసి కొని "ఈనీళ్ళు మంచుగడ్డవలె చల్లగా నున్నవి" అని చెప్పును. అంత కంటెను చల్లగానుండు నెడల, మంచుగడ్డ కన్న చల్లని వస్తువు నాతడెఱుగని యెడల, ఇక "చల్లని" యను పదమును సాగదీసి యుచ్చరించుచు ఆ పదార్థమును తాకినప్పుడు కలుగు ముఖవికారము నభినయించుచు "అబ్బ! యీనీళ్ళు చల్ల్ల్ల్ల్ల్లగా ఉన్నవి" అని నొక్కి చెప్పును. ఇంతటి శీతలత్వమును ప్రకటింపగల పదము భాషలో రూఢియై యున్నయెడల అతడు సాదృశ్యసహాయము పొంద వలసిన యవసరముండదు. కాని యే భాషయు ఎప్పటికిని అట్టి పరిపూర్ణత పొందజాలదు.

"అరవిందాలు గదోయి కన్నులు" అని కవియొక రమణీయవతి కన్నులను వర్ణించును. కవులు భావోద్రిక్త మానసులు. వారి దృష్టి భావరంజితము; శబలితము. అందు వలన సామాన్యులు చూడజాలని అంతర్లీనగుణసౌభాగ్య మును కవి దర్శించును. కవి ప్రకటింప దలచుకొన్న భావము

లివి:-ఆమె కన్నులు విశాలముగ నున్నవి. కనుగ్రుడ్డుకొనల నాజూకైన యెఱ్ఱారంగు కలదు. కన్నులలో జీవకాంతి తొలికాడు చున్నది. తెల్ల వెలుగు పొడచూపు చున్నది. మెత్తదనము ఆర్ద్రత్వముగలదు. ఈ భావములన్నియు కవి వర్ణింపవలయునన్న ఒక సీసపద్యము వ్రాయవలసి యుండును. ఈ భావములన్నియు స్ఫురింపజేయు ఒక్కపదము ఏ భాష లోను ఉండదు. కావున కవి తాను వర్ణింపదలచుకొన్న గుణములన్నియు అరవిందమున నున్నవని తెలిసికొని యుండుటచేతను అరవిందమునొక్క అనుభవజ్ఞానము సామాన్యముగావునను "అరవిందాలు గదోయి కన్నులు" అని సంక్షిప్త లేఖనమున (Short hand) లిఖించినట్లు ముక్త సరిగ వర్ణించెను.

ఇట్టి సంకేతముల వలన భావములు యివిడికయు భాష పొదుపును సిద్ధించును. పసుపు ఎఱుపు నీలము అను మూడు రంగులే ప్రధానములు. చిత్రకారుడు ఈమూడు రంగులను మిశ్రమము చేయుటవలన వేలకొలది వర్ణచ్ఛాయలను సృజించును. కవియున్నట్లే పరస్పర భిన్న వస్తువులలోని గుణములను మేళవించి నూత్న సృష్టిని చేయును.

కావ్య కళకు చిత్రలేఖనమునకు దగ్గరి సంబంధముండి నను వాహక భేదముల (Difference of medium) ననుసరించి వారి మార్గములు భిన్నములు. చిత్రకారుడు ఉపమానోప మేయములను మేళవించి లిఖించును. అనగా అరవిందముల లోని వైశాల్యము నిగనిగ మొదలగు రమణీయగుణములను కన్నులలో మూర్తీభవించునట్లు చిత్రించును. వేఱుగా అర

విందు పత్రములను కంటి ప్రక్కన వ్రేలాడ గట్టవలసిన యవసర ముండదు. చిత్రకారుడు రంగులు కలుపునట్లే కవి భావములను కలుపును; అట్టి భావసమ్మేళనము స్ఫురింప జేయుటకు ఉపమాద్యలంకారములను ఆశ్రయించును.

విరటుని గృహామునందు సైరంధ్రి వాలకముతోనున్న ద్రౌపదిపై కీచకుని మనసు లగ్నమైనది.

కII నా యున్నబామ దలపవ
యా యొడలీ చీర యిట్టి యేపపుజందం
బోయన్న, మదన వికృతిం
జేయుననుట యెంతయు నిషిద్ధముగాదే.

అని ఆమె యెంత వారించినను కీచకుడు వినడు. విసజాలడు. కామోద్రిక్తమానసుడైన కీచకునకు ప్రకృతిలోని రామణీయకమంతయు సైరంధ్రిగా మూర్తీభవించినట్లు కనుపట్టినది. ఈ భావగాఢత్వము, తన్మూలమున గలిగిన రసతన్మయత్వము ప్రస్ఫుటము చేయుటకు తగిన భాష కావలయును. కీచకుడు ఆమె యడుగులను చూచెను. సామాన్య భాషలో వానిని వర్ణింపవలయునన్న, అవి మెత్తగను, యెఱ్ఱగను ఉన్నవని చెప్పవచ్చును. అట్లుగాక ఒకవేళ వర్ణించువాడు సహృదయుడైన యెడల అవి "శిరీషకుసుమపేశలములు" అని వర్ణించును. ఈ మాటలేవియు కీచకుని హృదయమును ఉల్లూతలూచుచున్న ప్రగాఢ భావోద్రేకమున శతాంశమైనను ప్రకటింప లేవు. కావున కీచకుడే తన భాషతో ఆమెను వర్ణింపవలయును.

సీ॥ నెత్తమ్మిరేకుల మెత్తఁదనము దెచ్చి
యచ్చున బెట్టినట్లంద మొంది;
చక్రవాకంబుల చందంబు కొనివచ్చి
కుప్పలుచేసిన ట్లొప్పుమెరసి;
చందురుననుఁ గాంతికందేర్చికూర్చి బా
గునకు దెచ్చిన యట్లు కొమరు మిగిలి
ఆళికులంబుల కప్పుగలయంతయుఁ దెచ్చి
నారువోసిన భంగి నవక మెక్కి
అంఘ్రితలములు కుచములు నాననంబు
కచభరంబును నిట్లున్న రుచిరమూ ర్తి
అనుపమానభోగములకు నాస్పదంబు
గాదె.....

ఒక నెత్తమ్మిరేకుల మెత్తందనము చాలదు. లోకములోని నెత్తమ్మిరేకుల మెత్తందనము తెచ్చి కరువుపోసినగాని అతడు భావించిన మెత్తదనమునకు సరిపోదు. ఈ భావ ప్రగాఢత్వము ఇంతకన్న తక్కువగా చెప్పఁ బెట్లు? సామాన్యమైన మాటలు చాలనప్పుడు కవికి అలంకారమే శరణ్యమని Newman వచించెను.

(Poetry) from living thus in a world of its own, it speaks the language of dignity, emotion, and refinement. Figure is its necessary medium of communication with man; for in the feebleness of ordinary words to express its ideas, and in the absence of terms of abstract perfection the adoption of metaphorical language is the only poor means allowed it for imparting to others its intense feelings (Newman).

దుష్యంతుడు కణ్వాశ్రమ ప్రాంతమున వేటాడుచు
ఆశ్రమకురంగముపై విల్లెక్కుపెట్టు సమయమున వైఖానసు
లిట్లనిరి.

నఖలు నఖలు బాణాః సన్నిపాత్యోయ మస్మిన్
మృదుని మృగశరీరే పుష్కరాశా వివాగ్నిః ॥

రాజులు మృగయా ప్రియులు, వేట యందు కరుణా రహితులు కూడ. అట్టివారిని మృగమును చంపవద్దనిన ప్రయోజనమేమి? రాజు హృదయమున కారుణ్యము పుట్టింప వలయును. ఈ మృగము మృదువైన శరీరముగలది. బాధ కోర్వ జాలదు. బాణప్రయోగము చేయకుడు అని వైఖానసు లందుచేని రాజు సరకు చేసియుండడు. కాని మృదువైన మృగశరీరము పుష్పరాశికిని బాణము అగ్నికిని పోల్పబడినది. రాజా, నీవు జింకపై బాణము వేసిన పూలరాశిలో నిప్పు పెట్టినట్లైనమా అని వైఖానసులు చెప్పినట్లైనది. రాజునకు తన క్రూర కార్యముయొక్క ఘోరత్వము హృదయమున సూటిగా నాటినది. జింక బ్రతికినది. కపి మృదు అను విశేషణములోని సామాన్యభావముతో పుష్పరాశిలోని సుగుణములన్నియు మేళవించి అపూర్వమును హృదయంగమమునైన మార్దవమును మృగశరీరమున కాపాదింపజేసెను.

కంటి కగుపడని ఉపమేయమును అగుపడు ఉపమాన ముతో పోల్చుదుమేని భావమున కాలంబము దొరకి బోధ సులభమగును. "వాని మనస్సు కాసార జలమువలె స్వచ్ఛముగ నున్నది" మనస్సు అదృష్టము, జలము దృష్టము. ఉపమాన సహాయముచేత ఉపమేయము నూహింపగలము. ఇట్లుగాక విపరీతమయ్యేనేని ప్రయోజనముండదు. ఉపమానము ఆత్మ గుణసంయోగము వలన ఉపమేయమును శోభింప జేయునదిగ నుండవలయును.

తారకాభరిత గగనము, సముద్రము, మహోన్నత పర్వతపంక్తులు మున్నగు ప్రకృతి విశాల గభీర రమణీయ సృష్టులకు ఉపమానములు లేవు. అయినను కవులు వానిని అంతకంటెను తక్కువ రమణీయములైన వస్తువులతో సరి పోల్చియున్నారు. విశాలమైన దృశ్యమును మనస్సు ఆకళించు కొన అనుభవించలేదు. ఆ దృశ్యమునే చిత్రకారుడు పరిమిత మైన భిత్తిపై చిత్రించినప్పుడు చూచి ఆనందింతుము. ఎందు వలన? ప్రకృతి దృశ్యముయొక్క వైశాల్యము అనావశ్యకములైన వివరములు ఇందుండవు ఆవరణము సంకుచిత మగును. చిత్రము అన్ని మూలలు ఏకకాలమునచూచి ఆనందింపగలయంత పరిమితమైయుండును. కవులుకూడ కొంచెమించుమించు ఈమార్గమునే యవలంబించిరి.

" సపది ముకులితాక్షీం రుద్ర సంరంభభీత్యా
దుహితర మనుకంప్యా మద్రి రాదాయ దోర్భ్యాం
సురగజ ఇవ బిభ్రత్ పద్మినీం దంతలగ్నాం
ప్రతిపథగతి రాసీద్వేగ దీర్ఘీకృతాంగః "

రుద్రసరంభ భీతిచే కన్నుమోడ్చిన పార్వతిని హిమవంతుడు మోసికొనిపోవుటను కాళిదాస మహాకవి అద్భుతముగ వర్ణించెను. అద్రి పార్వతిని మోసికొని పోవుట ఊహించుట కష్టము.. అద్రిని సురగజమునకును మూర్ఛపోవు చున్న పార్వతిని, పెళ్ళగించుటవలన యించుకవాడి దంత లగ్నమైన శ్రీమర తీవకును పోల్చి, పరిమిత దృశ్యముగ మార్చి అనుభవింపదగిన రమణీయతను, కవి సృజించినాడు. కాని

" అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయో
నామ నగాధిరాజ:
పూర్వాపరౌ వారినిధీ విగాహ్య స్థిత: పృథివ్యా
ఇవ మానదండ:. "

ఇందు హిమవత్పర్వతమును కొలగట్టికు పోల్చుటలో కవి ఏ విధమైన సౌందర్యమును నర్థించెనో నాకు గోచరించుట లేదు—

కొన్ని సమాసములు అలంకారములు నిత్యపరిచితము లయి యొకవిధమైన తిరస్కారభావము కొల్పుచుండును. పద్మనేత్ర, లతాంగి, శంపాలతాంగి అను సమాసములు కేవలము స్త్రీ పర్యాయపదములైనవి, పద్మనేత్ర యున్నంతనే యేదోయొక స్త్రీ యని దాటిపోదుము. కాని ఒక్క క్షణమైన ఆగి ఆ నేత్రపద్మముల సౌందర్యమును మన హృదయమున చిత్రించుకొనము. కావున కవిత్వములోని సౌందర్యమును మన మనుభవింపవలసినంత యనుభవించుట లేదు.

అలంకార తత్త్వమును వానిప్రయోజనమును గుర్తెఱిగి నచో అలంకారము లావశ్యకములా కావా యను చర్చలకు దిగ నవసరము లేదు. ప్రతిభానంతులగు కవుల రచనలందు అలంకారములు ఆవశ్యకములగు చోటుల అప్రయత్నపూర్వకముగనే దొరలును.

వాల్మీకి మహాకవికి పూర్వము అలంకార గ్రంథములుండి యుండవు. క్రౌంచపక్షిశోకము హేతువుగా కవిత్వము శ్లోకరూపమున ప్రవహించినది. ఆయన యుపయోగించిన యలంకారములన్నియు భావ ప్రకటనావశ్యకతా సంభవ

ములు. అలంకారశాస్త్రములు వ్యాప్తిలోనికి వచ్చినతర్వాత కొందరు కవులు కేవలము అలంకారముల వాడిరి. నీరసము లైన వింత వింత యలంకారములు పుట్టినవి ఉపమయొక్క ప్రయోజనము విస్మృతమైనది. పిరుదులు ఇనుకతిప్పలైనవి. వక్షోజములు కొండలైనవి. కేవలము ఆకృతిని సూచించు ఉపమానము లధమములు. రానురాను ఇట్టి వర్ణనములు కవితా సంప్రదాయము లైనవి.

అలంకారములు కుయుక్తులతో నిండిన మేదో వ్యాపారములుకావు. భావ ప్రకటనా వశ్యకతయే అలంకారములకు ప్రభవము. ఇవి కటగాంగదములవలె శరీర బాహ్యాము లైన భూషణములు కావు.

తెలుగుకవితలో క్రొత్తతెన్నులు

తెలుగు కవితలో క్రొత్త తెన్నులు

[ఈ వ్యాసము రెడ్డిగారి అసంపూర్ణ రచన. సాహిత్యాభిలాషులకు వుపకరించునను వుద్దేశ్యముతో ఈ సంపుటిలో చేర్చినాము. —సం.]

పూర్వకాలమున మానవ సంఘమునందు మార్పులు చాల ఆలస్యముగ జరుగుచుండినవి. దేశములకు అన్యోన్య సంబంధము పరిమితముగా నుండుటయే దీనికి కారణమై ఉండవచ్చును. సంఘమున కలుగు మార్పులు వాఙ్మయమున కూడ కలుగుట సహజము. ఈ కాలమున పరదేశ గ్రంథ బాహుళ్యమునల్లను వార్తాపత్రికల మూలమునను మార్పులు అనతికాలమున జరుగుచున్నవి. ఈ మార్పులు అనుకూలములా? ప్రతికూలములా? అనిగాని ఆవశ్యకములా? కావా? అనిగాని యోచించుటకుకూడ తడవులేదు. సుడిగాలిలో తగులుకొన్న యెండుటాకువలె మన సంఘము గింగిరీలు కొట్టుచున్నది. పరదేశమున మోగు ప్రతిధ్వనికిని ఇచ్చట ప్రతిధ్వనులు పుట్టుచున్నవి.

జీవవిలసనము ఉన్నప్పుడు కదలిక ఉండుట స్వాభావికము. ఈ కదలిక రెండు విధములు. సోపానములను ఎక్కు కదలిక యొకటి; దిగు కదలిక మఱొకటి. మన వాఙ్మయ ప్రపంచమున నేడు జరుగుచున్న మార్పులు ఏ కదలికకు సంబంధించినవా అని నిర్ణయించుట అంత తేలికగా కనిపించుటలేదు. అయితే, కాలము మాత్రము అన్నిటిని తూర్పార పట్టును. పొల్లుగింజలు చెత్తా చెదారము గాలికి

ఎగిరిపోవును. గట్టిగింజలు మాత్రము నిలిచి ఉండును, ఇది మానవులకు కొంత సంతృప్తి.

ప్రాణములేని యంత్రమునందు ఆజ్ఞాతృణీకరణము శాసనోల్లంఘనము లేదు. ఒక్కసారి తాళము త్రిప్పిన గడియారము ఏమీ మార్పులేక 24 గంటలు నడచును. ప్రాణముకలిగిన జంతువులో ఇటువంటి యాంత్రిక ప్రవృత్తి లేదు.

నిర్బంధ విమోచనము భావదాస్య విముక్తికలిగిన ప్రథమ దశలో, స్వాతంత్ర్యము విశృంఖలత్వముగ భావింప బడును. విశృంఖలత్వము నాగరిక స్వాతంత్ర్యము కాదు. అది నయాగరా ప్రవాహ పాతమువంటి అసంయమిత శక్తి. దానిని నియమబద్ధము కావించినప్పుడే జనోపకారి యగును.

స్వాతంత్ర్యము నియమరహితమైనది కాదు. ప్రజా ప్రభుత్వము (Democracy) శాసనబాహ్యమైనది కాదు. రెంటికిని నీతులు నియమములు బాధ్యతలు కలవు.

మానవుడు బహువిధములైన భోజన పదార్థములను జీర్ణించుకొని వానికంటె భిన్నమైన తన శరీరమును పోషించు కొనునట్లే ఒక జాతికూడ ఇతరదేశ నాగరకతలలోని ఉత్తమ ధర్మములను తనలో జీర్ణింపజేసుకొని సాంఘిక శరీరమును పెంపుచేసుకొను చున్నది. తన దేహతత్త్వమునకు వికటించిన పదార్థములను వెడలగ్రక్కు చున్నది. ఒకప్పుడు ఇతర దేశములకు జాతులకు వాని పరిస్థితులకు అనువైన వెన్నో మనకు సరిపడకపోవచ్చును. ప్రతి జాతికి ఒక జాతీయ

వ్యక్తిత్వమున్నది. జాతీయ సంప్రదాయములలో వేరు నాటు కొనినదే ఏదైనను చిరకాలముండదు.

1914 వ సంవత్సరమున ప్రారంభమైన ప్రపంచ యుద్ధము ముగిసిన తర్వాత యుద్ధ విచ్ఛిన్నమైన యూరపు దేశమునందు ఎన్నో వాఙ్మయోద్యమములు, పుట్టగొడుగుల వలె పుట్టి పరిస్థితులు కొంచెము మారునప్పటికి, నశించినవి. వాని ప్రతిధ్వనులు మన దేశమునకూడ వినబడినవి.

చిత్రలేఖనమున 'కూ్యబిజం' (Cubism) అను పద్ధతి ఫ్రాన్సు దేశమున పుట్టి ఇంగ్లాండు జర్మనీలకు వ్యాపించినది. 'కూ్యబిజం' అనగా మనము చూచు ప్రతివస్తువు Cubes గా అగపడునట్లు చిత్రించుట. ఇది మన యింద్రియజ్ఞానమునకు అనుభూతికి అతీతమైనది. జగదేకమైన భావమును, సార్వజనీనానుభూతిని కవిగాని చిత్రకారుడుగాని వ్యక్తిగతమైన భావ సౌందర్యముతో మేళవించి అందరకు రుచించునట్లు ఆకృతి బద్ధము చేయగలడు. కాని తనకు మాత్రమే అనుభూతమైన దానిని ఏ కవికూడ జగదేకము చేయలేడు. ఈ కూ్యబిజము గతి కూడ అట్లే అయినది.

అస్టిగ్మాటిజం (Astigmatism) అను కంటిరోగము అందరకు లేదు. ఆ జబ్బు ఉండువారికి రస్తా హెచ్చుతగ్గులుగా కనబడును. అది రోగమని తెలియక, స్పర్శేంద్రియ జ్ఞానము కూడ లేనియెడల అట్టివానికి ప్రపంచము మిట్టపల్లములుగా కనబడును. అట్టివాడు చిత్రలేఖకుడయ్యెనేని తన చిత్రము లలో సమతలముండదు. అట్టి చిత్రములను మనము మెచ్చి

కొన జాలము. అది క్రొత్త ఉద్యమము కావచ్చు. కాని ఆ చిత్రములను మెచ్చుకొనుటకు మనకు కూడ అస్టిగ్మాటిజం అను కంటిజబ్బు రావలయును. కొన్ని ఉద్యమములు ఇటు వంటి అసామాన్య ప్రకృతులకును కాలమునకును సంబంధించినవి. Cubism, Dadaism, Futurism, Impressionism అను చిత్రలేఖన పద్ధతులు కూడ abnormal psychology కి సంబంధించినవె. యుద్ధమునందుచూచిన రక్తపాతము, ఘోరత్వము మృత్యువు ఈలాటి మార్పులకు కారణమై యుండును.

True, it is a ghostly Company: Expressionistic and cubistic shapes, the forms of Futurism, moving and caught in movement; Pictures of horror and protest which have arisen out of the great Death of the War.

జర్మనీలో ఈ చిత్రముల సంత పెట్టినప్పుడు దానిని బహిరంగపఱచుచు అధ్యక్షుడు ఇట్లు చెప్పినాడు.

Cubism, Dadaism, Futurism, Impressionism and the rest have nothing in common with our German people. For all these notions are neither old nor are they modern. They are simply the artificial stammering of people whom God has denied the boon of genuine artistic talent and given instead the gift of prating and deception. ఈలాటి విపరీత కళాచాపల్యము వారికే నచ్చలేదు. ఇక అటువంటి పరిస్థితులు లేని మనకెట్లు సంతోషము కూర్చును.

ప్రస్తుతపు మహా సంగ్రామము ముగిసిన తర్వాత కూడ శ్మశానవాటికయైన యూరపునందు విపరీతోద్యమములు పుట్టవచ్చును. ఈ యుద్ధమునందు ఇండ్లు ఆస్తులు ప్రాణములు జాతుల స్వాతంత్ర్యము నాశనమైనవి. వాఙ్మయము భగ్నము

కాలేదు. అది మాత్రము ఎందుకు భగ్నము కాకూడదు అను భావములుగల ఒక వాఙ్మయ హిట్లరు పుట్టి యూరపున ఒక విపరీతోద్యమము లేవదీయునేని దాని క్రొత్తందనము వలన మన దేశమునందుకూడ ప్రతిధ్వనులు పుట్టును. ఎద్ది ఈనినదనిన గాటకట్టివేయుమని చెప్పుటయేగదా యిప్పటి మన పరిస్థితి. జాతీయగౌరవము జాతీయ వ్యక్తిత్వము పరిస్ఫుటము కానంతవఱకు మనకీ యనుకరణ దురవస్థ తప్పదు.

అయినను, కాలప్రవాహమున మార్పులు అనివార్యములు. ఆంధ్రుల సాంఘిక జీవనమునందు వాఙ్మయమునందు కొన్ని మార్పులు కలిగినవి. వీరేశలింగంపంతులుగారు ఇంగ్లీషు రచనా మర్యాదలను తెలుగులో ప్రవేశపెట్టిరి. గురిజాడ అప్పారావుగారు గిడుగు రామమూర్తి పంతులుగారు వ్యావహారిక భాషోద్యమమునకు మూలపురుషులైరి. ఇట్టి మార్పులు నేటికాలపు తెలుగు కవితలో పొడచూపినవి. విస్మృతమైన పల్లెపదాలు మరల చెలామణియైనవి. ద్విపదకు గౌరవము కలిగినది. క్రొత్తఛందస్సులు పుట్టినవి. ఆంగ్లేయుల కావ్య మర్యాదలు ఆకృతులు మన కావ్య పద్ధతులందు కొన్ని మార్పులు కలిగించినవి. ఖండకావ్యములు ప్రముఖములైనవి. కవితావస్తువునందు మార్పు కలిగినది. నవలలు ఉపకథలు పుట్టినవి.

ఆఫీసుకు పోవునప్పుడు కోటు బూటు హ్యాటు తగిలించుకొని యింటికి వచ్చినతర్వాత ఎప్పటివలె ధోవతి తుండు గుడ్డతో ఉండినట్లే ఈ మార్పులన్నియు బాహిరములే. కవితాంత రంగమున, కవితా మూల సూత్రములలో

మార్పులు కలుగలేదు. ఏలయనగా అవి సార్వకాలీనములు. సార్వ లౌకికములు.

ఈ మూల సూత్రము లెట్టివి?

యథార్థమైన కవిత్వమునకు అనివార్యముగా ఛందస్సు అనుగతమాను.

కవి ప్రతిభయే కవితకు ప్రాణము.

కవితా ప్రయోజనము సద్యఃపర నిర్వృతి. తక్కిన ప్రయోజనములు ఆనుషంగికములు.

కవితయందు రసరామణీయకములు ప్రధానములు. తక్కినవి పోషకములు.

రసప్రతిబంధకములైన హేతువులు కావ్య దోషములు.

కవితాకళ జగదేకమైనది కావున దాని నిర్మాణ సూత్రములుకూడ జగదేకములుగ నుండును. ఈమూల సూత్రములకుకూడ ఈనాడు చేటుమూడు అనస్థ పచ్చినట్లు సూచనలగపడు చున్నవి.

రాజకీయ విషయములలో Democracy ప్రవేశించి జనసామాన్యమునకు మేలుచేసినది. అట్లే వాఙ్మయములోని కినీ ప్రవేశించినది. ఉపకారమునకంటే అపకారమే చేసినది. ఎందుచేత? రాజకీయమైన Democracy నియమబద్ధము. వాఙ్మయములోని Democracy విశృంఖలము. ఆ డెమొక్రసి తప్పత్రోవ త్రొక్కినప్పుడు అధికారముగల ప్రజా ప్రతినిధుల చేతిలో కళ్ళెమున్నది. సరియైనదారికి త్రిప్పగలరు. వాఙ్మయములోని డెమోక్రసి తప్పుదారి పట్టినప్పుడు దానిని

మరలించు కళ్ళెము చేతపట్టుకొన్న ప్రతినిధులులేరు. అందు వలన ఈ డెమొక్రసీ యింతవరకు విశృంఖలముగానే ప్రవర్తించుచున్నది.

తెలుగు కవితలో నేడుజరుగు మార్పులలో ఛందో బద్ధముకాని వచనపు తుంటలను వ్రాసి దానిని కవిత్వమని నామకరణము చేయుట ఒక పెద్దమార్పు. ఈ నావెల్టి తెలుగులో క్రొత్తగా ప్రవేశించినది. ఈ కవిత్వము వ్రాయు వారు, ఏడెనిమిదిమంది నవకవులు. మనదేశములో ఈకవిత్వము కూడ ఒక ప్రతిధ్వని. ప్రతిధ్వనులు ప్రతిఫలించిన కాంతులు సారభూతములు కావు. అనుభూతి జన్యములును కావు.

అమెరికా దేశమున Walt Whitman అను నతడు Leaves of grass అను గ్రంథమును రచించెను. దానికి Verse libre అని పేరుపెట్టినారు. అనగా Freeverse— ఛందో బద్ధముకాని పద్యము. ఈ పద్యములు అమెరికాలోకంబె ఇంగ్లాండులో ప్రజల మనస్సుల నాకర్షించినవి. కారణ మేమనగా, వానిలో ఛందస్సు లేనందువలనకాదు, అమెరికా దేశస్థుల Democratic భావములు సర్వమానవ సౌభ్రాత్రము విశాలమైన Cosmopolitanism ఆపద్యములలో అద్దమునందు ప్రతిబింబమట్లు ఇంగ్లీషువారికి గోచరించినది. ఆ భావములు అందర హృదయములను ఉద్ధరింపగల సమర్థములు. నేనా గ్రంథమును మొట్టమొదట చదివినప్పుడు ఇటువంటి మహో న్నత భావనములు ఛందోబద్ధమైయుండిన మఱెంత రమణీయ ముగా నుండెడివో యని తలంచితిని.

Walt Whitman రచించిన కొన్ని పద్యములు లయాన్వితమై ఛందోబద్ధ పద్యములకు దాదాపునకు వచ్చుచున్నవి. హృదయములోని లయను మొదలంట యెవరు కోయగలరు? ఛందస్సునందు లయపుట్టును. లేక మనసులోని లయనలన ఛందస్సు పుట్టును. లయ కృత్రిమముగా కల్పించుకొన్న కవితోపకరణముగాదు. అది సహజము. కావునే జగదేకము. ప్రపంచములోని అన్ని జాతుల భాషలలోను అక్షరబద్ధము కాని అనాగరిక భాషలందును కవిత్వము ఛందోబద్ధముగానే ఉన్నది. ఈనియమము స్వాభావికము కానియెడల జగదేకత్వము సిద్ధింపదు.

ఇప్పటి పదార్థ విజ్ఞాన శాస్త్రజ్ఞులు కూడ Radiation, matter అనియు సూక్ష్మముగా మన కంటికి కనబడు వస్తువులు కూడా bottled up radiations అనియు చెప్పుచున్నారు. ఈ radiation కాలావకాశ బద్ధములైన తరంగములుగ ప్రసరించును. ఈ అలలు లయాబద్ధములు. ఈ ప్రకృతియే లయాబద్ధము – లయసహజము. లయయొక్క శ్రుతి సుభగత్వమే ఛందస్సు.

కవితా విషయములందు మనలాక్షణికులకును యూరపియన్ విమర్శకులకును గమనింపదగిన భేదములు లేవు. Poetry is the rythmic creation of beauty అని అలన్ పో అన్నాడు. Musical thought అని కార్లయిలు చెప్పినాడు. There is something magical in rythm. It even makes us believe that the sublime lies within our reach అని జర్మను కవి గెతె లయా సౌందర్యముల సాహచర్యమును వివరించి

నాడు. ఛందస్సు యదార్థమైన కవికి ఆటంకము కాదు. సహాయకరమె. హృదయములో నేమూలనో దాగియున్న భావములు ఉద్రిక్తములయి ఉత్తేజితములయి లయాశక్తి మూలమున ఉత్పతన క్షమములు కాగలవు. 'A metrical garb has in all languages been appropriated to poetry. It is but the outward development of the music and hormony within. The verse far from being a restraint on the true poet, is the suitable index of his sense and is adopted by his free and delibarate choice' అని ఛందస్సు నకు కవి మనసులోని లయాశబ్ద సారస్యములకును గల అవినా భావ సంబంధమును Newman గారు వచించినారు.

ఛందస్సులేని పద్యము విన్నప్పుడు ఉప్పులేని చప్పిడి కూరతో అన్నము తిన్నట్లుండును. శ్రుతిరంజకత్వము అభావమగును. ఆనందదాయక హేతువులలో ఒకటి లుప్తమయి మన ఆనందము పరిపూర్ణముకాదు. ఇంకను వీలైన యెడల ఆనంద హేతువులను చేర్చుట న్యాయముగాని ఉన్న వానిని ఊడబెరుకుట సమంజసముకాదు. ఆపని చేయుటకు కవులే అవసరములేదు. ఏ అసమర్థుడు కూడ చేయవచ్చును.

రాయప్రోలు సుబ్బారావుగారు నవ్యకవులకు ప్రతి నిధిగ రమ్యాలోకమను కావ్యనియమ గ్రంథమును రచించిరి. దానిలో

ప్రాతవైనంతనే త్యజింపరు ; నవీన
మైనమాత్ర పరింపరు ; ప్రియములై స
హృదయ సేవ్యమానము లైనవెల్ల స్వీక
రించి భావాంబరమలంకరింతు రర్థి.

చిర యశఃస్థాయిగొనిన ప్రాచీన సుకవి
వాఙ్మయమునను ఆకర్షవంతమయిన
రమ్యభావకలాపముల్, శ్రావ్యమైన
శబ్దరీతి విధానముల్ సంగ్రహింత్రు.
శీలమట్టుల నౌచితి చెదరనీక
అహివిధాస అశ్లీల మనాదరించి
ప్రేమమంత్ర మహోపాసనామయులగు
నవ్యుల కుపాధియయ్యె సౌందర్యమొకటె.

ఈ గమ్యాలోకము సుబ్బారావుగారు ఉద్దేశించిన నవ్య కవుల Manifesto గా కనబడుచున్నది. శ్రీశ్రీగారు కూడ వారు ఉద్దేశించ నవకవుల పక్షమున మరొక Manifesto ప్రకటించినారు. ఇది 'ఫిడేలు రాగాలడజక్' కు Intro గా ఉన్నది. Intro అంటే Introduction; ఈ రాగాలడజక్ అనునది ఛందోబద్ధముకాని పద్యముల సంపుటి. దీనిని రచించిన కవి మావాడె. Intro లో సారాంశమేమనగా:

ఒక మాటకు ఒక అర్థం అదీ న్యాయం. కాని యీ ప్రపంచంలో చూడండి. ఒక మాటకు పది అర్థాలు. ఒక అక్షరానికే లక్ష అర్థాలు. ఇక రెండో దాన్ని ఒక అర్థానికే కోటి పదాలు. ఈ అర్థాల నిరంకుశత్వం భరించలేడు నవకవి. వ్యాకరణం మాత్రం? వాక్యానికి కర్త కర్మ క్రియలు విధిస్తారుకాదూ. వీటికి నవకవి విడాకులిస్తున్నాడు. కర్తలేకుండా ఒక క్రియమాత్రం నిరంకుశంగా విహరిస్తుంటే కొందరు కళ్లు పొడుచుకొంటున్నారు. కాని కవి సర్వతోముఖ స్వాతంత్ర్యదూత, స్వేచ్ఛాదాత. విభ్రమ విశృంఖ

లంగా షికారు పోవచ్చు. ప్రతిఫలం విచిత్ర సౌందర్యం. విచిత్రమే సౌందర్యం – సౌందర్యమే విచిత్రం.

ఛందస్సుల చండ శాసనానికికూడా కాలం వెళ్లిపోయింది. కవి హృదయంలో రాగాలపస ఎట్టి తీగలు సాగితే అదే గీతానికి ఆకారం నిర్ణయించాల. నవకవికి అనుకరణ అసహ్యం. ఇనన్నీ ఋణపడ్డాన నవకవుల తిరుగుబాటు. వారు సాధించిన ధనం ఏమైనా ఉన్నదా అని ప్రశ్నిస్తారా చదవండి ఫిడేలు రాగాలడజ్.

శ్రీశ్రీగారు ఉద్దేశించిన నవకవులు ఒకరిద్దరు తప్ప శ్రీశ్రీగారితో సహా నాకు మిత్రులు. వారి సౌజన్యముపైన నాకు నమ్మకముకలదు. ఒకవేళ వాకు "వచన పద్యాలనే దుడ్డుకర్రలతో పద్యాల నడుములు విరుగ దంతాము" అని నిరాఘాటముగా చాటినప్పటికిని వారిలో ఎవ్వరిలోను ఇటు వంటి గడుసుదనము నాకు కనిపించలేదు. అందుచేత అభిప్రాయ భేదములు నాగరకుల స్నేహమునకు భంగము కలిగించవని నానమ్మకము.

రాయప్రోలు సుబ్బారావుగారి Manifesto లో సిద్ధాంతీకరింపబడిన కొన్ని విషయములను గురించి నాకు అభిప్రాయ భేదము లున్నప్పటికిని కవితావిషయమై వారు కావించిన నిర్ణయములను గురించి నాకు భిన్నాభిప్రాయము లేదు. అవి సర్వాంగీకార పాత్రములయి సాంప్రదాయికముగ అలవాటులోనున్న నియమములె. కవిత్వమున రస రామణీయకములు ఔచిత్యము ఉండ నక్కరలేదని యెవరు చెప్పరు.

శ్రీశ్రీగారి నవకవులకంటె సుబ్బారావుగారి నవ్యకవులే తెలుగు దేశమున ఎక్కువగ నున్నారు. అందుకు వారి రచనలే సాక్ష్యులు.

శ్రీశ్రీగారి Intro లో ప్రతి వాక్యము విమర్శకు పాత్ర మగునంతటి బలహీనముగా నాకు గోచరించినది. ఒక అక్షర మునకు లక్ష అర్థములుండిన కవులకు ఏమీ యిబ్బందిలేదు. ఒక మాటకు పది పర్యాయపదములుండిన ఏమీ చిక్కు లేదు. అవి అన్నియు వాడుకలో రూఢియైనవి కావు. నానార్థ రత్నమాలను ముందు పెట్టుకొని ఏకవి కవిత్వము వ్రాయడు. పూర్వము శ్లేషకావ్యములు వ్రాయుదినములలో అట్టి నిఘంటువులు ఉపయోగపడి యుండవచ్చును. ఇప్పుడెవ్వరు శ్లేష కావ్యములు ద్వ్యర్థికావ్యములు వ్రాయటలేదు. ఆ ప్రస్తావ నయే అనవసరము.

నిఘంటువులో ఉన్నదన్న మాత్రమున కవి ఆ పద మును గ్రహింపడు. కవి గ్రహించుపదము శ్రవణ సుభగము గను తన భావము ప్రకటించునదిగను ఉండును. కావుననే తిక్కన "కావ్యంబు సరసులైన కవుల చెవులకు నెక్కినగాని నమ్మ డొందు పరిణతిగల్గు కవీశ్వరుండు" అని చెప్పెను. దీనిలో శబ్దసారళ్యము సౌకుమార్యము ధ్వనించుచున్నది. చెవికికూడ ప్రాధాన్యము. పింగళి సూరన "పాసగ ముత్తెపు సరుల్ పోహళించినలీల దమలోన దొరయు శబ్దములు గూర్చి" అని word harmony సూచించినాడు. నానార్థ నిఘంటువు లుండినందువలన, ఆంధ్ర మహాభారతము భాగ వతము మున్నగు గొప్ప గ్రంథములను రచించిన పూర్వకవు

లకుగాని నేటి కవులకుగాని ఏలాటి యిబ్బంది కలుగుట లేదు. నవకవులకు మాత్రము ఈ బాధ యెందుకు కలుగవలయును?

ఒక వేళ నవకవులు నానార్థ రత్నమాలాది నిఘంటువులు మునిసిపాలిటీవారి చెత్తదిబ్బల స్టోరు అని అనుకొను పక్షమున ఆచెత్తదిబ్బలు మనము నడచు రాజమార్గమున లేవు. వానిని వెదకుకొని పోవువారికే కనబడును. ఆ చెత్త దిబ్బల భారము ఏకవియు మోయుట లేదు. అందులో నవ కవులు తాము మోయుచున్నామనియు భరింపలేమనియు అనుకొందురేని అది వారి భ్రాంతి.

వాక్యమున కర్త కర్మ క్రియల అనుబంధానికి నవకవి విడాకు లిస్తున్నాడు. ఒక క్రియమాత్రం నిరంకుశంగా విహరిస్తే కొందరు కళ్ళు పొడుచుకోవడం ఎందుకని శ్రీశ్రీగారి ప్రశ్న. చిన్నయసూరిగారి బాలవ్యాకరణాన్ని దండిస్తామని నవకవుల ప్రతిజ్ఞ. చిన్నయసూరిగారిని విమర్శింపవలసిన భాగములు వేరేవున్నవి. అవి కర్త కర్మ క్రియలలో కాదు. ఆ పని దక్షులైన పండితులు పూర్వమే చేసియున్నారు.

మనుష్యులు అన్యోన్యము మాటలాడుకొనుటకు తమ భావములను వెల్లడి చేయుటకు భాష పుట్టినది. మనము వాక్యములతో మాటలాడుకొందుము. ఒక వాక్యమునకు కనీసము ఒక కర్త ఒక క్రియ వుండుట అవసరము. ఈ నియమము అనుభవ జన్యమైన అక్కరవలన పుట్టినది.

ఒకప్పుడు ఇద్దరు మనుష్యులు మాటలాడుకొనునప్పుడు ఒక క్రియనే ఉపయోగించవచ్చును. "ఏంరా వస్తావా?" అంటే "వస్తున్నారా" అనవచ్చు. అప్పుడు

కర్త తేలికగా ఊహించుకొనబడును. మూడవ వానిని గురించి చెప్పినప్పుడు "వస్తాడురా" అని అంటే "ఎవడురా" అని రెండవవాడు ప్రశ్నింపవలసి యుండును. "రాముడురా" అని మరల వీడు జవాబు చెప్పవలసియుండును. ఇట్టి సంశయము, కాలహరణము, ఇబ్బంది తొలగించుటకే ఒక వాక్యమున ఒక కర్త ఒక క్రియ అవసరమని చెప్పిరి. ఈ నియమము మన భాషకే కాదు. అన్ని భాషలలో నున్నది. ఈ నియమము ప్రాచీనము కాబట్టి నవీకవులకు గ్రాహ్యముకాదని చెప్పుటకు వీలులేదు. కొన్ని నియమములు మనము వదలదలచుకొన్నను అవి వదలవు. ఈ నియమమును బహిష్కరించి శ్రీశ్రీగారి కోరిక ప్రకారము ఒక్కక్రియకే యేకచ్ఛత్రాధిపత్యము కట్టిపెట్టిన యెడల మన భాష మూగ చెవిటివారి భాషయగును. ఇది క్రొత్త ఆవిష్కరణముకాదు. ఒక గొప్ప సిద్ధియుకాదు.

కవులకు భాషను పొదుపుచేయు గుణమున్నది. కవి ఎన్ని తక్కువ మాటలతో క్లిష్టాన్వయ దోషములేకుండ చెప్పగలడో అన్ని తక్కువ మాటలతో తన భావమును వెల్లడించును. అట్లు చేయలేనియెడల కవిదే దోషము. ప్రకరణమునుబట్టి కర్తనుగాని కర్మనుగాని ఊహించుకొనుట సులువైనయెడల వానిని పరిత్యజించును. "వచ్చెడువాడు ఫల్గుణుడవశ్యము గెల్తుమనంగరాదు" అని తిక్కన వ్రాసెను. గెల్తుము అను క్రియ కర్మను అపేక్షించుచున్నది. ఎవరిని గెల్తుము? పాండవులను. తిక్కన పాండవులను అని వ్రాయలేదు. ప్రకరణమునుబట్టి ఊహించుకొనవచ్చును.

పూర్వము సిద్ధమైయుండినవి చక్కగ తెలుసుకొనక పోవుటచేత నవకవులకు ఇట్టివి అపూర్వసిద్ధులుగ తోచును. ఇంతయేల? శ్రీశ్రీగారు ఎంతవరకు తమ వాదమును ఆచరణలో పెట్టగలిగిరో తెలుసుకొనుటకు వారు రచించిన intro ను ఉదాహరణముగ తీసుకొనవచ్చును. వారు తమ వాదము ప్రకారము పీఠిక యంతయు క్రియలతో నింపియుండిన ఇతరులు విమర్శింపవలసిన యవసరము ఉండియుండదు. ఏలయన ఆ భాష మనుష్యులకు అర్థముకాదు. శ్రీశ్రీగారు కూడ విభక్తి విశృంఖలముగా షికారు పోజాలనందుకు సంతోషము. విభక్తులు లేని వాక్యము అన్యోన్యసంబంధము లేని పదసమూహముగ తోచునేగాని భావము తెలుసుకొనుట దుర్లభము. తామే అనుసరింపలేని తియరీలను ఇతరులపై పారవేసి వారిని చీకాకుపెట్టుట యెందుకా అని నాచింత. అయితే దీనికొక సమర్థనమున్నది. నవకవులు, తమ కవిత్వమునకు తమకు ఏలాటి సంబంధము లేదను నమ్మకముకలవారు కావున వారి తియరీలు ఒకవంక వారి రచనలు మరొకవంక నడువవచ్చును.

"కవులు స్వాతంత్ర్య దూతలు - స్వేచ్ఛా దాతలు. నిజమే. నిరంకుశాః కవయః అనే పలుకుబడి పూర్వమునుండి వ్యాప్తిలోనున్నది. అయితే ఒక్క భేదము మాత్రము కనబడుచున్నది. పూర్వులది నియమబద్ధమైన స్వాతంత్ర్యము. మనవారిది అరాజకమైన విశృంఖలత్వము. కాళిదాసువంటి ప్రతిభాసంపన్నుడైన మహాకవికికూడ "ప్రాంశు లభ్యే ఫలే లోభా దుద్బాహురివవామనః" అని అడకువచేత తన గొప్పతనమును తెలుపుకొనగా, ఒకటిన్నర పేజి చక్కగా వ్రాయు

లేని మాబోటివారము దుడ్డుకర్ర లెత్తుకొని బయలుదేరి నడుములు విరుగదన్నామనడము, అహంభావ కవులమని కంచుగంట మ్రోగించడము — ఇదీ ఒక నావల్టీగానే కనపడుచున్నది. వారి సిద్ధులను విమర్శింతుమేని మిగులునది అహంభావమే. తక్కినది అభావమే.

నవకవికి అనుకరణ అసహ్యమని వారన్నారు. అనుకరణము నిస్సారమని అందరు ఒప్పుకొనతగిన విషయమే. కాని వీరికి మనదేశపు కవులను అనుసరించడము అనుకరించడము అసహ్యము. పరదేశ కవులనుకరించడము పరమార్థము. ఈ వచన పద్యములు Walt Whitman పద్యముల కనుకరణము కాదని యెవరు చెప్పగలరు.

ఛందస్సుల చండశాసనానికికూడా కాలం వెళ్లిపోయిందని శ్రీశ్రీగారు వ్రాసినారు. ఇది కేవలం భ్రాంతి. పది సంవత్సరములకు పూర్వము భావకవి అని అనిపించుకొనుట ఒక గౌరవము. నాడు భావకవులమని యనుకొన్నవారుకూడ నేడు ఆపేరువహించుటకు సిగ్గుపడుచున్నారు. ఇప్పుడు ఆ నావెల్టీ పోయినది. అంతే యీ నవకవుల వచనపద్యాల నావెల్టీకూడ. తెలుగుజాతి పరాయిది కానంతవరకు, తెలుగువారి హృదయమున రసజ్ఞత నశించనంతవరకు, తెలుగువారి సాంఘిక జీవన ప్రవాహమునకు గట్టుగా ఆంధ్ర మహా భారతము భాగవతము రామాయణము జీవించి ఉండునంతవరకు తెలుగు కవిత్వమునకు ఛందస్సునకు విరహము కలుగదు. ఎన్ని రాజ్యములు పుట్టిచచ్చినవి? ఎందరు రాజులు గతించినారు? ఎన్ని నాగరకతలతో మనకు సంబంధము కలిగినది?

అయినప్పటికిని ఇప్పటివఱకు తెలుగువారము తెలుగువారముగానే ఉన్నాము. భాగవతము చదివినప్పుడు ఒడలు పులకరింపని ఆంధ్రుడుండడు. భారతము విని తలయూపని తెలుగువాడుండడు. ఇవి మన జాతీయసిద్ధులు. వీనిముందు తక్కిన నాపెల్లీలు హనుమంతుని యెదుట కుప్పెగంతులు.

నారాయణబాబుగారు తాము రచించిన వచన పద్యములను ఒకతూరి వినిపించిరి. వానియందు ఈ ఫిడేలరాగాల డబ్బాలో వలెకాక, ఉన్నతములైన భావములుండినవి. ఆయనకు ఏపద్యమైనను చక్కగా చదువగల శక్తి కలదు. ఆ పద్యములందు ఒకదానితో నొకటి పొందిపొసగని లయాఖండములు (Mosaic of rythm) వినిపించినవి. ఛందస్సును త్యజించితిమంటిరే వీనిలో లయాఖండములు గోచరించుటకు కారణమేమని యంటిని. (వానిలో ద్విపద పాదములు, గీత పద్యముల తుంటలు కనబడినవి.) ఇవి ఆకాంక్షితముగ పడినవని వారనిరి.

గుడిపాటి వెంకటచలంగారు రాగాలడబ్బాపై అభిప్రాయము ఒక వచన పద్యమున వ్రాసిరి. ఆ పద్యము చదివినప్పుడు, వీరు చందోబద్ధముగవచ్చు కవిత్వమును కేవలము నవత్వముకొరకు అవయవ విచ్ఛేదము చేసియుందురని నాయూహకు తట్టినది. నాయూహ యదార్థము కాకపోవచ్చును. ఈ నిదర్శములు గమనింపుడు.

వేయి కన్నీటిచుక్కల వేడిగాను,
చెవులఘోషించి కలవరపరచగలవు,

ఇవి రెండును పరిపూర్ణముగ తేటగీతి పాదములు.

వాడిఅయినట్టి కొనగోళ్ళతోడ (నొక్కి)
చురుకుమనునట్లు పెట్టిన (పోకులాడి)

మొదటి పాదమున 'నొక్కి' అనియు రెండవ పాదమున 'పోకులాడి' అని చేర్చిన తేటగీతి పాదములగును.

నూరువెక్కిరింపులనాలికల్ (గవెలికి)
దిక్కుదిక్కుల పకపకల్ (తేజరిల్ల)

ఈ పాదములలో మొదటిదానికి 'గవెలికి' అనియు రెండవ దానికి 'తేజరిల్ల' అని చేర్చిన తేటగీతి పాదములగును.

వీరి హృదయములలో దేవుడు ప్రసాదించిన లయా శక్తి ఉన్నది. నవత్వముకొరకు సహజశక్తిని అడగద్రొక్కి పరిపూర్ణమైన ఆకారమునందు అవయవనులు భేదించి వీరు సాధించిన ఆ మహాప్రయోజనమేది? ఈ అపకారము వారికే కాదు, లోకమునకుకూడ. ఒక చిత్రమును యిరువయి తుంటలుగ కత్తిరించి చీట్లపాక్‌కీ కలిపినట్లు కలిపి మరల మేజాపై నెరిపిన ఒక అసంబద్ధమైన (dis - harmonious) చిత్రము కనబడును. ఈ విచిత్రసౌందర్యమేనా ఛందో వైకల్యమునందు వీరు ఆశించునది?

ఈ నవకవులు రచించు వచనపు తుంటలకు పద్యము లని ఎట్లు పేరువచ్చినది? జామెట్రివలన. ప్రోసు పేరాను లయిను ప్రకారము కత్తిరించి వివిధ పరిమితులుగ తుంటలు చేసి, ఒకదాని క్రింద నొకటి అతికించిన ప్రోసు, పోయిట్రీగా మారును. ఇది జామెట్రి కవిత్వము. ఈ కవిత్వమున, తిక్కన చెప్పినట్లు చెవి ప్రధానముకాదు, కన్ను ప్రధానము. ఇది తను భంగమునలన గద్యమూ కాదు, ఛందోవిరహితమై నం

దున పద్యమూ కాదు; త్రిశంకునివలె నడుమంతరమున వ్రేలాడుచు రెంటికిం జెడిన రేవడ యైనది.

ఎంతకాలమైనను తెలుగు కవిత్వమునకు ఆ వృత్తాలు ఆ సీస గీత పద్యములేనా వేరేవీ గతిలేదా యని యందు రేని, కలదని నేను మనవిచేయుచున్నాను. క్రొత్త ఛందస్సులు ఆవిష్కరించుకొని కవిత్వము వ్రాయవచ్చును. అవి శ్రవణ సుఖముగా నున్నయెడల నిలిచియుండును. ప్రస్తారము వలన ఎన్నివృత్తములు పుట్టలేదు? అవి అన్నీ మన చెవికి రుచించుటలేదు. రుచించినవి మాత్రము నిలిచియున్నవి.

ఆడినదల్లా ఆటకాదు. పాడినదల్లా పాటకాదు. శిల్పమునకు సంయమనము (restraint) అవసరము. వీనియందు అటువంటిది కన్పించదు.

శ్రీశ్రీగారు నవకవులు సాధించిన మహాసిద్ధి యని తెలుగుదేశమునకు శిఫారసుచేసిన ఈ ఫిడేలరాగాల డబ్బాను గురించి రెండు మాటలు. ఆ పుస్తకము చదివినప్పుడు నాకు కలిగిన భావమిది: యౌవన ప్రాదుర్భావ సమయమున కామోద్రిక్తుడయి "కామార్తాహి ప్రకృతికృపణా చేతనా చేతనేషు" అను కాళిదాసు సూక్తికి ఉదాహరణప్రాయుడయి వలపు పస్తులతో నవసి మతిచెడిన యువకుని ఉన్మత్త ప్రలాపములు (mad ravings) గా నాకు స్ఫురించినది. బుర్రా వేంకట సుబ్రహ్మణ్యంగారు చెప్పినట్లు ఒక్క Cleverness ఉన్నంతనే కవిత్వము కాదు.

———

అభినవాంధ్ర సాహిత్యము

[శ్రీ కొంపెల్ల జగన్నాథరావుగారి సంపాదకత్వమున వెలువడుచుండిన "ఉదయిని" పత్రికలో ఈ వ్యాసము ప్రకటింపబడినది. —సం.]

సంఘమునందును వాఙ్మయమునందును మార్పులు అనివార్యములు. అన్య నాగరకతా సంసర్గమును బాహ్య నిమిత్తమువలన మార్పులు అలక్షితముగ తలసూపుచుండును. ఒక వాఙ్మయము యొక్క బాగోగులు, మంచిచెడ్డలు తెలిసికొనవలయునన్న దానికన్న భిన్న సంప్రదాయము ననుసరించు మఱియొక వాఙ్మయముతోడి పరిచయము మనకుండవలయును. అద్వైతానస్థయందు తరతమజ్ఞానముండదు. మన దేశీయ వాఙ్మయములన్నియు ఏకసంప్రదాయ బద్ధములయి సంస్కృత వాఙ్మయమునకు ప్రతిబింబములుగ నుండినవి.

ఆంగ్లేయుల సంబంధమునలన పాశ్చాత్యనాగరకతతో మనకు పరిచయము కలిగినది. వారి వాఙ్మయము, వారి ప్రకృతి విజ్ఞానము మనదృష్టి నాకర్షించినవి. వారి పరిపాలనా పద్ధతి మనయందు స్వాతంత్ర్యేచ్ఛ పురికొల్పి జాతీయైక్యమును పెంపొందించినది. సంఘమునం దవతరించిన ఈ నూతన స్వాతంత్ర్య ప్రియత్వము రాజకీయ విషయములందే కాక వివిధ సాంఘిక చర్యలయందును తలసూపినది. కట్టు బాట్లకు లోనయి బహిర్వ్యాప్తిని కోల్పోయిన సర్జన శక్తులు నేడు సంకుచితావరణమునుండి వెలి కురికి అత్యుచిత కార్య కల్పనకు సిద్ధములైనవి. వాఙ్మయము సాంఘికజీవనముయొక్క

ప్రతిబింబమే కావున సంఘమున చెలరేగిన ఈ సంచలనము, ఈ ఆందోళనము, ఈ స్వాతంత్ర్యేచ్ఛ దానియందు మాత్ర మెట్లు ప్రకటితము కాకుండును?

ప్రబంధములలోని పచ్చి శృంగారము నేటి యభి రుచులబట్టి మొరటుగ తోచినది. అందలి శబ్దాలంకారములు, భావప్రేరకములుగాక కేవలము బుద్ధిపరిశ్రమకు వినియోగ పడు తెచ్చికోలు అర్థాలంకారములు "intellectual gymnastics" అని నిరసింపబడినవి. ఈ యసంతృప్తి ప్రతికూల వివర్శనముతోనే వ్యయమైపోక వాఙ్మయ నిర్మాణమునకు తోడ్పడినది. కందుకూరి వీరేశలింగం పంతులుగారు Vicar of Wakefield, Gulliver's Travels అను ఆంగ్లేయ నవలలను మానాగా పెట్టుకొని తెలుగు నవల రచనకు మార్గదర్శకులైరి. వారు షేక్స్పియరు నాటకములను తెనిగించిరి. నాటకములు, ప్రహసనములు, వ్యాసములు, ఖండ కావ్యములు, కనిజీవితములు వ్రాసి పంతులుగారు ఆంగ్లేయ వాఙ్మయములోని కొన్ని రచనావిధానములను, సంప్రదాయములను తెలుగులో పెలయించిరి.

వాఙ్మయ రచనలలో కలిగిన మార్పులతోపాటు భాషావిషయములందుకూడ కొంత సంచలనము ప్రారంభమైనది. గ్రాంథిక భాష కృత్రిమమనియు సహజమైన వ్యావహారిక భాషలో వ్రాయుట ఆవశ్యకమనియు గురిజాడ అప్పారావుగారు, గిడుగు రామమూర్తి పంతులుగారు తలంచి అందుకు కావలసిన మందుగుండు సామగ్రితో గ్రాంథిక భాషావాదులను ముట్టడించిరి. ఈ యుద్ధ్యమమునకు ఫలితముగ

వ్యావహారిక భాషావాదములోని సహేతుకత్వమును ఇప్పుడు అందరును అంగీకరింపక తప్పినదికాదు.

ప్రపంచ వాఙ్మయములనెల్ల జీర్ణించుకొని తన శరీరము నకు కావలసిన నెత్తురు కండలుగ మార్చుకొనుటచేతనే ఆంగ్లేయ వాఙ్మయము నేడు అపరిమితముగ వృద్ధి చెందు చున్నది. విదేశ వాఙ్మయ సంబంధము నూత్న సృష్టికి ప్రతి బంధకము కాదు. ఒకవేళ అపూర్వసృష్టి ప్రేరకము కావ చ్చును. ఇందుకు ఆంధ్రదేశమున సుమారు ముప్పది సం వత్సరములనుండి ప్రబలుచున్న అభినవ కవితోద్యమమె తగిన దార్ఢ్యము. ఆంధ్ర కవుల ప్రతిభానర్తకికి నూత్న నాట్యరంగముల నేర్పఱచిన తప్పేమి?

అప్పారావుగారి ముత్యాలసరములతో అభినవ కవితో ద్యమము ప్రారంభమయినది. సంక్షుబ్ధసాగర కల్లోలములలో గాలివీచినచ్చిల్ల కొట్టుకొని పోవుచున్న అభినవ కవితా నావకు కట్టమంచి రామలింగారెడ్డిగారు కర్ణధారులై నిలిచిరి. వారు రచించిన కవిత్వ తత్త్వవిచారమను విమర్శన గ్రంథము ఈ నవీనోద్యమమునకు మార్గదర్శకమైనది. ఈ నవయుగ కవితా ప్రభాతముయొక్క ప్రథమరోచులు రాయప్రోలు సుబ్బా రావుగారి కుటీర గవాక్షములో ప్రసరించి ఆయనను ప్రబో ధించినవి. సుబ్బారావుగారు అంతకు పూర్వమే కవిత్వ మల్లు చుండిరి. ఆయన రచించిన 'లలిత' యను ప్రథమ కావ్యము శబ్దాలంకారయుతమై పూర్వ ప్రబంధ శైలిని తలపించు చున్నను, అందే భావికవితా పరిణామముయొక్క సూచ నలు పొడకట్టుచుండినవి. ఆకాలమున నెల్లరకు పూర్వ

ప్రబంధములే పాఠ్యగ్రంథములు. అభినవ కవితకు మానా లేదు. ప్రతి కవియు సొంతమానాలు సృజించుకొనవలసి యుండెను. ఒక సంప్రదాయము కరుడుకట్టిన వెనుక వ్రాయు వారి కంతకష్టముండదు. పిఠాపురమున సుబ్బారావుగారు స్థాపించిన అభినవ కవితా గ్రంథమండలిని (లేక గ్రంథ మాలయో నాకు జ్ఞప్తిలేదు.) గుఱించిన యొక కరపత్రమును పూర్వమొకప్పుడు సి. వి. కృష్ణయ్యగారి యొద్ద నేను చూచితిని. ఆంగ్లేయ సాహిత్యములోని పేరిన తేనెగడ్డలను అభినవాంధ్ర కావ్యములలోనికి తెచ్చుట ఆ గ్రంథమండలి యుద్దేశములలో నొకటియని అందు వ్రాయబడి యుండినది. ప్రథమమున సుబ్బారావుగారి యుద్దేశ మెట్లుండినను తరువాత వారు రచించిన కావ్యములు స్వతంత్ర సృష్టులనియే చెప్ప వలయును. ఆయన వెనువెంటనే యీమార్గ మవలంబించిన వారు అబ్బూరి రామకృష్ణారావుగారు. 1915, 1916 మొదలు పింగళి లక్ష్మీకాంతం, వెంకటేశ్వరరావుగార్లు, విశ్వనాథ సత్యనారాయణగారు, వెంకటపార్వతీశ్వర కవులు, శివశంకరశాస్త్రిగారు, కృష్ణశాస్త్రిగారు మఱి యింక కొందఱు ఈ నవీనమార్గము నవలంబించిరి. తరువాత క్రమ క్రమముగ ఇప్పుడు వ్రాయుచున్న కవులందఱు కొద్ది గనో గొప్పగనో స్వతంత్రముగనే రచించుచున్నారు. వీరందఱు ఏక మార్గావలంబికులయ్యును వ్యక్తిగత శిల్ప పరిపాకము ననుసరించి రచనలలో తారతమ్యము గోచరించును.

ఈ అభినవ కవితోద్యమ ఫలితముగ నొంత ఫునరుద్ధరణము, కొంత నూతన సృష్టి కొనసాగినది. "ద్విపద కావ్యంబు ముదిలంజ...." అని తిరస్కరింపబడిన ద్విపదలు, పల్లెపదములు, ఫునర్గ్రహణ యోగ్యములైనవి. ఖండకావ్యములు, గేయములు, నవలలు, నాటకములు, ఏకాంక నాటికలు, ఉపకథలు, వ్యాసములు పుట్టినవి. ఇవి యున్నియు తెలుగువాణికి నూత్నాలంకారములె. ఈ యిరువదియైదు సంవత్సరములనుండి పుట్టిన వాఙ్మయము విమర్శించుటకు తగినంత విరివిగా నున్నది. ఏసమర్థుడైనను నిష్పక్షపాత బుద్ధితో ఈ వాఙ్మయమును విమర్శించినయెడల చాల ఉపయోగకరముగ నుండును.

అభినవ కవిత్వమును గుఱించి యిప్పుడిప్పుడే కొన్ని యాక్షేపములు, ప్రత్యుత్తరములు బయలుదేరు చున్నవి. కాని, ఆక్షేపములవలెనే ప్రత్యుత్తరములుకూడ మూక ఉమ్మడిగ నున్నవి. ఈకాలమున వ్రాయబడునదంతయు చెత్తయని తృణీకరించుట యెంత అసమంజసమో ఈ నాటి రచనలన్నియు మహోత్కృష్టములని ప్రశంసించుటకూడ నంత యవిచారమూలకమె. బాగోగులు ఒక వర్తమాన కాలమునకే సంబంధించినవి కావు. చెత్త వ్రాసినవారు పూర్వమునకూడ కలరు. అయితే ఆచెత్తకును ఘనకును నూఱులకొలది సంవత్సరముల అంతరమున్నది కావున, ఆచెత్త యంతయు క్రుళ్ళి కాలప్రవాహమున కొట్టుకొని పోయి అంతస్సారముగల యేకొన్ని కావ్యములో నిలిచినవి. ఎచ్చటనో దాగియుండిన చెత్తలు పురాతనములన్నంత

మాత్రమునకే అచ్చొత్తింపబడినవి యిప్పటికిని మనకు దొరకుచునే యున్నవి. ఈకాలమున వ్రాయబడున దంతయు బ్రతికియుండునని యెవరు చెప్పగలరు? ఈసంశయము కాలమే తీర్పగలదు. ప్రతిభావంతులగు కవులు ఏకాలమందైన నుందురు. అయితే వారిమార్గములు భిన్నములుగ నుండవచ్చును.

పోలవరపు రామబ్రహ్మముగారు 'ప్రజామిత్ర'లో ఆధునిక కవిత్వమును విమర్శించిరి. వారి విమర్శలో కొంత సత్యమున్నది. కొంత తొందరపాటు, కొంత పొరపాటుకూడ ఉన్నది. వీరికి వడ్డాది సుబ్బరాయుడుగారు మున్నగు పెద్ద కవులతో ఏలాటి తగాయిదా లేదు. రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణరావుగార్ల కావ్యములతోగూడ వీరికేలాటి యిబ్బందిలేదు. కాని యితర కవులు రచించిన కావ్యములన్నియు చెత్తలని వీరభిప్రాయపడిరి. సుబ్బారావు రామకృష్ణారావుగార్ల కావ్యములను మెచ్చుకోగలవారు తదితరులు వ్రాసినదంతయు చెత్తయని యెట్లుతలంచిరో నాకు బోధపడుటలేదు. వారి కావ్యములలో నున్న గుణములును దోషములును తక్కినవారి కావ్యములలోకూడ నున్నవి. పింగళి లక్ష్మీకాంతం వెంకటేశ్వరరావుగార్ల 'సౌందర నందనము', విశ్వనాథ సత్యనారాయణగారి 'ఆంధ్రప్రశస్తి' శివశంకరశాస్త్రిగారి 'హృదయేశ్వరి', కృష్ణశాస్త్రిగారి గీతములు, వేదుల సత్యనారాయణశాస్త్రిగారి ఖండకావ్యములు, జాషువాగారి 'ఫిర్దౌసి', నాయని సుబ్బారావుగారి మాతృ గీతములు, సుబ్బారావుగారి 'హంపీక్షేత్రము', బసవరాజు అప్పారావుగారి గేయములు, నండూరి సుబ్బారావుగారి

యెంకిపాటలు, కుందుర్తి నరసింహారావుగారి 'పంపాసరస్సు' (ఇదియొక ఖండకావ్యము), బొడ్డు బాపిరాజుగారి 'విపంచి' యేవాఙ్మయమునకైన అలంకారప్రాయములుగ నుండగలవు. మచ్చునకుగా కొందఱి కవులను, వారికావ్యములను పేర్కొంటిని. చక్కగా కవిత్వము వ్రాయగల కవులు ఇక నెందఱో నేడు ఆంధ్రదేశమున నున్నారు. ఈ రచనలన్నియు చెత్తని చెప్పుటకు రామబ్రహ్మముగారు సాహసింతురా? అట్లు సాహసింతురేని వారి యభినవ కవితా పరిచయము 1916-వ సంవత్సర పర్యంత మనియే మన మూహింపవలయును. అట్లుగానిచో వారి సహృదయత్వమును మనము శంకింపవలసియుండును.

రామబ్రహ్మముగారు చూపించిన కావ్యదోషములు నేటి కవిత్వమున కానవచ్చుచున్నవి. దురాన్వయము, క్లిష్టాన్వయము, అర్థము బోధపడని పదములకూర్పు, నిరర్థక పదాడంబరత్వము, భావప్రకటనము చక్కగా చేయలేని గజిబిజితనము, మున్నగు కావ్యదోషములు ప్రత్యేకముగ అయాకవికి సంబంధించిన రచనాలోపములే కాని అవియెల్ల అభినవకవితకు లక్షణములు కావు. కవి మనస్సులోని భావము స్ఫుటముగా ప్రకటించుటకు తగినంత తీవ్రము కాకపోవుట చేతను, భాషపై కావలసినంత ప్రభుత్వము లేకపోవుట చేతను, భావోచితమైన పదమును వెదికికొన లేకపోవుట చేతను ఇట్టిదోషములు కలుగుచుండును. స్వాతంత్ర్యము చేకూరిన వెంటనే సంప్రదాయములమీది ప్రమాణగౌరవము నశించును. అట్లు నశింపనిదే నూత్న సృష్టిని పురికొల్పు

సాహసమలవడదు. ఒకొక్కప్పుడు మనము స్వాతంత్ర్యమును దుర్వినియోగ పఱచుచుండుటయు కలదు. స్వాతంత్ర్యము దుర్వినియోగపడునను భయముతో పారతంత్ర్య మనుభవించుట భావ్యముకాదు. తప్పులుచేయనిదే యొప్పులు నేర్చుకొనము. ఒక నూత్న సంప్రదాయము కరుడుగట్టు ప్రథమదశయందు యిట్టి దోషము లుప్పతిల్లుచుండును. రవీంద్రనాథ టాగూరుగారు కవిత్వము వ్రాయ ప్రారంభించిన కాలమునాటి నూత్న సంప్రదాయముకూడ అంకురించుచుండినది. దానికి టాగూరుగారుకూడ కొంతవఱకు బాధ్యులు. ప్రథమమున వీరు వ్రాయుచుండిన బంగాళీ కవిత్వము అర్థమగుటలేదని అందఱు గోలపెట్టిరి. ఇప్పుడు మన కవిత్వమున గోచరించు దోషములు అప్పుడు ఆయన కవిత్వములో కూడ దొరలినవి. దీనిని గుఱించి తన "జీవనస్మృతి" యందు కొంత సమర్థించిరి.

ఈ సందర్భమున అభినవకవుల కష్టములను గూడ మనము గుర్తింపవలయును. వార్తాపత్రికల మూలమునను, వివిధ గ్రంథబాహుళ్యము వలనను నేడు ప్రపంచమంతటితో మనకు సంబంధమున్నది. కావున మన భావములుకూడ విరివి యైనవి. మనభాష మన భావములతోపాటు వృద్ధిపొందలేదు. "New phraseology to express new ideology" అన్నట్లు, క్రొత్తభావములను, అందలి తరతమ చ్ఛాయలను వెలిపుచ్చుటకు క్రొత్తరకపు పదముల కూర్పు ఆవశ్యకమగును. కవి యొక్క భాషాప్రభుత్వము, పదములు కూర్చు నేర్పు ఇట్టి యెడ నుపకరించును.

భాష యెప్పటికిని భావములకంటె వెనుకపడి యుండును. భావములు మాటినంత సులువుగా భాష మాటిదు. అయినను కార్యకుశలుడు కొఱముట్లులేని లోప మును ఎట్లో పూర్తిచేసికొనును. ప్రతిభావంతులగు కవులు, గ్రంథకర్తలు జన్మించి సమకాలీన భాషను తమకూర్పు నేర్పుచేత వివిధ భావ ప్రకటనార్హముగ నొనరింతురు. పదజాలము సంకుచితమయ్యున్నను కవి ఆవశ్యకమునుబట్టి ఒక యింద్రజాలమునన్ని భాషా దారిద్ర్యమును అతిక్రమించును. పూర్వమునుండియు కవులు కావ్యములలో ఉపమాద్యలంకారములను వాడుచున్నారు. భామహునికాలమున నాలుగు అలంకారములె గుర్తింపబడినవి. కాని క్రమ క్రమముగ విమర్శకుల పృథక్కరణ శక్తివలన అలంకారములు పెక్కులయి మనముర్వాయు ప్రతి వాక్యము, సమాసము, ఏదో యొక యలంకారము క్రిందికి వచ్చునట్లైనది. కాని మొట్ట మొదట ఈయలంకారముల నుపయోగించిన కవి, అవి యలంకారములని, కవితకు మెఱుగుపెట్టుటకుగా వాని నుపయోగించుచున్నానను జ్ఞానముతోకాక, తాను ప్రకటింపదలచిన భావ తీవ్రతను మొక్కవోక స్ఫురింపజేయుటకు పడిన కడగండ్లే యీ యలంకారములని నా యుద్దేశము. తాను చెప్పదలచుకొన్న భావమునకు ఉచితమైన పదము భాషలోనుండిన ఈ యుపమాద్యలంకారములకు అవసరముండదు. భాషకు సహజమైన లోపమె యీ యలంకారములకు మూలము. ఒక యుదాహరణము చూడుడు.

నఖలు నఖలు బాణః సన్నిపాత్యోఽయ మస్మిన్
మృదుని మృగశరీరే పుష్పరాశా వివాగ్నిః.

దుష్యంతుడు ఆశ్రమ మృగమును తరుముకొని వచ్చు చుండగా కణ్వాశిష్యులుచూచి దానిని రక్షింపనెంచి, "ఓ రాజా, యిది యాశ్రమ మృగము, దీనిని చంపదగ" దని చెప్పిరి. ఆశ్రమ కురంగమని బెదరు పెట్టినంతనే సార్వ భౌముడు భీతిల్లి దానిని వదలునా? దుష్యంతుడు మృగయా ప్రియుడు. వేటాడుటకొఱకే వచ్చెను. జీవహింస క్షత్రియులకు క్రొత్తదికాదు. కావున వైఖానసులు ఎట్లయిన రాజు హృద యమును కరుణార్ద్రము కావించి మృగమును రక్షింపవల యును. అట్టిచెడ "మృదువైన మృగశరీరమునందు బాణము ప్రయోగింపవలదు" అని బ్రతిమాలిరి. మృదువు అను విశే షణము బాధ నోర్చుకొనలేని కోమలత్వమును స్ఫురింప జేయునుగాని, ఎంతసుకుమారమని వైఖానసుడు చెప్పిన రాజు హృదయము ఆర్ద్రమగునో అంత సౌకుమార్యమును స్ఫురింపజేయుటకీ విశేషణము చాలదు. కావున వైఖానసుడు ఆభావ తీవ్రతను, సాంద్రతను ఇట్లు ప్రకటించెను: రాజా, నీవు మృగముపై బాణము వేయుదువేని పూలరాశిలో అగ్ని పెట్టినట్లే! పూవులు చాల పేశలములైనవి. తాకిన కండి పోవునవి. తలనిడికోదగినవి. తన ప్రేయసి ధరియించునవి. తాను ప్రణయ బహుమానముగగొన్నవి. దేవుని పూజిం చుట కర్హమైనవి. ప్రకృతిదేవీ దరహాసముల వంటివి. మనో హరములైనవి. ఇట్టి పూలకు నగ్ని రగల్చినట్లగునా! ఈ కార్యము క్రూరము ఘోరము. ఎంత కర్కశాత్ముడై

నను ఈ కార్య మొనరింపడు. ఇక సరసుడైన దుష్యంతుని మాట వేఱ చెప్పవలయునా? ఈ సాదృశ్య ప్రభావము "మృదువు" అను విశేషణము అంతకు పూర్వము స్ఫురింప జేయలేని యెన్నో భావములు ఇప్పుడు దానికి సంక్రమించినవి.

కవి గాఢమైన తన రసానుభూతిని చెక్కు చెదరనీయక పఠితల హృదయముల స్ఫురింపజేయును. భావమునకు భాష కేవలము సంజ్ఞా మాత్రమె. ఒకొక్కప్పుడు మనము భావించిన దొకటి, ప్రకటించిన దొకటిగా వేర్పడును. ఏలయన, భావము సున్నితమైనది. భాష స్థూలమైనది. కావున దీనికొక Momentum కలదు. ఇందుకు ప్రతీకారముగ భావము తీవ్రతరముకానిదే భాష భావమునకు లొంగదు. కవి యుపయోగించు సంజ్ఞలు పఠితలకుగూడ తెలిసినవిగనో తెలిసికొన తగినవిగనో యుండవలయును. పదమునకు నిఘంటువు ప్రసాదించు అర్థమునకంటె వేఱు శక్తులుకూడ కలవు. ఆ శక్తుల యన్నిటిపైనను కవి యాధారపడి తన భావమును స్ఫురింపజేయును. తన భావము ఇతరుల కెఱుకపడనియంత క్లిష్టసంజ్ఞలతో ప్రకటింపబడియున్న ఆ పద్యము మూగ చెవిటి వారల సంభాషణమునలె వ్యర్థమగును. కావ్య ప్రయోజనమందు శూన్యమగుటవలన దానికి కావ్యత్వ హానికూడ సిద్ధించును. F. T. Palgrave గారు "Golden Treasury" అను ఖండకావ్య సంపుటమునకు తాను రచించిన యుపోద్ఘాతమున నిట్లు వ్రాసియున్నారు :-

'.....that passion, colour, and originality can not atone for serious imperfections in clearness, unity or truth.' కావ్యమునకు ముఖ్యమైన గుణములలో భావ స్ఫుటత్వ మొకటి యని ఈ విమర్శకుని యభిప్రాయము.

భావములు వాచ్యములుగనె యుండవలయునా? వ్యంగ్యముగ నుండకూడదా? అని కొందఱు ప్రశ్నింపవచ్చును. భావస్ఫుటత్వము వ్యంగ్య మర్యాదకు విరోధికాదు. ప్రకరణార్థము గోచరించుచునే తదతిరిక్తమైన వేఱొక భావము స్ఫురించవచ్చును. శ్లిష్టార్థ సమన్వితములైన పద్యములను దీసికొని యవి వ్యంగ్యప్రధానములని సమర్థించుట ఇప్పుడొక యాచారమైనది. ధ్వని ప్రధానములని యెన్నబడు సంస్కృత శ్లోకములలో ప్రకరణమునకు సంబంధించిన యర్థము సులభ గ్రాహ్యముగనే యుండును.

రామబ్రహ్మముగారు బూతు కథల విమర్శించిరి. వీరికి బూతుకథలపై గలిగిన ఆగ్రహము అభినవసాహిత్యము నంతటిపై ప్రసరించి వారి విమర్శనమునకున్న విలువను తగ్గించినది. బూతుకథలు పెలువడుచుండుట యదార్థమేగాని అభినవ సారస్వతమంతయు ఈ బూతులుతప్ప మఱి యింకేమి లేదని చెప్పుట ఆ సాహిత్యముతోడి వీరి పరిచయ మెంతపాటిదో మనకు గోచరించుచున్నది. మున్నటివైనను నేటివైనను బూతులు బూతులే. నాగరకాభిరుచిగలవారికి అట్టి కథలు ఏవము పుట్టించును. అట్టి కథకులు ఏ స్త్రీలను సంస్కరించుటకు (గిరీశమువలె) ప్రయత్నించుచున్నారో ఆ స్త్రీల ఆత్మగౌరవమునకే అట్టి కథలు భంగకాములుగ నున్నవి.

కథలు వ్రాయువారందరు ఇట్టి బూతుకథలే వ్రాయుటలేదు. ఇట్టికథలు ప్రచరించుటకు రెండు, మూడు మాసపత్రికలె కంకణము కట్టుకొన్నవి.

"సుబోధిని" పత్రికయందు "నవకవులు - బూతుక వనము" అని రామబ్రహ్మముగారు రచించిన వ్యాసము, "ప్రజామిత్ర" లోని వ్యాసమునకన్న మతింత తీవ్రమై బూతుకథలలో వారికిగల పరిచయమును సార్థకపఱిచు చున్నది, నవకవులెవ్వరును బూతుకవనము వ్రాయుటలేదు. వారి కవిత్వములోని శృంగారము సభ్యముగను నాజూకైన యభిరుచిగలదిగ నుండును. కవిత్వము వ్రాయువారి సంఖ్య చాల తక్కువ. వారి కథలలోగూడ బూతులేదు. అందులో ఒక్కరు మాత్రము అట్టి కథలను వ్రాయుచుందురు. ఇక మీదనైనను రామబ్రహ్మముగారు విషయ పృథక్కరణము నందు కొంతపరిశ్రమ చేయుదురుగాక యనియు, అభినవ కావ్య సాహిత్య పరిచయము కలిగించుకొందురుగాక యనియు నా మనవి.

చిత్రలక్షణము *

[శ్రీ పి. వి, రాజమన్నారుగారి సంపాదకత్వమున వెలువడుచుండిన 'కళ' అను మాసపత్రికయందు, ఈ వ్యాసము ప్రకటింపబడినది. —సం.]

తొమ్మిది సంవత్సరములకుఁ బూర్వము బెర్తోల్డు లౌఫర్ (Berthold Laufer) అను నొక జర్మను పండితుఁడు టిబెట్ దేశపు "తాంజుర్" గ్రంథమాల నుండి "రెమొ ఈశాన్యి" లేక "చిత్రలక్షణము" అను నొక శిల్పశాస్త్రమును జర్మను అనువాదముతోడఁ బ్రకటించెను. గ్రంథము నందలి విషయమును సంక్షేపముగఁ గ్రింద వివరించుచున్నాను.

టిబెటు దేశమున బౌద్ధధర్మము ప్రతిష్ఠింపఁబడిన యనంతరము, ఆదేశపు భాషలోనికిఁ జాల సంస్కృత గ్రంథములు తర్జుమా చేయఁబడినవి; ఇట్టి పుస్తకములతోడ "కాంజుర్", "తాంజుర్" అను రెండు గొప్ప గ్రంథ మాలలు సమకూర్పఁబడినవి. ప్రస్తుతము మేము పర్యాలోచించు గ్రంథము "తాంజుర్" గ్రంథమాలలోనిది.

---

* చిత్రలక్షణమును శీర్షికతో, వంగసాహిత్యపరిషత్ పత్రికయందు రవీంద్రనారాయణ ఘోషుగారొక వ్యాసమును ప్రకటించిరి. అందలి ముఖ్య భాగమును సంకలించి రామానంద చట్టోపాధ్యాయగారు "ప్రభాని" చైత్రసంచికయందుఁ ప్రకటించిరి. దానిని "కళ" కొఱకు నేను తెనిగించితిని. —దు. రామిరెడ్డి.

పై గ్రంథమాలయొక్క సూత్రవిభాగమున 123-వ ఖండమందు నాలుగు శిల్ప శాస్త్రములు గలవు. అవి యేవన :—

(1) దశతలన్య గ్రోధపరిమండల బుద్ధ ప్రతిమా లక్షణము.

(2) సంబుద్ధభాషిత ప్రతిమాలక్షణ వివరణము.

(3) చిత్రలక్షణము.

(4) ప్రతిమా మానలక్షణము.

మరల చిత్రలక్షణము మూడధ్యాయములుగ విభ జింపఁబడి యున్నది. కడపటి యధ్యాయమునఁ బలు తెఱఁగు లైన కొలతలను గుఱించియు గ్రంథకారుఁడు వివరించి యున్నాడు. ముప్పదియారు విధముల నయనభంగుల వర్ణన మందుఁ గలదు. ఆ యధ్యాయమందె చిత్రశిల్ప పద్ధతిని గుఱించియుఁ జెప్పఁబడియున్నది. ప్రథమాధ్యాయమందుఁ జిత్రవిద్యయొక్కయుఁ జిత్రలక్షణమను గ్రంథముయొక్కయు నుత్పత్తి వర్ణింపఁబడినది. ద్వితీయాధ్యాయమునందుఁ జిత్ర విద్యయొక్క దైవిక సంబంధపుగాథ వ్రాయఁబడినది. మొదటి రెండధ్యాయముల చివర "నగ్నజిత్ కృత చిత్ర లక్షణము" అని గ్రంథ రచయిత పేరు తెల్పఁబడియున్నది.

మొట్టమొదట భూలోకమునఁ జిత్రవిద్యను సృజించి నది నగ్నజిత్తు అను నొక రాజు. పూర్వకాలమున, యశ స్వియు, ధార్మికుఁడునయి భయజిత్తు అను రాజొకడుండెను. ఒకప్పుడొక బ్రాహ్మణుఁ డాతని యొద్దకువచ్చి "నాపుత్రకుఁ

డీవేళ నకాలమరణము నొందెను; నాప్రియపుత్రకుని యమాలయమునుండి మరలఁ దెచ్చి యియ్యవలయు" నని యడిగెను. రాజు తత్క్షణమె తన యమోఘ తపఃప్రభావము చేత యమునిసమ్ముఖమునకు రప్పించి "బ్రాహ్మణ పుత్రకుని పునర్జీవునిగ నొనరింపు" మని కోరెను. యముఁడందులకు సమ్మతింపక పోవుటవలన నిరువురికి ఘోర యుద్ధముజరిగెను. తుదకు యముఁడు పరాజిత ప్రాయుఁడుకాఁగా, బ్రహ్మ యరుదెంచి వారిరువురిని సమాధానపఱచి, "నీవు బ్రాహ్మణ పుత్రకుని రూపము ననుసరించి రంగులతో నొక చిత్రపట మును లిఖింపుము". అని రాజుతోఁజెప్పెను. అందుకు సమ్మతించి రాజు చిత్రమును లిఖించెను, అంతట బ్రహ్మ యాచిత్రమును ప్రాణవంతముఁగావించి బ్రాహ్మణున కొసఁగెను.

"నీవు నేఁడేవిధముగ నగ్నజిత్తుల జయించితివో, యదే విధముగఁ జిరకాలము నగ్నజిత్తుడవగుదువుగాక" అని బ్రహ్మ రాజును దీవించెను. చిత్రకారుఁడు దేవదానవుల రూపములను జిత్రించి వారిని వశ్యము 'చేసికొనఁగలఁడు అను ఉద్దేశమె చీనా, టిబెట్ దేశముల చిత్రవిద్యల మూల తత్త్వము.

నగ్నజిత్తు రచించినదె భూలోకమునఁ బ్రథమ చిత్రము. ప్రాచీన భారతీయ గ్రంథములందుఁ గొన్ని స్థలము లలో నగ్నజిత్తు సమాచారము గోచరించుచున్నది. శకుని గాంధారుల తండ్రియగు గాంధారరాజునకు సబలుఁడనియు, నగ్నజిత్తనియుఁ బేరులుగలవు. ఆయన "ప్రహ్లాద శిష్యుఁ

ఱని " యుఁ బేరొక్కనఁబడియెను. "ప్రథమమున వేదమును యజ్ఞమును ఆవిర్భవించినవి. చైత్యనిర్మాణ మొనరించుటకుఁ జిత్రవిద్య యావశ్యకము. అందుకొఱకు చిత్రవిద్య వేద స్వరూపముగఁ బరిగణింపఁబడినది. నేనె మొట్టమొదట మానవరూపమును లిఖించితిని; నేనె మానవునికి మొట్ట మొదట నీ చిత్రలేఖనవిద్య నేర్పించితిని". అని బ్రహ్మ చెప్పెను. నగ్నజిత్తు అను శబ్దము చిత్రశిల్పి అను నర్థమున వ్యవహరింపఁబడినది. నగ్నజిత్తు విశ్వకర్మకు శిష్యుఁడు. నగ్నజిత్తు రచియించిన చిత్రలక్షణము ఆరవ శతాబ్దము నాఁటికె వ్యాప్తి చెంది యుండవలయును. ఏలనన వరాహ మిహిరుఁడు తన బృహత్సంహితయందు నగ్నజిత్తు శిల్ప మతమును రెండుచోట్ల నుదహరించెను.

చిత్రలక్షణ గ్రంథమున ముఖమండలము మూడు భాగములుగ విభాగింపఁబడి యున్నది. చిబుకము నాలు గంగుళులు; నాసిక నాలుగంగుళులు; నుదురు నాలుగంగు ళులు, ఇదిగాక చక్రవర్తులు ధరించుకొను ఉష్ణీషము అను కేశగుచ్ఛము నాలుగంగుళులు. చిత్రలక్షణము సంపూర్ణ ముగ బ్రాహ్మణ్య గ్రంథము. మహాదేవుని పలుమాఱు నుతించుటవలన, ఆ గ్రంథమును సంకలించిన యతఁడు శైవుఁడసి యనుమానింపవలసియున్నది. కాని గ్రంథ మధ్య భాగమందు బ్రహ్మకే ప్రాధాన్య మొసఁగబడి యున్నది. వైదిక యజ్ఞమందు విగ్రహములకు స్థానము లేదు. బ్రాహ్మణ్య ధర్మమునందు విగ్రహారాధన మెప్పుడు ఏ రీతిని ప్రవేశపెట్టఁ బడినది తెలిసికొనుటకు వీలుపడదు. బౌద్ధమతవ్యాప్తికిఁ

భార్యామె విగ్రహారాధనము అలవాటులో నుండినట్లు జాతక కథలు, లలితవిస్తారము మున్నగు బౌద్ధగ్రంథములందుఁ బ్రమాణములు దొరకుచున్నవి. వైదిక మంత్రములందు ఋషులు వ్యక్తపఱచిన కవిత్వశక్తినిఁజూడ వారి కల్పనా నైపుణ్యము అసామాన్యమని తెలియవచ్చుచున్నది. కాని వాస్తవ జగత్తునందు అట్టి కల్పనలను మూర్తీభవింపఁజేయుటకు వారు ప్రయత్నింపరైరి. అయినను, యజ్ఞవేదికా యూపస్తంభ నిర్మాణములందు దమ శిల్పకల్పనము, నేదోయొక రీతిగఁ గనఁబఱచిరి. చిత్రలక్షణకర్త వైదిక యజ్ఞములను గుఱించి చెప్పు సందర్భమునఁ జైత్యములను వర్ణించియున్నాఁడు. వైదిక సాహిత్యమునందుఁ జైత్యశబ్దము చాల నరుదు. మనకు బౌద్ధ చైత్యములను గుఱించియె విశేషముగఁ దెలియును. అయినను వైదిక యజ్ఞవర్ణనా సందర్భమున నొక విధమైన చైత్య చిత్ర లక్షణము మహాభారతమునందలి యాదిపర్వము యొక్క తొంబదినాలవ యధ్యాయమున మనము చూడ వచ్చును.

చిత్రలక్షణము యొక్క ద్వితీయాధ్యాయమునందు, దేవలోకమునఁ జిత్రవిద్య యుత్పత్తియైన విషయము వర్ణింపఁ బడినది. విశ్వసృష్టియైన యనంతరము దేవతలు తమ మూర్తులను దామె చిత్రించుకొనిరి. ఈ విధముగఁ బూజయు బలి విధులను ఉత్పన్నములైనవి. ప్రథమాధ్యాయమునందు, మనుష్యుఁడు స్వాభావిక స్నేహప్రీతులకు వశవర్తియయి మనుష్య చిత్రముల రచియించుట కెట్లు ప్రవృత్తుఁడాయెనో, ఆ కథ వివరింపఁబడియున్నది. విశ్వకళ్యాణము కొఱకు,

మనుష్యసమాజమునకు దేవోపాసనమార్గము సుగమ మొన రించుటకు బ్రహ్మచేఁ బ్రేరితులైన దేవతలు తమతమ మూర్తులను గల్పించుకొన్న విధానము ద్వితీయాధ్యాయమున వివరింపఁబడియున్నది.

చక్రవర్తి చిత్రలక్షణములను ఈ గ్రంథము ముఖ్యముగ బోధించుచున్నది. శిల్పరచనా పద్ధతియందును, శిల్పనియమములందును ప్రాచీన హైందవ, బౌద్ధ, జైన సంప్రదాయములకు విశేష భేదము లేవియుఁ గానరావు. గాంధార దేశమునందలి యనేక భాస్కర్య నిదర్శనములవలన అందొక ప్రాచీన చిత్రకళా సంప్రదాయముండె నని యూహింపఁ దగియున్నది. టిబెట్ దేశముయొక్క మతసంబంధమైన చిత్ర రచన గాంధార చిత్రకళకు సంబంధించిన యొక శాఖగఁ దలంపవచ్చును.

బొజ్ఞాయను ఒయూయ్-చి-ఇ-సోంగ్ అను నిరువురు చిత్రకారులు భారతీయ చిత్రశిలాదర్శనములను కొరియా, చీనా దేశములఁ బ్రవేశపెట్టిరని చీనా దేశమందొక నానుడి కలదు.

ప్రతిమలు కొలతవేయుటయందు అంగుళియె ప్రమాణముగఁ గైకొనఁబడినది. ఎవని (యే దేవత) చిత్రము లిఖింపబడునో యాతని (ఆ దేవత) అంగుళియె ప్రమాణముగఁ దీసికొనవలయును. భిన్న భిన్న పరిమాణములు గలవిగ నున్నను ఆయా చిత్రములందు అంగప్రత్యంగ పరస్పరానుగణ్యము కొఱకు నిట్టి నియమము ఉద్దేశింపఁబడినది.

చక్రవర్తి పురుషుని రూపవర్ణనము :— చక్రవర్తియైన భూపతి మేఘ ముక్తాకాశమునంబలి చంద్రునితోడఁ దుల తూగును. ఆతని శరీరము చుట్టును ప్రభామండలము చిత్రింపఁ బడవలయును. ఆతని ముఖమండలము చంద్రప్రభవలె శుభ్రమైయుండును. ఆతని భ్రూయుగళమును, గ్రీవమును, ఫాలమును అత్యంతసుందరములు. ఆతని కేశముల వర్ణము ఉజ్జ్వలముగను గోమలముగ నుండును; నాసిక యున్నతము గను చక్కగ నుండును; అధరోష్ఠములు రక్తవర్ణభూషిత ములు. ఆతని దంతములు ముక్తాఫల ధవళములు; నేత్ర ద్వయము ఆకాశమురీతి నీలమును, సుదీర్ఘవిశ్రాంతమును. ఆతని భ్రూయుగళ మధ్యప్రదేశమునఁ దేజఃపుంజము శోభించుచుండును. ఆతని శుభ్రకాయ మతిసుందరరూప ముగఁ జిత్రింపఁబడును. కర్ణద్వయము సమభావముగఁ జిత్రింపఁబడును. ఆతని కంఠము శంఖసదృశము; స్కంద ద్వయ మధ్యవర్తిస్థానము పరిస్ఫుటము; పదములు హస్త ములు పుష్కలములు; శరీరము మాంసలము, నాభిదక్షిణా వర్తనమును గంభీరమును; ఆతని శరీరము సకలప్రదేశము లందు గుండ్రముగ నుండును. మఱియు సంధిస్థలములు (కీళ్ళయుబ్బులు) దృష్టిగోచరములు కావు. ఆతని యూరు ద్వయము ఏనుగతొండమువలె గుండ్రముగ నుండును; గోళ్ళు అర్ధచంద్రాకారములు; పదతలము ఛత్రచిహ్నితము; అంగుళి పొడవుగను గుండ్రముగ నుండును. ఆతని వర్ణము చంపక పుష్పమువలె గౌరవముగ నుండును.

ఆదర్శ పురుషుల శరీరము మాంసలముగ నుండును; కాని, నరములు, కండలు, మున్నగునవి కానరావు. వక్షము సుపుష్టముగను, విశాలముగను, సమతలముగను జిత్రింపఁ బడును. చక్రవర్తులకును, లోక దేవమూర్తులకును క్రోర మీసము లుండవు. వారిని షోడశవర్ష యువకులనుగఁ జిత్రింప వలయును. వారి శరీరము సింహోదరమువలె పొడవుగను, విరివిగనుండును. ఈ సకల లక్షణములు టిబెట్ భారతీయ చిత్రములందు సామాన్యముగ గోచరించును.

చిత్రలక్షణకారుఁడు నయనములను జిత్రించుటను గుఱించి యెంత విరివిగ నుపదేశించియున్నాఁడో, అంత యెక్కుడుగ మఱియే యంగమును గుఱించియుఁ జెప్పియుండ లేదు. ఏలనన నేత్రమె భావవ్యంజనమునకుఁ బ్రధాన సహాయకారి. గ్రంథకర్త యాకారభేదముల ననుసరించి క్రింది విధమున నైదు విధములైన కన్నులను వర్ణించి యున్నాఁడు.

(1) ధనురాకృతి (2) ఉత్పల పత్రాకృతి (3) మత్స్యోదరాకృతి (4) పద్మపత్రాకృతి (5) *కపర్దాకృతి. ఈ నయనాకృతుల పరిమాణములు నిర్ణయింపఁబడినవి. ధనురాకృతి గల నేత్రము నివీలితప్రాయము, దాని విస్తృతి మూడు ♦ యవలప్రమాణము. ధనురాకృతి మొదలు క్రమముగ నొకదానికన్న నొకటి విరివియైనది. ధనురాకృతికన్న నుత్పలాకృతి పెద్దది. అన్నిటికన్నను కపర్దాకృతి పెద్దది. అది బదియవల ప్రమాణముగలది. ధ్యానముద్రాకలితులైన

---

* గవ్వయాకారము

♦ ఒకయవ యంగుళీలో మూడవభాగము

యోగుల నేత్రములు ధనురాకృతిగలవి. సాధారణుల కన్నులు ఉత్పల పత్రాకృతి నొందియుండును. భయమును క్రందనమును సూచించు కన్నులు † పద్మపత్రాకృతిగఁ జిత్రింపఁబడవలయును. యాతనాక్రోధవ్యంజకములగు నేత్రములు కపర్దాకృతిగ లిఖింపవలయును. దేవతల కన్నులు చక్కగఁ జిత్రింపఁబడిన యెడల రాజులకును బ్రజలకును మంగళము గలుగును. దేవతల నేత్రములు పాలవలె శుభ్రములుగ నుండును. స్నిగ్ధములైన నయన పల్లవములందు నేలాటి కర్కశత్వమును గోచరింపదు. నయనశోభ, పద్మ పత్ర సదృశముగను, నింద్రనీలమణి మధ్యమునఁ దరళించు చంచలకాంతిపుంజమువలె నుండును. తారకలు నల్లవిగను బెదవిగను నుండవలయును.

కన్నులకువలెఁ గనుబొమ్మలకుఁ గూడఁ బ్రకార భేదములు వివరింపఁబడియున్నవి. ప్రశాంతవ్యక్తియొక్క కనుబొమలు అర్ధచంద్రాకారముగ నుండును. క్రోధావిష్టుని కనుబొమలు ధనురాకృతి గలిగియుండును. భీతునియొక్కయు విలపించు వానియొక్కయుఁ గనుబొమలు నాసికాసంధియొద్ద నుండి ఫాలమునందు సగమువఱకు వ్యాపించియుండును.

వర్ణవిన్యాసమును గుఱించిన కొన్ని నియమములు క్రింద వివరింపఁబడుచున్నవి.

(1) రక్తవర్ణము:— ఉత్పలాకృతి నయనముల యంచులకును, అధరోష్ఠములకును (బింబఫల సదృశముగ) గోళ్ళకును, గోళ్ళ మధ్య ప్రదేశములందును (ఉత్పల నాగఫణ

† ఇచ్చట పత్రముల యాకృతియె కేవలము గ్రాహ్యము

ముల వలె) హస్తమునందును (యెఱ్ఱతామరవలె) నాలుకకును (నెత్తురువలె) పదతలమునందలి లత్తుక పూఁతకును నిర్ణయింపఁబడినది.

(2) శుక్ల వర్ణము:— దేవతల కన్నులకు (పాలవలె) దంతములకు (ముత్యములు, పద్మబీజములు, తుషారము, మల్లెపువ్వులవలె) చక్రవర్తి పరిచ్ఛదమునకు, నిర్ణయింపఁబడినది.

(3) నీలవర్ణము :— తారకలకు (ఆకాశమువలె) కేశములకు, (ఇంద్రనీలములు, భ్రమరములు, అంజనము, మయూరకంఠము, ఆకాశములవలె)

(4) కృష్ణవర్ణము:— తారకలకు నిర్ణయింపఁబడినది.

(5) జాబురాయి (పసుపు) వర్ణము :— కరనఖర ప్రసాదనములకు నిర్ణయింపఁబడినది.

(6) సువర్ణము:— చక్రవర్తుల శరీరమునకు (జాంబూనద సువర్ణము, ప్రస్ఫుటిత పద్మబీజము, చంపకములవలె).

ఈ యారువర్ణములందు ఎఱుపు, తెలుపు, నీలము, సువర్ణములకె ప్రాధాన్య మొసఁగఁబడినది.

(రుధిరోద్గారి : వైశాఖము.)

సాహిత్యములో రమ్యత

ఏ కావ్యము సహృదయుల రంజింపజేయునో ఆ కావ్యమునందు రామణీయకము తప్పనిసరిగా ఉండును. అట్లు లేనియెడల రంజకత్వమునకు హేతువుండదు. మన ఆలంకారికులలో అర్వాచీనుడైన పండితరాయలు "రమణీయార్థ ప్రతిపాదక శబ్దము కావ్యమ"ని చెప్పినట్లుగనే అమెరికా దేశపుకవి, కథకుడు ఆలన్‌పో కూడ "లయాబద్ధమైన సౌందర్యసృష్టియే కవిత్వమ"ని నిర్ణయించినాడు. కావ్యమునందు రామణీయక ముండవలెనన్న అభిప్రాయము ప్రాచ్య పాశ్చాత్య లాక్షణికులకు కవులకు సమ్మతమైయున్నది.

కావ్యసమర్పితమైన రామణీయకము ఎట్టిది? ఇదమిద్ధమని తిర్ణయించుటకు తగిన జగదేకమైన మానదండములేదు. రామణీయకము బాహిరమేకాక ఆంతరిక మనఃస్థితికి కూడ సంబంధించినది. ప్రతివ్యక్తికి అనుభవైకవేద్యముగా నుండు సౌందర్యము ఆవ్యక్తియొక్క సంస్కారము, హృదయ పరిపాకమును అనుసరించి వృద్ధిక్షీణతలను పొందును. అయినప్పటికిని స్థూలముగను, మార్గసూచకముగను కొన్ని సామాన్య లక్షణములు గోచరించకపోవు.

కవిత్వములోని రామణీయకము ఏకవస్తువుగాదు, ఏకగుణమును గాదు. వస్తుగుణములు ఉచితమైనరీతిగా సమ్మేళింపబడి, కవిప్రతిభచేత సచేతనమై ఆకృతిబద్ధమైన భావముయొక్క సమిష్టి మోహనత్వమె సౌందర్యము.

ప్రతిభావంతుడైన కవికి అపూర్వ వస్తునిర్మాణక్షమ మైన ప్రజ్ఞ ఉండును. అద్దములో బింబము ప్రతిఫలించినట్లుగా సహృదయుల హృదయములందు భావచిత్రములను ప్రతి ఫలింపజేయు వర్ణనాశక్తి కవికి స్వభావసిద్ధముగ ఉండును. ఈ శక్తి యేకవికి పరిపూర్ణముగ నుండునో ఆతడు అమర కవి. వానిది సార్వకాలీనమైన అమరకవిత.

కవి కులగురువైన కాళిదాసునందు ఇట్టి భావ చిత్ర రచనా కౌశలము పరమావధి నొందినది. మేఘసందేశ మంతయు ఇట్టి రమణీయ చిత్రముల పరంపరయేగదా! రమణీయ వస్తువు నిరంతరము సంతోషమును చేకూర్చునని కీట్సు కవి చెప్పినట్లుగా మనోహర భావచిత్రములు, దృశ్యములు, జరా మరణావస్థలు పొందక మన భావలోకముపై అధికారము చెలాయించు చుండును.

చూడండి, కాళిదాసు చిత్రించిన జింక ఎంత రమణీయముగను ప్రాణవంతముగను మనకు భావగోచరమగు చున్నదో.

గ్రీవాభంగాభిరామం ముహు రనుపతతి స్యందనే బద్ధదృష్టిః
పశ్చార్ధేన ప్రవిష్ట శ్శరపతనభియా భూయసా పూర్వకాయం
దర్భైరర్ధావలీడై ర్శ్రమవివృతముఖభ్రంశిభిః కీర్ణవర్త్మా
ప శ్యోదగ్రప్లుతత్వా ద్వ్యయతి బహుతరం స్తోక ముర్వ్యాం ప్రయాతి.

దుష్యంతుడు మృగయావినోదలాలసుడయి రథమెక్కి విల్లెక్కుపెట్టి జింకను వెన్నంటి తరుము కొనుచున్నాడు. జింక శరవేగముతో పరుగెత్తుచున్నది. అది చెంగలించి పరుగెత్తుటచేత కొంత భూమిపైన కాళ్ళానుచున్నవి.

ఎక్కువగా ఆకాశములో పోవుచున్నది. రథం కనబడినపు డెల్లా మెడతిప్పి చూచుచున్నది. శరపతన భయముచేత వెనకటి భాగము పూర్వకాయములోకి చొచ్చుకొన్నట్లుగా కనబడుచున్నది.పరుగెత్తు అలసటచేత నోరు తెరుచుకొనడము వల్ల సగం సగం కొరకిన దర్భలు అక్కడక్కడ దారిలోపడి అదిపోయిన జాడ తెలుపుచున్నవి. కవులు సౌందర్య ప్రియులు కాబట్టి దుఃఖావస్థలోకూడ కాళిదాసును ఆ జింక రమణీయ భంగిమమే ఆకర్షించినది. ఈ చిత్రము చాలా అభిరామముగా ఉన్నదని కవియే సర్టిఫికేటు ఇచ్చు కొన్నాడు.

శకుంతల సఖీసహితముగ పూలతీవలకు నీళ్ళుపోయుచు "ప్రియంవద నిర్దయముగ నాకంచెలవల్కలమును బిగించి ముడివేసినది. కొంచెము సడలించు" మని అనసూయను అడుగుచున్నది. "అనుక్షణ విజృంభమాణమైన నీ యీవ నాన్ని అడగవమ్మా" అని అనసూయ చలోక్తులాడు చున్నది. ఈమాటలకు సిగ్గుతో తలవంచుకొన్న ముద్దరాలు, శకుంతల, దుష్యంతుని కన్నులకు నిర్వాణ సామ్రాజ్యమై కనుపట్టిన శకుంతల నేటికికూడా మన కన్నులకు ఆ విధము గానే పొడకట్టుచున్నది.

క్షణే క్షణే యన్నవతా ముపైతి,
తదేవ రూపం రమణీయతాయాః

అను సూక్తికి ఉదాహరణ ప్రాయములయి ఈ దృశ్యములు మనలను మంత్రముగ్ధులను చేయుచున్నవి.

కాళిదాసుని కవితా సమ్మోహన ప్రభావమునకు చిక్కి సహానుభూతివలన తా మె దుష్యంతుల మనుకొని శకుంతల వనవిహార శృంగారము ననుభవించి, పుస్తకము మూసిన పెనుక, కలగని మేల్కొన్నవారివలె లోకము దెలిసి, దుష్యంతుడు తుమ్మెదనుగురించి అనుకొన్నట్లుగనె తామున్న దుష్యంతుని ఉద్దేశించి "కృతార్థుడవు నీవే నోయ్" అని దీర్ఘనిశ్వాసము విడిచిన పఠితలు ఎంద రుండరు?

నలకూబరసన్నిభుడైన ప్రవరాఖ్యుడు వరూధినికంట బడినాడు. ఆమె అబ్బురమొంది నయనాంబుజములు వికసించునట్లు చూచినది.

చూచి, ఝళంఝళత్కటకసూచితవేగపదారవింద యై
లేచి కుచంబులుక దురుము లేనడు మల్లలనాడ నయ్యెడక
బూచినయొక్కపోకనునుబోదియఁ జేరి విలోకనప్రభా
వీచికలం దదీయపదవీకలశాంబుధి వెల్లిగొల్పుచుక.

పెద్దన వరూధినిని ప్రతిక్షణవ్యగ్రమైన కార్య సంచలనముతో జీవత్ప్రతిమవలె మనకన్నులకు కట్టునట్లు చిత్రించినాడు. ఆమె తత్తరము ఆశ్చర్యము ఈపద్యములోని ప్రత్యక్షరములో అంకితమై ఉన్నది. తాను కన్యాత్వసహజమైన సిగ్గుగల వినయవతి యని ప్రవరాఖ్యునికి తోపవలయును. ఆయన వరూధిని సౌందర్యమును చూచి ముగ్ధుడు కావలయును. ఈ రెండుకార్యములు ఒక్కసారిగా సాధించవలయును. ఆమె ప్రక్కననున్న పోకచెట్టుపెనుక నిలుచున్నది. ఏచింత చెట్టుచాటున నిలుచున్నయెడల ఆమె సౌందర్యము ప్రవరా

ఖ్యానికి గోచరించదు. ఈ చిత్రముకూడ మన హృదయము చొచ్చుకొని వదలిపోదు. ఒక్కొక్క కావ్యము చదువుకొలదీ మన భావప్రపంచము వృద్ధిపొందుచుండును. సుందరమూర్తు లైన స్త్రీ పురుషుల జనాభాకూడ విరివిచెందుతూ ఉండును. భూమిపైన స్వర్గము స్థాపించినట్లగును.

సర్. సి. ఆర్. రెడ్డిగారు ఒక కావ్యమునకు వ్రాసిన ఉపోద్ఘాతమునందు "ప్రతిపద్యము చిత్తరువున కనుకూలించి నదిగా ఉన్నది" అని "కావ్యములో మనము చూడవలసిన నది రామణీయకమే" నని వ్రాసియున్నారు. వారు కవి యొక్క భావ చిత్రరచనాకౌశలమునకు ప్రాముఖ్యమొసగి యున్నారు. ఇట్టి నైపుణ్యము ప్రతి కవికిని వాని వాని సంస్కారపరిపాకము ననుసరించి నిర్మాణశీలమైన భావ బంధురత ననుసరించి కొద్దిగనో గొప్పగనో అలవడి యుండును.

కవి కావ్యమునందు సౌందర్యము సంపాదించుటకు హేతుభూతములైన వానిలో భావప్రకటనా విధానము ముఖ్యమైనది.

"A perfect expression is beauty. An imperfect expression is ugliness"

"నిర్దుష్టమైన భావప్రకటనము సౌందర్యమనియు, దోషయుక్తమైన భావప్రకటనము అందవికారమనియు" ఒక ఆంగ్లేయ విమర్శకుడు చెప్పియున్నాడు. పార్గ్రేవు మహాశ యుడు తాను చేకూర్చిన పద్యసంపుటమునకు వ్రాసిన ఉపో ద్ఘాతమునందు "భావప్రకటనము తేట తెల్లముగ నుండ

వలయును. అట్లులేనియెడల అపూర్వకల్పనాశ క్తి యున్నను ఆలోపమును పూరించలేదు." అని వ్రాసియున్నాడు.

భావమునకు ప్రకటనకు బింబ ప్రతిబింబ భావసంబంధము గలదు. కవి మనస్సులో ప్రస్ఫుటముగ ఏర్పడిన భావము అట్లె ప్రకటితమగును. అట్లుకాదేని అపూర్ణముగను క్లిష్టముగను ప్రకటింపబడును. మన భావములు వాచ్యముగను వ్యంగ్యముగను ప్రకటింపవచ్చును. వాచ్యమునకన్న వ్యంగ్యమే రమణీయమని అందరును ఒప్పుకొనియున్నారు. అయినను ఏ మహాకవి రచించిన కావ్యమునందు గూడ ప్రతి పద్యము ప్రతివాక్యము ధ్వని ప్రధానముగ ఉండదు. గుణము హెచ్చుకొలది రాశి తగ్గుచుండును. ప్రయత్న పూర్వకముగ శ్రమపడి వ్రాయుదుమేని శ్లేష కావ్యములవలె సహజ సౌందర్యమును కోలుపోయి హృదయాకర్షకముగ నుండదు. కొందరు ఆధునికులు భావశబ్ద క్లిష్టత్వమును ధ్వనియని పొరపడినట్లు కనుపించును. ధ్వని ప్రధానముగా నున్న పద్యమునందు, శ్లోకమునందు ప్రకృతార్థము చక్కగా బోధపడుచూ వ్యాక్యాతిశయ మయిన వేరొక భావము స్ఫురించును. ధ్వని యెప్పుడు నేల విడిచి సాముచేయదు. ధ్వనికి బీజము పద్యములోనే ఉండును.

కావ్యమునందు సౌందర్యాపాదక హేతుసామగ్రిని స్వీకరించుటయేగాక తద్భంగ హేతువులను వర్జించుటకూడ అవసరమె. దూరాన్వయము, దురన్వయము, అన్వయ కాఠిన్యము, భావక్లిష్టత్వము, అర్థముపొసగని పదముల కూర్పు, భావదారిద్ర్యమును ఆచ్ఛాదించు అనుచిత నిరర్థక

శబ్దాడంబరత మున్నగు కావ్యదోషములు భావమును అవగతము చేసికొనుటకు ప్రతిబంధకములు గావున అవి పరిహరింపదగినవి.

అనౌచిత్యము రసభంగహేతువుగాన అది ముఖ్యముగ పరిహరింప తగినది. ఔచిత్యమనగా Commonsense. లోకజ్ఞానము జీవితమునందెంత అవసరమో కావ్యమునందు కూడ ముఖ్యమె. ఆది మధ్యాంతములుగల కావ్యాకృతి యందు అంగాంగ సంయోగిత, అవయవాను రూపత్వము పరిపూర్ణతను చేకూర్చి రామణీయకమునకు సహాయకారి యగును.

కవి తన కావ్యమునందు ఇట్టి సౌందర్యోపాదక సామగ్రిని చేకూర్చి, శబ్దార్థములకు సమాన గౌరవముచూపి శ్రోత్రపేయత్వము సంతరించి రమణీయసృష్టి చేయుచున్నాడు గావున సాహిత్యములో సౌందర్యము ఘనీభవించి యుండును.

--(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో)

నేటికవిత - ప్రకృతిపూజ

ప్రకృతిని అర్చించుటలోను ప్రకృతి సౌందర్యమును అభినర్ణించుటలోను, పూర్వ కవులకును, నేటి కవులకును కొంత మార్గభేదము కనుపడుచున్నది. ప్రబంధకవులు కృత్రిమాలంకార ప్రియులు. నేటి కవులు సహజ సౌందర్య ప్రియులు. కాలానుసారముగ మానవసంఘము, దాని ఆచార వ్యవహారములు మార్పుచెందుట సహజము. సాంఘిక పరిణామము ననుసరించి దాని నాశ్రయించి బ్రతుకు కళలుకూడ మార్పు చెందుచుండును భూత భవిష్యద్వర్తమాన కాలములకు అవినాభావ సంబంధము కలదు. కావునసే యొకటి లేక మరియొకటి యుండదు.

కవులు ఏకాలమునకు సంబంధించిన వారైనను, వారి రచనావిధానము మార్పుచెందినను, వారికి లోకమే ప్రమాణము. ప్రకృతిసౌందర్య వర్ణనము మానవ స్వభావ చిత్రణము వారికి ముఖ్యమైన విషయము. ఆందువల్లనే కాబోలు ఒక ఆంగ్లేయ విమర్శకుడు "Nature is the Godess of poets' కవులకు ప్రకృతి ఆరాధ్య దేవత"యని చెప్పినాడు.

పూర్వ కవిత్వములో అసంతృప్తిచెంది నవ్య కవిత్వము వ్రాయవలయునను కోర్కె ఈనాటి కవులకు మాత్రమే సంబంధించినదికాదు. మన పూర్వులకును వారి కంటె పూర్వులున్నారు. వారికిని వారి పూర్వుల కవిత్వముపై కొంత అసంతృప్తికలిగి నవ్య కవిత్వము వ్రాయవలయునని

ప్రయత్నించియే యున్నారు. శ్రీనాథుడు తన కవిత్వమును నవ్యమని చెప్పుకొనెను. తెనాలిరామకృష్ణకవి "స్కంద పురాణ నీరనిధి కౌస్తుభమై ప్రభవించి దేవకీనందను సత్కథోద్యమము నవ్యకవిత్వ కళాకలాపమన్ కుందనమ్ము ఘటించి కడుక్రొత్తగు సొమ్మొనరించి" అని నుడివియున్నాడు. ఇచ్చట నవ్యకవిత్వ కళాకలాపము, క్రొత్తగు సొమ్ము అను మాటలు ముఖ్యముగ గమనింపతగినవి. చేమకూరు వెంకన్న తెలుగు కవిత్వమున క్రొత్తపద్ధతిని ప్రవేశపెట్టెను. ఆ రచన లోని నవ్యతను, అపూర్వతను తన సమకాలికులు మెచ్చుకొనవలసినంత మెచ్చుకొనలేదని పాప మానవ్యకవి "ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరేగదా!" అని ఆశాభంగమును వేడినిట్టూర్పుతో ప్రకటించెను. మార్పులు కోరినది నేటికాలపు కవులు మాత్రమేనని పొరపడుటవలన మన చారిత్రకదృష్టి నశించి, పూర్వకవిత్వ మన్నంతనే అసహ్యపడుట ఒక నాగరక ఆచారముగ పరిణమించినది. 1910 వ సంవత్సరము మొదలు ప్రారంభించిన నవ్య కవుల రచనలు 1935 వ సంవత్సరమునాటికే పూర్వకవిత్వముగా మారిపోయినదన్న విషయము నవ్యకవులు జ్ఞప్తిపెట్టుకొన్న యెడల పూర్వ కవిత్వమును అంతగా ద్వేషింపవలసిన అవసరముండదు. మొదటి నవ్యకవులకు పూర్వకవుల రచనలేగదా మానాలు. అభిరుచుల ననుసరించి కొందరకు తిక్కన, కొందరకు శ్రీనాథుడు, మరికొందరకు పింగళి సూరన పెద్దనలేగదా అభిమాన కవులు; తరువాత వారి వారి నైజ ప్రతిభ ననుసరించి మార్పులు చెందియుండవచ్చును.

ప్రకృతి రామణీయకము వర్ణించుటయందు పూర్వ కవులకును ఆధునికులకును దేశకాల పాత్రభేదముల ననుసరించి కొంత తారతమ్యము కొంత విభిన్నత అగపడుచున్నది. దీనికి ఆలంకారిక మతముకూడ యొక కారణమై యుండును.

రసవాదము భరతముని నాట్యశాస్త్రమున నిర్వచింపబడినది. బహుశా ప్రభవించినదనికూడ చెప్పవచ్చును. నాట్యమునందు నాయికా నాయకులు ముఖ్య పాత్రలు. తక్కినవెల్లను ఔపచారికములు. కావునే ప్రకృతి మానవ చర్యాలకు కేవలము భిత్తిమాత్ర ప్రయోజనము (Back ground) గా రెండవస్థానము నలంకరించినది. కావ్యములు కూడ క్రమ క్రమముగా ఈ పద్ధతినే అవలంబించినవి. వాని యందును మానవచర్యలే ముఖ్యములు. మానవచర్యలతో సంబంధములేని ప్రకృతివర్ణనమునకు తావులేదు. మానవ చర్యాలకు సంబంధించి, రసపోషణకు కావలసిన మాత్రము ప్రకృతివర్ణనము గ్రాహ్యమని వారి మతము. అనాగరక జాతుల చర్యలు మానవేతరములైన పశుపక్ష్యాది జంతువుల చర్యలలో రసాభాసముతప్ప రసమునకు పరిపూర్ణత చేకూరదని వారి తలంపు.

ఈ మతమును ప్రతిఘటించినవాడు ఆలంకారికులలో అభినవుడు జగన్నాథ పండితరాయలు. రమణీయార్థమును ప్రతిపాదించు శబ్దమే కావ్యమని నిర్వచించి కవితానర్తకి నాట్యరంగము సువిశాలమొనర్చి మహాకవుల రచనలకు గతికల్పించినాడు. లేక, మహాకవుల ప్రతిభను పండితరాయలు గౌరవించినాడనికూడ చెప్పవచ్చును. అట్లు కాని

యెడల, రసవాదప్రకారము కాళిదాసుని కుమారసంభవము లోని "మధుద్విరేపఃకుసుమైక పాత్రే పపౌప్రియాం స్వామను రక్తమానఃʼʼ అను శ్లోకమును, దానివంటి మరి కొన్ని రమణీయ శ్లోకములును రసాభాసమునకు దృష్టాంత ములు కాగలవు. మను చరిత్రలోని "ఏ విహంగముగన్న యెలుగించుచునుసారెʼʼ అను చక్కని సీసపద్యము రసా భాసమగును. ఇంత యెందుకు రతి ఉభయనిష్ఠము కానందు వలన మనుచరిత్రకథే రసాభాసము. లోకము ననుసరింపని శాస్త్రమెట్లున్నదేమి, మనుచరిత్ర రమణీయముగ నుండుట లేదా? కావ్యలక్షణములు కొన్ని నాట్యశాస్త్రమునుండి దిగుమతి యగుటవలన యిట్టి యిబ్బంది కలిగినది. లోకము ప్రమాణమన్న సంగతి యేమైనది.

ఆధునిక కవులు అస్వాభావికపు కట్టుబాట్లను ఉల్లం ఘించినారు గావున వారు కావించిన ప్రకృతివర్ణనములు ఒకొక్కప్పుడు నాయికా నాయక నిరపేక్షకముగాకూడ నుండును. ప్రొద్దుసొడుపులు, మునిమాపులు, సెలయేళ్ళు, వనములు, కొండలు, మేఘములు, చంద్రోదయము, అవి యివి యనవేల, రమణీయమైన బాహ్యప్రకృతి యంతయును మానవచర్యల సంబంధములేకున్నను తమంతతామె మనో హర దృశ్యములుగ నున్నవి. అవి కవికి ప్రత్యేక వర్ణనీయములు. ఇంగ్లీషువారి Lake poetry, Nature poetry ఈ తెగకు చేరినవి.

కవులు పూర్వులైనను, ఆధునికులైనను ప్రకృతిని వర్ణించుటయందు రెండుపద్ధతులను అవలంబించిరి. కవుల దృష్టికి ప్రకృతిలోని ప్రతి అణువును ప్రాణవంతముగ నగపడు చుండును. అందువలన ప్రకృతిని మానవీకరించుట, మాన వుని కష్టసుఖములతో ప్రకృతి సహానుభూతి చూపుచున్నట్లు వర్ణించుట మొదలైనవి ప్రథమ విధానము. ప్రకృతి సౌంద ర్యమును స్వాభావికముగ వర్ణించుట రెండవ విధానము. ఈ రెండు విధానములను మన కవులు, ఇంగ్లీషు కవులు సమానముగ నవలంబించిరి. మనుచరిత్రమున "తరుణి ననన్యకాంత, నతిదారుణ పుష్ప శిలీముఖ వ్యధాభర వివశాంగి నంగభవుబారికి నగ్గముచేసి క్రూరుడై యలిగె మహేసురాధము డహంకృతితోనని రోషభీషణ స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెకపాయ దీధితిన్" ఇచ్చట సూర్యునకు మానవత్వ మారోపింపబడినది. వరూ ధిని దురవస్థకు మనసు మెత్తవడి, అందుకు కారకుడైన ప్రవరాఖ్యునిపై గోసముగల్గి "వీని మొగమునైన చూడ గూడద"ని సూర్యభగవానుడు అస్తమించుచున్నట్లుగ వర్ణింపబడినది. ఒక యాధునిక కవి, తన దుఃఖమున ప్రకృతి మిత్రునివలె పాల్గొనుచున్నదని రచించెను.

చిత్రతాపంబు బాపుకో జేలగట్ల
కరిగి కూర్చుండ, మూకసహానుభూతి
పైరు తలవంచు భారంబుపంచికొన్న
ప్రాణసఖులట్లు ; కవులకు ప్రకృతితోడు.

ఆపరదిక్కాంతసైతము, అస్తమించు
అరుణబింబబుతో గన్నులవియఁజేయు
తనదు పూజారియిక్కట్లు తలచి కుంద
ఎఱ్ఱపుండాయెనో యేమొ హృదయమనగ.

ప్రకృతిని మానవీకరింపక స్వాభావికముగ వర్ణించిన రచనలు ఆధునిక కవులు చేసియున్నారు. అట్టి రచనలు పూర్వ కావ్యములందును అచ్చటచ్చట గోచరించుచున్నవి. ఆ రచనలసంఖ్య తక్కువ అనియే చెప్పవచ్చును.

రమణీయ వస్తువులు తమంత తామే వర్ణనా యోగ్యములయ్యును అవి మానవచర్యలకు భిత్తికయయి కావ్యవర్ణనములో మిళితమైనప్పుడు మరింత సుందరముగ నుండును. మానవ నాటకరంగమునకు బాహ్య ప్రకృతి పరదావంటిది. ఇందుకు వివిధ దేశములలోని మహాకవుల రచనలే సాక్ష్యము.

ఈ రహస్యమును కవులేకాక చిత్రకారులును గ్రహించిరి. వారు కొండలను, పచ్చిక బయళ్ళను, వనములను, సెలయేళ్ళను మాత్రమే చిత్రించి తృప్తిపడరు. ఆ దృశ్యమును ప్రాణవంతము చేయుటకు, మేయుచున్న ఆవునో, పూవులుకోసికొనుచున్న పిల్లనో లేక చలన శీలమైన ఏదేని జంతువునో చిత్రింతురు.

సముద్రము తరంగ సుందరమయ్యు దానిలో నొక యోడ త్రుళ్ళింతలాడుచున్నట్లు చిత్రింతురు.

ఒక పెద్ద తుపాను వీచుచున్నది. చెట్లు నిర్మూలములగుచున్నవి. ఇంటికప్పులు ఎగిరిపోవుచున్నవి. పెళ

పెళారభటులతో మేఘములు గర్జించుచున్నవి. కుండపోతగా వర్షము కురియుచున్నది. కాని ఈ భౌతిక దౌర్జన్యమునకు గురియయి నిస్సహాయుడై బాధపడుచున్న మానవుడు ఆ చిత్రములో కనిపించని యెడల అది మానవ హృదయమును ఆకర్షించును. కవులు అవలంబించిన రెండు పద్ధతులు రమణీయములైనను మానవచర్యలకు సంబంధపడిన ప్రకృతి వర్ణనమె మరింత ప్రాణవంతముగను మనోహరముగనుండును.

ఆధునిక కవులుచేసిన గొప్పమార్పు కథావస్తువునకు మానవస్వభావ చిత్రణమునకు సంబంధించి యున్నది. సామాన్య మానవ జీవితమునందు కూడ కవితార్హమైన రసోత్పాదక ఘట్టములున్నవని రుజువుచేయు కావ్యములను రచించిరి. మానవస్వభావ చిత్రమునకు అవకాశముకలిగించి, పాలిపోయి ప్రాతపడ్డ కవితా సరస్వతి యొడలు క్రొత్త నెత్తురు పెట్టుటకు తోడ్పడిరి. అందుకు వారు మనకందరకు వంద్యులు.

—(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.)

సాహిత్యంలో వైచిత్రి

"యా వ్యాసారపతీ రసాన్రసయితుం కాచిత్ కవీ నాం నవాదృష్టిః" అను ఆనందవర్ధనుని నిర్వచనమును, "క్షణే క్షణే నూతనైర్వైచిత్రైః జగన్త్యా సూత్రయంతి" అని నవ అను విశేషణమును అభినవ గుప్తపాదులు వివరించి నారు. అనుక్షణము నూతనమైన వైచిత్రులతో జగత్తులను సూత్రిస్తూ ఉంటుందట కవి ప్రతిభ.

ఈ "వైచిత్రి"నే Romantic element అనే మాటకు పర్యాయపదంగా నేటి విమర్శకులు రూఢి చేస్తున్నారు. ఈ వైచిత్ర్యమునే "లోకోత్తర చమత్కారము" ని పూర్వ లాక్షణికులు చెప్పియున్నారు.

ఈ Romantic element— వైచిత్రి అనునది కవిత్వము నకు సహజమైన జీవముపంటిదా, లేక అనుషంగికముగా వచ్చిన కావ్యశోభాహేతువులలో నొకటియా?

యదార్థమైన కవిత్వమునకు వైచిత్ర్యము జీవము. నవ్యతయే యీ వైచిత్ర్యమునకు మూలము. Romantic poetry అంటే భావనాపటిష్ఠమైన స్వేచ్ఛా ప్రియ కవిత్వమని మనము నిర్ణయించుకొను పక్షములో మహాకవుల కావ్యము లన్నియు ఈ వర్గమునకే చెందును.

మహాకవి కవిత్వము స్వేచ్ఛాప్రియమని యంటివిగదా అట్లయిన అది లక్షణబద్ధముగాదా? లక్షణబద్ధముకాని

కళయే ఉండదు. కాని ఆలక్షణములు స్వయంకల్పితములు. ప్రతిభోచితములు. ప్రత్యేకములు.

కాళిదాసు, భవభూతి మున్నగు సంస్కృత కవుల యందును "భావాంబరవీధి విశ్రుత విహారిణి" అని సరస్వతిని ప్రశంసించిన నన్నయ మొదలు ఈ కాలమువరకు గల తెలుగు కవులయందును ఈ Romantic element దేశకాల పాత్రభేదముల ననుసరించి కొద్దిగనో, గొప్పగనో గోచరించు చున్నది. నేటికాలపు కవులే Romantic కవులని చెప్పుటకు వీలులేదు. కాలభేదం, ఆచార వ్యవహారభేదం ఉండుటవలన అందుకు తగువైనవిధముగా ఈ Romantic element మారుతూ వచ్చినది.

18 వ శతాబ్ది ఇంగ్లీషు వాఙ్మయ చరిత్రలో నీరస మైన ఘట్టమని కొందరి ఆంగ్లేయ విమర్శకుల అభిప్రాయము. ఆకాలపు neo - classic పద్ధతికి ప్రతిస్పర్ధిగా Romantic కవి తోద్యమము 19 వ శతాబ్ది ఆరంభమున బయలుదేరినది. ఆ కాలపు నవ్యకవులకు లక్షణ నిర్బంధములు, ఛందో నిర్బంధ ములు, వ్యాకరణపు కట్టుబాట్లు అసహ్యములుగా తోచినవి. పూర్వ రచనపై అసంతృప్తి కలిగినది. ఈలాంటి స్వేచ్ఛా ప్రియత్వం కలుగుటకు ఫ్రెంచి విప్లవంవల్ల ఇంగ్లాండులో వ్యాపించిన నూతన భావముల ప్రభావమే కారణమని చెప్ప వచ్చును. బందాలు వదలించుకొని కాలుసేతులు హాయిగా చాపుకొన్నారు కవులు. ఈ మార్పు రచనలలో గోచరించినది.

"A little noiseless noise among the leaves
Born of the very sigh that silence heaves"

"నిశ్శబ్దమైన కంఠధ్వని ఆకులలో వినబడుచున్నది. నిశ్శబ్దత ఊర్చిన నిట్టూర్పువలె నున్నది" అని ఒక చోట 'కీట్సు' (Keats) అంటాడు. అప్పటి Neo-Classic కవులు యీ విధముగా వ్రాసియుండరు. నిశ్శబ్దమైన శబ్దమేమి? దానిని చెవి యెట్లు గుర్తించును? దానిని శబ్దమనుటెట్లు? ఈలాటి మీమాంసలోపడి తుదకు దానిని తెప్పని త్రోసిపుచ్చెదరు. శబ్దములేనికంఠస్వరం అనుప్రయోగము హేతువాదమునకు నిలువలేకపోయిననూ పంచేంద్రియాతిరిక్తమైన యేదోయొక రహస్యేంద్రియముద్వారా బుద్ధివ్యాపార నిరపేక్షకముగ హృదయములో ప్రవేశించి అనూహ్యమైన నిశ్శబ్దతను కల్పించి మనలను రసతన్మయులను చేయుచున్నది. "వినిన మధురగీతికలు ఆనందదాయకములేకాని వినని మధురగీతికలు, మరీ ఆనందదాయకములు" అని పాడిన కవికి నీరవ వాణిని విను దివ్యశ్రోతస్సు ఉండవలెను. ఆనందవర్ధనుడు నిర్వచించినాడు.

"శబ్దార్థ శాసనజ్ఞానమా తేత్రైవ సవేద్యతే,
వేద్యతేసహి కావ్యార్థ తత్త్వజ్ఞైరైవ కేవలం"

మహాకవుల వాక్యములలో పదాతిరిక్తములైన భావములు స్ఫురించుచుండును. వానిని తెలుసుకొనుటకు శబ్దార్థ శాసన జ్ఞానముమాత్రమే చాలదు. కావ్యార్థ తత్త్వజ్ఞత అవసరము.

వైచిత్ర్యమునకు మూలము నవ్యత్వమంటిరిగదా? మానవుని రసావేశము లలితకళల మూలమున బహిర్గత

మగుటకు మొదలు పెట్టి కొన్ని వేల సంవత్సరములైనవి. ఇంకను క్రొత్తదన మేమి ఉండును? అని సంశయమా? ప్రకృతి అనంతము. అనుక్షణ పరిణామశీలము. దేశకాలపరిసితుల మార్పులు, కవుల ప్రత్యేక ప్రతిభావిశేషములు ఈ నవీనత్వమునకు హేతువులు. ఒకేవిషయము పదిమంది కవులు చెప్పినయెడల తలకొక విధముగనుండును. కవిత్వముపుట్టినప్పటినుండి స్త్రీవర్ణనము కవిత్వములోనికి దిగినది. ఎన్ని వేల సంవత్సరములనుండియో కవులు స్త్రీలను వర్ణించుచున్నారు. ఆ కళ్ళు, ఆ ముక్కు, ఆ మొగమె కాని యిన్ని వేలమంది కవులకు పరిమితమైన స్త్రీశరీరము కవితాలంబము కావడ మెట్లు? వస్తువు ఒకటే అయినను భావప్రకటన వివిధత్వము వలన చమత్కారమువలన సవ్యముగా కనపడును.

తేనెవాకలంకల్లో పెరిగిన చేమకూర రుచిచూస్తాం!

కడుహెచ్చు కొప్పు, దానిం
గడవం జనుదోయి హెచ్చు, కటియన్నిటికిన్
గడుహెచ్చు, హెచ్చులన్నియు;
సడుమేపన లేదుగాని నారీమణికిన్.

సాధారణమైన భావమే. సాధారణమైన వర్ణనయే. కాని భావప్రకటనలో చమత్కారమున్నది. తిట్టినట్టు తిట్టి పొగడినాడు కవి.

ఇక, 'యతి విటుడు గాకపోవు టెట్లని' ప్రతిజ్ఞ చేసిన సంకుసాల కవి:

"ఒత్తుకొనిపచ్చ కటికుచోద్వృత్తి చూచి
తరుణి తనుమధ్యమెచటికో దలగిపోయె."

అనిచెప్పి, అంతటితో తనివి సనక "ఉద్ధతులమధ్య పేదల కుండవర మె" అని లోకోక్తిప్రాయంగా నిలిచిపోయేటట్లు ఒక అర్థాంతరన్యాసం విసరినాడు.

శ్రీనాథుడు "అస్తినాస్తి విచికిత్సా హేతు, ఞాతో దరిక్ర" అని యింకొక తీరున నడుము వర్ణించినాడు. ఈవర్ణనములన్ని ఒకే విషయమును గురించి చెలసినప్పటికిని భిన్నత్వమువలన, నవ్యత్వమువలన, చమత్కారమువలన రసవంతములయి అనుభోగ్యములగుచున్నవి.

ఉన్నది ఉన్నట్లే చెప్పుట కవిత్వముగాదు. న్యూసు పేపరు రిపోర్టు కావచ్చును. కేవలము వాస్తలను ప్రకటించడం కావచ్చును. లోకోత్తర వర్ణనానిపుణ కవికర్మ కావ్యమని మమ్మటుడు నిర్వచించినాడు. ఈ అభిప్రాయము లాక్షణికులందరు అంగీకరించినదే. లోకోత్తరత్వమనగా అనుభవసాక్షికమైన ఆహ్లాదగత చమత్కారమని పండిత రాయలున్నా, చమత్కారమనగా చిత్తవిస్తార రూపమగు విస్మయమని విశ్వనాథుడును వివరించినారు. ఇట్లనుటవలన చమత్కార రహితములగు కేవల శబ్దార్థములకు కావ్య యోగ్యత సిద్ధింపదు. కావున నె చేమకూర వెంకట కవి :

"ప్రతి పద్యమునందు జమ
త్కృతి గలుగం జెప్పనేర్తు వెల్లెడ, బెళుకే
కృతి వింటి మపారముగా
క్షితిలో నీమార్గ మెవరికిక్ర రాదుసుమీ"

అని రఘునాథరాయలు తన్ను నుతించినట్లు చెప్పుకొని యున్నాడు. ఇది ప్రగల్భముగా కనబడినప్పటికిని ఈ కవి

పట్ల సత్యమే యని యనవలయును. ప్రతి పదరసోదయముగా కవిత్వము చెప్పిన తెలుగు కవులలో చేమకూరు వెంకన్న ముఖ్యుడు. ఆయన మార్గం నిజంగా యెవరికీ అబ్బలేదు. మహాకవుల పోకడలు అనుకరణ సాధ్యములుగావు.

చిత్తజుడల్లి తూపుమొన చేసినఁ జేయగనిమ్ము పై ధ్వజం
బెత్తిన నెత్తనిమ్ము వచియించెదఁ గల్గినమాట గట్టిగా
అత్తరళాయతేక్షణకటాక్ష విలాసరసప్రవాహముల్
కుత్తుకబంటి తామరలకుఁ దలమున్కలు గండుమీలకుఁ.

ఈ పద్యము

ప్రతీయమానం పునరన్యదేవ
వస్త్వస్తివాణీషు మహాకవీనాం
యత్తత్ ప్రసిద్ధావ యవాతిరిక్తం
విభాతి లావణ్యమివాంగనాసు.

అను లక్షణమునకు ఉదాహరణ ప్రాయముగనున్నది. అంగనలయందు అవయవాతిరిక్తమైన లావణ్యమువలె మహాకవుల వాక్యములందు నిఘంటు అర్థములకు మించిపోవు భావస్ఫురణలు ఉన్నవనుట నిజమె.

సత్యభామకడకు కృష్ణుడు రావడము పారిజాతాపహరణములో తిమ్మన ఈ విధంగా వర్ణించినాడు.

అరదమునెక్కి కేతన పటాంచల చండలమైన తాల్మితో
దురగజవంబు మున్గడపద్రోచి కడంగెడు తత్తరంబుతో
దిరిగెడు బండికండ్లపగిదిఁ భ్రమియించుమనంబుతోడ నా
హరి సనుదెంచె సత్యసముదంచిత కాంచనసౌధవీధికిఁ.

ఈ పద్యమున కృష్ణుని యాతురత మనఃస్థితి అద్భుతముగ వర్ణింపబడినది. కంటికి గోచరింపని తాలిమి, మనస్సు,

తత్తరము, దృగ్గోచరములగు కేతన పటాంచలము, తురగ జవము, బండికండ్లు వీని సంబంధమునవలన మూర్తిమంతము లయినవి. రథమును దానిలోనున్న కృష్ణుని ఒక్కసారిగా మనము చూచుచున్నాము. కృష్ణుని మన స్థితితో పోల్చ బడిన ఉపమానములును రథములోనివె. ఫిలిమ్ డైరెక్టర్లు చూపించే Super imposed dissohes లాగా ఇది శోభించు చున్నది. దీనిలోని వస్తుసామగ్రి సర్వసామాన్యమైనదే. కాని వానికి కల్పింపబడిన పరస్పర సంబంధము కవి భావనా పటిష్టతను చాటుచున్నది.

Romantic కవులకు ప్రకృతి అనుసరణముకంటె భావ సృష్టి అత్యంతప్రియము. పూర్వరచనలపై అసంతృప్తికలిగి నప్పుడు నవ్యరచనకు దారి యేర్పడును. ప్రాణముకలిగిన వేవైనా ప్రతికూల పరిస్థితులు సంభవించినప్పుడు తిరుగ బడును. కాలార తిరుగనేర్చిన బిడ్డ దాది నిర్బంధములకు ఎదురుతిరుగును. ప్రబంధరచనా విధానముపై కలిగిన అసం తృప్తియే యీనాటి కవుల క్రొత్తపోకడలకు హేతువైనది.

—(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.)

నా కవితానుభవములు

కవుల అనుభవాలను వినడానికి లోకం ఉవ్విళ్ళూరు తుంటుంది. కవికి కావ్యానికి అవినాభావసంబంధం ఉంటుంది. కవి మనస్తత్వం, భావప్రపంచం తన కావ్యాలలో ప్రతి ఫలించడం సహజం. కవి జీవితం. కావ్యాలకు, కావ్యాలు కవి జీవితానికి వ్యాఖ్యాప్రాయంగా కనిపిస్తాయి. అందువల్లనే కవిజీవితానుభవాలను తెలుసుకొని రెంటిని సమన్వయ పరచుకొని ఆనందం అనుభవించడానికి రసికలోకం ఆశపడు తుంటుంది. ప్రోగ్రాం డైరెక్టరుగారు కాకతాళీయంగా నా కిటువంటి అవకాశం కలిగించడం సంతోషకరం.

నాకు ఒక కుగ్రామం నివాసం. ఇప్పటివరకు నా జీవిత మంతా ఆ గ్రామములోనే కొనసాగిపోయింది. ఆ పరిసరాల ప్రభావంవల్లనో యేమో నా జీవితంలోను కవిత్వంలోను గ్రామీణత్వం పరిస్ఫుటంగా అంకితమై ఉంటుంది. ఒక యువ కవికి కవితాకన్యకు జరిగిన సంభాషణములో ఒకప్పుడు నే నీ విధంగా వ్రాసినాను.

గ్రామవాసిని, ఎఱుఁగను గైతవంబు,
ప్రకృతి తల్లి స్తన్యంబునఁ బ్రబలినాడఁ;
బొలముల విహరించుచుఁ బొద్దుఁబుచ్చుచుందు
నట్టి నా ముద్దువలపును నరయలేవె?

తనకు దైనందిన చర్యగా ఉన్న కవితాపూజను గురించి ఉత్కంఠనుగురించి ఈవిధంగా అన్నాడు.

ప్రత్యూషస్సుల నూత్నపత్రములువిచ్చి
విమల హిమబిందువులురాల్చు సుమవితతుల
తోడఁబ్రమదాశ్రువులు వీడిపాడుచుందుఁ
గలికి, నీమసంబంటెడు గానములను.
సందెమబ్బుల చిఱువేరు చాయదీసి
పండువెన్నెల పసరునఁ బదనుచేసి
తరుణి, నీ పట్టుముసుగు నద్దకమువైవ
విఫలయత్నంబులంజల్పి వెఱ్ఱినైతి.
పారిజాతపుష్పంబులు పవనహతిని
మృదులతృణములరాలెడు నెడల, నీదు
చరణవిన్యాస కోమల శబ్దమనుచు
నడుగుగుర్తులఁ బలుమాఱు నరయుచుందు.

నా మిత్రులు కొందరు నా కావ్యాలు కొంతవరకు ఆత్మచారిత్రస్ఫోరకాలుగా ఉంటవని అంటున్నారు. పూర్వం నేను వ్రాసేటప్పుడు అజ్ఞాతంగా నాకాభావము ఉండినదో లేదో చెప్పలేనుగాని మిత్రుల వ్యాఖ్యానాలవల్ల యిప్పుడు నాకానమ్మకం కలుగుతున్నది.

నాకు కవిత్వం యాదృచ్ఛికంగా లభ్యమైనది. అంటె Love at first sight అన్నమాట. ప్రథమ కవితా సందర్భానికి దారితీసినవి యీ క్రింది పరిస్థితులని స్ఫురిస్తున్నది.

గూళులకువచ్చు పక్షుల కూజితములు
సంజకెంజాయ గారడి చక్రదసము
వరులవినవచ్చు కీటకావ్యక్తగీతి
కాపువానిని సైతము కవినొనర్చు.

నా కవితావధువు సంపన్నుల యింటి ఆడపడుచు. అందువల్ల నా పెట్టుపోతల్లోను చెప్పుచేతల్లోను అణిగిమణిగి ఉండదు.

పిలి స్తే రాదు. వ స్తేనిలవదు. తలవని తలంపుగా వస్తుంది సగములో ఏమో పుట్టిమునిగిపోయినట్లు వెడలిపోతుంది. ఒకొక్కప్పుడు అలక్ష్యంగా వచ్చిపోయిన జాడకు యీ పరాగ రంజిత పదాంకాలే దుఃఖకరమైన సాక్ష్యంగా నిలిచి ఉంటవి.

పొలతి రానూవచ్చె పోవనుం బోయె
పచ్చిలత్తుక పూతఁ బైదలియడుగు
ముద్రలు వాకిటి ముంగలం దనరె!
సకియ మేలు ముసుంగు సందడివినియు
పవనకంపితపర్ణ రవమనుకొంటి
ప్రేయసిచేతి దీపక కాంతిగాంచి
యమల తారాశోభయని భ్రాంతిపడితి
వింతముగుడనెతి - ఎంత పొరపడితి.

భాగ్యవంతుల యింటి బిడ్డను పెండ్లిచేసుకొన్న నిరుపేద సంసారికి ఏ అవస్థ కలుగుతుందో నాకూ అదే అవస్థ పట్టించినది. చూచారా, నాకూ ఆవిడకు ఎంత తారతమ్యముందో—

నీవురాణివె యౌదువు ; నేను బిచ్చ
మెత్తు పిచ్చివికారినె ; యిద్దఱకును
దారతమ్యంబు కొండంత ; తరుణి యింత
పొల్చ లేనైతి ; నినునమ్మి మోసపోతి.

జలదపథంబునందిరుగు చక్రనిచుక్రవెయయ్యో నాపయిం
గల ప్రణయంబునం బసిఁడిగద్దియడిగ్గి పాలానఁ బచ్చకం
చెలకడఁ గూరుచుంటివి కృషీవలబాలికయట్లు ; గడ్డిపూఁ
దలిరుల కాన్కతోఁ బ్రథమదర్శన ముత్సవమయ్యె దొయ్యలీ.

అంటూ పలవిస్తూ ఉండేవాణ్ణి. ఒక వేళ నేను ఎంత బీదవాణ్ణి అయినప్పటికి నేను మనిషినే కాబట్టి నాభార్య నాకు లోబడి ఉండవలెననే కోరిక, నేను భర్తనుగదా అన్న అహంకారము ఉంటుందిలేండి. నీవేమన్నా నాకు తాళిగట్టి మంత్రపూతంగా నన్ను పెండ్లి చేసుకొన్నావా? అనేమాట ప్రత్యక్షంగా ముఖాముఖి యెత్తిపొడవదు. యిక్కాంత అహంభావ Ultra Moderen wife తత్వం పట్టు పడనందువల్ల కొంచెం చాటుమాటుగా హావభావాలచేత నా మనస్సుకు తగిలేట్లు స్ఫురింపచేస్తూ ఉంటుంది.

అయితే మనలో మాట చెబుతున్నాను. నేనూ అంత నిరపరాధుణ్ణి కానులేండి. "కంఠాశ్లేష ప్రణయినిజనేకిం పునరర్ద్దారసంస్క్రే" అని భార్యా వియోగంవల్ల యక్షుడు దుఃఖించినట్లు నేనూ దుఃఖించి:

రసపిపాసలనడచు నీరమ్యమూర్తి
మెరుపువలెనైన గనుపించి మరగిపొమ్ము

అని చాల దీనంగా వేడుకొన్నాను. వేడికొందీ యింక కొంత బిగిసి ఏదో కొంతకాలం కుదురుగా కాపురం చేశాము. సంతానంకూడా కలిగింది. కాలంగడిచి పోతున్నది. కాస్త యింటిపట్టున వుంటే బాగుంటుందని నాకోరిక. కాని నాకోరిక నిష్ప్రయోజనమైంది. కసితీర్చుకో దలచుకొని 'వెంకటచలం' గారి నవలలు, కథలు అన్నీ పట్టుపట్టి చదివాను. వ్యభిచరించడం ఒక గుణమని సిద్ధాంతం చేసుకొని, అంచట్లో మావివాహం Convenience Marriage కాబట్టి, అంత చచ్చుచదనంగా ఉండడం సుతీ లోకువగా వుంటుందని అహంభావ

కవులవద్ద కొంత అహంభావం ఎరువుతీసుకొని సాహసం సంపాదించి, చిత్రలేఖను చేరదీశాను.

చూచారా మానవస్వభావంలో ఉండే చిత్రం. నా యిల్లాలికి మనసులో ఈర్ష్యపుట్టింది. నన్ను వేటాడడం మొదలుపెట్టింది. నేను కొంచెం మూతిబిగింపు చూపినాను. మానము ధరించాను.

నేటికైనను నా యున్కి నీకుఁబలఁపు
వచ్చెఁ; నది కొంతభాగ్యంబు మెచ్చుకాఁడ,
బహుళ సంతానవతియైన భార్యవలపు
సాటిగాదయ్యెఁ గొందగు లాటమునకు.
ప్రేమసూత్రాలఁ ద్రెంపెడి బిగువుసడలి
బిచ్చకత్తియపోల్కి నీ పిలుపులేక
వచ్చినిలిచితి ముంగిట, నిచ్చకాల
కైనఁ దలయెత్తి చూడవు మౌనివైతె?

అంటూ పూర్వప్రేమను తోపింపజేస్తూ, బొటనవ్రేలు నేలరాస్తూ కన్నీరునింపింది. చిత్రలేఖకు నాకు కలిగిన సాంగత్యం ఫలప్రదం కాకపోయినప్పటికినీ కవితకు నామీద ఉన్న. పూర్వప్రేమ యింకా మాసిపోలేదని బుజువుచేసింది. బయటికి తెచ్చికోలు బిగింపుచూపినా లోలోపల నా హృదయం వెన్నవలె కరగిపోయింది. అన్నానుగదా.

నిలునిలుమోసఖీ, మనసు నీరయిపోయె; నవజ్ఞగాదు; నీ
వలె ననుజేరవచ్చె బహువర్ణ సుశోభిత చిత్రలేఖ; నే
వలదనఁ జాలనైతి; నెలప్రాయము మోసముఁజేసె; నిక్కముం
దెలిసిన నీవునుం జెలినిఁ దియ్యని కౌగిటఁజేర్తు వింతకున్.

అని వోదార్చినాను. ఇద్దరం భాయి భాయి అను కొన్నాము. విరహాంతరమువల్ల మా సమాగమం ప్రణయ చిక్కణంగా కనిపించింది. తర్వాత ఫలితకేశం కనుపించి :

చెలువలు ప్రేముడిం గమము చిక్కని కౌగిళులఁ సుఖించి ని
చ్చలు మధురాధరామృతరసంబున మత్తిలి యౌవనంబు ని
శ్చలమని యెంచి కామపరిచర్య యొనర్చుచు భావికాల చిం
తలు తలపెట్టబోని పశుతత్త్వని నిద్దురలేప వచ్చితిఁ.

అంటూ హెచ్చరించింది. పాపం! నా యిల్లాలి ముఖం మేఘాచ్ఛన్నమైంది చూచాను.

అతివ పొరపాట్ల ప్రహసనం బాడినాము
భరత వాక్యంబుగాఁబెట్టు వలపు ముద్దు;

అని ఒక ముద్దు ముద్రించాను.

—(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.)

తిక్కన

మహాభారతాంధ్రీకరణముతోడ ఆంధ్రుల నాగరక జీవితము ప్రారంభమైనదని చెప్పవచ్చును. గాసట బీసటే చదివి సంతృప్తిపడు ఆంధ్రులకు సర్వాలక్షణ సమన్వితమైన భాష కవిత్వము చేకూడినది. వైదికమతము వ్యాపింపజేయ వలయుననే కోర్కెయే భారతాంధ్రీకరణమునకు మూల కారణము. రాజరాజు వైదిక మతాభిమాని కావున నన్న యను ఆ మహాకార్యమున నియోగించి ఆదరించెను. మొట్ట మొదటి యుద్దేశమెట్టిదైనను ఆంధ్రులకు ఆంధ్రభాషకు మహోపకార మొనగూడినది.

అరణ్యపర్వము పూర్తి కాకపూర్వమె నన్నయ అస్తమించెను. ఆయన మరణము వింతవింత కింవదంతులకూ ఊహలకూ ఆకరమైనది. "అసలు సంస్కృత భారతమును తెనుగు చేయడమే ఒక గొప్ప అపచారము. కాబట్టి దుఃఖ భాజనమైన అరణ్యపర్వము పూర్తిగాకమునుపే నన్నయ మరణించినాడు" అను నమ్మకము దేశమున వ్యాపించినది. దీనిలో ఆశ్చర్యమేమిన్నీలేదు. నాగరకయుగమని చెప్పుకో బడే యీ యిరవయ్యో శతాబ్దమునకూడ ఇట్టి విశ్వాసములు నాటుకొనియున్నవి.

రెండువందల సంవత్సరములు గడచినవెనుక తిక్కన యవతరించి ఈ యాంధ్రీకరణ భారము వహించువరకు ఈ పనికి పూనుకొన్నవారు లేరు. తలపెట్టినవారుండవచ్చును.

అథర్వణాచార్యుడు భారతము రచించెనని వినికిడి. అదేమైనది? దానినిగుఱించి కొన్నికట్టుకథలు ప్రబలినవి. అయితే యీమధ్యకాలమున భారతమును తెనిగింపగల మహాకవి ఆంధ్రదేశమునలేడా? రామాయణమంతటి బృహత్కావ్యమును నిర్వహించిన భాస్కరాదులున్నారుగదా. బహుశా అరణ్యపర్వమును గుఱించిన మూఢవిశ్వాసము కొద్దిపాటి మార్పులతో తిక్కన నాటికిగూడ వ్యాపించి యుండినదేమొ? ఇటువంటి విశ్వాసములకు కారణభూతమైన అరణ్యపర్వ శేషమును వదలిపెట్టి విరాటపర్వము మొదలు పదునేనింటిని తెనిగించెను.

నన్నయకును తిక్కనకును షుమారు రెండువందల సంవత్సరముల కాలవ్యత్యాసమున్నది. ఈ మధ్యకాలమున రాజకీయ సాంఘిక విషయములందేమి, భాషావిషయము నందేమి, ప్రజల యాచార వ్యవహారములందేమి కొన్ని మార్పులు తప్పక జరిగియుండవలయును. నన్నయ తిక్కనల కావ్యప్రయోజన దృష్టి భేదములకు ఈ మార్పులే బాధ్యములై యుండవచ్చును. నన్నయ వైదిక దృష్టితోను, జగద్ధిత బుద్ధితోను భారత రచనకు పూనుకొనెను. తిక్కన శిల్పదృష్టితోను "ఆంధ్రావళి మోదముం బొరయించు" బుద్ధితోను భారత రచన కొనసాగించెను.

తిక్కన కాలమునకే ఆంధ్రులు, ఆంధ్రత్వము అను నొక ప్రత్యేకత, సాంఘికజ్ఞానము అంకురించి యుండినది. ఈనాటి గ్రాంథిక, వ్యవహారిక భాషావాదములవలెనే

ఆనాడును మార్గకవితా దేశికవితావాదములు పుట్టియుండి నవి. దీనికి కారకులు శివకవులు. జాను తెనుగున కావ్య గతార్థము సామాన్యజనులకు బోధపడునట్లు వ్రాయుటయే వాడి యుద్దేశము అట్టి గ్రంథములే మత ప్రచారమున కనుకూలముగ నుండును. ఇట్టి యుద్దేశముగల కవులలో ప్రబంధ పద్ధతిని వ్రాసి ప్రబంధ రచనకు మార్గదర్శియైనవాడు నన్నెచోడుడను రాజకవి. నిర్వచనోత్తర రామాయణమున తిక్కన చేసికొన్న నియమములనుబట్టినీ తర్వాత కొంత కాలమునకు భారతమును రచించిన విధానమునుబట్టినీ ఈయనకూడ జాను తెనుగు ఉద్యమమునకు సంబంధించిన వాడేనని చెప్పవచ్చును. సంస్కృతశబ్ద బహుళమైన దీర్ఘ సమాసములకంటె "అలతి యలంతి తునియలుగ" విరుగు తెనుగు శబ్దములపైననే యీయనకు అభిమానము మెండు. "జాత్యముగామి నొప్పయిన సంస్కృత మెయ్యెడజొన్ప"డు. శివకవులవలెనే తిక్కనకూడ యిట్టి నియమములు చేసి కొన్నను ఆచరణలో మాత్రము విధిలేక కొంత ప్రతిజ్ఞా భంగము కలిగినది. ఇది కాలపరిస్థితినిబట్టి అనివార్యము కూడ. అదివఱకే సంస్కృతము ఆంధ్రమునందు తిలతండుల న్యాయముగ కలిసిపోయినది. అరబ్బీభాషమూలమున పారసీభాష మఱింత సంపన్నమైనట్లు సంస్కృత సంబంధము వలన తెనుగు భాషకు పదజాల సమృద్ధి కలిగినది. కాని ఆ కాలమున ఈ జాను తెనుగు ఉద్యమమే లేనట్లయిన తిక్కన కాలము నాటికే తెనుగు పద్యములు ఇనపగుండ్లుగా తయారై యుండెడివి.

కేతన రచించిన దశకుమార చరిత్రమువలన తిక్కనను గుఱించి కొంత తెలిసికొనవచ్చును. తిక్కన బహు కళా సంపన్నుడు. వాక్పతినిభుడు. సకలాగమార్థ తత్త్వవేత్త. ఉభయకవిమిత్రుడు. ఇంతేకాదు. తిక్కన అభిరూప భావ భవుడు. కామినీ చిత్తచోరుడు. విజాతత్పరుడు. ధీరుడు.

తిక్కన నిర్వచనోత్తర రామాయణమున "నేను భయకావ్యప్రౌఢిం బాటించు శిల్పమునం బారగుడం గళా విదుడ"నని చెప్పియున్నాడు. కవిత్వము శాస్త్రముకాదనీ, శిల్పమనీ కళయనీ తిక్కన గ్రహించినాడు. తిక్కన మహిమను పూర్ణముగ తెలిసికొన్న పూర్వకవులలో ఎఱ్ఱన ప్రథముడు.

తనకావించిన సృష్టి తక్కొరుల చేతంగాదునా, నేముఖం
బునఁ దాఁబల్కినపల్కులాగమములై పొల్చొందునా, వాణిన
త్తను నీతండొకరుండ నాఁజనుమహత్వాప్తిం గవిబ్రహ్మ నా
ది నుతింతుం గవి తిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితుఁ.

తిక్కన కావించిన సృష్టి. అది యితరులచేత గానిపని. ఆయన కవిబ్రహ్మ. ఇదియెట్లు? సంస్కృతమునుండి తెనిగించినది స్వతంత్ర సృష్టి యెట్లయినది? సంస్కృత మూలముతో తిక్కన భారతమును సరిపోల్చి చూచినప్పుడే తాను కావించినది సృష్టియని గోచరించును.

ఒకటి రెండు వాక్యములలో సంస్కృత భారతమునకును తిక్కన యాంధ్రీకరణమునకునుగల తారతమ్యము చెప్పదలతుమేని - మూలము అస్థిపంజరము - తిక్కన ఆంధ్రీకరణము రక్తమాంసయుతమైన జీవన్మూర్తి.

కవియే కథచెప్పినట్లుగాక పాత్రలే మనయెదుట నిలబడి వ్యవహరించునట్లు, వారి మనోవృత్తులు భావవికారములు, అభినయ వర్ణనమూలమున మూర్తీభవించినట్లు రచించుటె తిక్కనగావించిన గొప్ప మార్పు. నాటక పద్ధతి వలన తెలుగు భారతమునకు అపూర్వమైన చైతన్యము కలిగినది. తిక్కన యొక్కడొక్కడ రసాభ్యుచితముగ మూలాతిక్రమణముచేసెను, ఎక్కడొక్కడ ఔచిత్యమును పోషించెను. అను చర్చకు నిదర్శనపూర్వకముగ పూనుకొందు మేని భారతమంత పెద్ద విమర్శన గ్రంథము వ్రాయవలసి యుండును. అయినను ఆ మహాకవి అవలంబించిన రచనా పద్ధతులను కొన్నిటిని చూచెదము.

(1) సంభాషణమూలకమైన నాటక పద్ధతిలో కథ నడుపుట.

(2) రసపోషణకుగా యథేచ్ఛముగ మూలము నతిక్రమించుట, అమూలకమును చేర్చుట, మూలమును మట్టగించుట.

(3) వస్తువుయొక్క ఐక్యమునకూ కథాగమనము నకూ అభ్యంతరములైన భగవద్గీతలవంటి వానిని వదలుట.

(4) పాత్రలు ప్రాణవంతములుగ స్ఫురించుటకు అంగ వికారాద్యభినయములను కన్నులు గట్టినట్లు వర్ణించుట.

(5) పాత్రల వ్యక్తిత్వము భిన్నత్వము పరిస్ఫుట మగునట్లు శీలమును పోషించుట.

(6) ఔచిత్యమును పోషించుట.

(7) ఉదయాస్తమయాది వర్ణనములు కథలో మేళవించునట్లు చేయుట.

(8) భావరసానుగుణమైన శైలి.

వీని యన్నిటి సమిష్టి ఫలిత మేమనగా ఆంధ్రీకరణము సంస్కృత మాత్మకకంటె వేయింతలు కళావిశిష్టమయి సినిమా చిత్రమువలె అనుక్షణ భిన్న కార్యశీలమయి ఆంధ్ర సారస్వతమునకు పట్టుగొమ్మయయి నిలిచినది.

కొన్ని ఉదాహరణములు :

(1) విరహావిహ్వాలుడైన కీచకుని యవస్థావర్ణనములు, సంభాషణములు, ఆ ఘట్టములోని ద్రౌపదీ వర్ణనములు చాల వఱకు అమూలకములు. అవి లేతపాకపు ప్రబంధధోరణి లోపడినను చాల మనోహరములై యున్నవి.

సుధేష్ణ వారుణిదెమ్మని ద్రౌపదిని కీచకుని యింటికి పొమ్మనినప్పటిస్థితి మూలమున "శంకమానారుదతీ" అని చెప్పబడియున్నది. ఇది కొంచ మించు మించు "ద్రౌపది సరిదేహిస్తూ ఏడ్చును" అన్న Stage direction కు సరిపోవును. కాని యిక్కడ లోపించినది ఆ direction ననుసరించి అభిన యించే పాత్ర. ఆ లోపాన్ని తిక్కన పూరించినాడు. అట్టి ద్రౌపది పాత్రను నాట్యరంగమున నిలబెట్టి మన కన్నులయెదుట అభినయింపించినాడు.

"ఉల్లము తల్లడిల్ల దనువుద్గత ఘర్మజలంబు దాల్చి చుక్కడిల్లవడంగ" ఇంతవఱకు ఈ చిడిముడి పాటంతా అభినయము. "నాకిది కడింది విచారముపుట్టె; అందుఁబో నొల్లననంగరా, దచటి కూరక పోవనురాదు, నేర్పు సంధిల్లగ

దీని బాపికొను దీమస మెట్టిదో”— ఇది స్వగతము. మనసు లోని ఉరిమాట. తలపోతల పోరాటము. To be or not to be— that is the question అనే మానసిక సంఘర్షణము. ఒక చిన్న Stage direction ను అభినయించు పాత్రగా మార్చగలిగిన తిక్కనయింద్రజాలమె తెలుగు భారతమునకు అనన్యమైన విశిష్టతను చేకూర్చినది.

(4) తిక్కన నిశితమైన లోకజ్ఞానము కలవాడు కావున ఔచిత్యములను చక్కగ పోషించెను. బృహన్న లను ఉత్తరకు ఆట నేర్పుటకు నియోగించుటకు పూర్వము అతడు నిజముగ నపుంసకుడా లేక పుంసత్వముకలవాడా అను సంగతి ప్రమదలచేత పరీక్ష చేయించి విరాటుడు తన సంశయము తీర్చుకొన్నట్లు మూలమున నున్నది. ఇది చాల మెరటుగాను బూతుగాను కనిపించును. దీనిని “నైపు ణంబున నుచితంబుమై నరసి” యని తిక్కన నాజూకుగా మార్చి తన సున్నితమైన యభిరుచిని వెల్లడించెను.

(5) “నిగూఢస్త్వం తథా పార్థకీచకంతం నిషూ దయ” అని కీచకుని రహస్యముగ చంపవలయునని భీమునితో ద్రౌపది చెప్పినట్లు మూలమున నున్నది. దీనికి విరుద్ధముగా భీమ కీచకుల యుద్ధము ఇట్లు వర్ణింపబడినది.

“శబ్దసమభవద్ఘోరో వేణుస్ఫోట సమోయుధి” అనిన్ని “అన్యోన్యం ప్రతిగర్జతాం” “విరురావ మహాబలం” అనిన్ని “నదంతంచ మహానాదం భిన్న భేరీ సమన్వితం” అని —అంటే, పూరింట్లు కాలునప్పుడు పెదురు బొంగుల గణు

పులు పగిలి పెట్ల దిమ్మలవలె శబ్దించును. అటువంటి శబ్దములతోను, అట్టహాసాది గర్జనములతోను, భేరి వాయించునప్పుడు దానిచర్మము పగిలిన ఎంత శబ్దమువచ్చునో అంత శబముతోను వాగు పోరినారట! ఈ అలకలోలమునకు రాజగృహములోని వారేకాక యూరివారందరు ఉలిక్కిపడి లేచి యుందురు. తిక్కన పూర్వాపర సందర్భ వైరుధ్యము కలగకుండునట్లు—

తసయగ పాటొరు లెఱుఁగుదు
రని సూతుఁడు, సమయభంగమగుటకు భీము
డును గొంకుచుఁ జప్పుడు సే
యని గూఢవిమర్ధన ప్రహరముల దగఁ.

అని యుచితముగ మార్చి రహస్య యుద్ధమునకు కారణములుకూడ చూపెను.

నాటికి నూలుపోగనునట్లుగా తిక్కన కావ్యగుణములను సూక్ష్మముగ తడవి యింతటితో విరమించుచున్నాను.

--(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.)

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

"మీరాబాయి" - ఒక విషాదాంతము

[శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారిచే రచింపఁబడిన "మీరాబాయి" నాటకము నెల్లూరి వెంకటగిరిరాజాగారి కళాశాల "ప్రాఁతవిద్యార్థి సంఘము" వారిచే తే (7–5–1933) దిన ప్రదర్శింపఁబడి సహృదయులగు ప్రేక్షకుల సంస్తుతికిఁ బాత్రమైనది. అప్పటినుండి కొంతకాలమువఱకు ఆనాటకమును గుఱించిన బాగోగుల వివాదములు స్థానిక పత్రికలయందుఁ బ్రచురింపఁబడినవి. అప్పుడు నెల్లూరినుండి వెలువడుచుండిన "Scrutator" అను పత్రికయందు "రసలుబ్ధుఁడు" "మీరాబాయి"నిగురించి ఒక విమర్శనము రచించి ప్రకటించెను. శ్రీ దు. రామిరెడ్డిగారు "కళాప్రియుఁడు" అను పేరుతో అదే పత్రికయందు "రసలుబ్ధుని" యాక్షేపములకుఁ బ్రత్యుత్తర మిచ్చెను. ఈ విమర్శనము పాఠకులకు ఉపయోగపడునను ఉద్దేశముతో ఈ సంపుటిలో చేర్చినాము. —సం.]

"శృంగారమేగాని వీరమేగాని ఒకటేరసము అంగి, కడమరసములన్నియు అంగములు" అను నిట్టివి మఱికొన్ని సాహిత్యదర్పణములోని నాటక లక్షణముల నుదాహరించి, ఆ లక్షణములనుబట్టిచూడ మీరాబాయి నాటకమున రసాభాసము కలిగినదని తీర్మానించి, [రసాభాస మన్నంతనే, అదేదో గుణలోపమని పామరుల యూహ; అది యట్టిది కానేకాదు. అదియొక పారిభాషిక పదమని పెద్ద లెఱుఁగుదురు.] "ఇత్యాది శాసనవ్యాప్త సాహిత్య రాజ్యమున వ్యాణాది విదేశబల సాహాయ్యమున శాసనము లుల్లంఘించి పితూరీలు రేఁపుచున్నారుగదా ఇప్పుడు కవులు!" అని కాల విపర్యాసమునకు వగచి, ప్రాణమైన రసము దెబ్బతినఁగాఁ

గళేబరము నేల వ్రాలదాయనియు, ఒకవేళ అట్లు వ్రాలనీయక "బ్రాడ్లీ ప్రభృతుల ట్రాజిడీ సంచిలోని క్రొత్తసంజీవనిం దెచ్చిపోసి నిలుపఁ గలమా? ఆమందు త్రాగి కులముచెడినను ఎందేని బ్రతికి ఊర్జితముగా నుండునేమొ" అని కులముచెడని తన పౌరాణిక మనస్తత్త్వమును, సందేహమును, రస లుబ్ధుఁడు వెల్లడించినాఁడు. ఈ పురాణ పురుషుని వగపు నకును సందేహమునకును గారణము కాలానుగుణముగఁ దలసూపు మార్పులను గుర్తింపనేరమి యనియే నాతలంపు.

లక్షణములు శాసనములా? లాక్షణికులకు అను శాసించు అధికారము ఎవరివలనఁ గలిగినది? ఆ యధి కారము వారు స్వయముగఁ దెచ్చిపెట్టుకొన్నదా ఇతరు లిచ్చినదా? లక్షణములకు లక్ష్యములకుఁగల సంబంధమేమి? నాటక లక్షణము లికవిూఁదఁ బుట్టుటకు అవకాశములేదా? సాహిత్య దర్పణములోని నాటక లక్షణములు ఇప్పటి నాటక రచయితల నెంతవఱకు బంధించును? శృంగార వీరములే నాటకమునఁ బ్రధాన రసములుగ నుండవల యునా? రసాభాస సిద్ధాంతము 'ట్రాజెడీ' లకును జెల్లునా? అను ఈ విషయములను మనము విచారించి నిగ్గుదేల్చిననే గాని "శాసనవ్యాప్త సాహిత్య రాజ్యమున పితూరీలు" రేఁపు స్వాతంత్ర్య ప్రియులైన నేఁటికాలపు కవుల యుద్య మమునొక్క గౌరవమును మనము గ్రహింపలేము.

కళలువోలె తదంతర్గతములగు లక్షణములును స్వయంభవములు. అవి ప్రతిభాశాలులైన కవుల భావ ప్రపంచమున నుద్భవించి రచనాముఖమున వ్యక్తమగును.

కొంతకాలము గడచునప్పటికి వివిధములగు రూపకము లేర్పడును. మొట్ట మొదట రచియించువారికి మార్గదర్శక ముగ లక్షణ గ్రంథము లుండనేరవుగదా! అందువలననే వివిధత్వమునకు అవకాశముండును. తరువాత కొన్ని నూఱుల సంవత్సరములకు (అనఁగా నిర్మాణయుగము దాఁటినపెనుక) లాక్షణికులు తమకుఁ బూర్వము రచియింపఁ బడియున్న రూపకములను బరిశీలించి నిర్మాణపద్ధతి, ఇతి వృత్తము, నాయికానాయకులు, రసము మున్నగువాని యందలి భేదముల ననుసరించి రూపకములను గొన్ని వర్గములుగ విభజింతురు. లక్షణ గ్రంథములు వ్యాపించిన క్రమమిదియే. తరువాత స్వతంత్ర రచనము సన్నగిల్లి అనుకరణములు బయలుదేరినవి. నేఁటి కవులు సాహిత్య రాజ్యమున పితూరీలు సలుపుట అన్యాక్రాంతమైన స్వరాజ్య మును దమపరము చేసికొనుటకే యని రసలుబ్ధుఁడు గ్రహించుఁగాక!

నాటక రచనముగూడ నొకప్పుడు ప్రభవించి క్రమ క్రమముగ నభివృద్ధి చెందినదే. భరతముని నాట్యశాస్త్ర మునకుఁ బూర్వము ఎట్టి ప్రేక్షణీయకము లుండినదియు మనమెఱుఁగము. కంసవధ, బలిబంధనము, అను రూపక ముల పేరులు పతంజలి యుదాహరించెనేగాని యాపురా తన రచనల తత్త్వమెట్టిదో మనమెఱుఁగము. సోమిల్ల కవిపుత్రాదుల రూపకములు మనకు లభింపలేదు. మన పూర్వ పుణ్యవశమున భాసుని రచనలు లభించినవి. భాసుని రూపకములకును దరువాతి కాళిదాసాదుల నాటకముల

కును గల తారతమ్య మరయుదుమేని కాలక్రమముగ వచ్చు మార్పులను మనము గమనింపఁగలము. తనకుఁ బూర్వము రచింపఁబడిన 'కంసవధ' యందువలెనె భాసుఁడును 'ఊరుభంగము' అను రూపకమున వధను 'స్టేజి'పై చూపించెను. కాని తదువాత నాటకములలో అట్టి సంవిధానము వర్జింపఁబడినది; ఇట్టి మార్పులు అనేకములు పొడకట్టును. మార్పులు అనివార్యములు. కళలకును మానవ సంఘమునకును సన్నిహిత సంబంధముగలదు. అందుఁ బొడసూపు మార్పులు కళలయందును బ్రతిబింబించుచుండును.

లక్షణ గ్రంథములలోని నియమములను బొల్లుపోక అనుసరించిన సంస్కృత కవుల నాటకములెన్ని యిప్పుడు ప్రదర్శనయోగ్యములై యున్నవి? పూర్వీకుల నియమములను అనుకూలమైనంతవఱకు గ్రహించి, వలయుచోట్ల క్రొత్త లక్షణములఁ దెచ్చుకొని రచియించు నేఁటికవుల నాటకములెన్ని ప్రచారంజకములుగ నుండుటలేదు? లక్షణములు శాసనములుకావు; మార్గదర్శకములు. కాలము గడచుకొలఁది భిన్నమార్గము లేర్పడుచుండును. "భావి పరిణామ మెవ్వరు పలుకఁగలరు?"

నాట్యరంగ పరికరములయందు ఇప్పటికిని అప్పటికిని ఎంతయో తారతమ్యముగలదు. ఈ భేదము నాటకరచన యందును జూపట్టదా? నాయకుఁడు ఏ స్థలమున సంచరించుచుండునో ఆస్థలమును స్ఫురింపఁజేయఁగల ఆలేఖ్యపటములు పరదాలు లేని యా కాలమున నటకులు వర్ణింపవలసిన అంశములు మెండుగనుండును. కావుననే కార్యసంచలన

మునకుఁ గథాప్రసరణమునకుఁ బ్రతికూలమైనను సంస్కృత నాటకములందుఁ గవిత్వభాగము హెచ్చుగనుండును. ఈ కాలపు నాటకములలో నట్టివర్ణనములకు అంత యవసర ముండదు. షేక్స్పియరు నాటకములకును, ఇబ్సన్, బియర్సన్, గాల్స్వర్థి, బెర్నార్డ్షా మున్నగు ఆధునికుల నాటక ములకునుగల "Technique" భేదమును గ్రహింతుమేని నాటకరచనాపద్ధతి యెంత అభివృద్ధియైనదో మన మెఱుంగకపోము. కాని అభివృద్ధిసూచకములుగా నున్నను మార్పులు గలిగినపుడెల్ల పూర్వాచారపరాయణులగు పండితులు ప్రపంచము తలక్రిందై పోవుచున్నదో యనునట్లు గగ్గోలు పడుచుందురు. క్రొత్తప్రాతల సంధికాలమున నిట్టిపోరాటములు తప్పక సంభవించుచుండును.

ఇతర కళలవలెనే నాట్యకళాసైతము రాజాశ్రయమునే యభివృద్ధి చెందినది. రాజప్రాసాదములందు నాట్యమండపము లుండెను. వసంతోత్సవ సమయములందు రాజుల యొక్కయు పండిత నాగరకులయొక్కయు వినోదముకొఱకు నాటకములు ప్రదర్శింపఁబడుచుండెను. రాజులు శృంగారప్రియులు; అంతఃపురములను స్వర్గతుల్యముగ నొనర్చుకొనిన సంపన్నులు. వారికి జీవితము సుఖమయము. కావుననే మనదేశమున శృంగార రసప్రధానములైన నాటకముల సంఖ్యయే హెచ్చుగనుండును. వీరరసము గ్రాహ్యమయ్యును దానికిఁ బ్రాధాన్యమొసఁగి ప్రాయఁబడిన నాటకముల సంఖ్య అల్పము. కాలక్రమమునఁ బరిస్థితులు మాఱినవి. శృంగార వీరములకన్న నన్యములగు కరుణ శాంతములు

నాటకమున ప్రాధాన్యము వహించుటకు ఆటంక మేమి యను విచారము బయలుదేరెను. భవభూతి కరుణము అంగిగా ఉత్తరరామ చరితమును రచించి 'రసేషు కరుణో రసః' అను ఆర్యోక్తికి గారణభూతుఁడాయెను. శాంతరస ప్రధానముగ కృష్ణమిశ్రుఁడు ప్రబోధ చంద్రోదయ నాటకమును రచించెను. పాపము! ఉత్తరరామ చరితము లాక్షణికుల తత్తఱపెట్టినది. ఇందలి రసము శృంగారము కాదు; వీరముకాదు. ఇఁక ఉత్తరరామచరితము లక్షణ బాహ్యమనవలయును. ఇదెట్లు పొసఁగును? లోకము అంగీకరించునా? భవభూతి నెట్లయిన లక్షణ బద్ధుఁడని తీర్మానించుకొనకున్న లక్షణములకే గౌరవము తగ్గునుగదా! అందువలన లాక్షణికులు, ఉత్తరరామచరితమున ప్రధాన రసము కరుణము గాదనియు, అది విప్రలంభ శృంగార మనియు ధర్మవీరమనియుఁ దర్కవాదములు సలిపి కొంత ఆత్మ సంతృప్తివడసిరి. అట్లుగాక, లక్ష్యమును ననుసరించి క్రొత్తలక్షణమును నెలకొలుపుకొని యుండిన భవభూతి స్వాతంత్ర్యమును మనము గౌరవించినవారమై యుందుముగద!

రతి ఉభయనిష్ఠము కానందువలన మీరాబాయి నాటకమున రసాభాసము గలిగినదని రసలుబ్ధుని వాదము. ఈపాటి విషయము కవియు నెఱింగియుండును. కాని, రసాభాస సంవిధానమునకూడ ప్రదర్శన యోగ్యమని కవిమతము కాఁబోలు కావుననే యీకవి "రస" సిద్ధాంతమును త్రోసిపుచ్చి "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్య" మ్మను పండితరాయల నిర్వచనమునకు ఉదాహరణ ప్రాయముగ, తాను

రచించిన 'వనకుమారి', 'కడపటి వీడుకోలు' అను కావ్యము లందును ఇట్టి 'రసాభాస' సంవిధానములను చేకూర్చి యున్నాఁడు. కవి మీరాబాయి నాటకమున శృంగారరసము పరిపూర్తి సేయ దలఁచుకొనలేదనుట స్పష్టము. రతి ఉభయ నిష్ఠము కానియప్పుడు చూపట్టు మానము, ద్వేషము, ఈర్ష్య, రోషము, వానిమూలమునఁగలుగు దురవస్థలు, మనోవిప్లవము కవి రూపింపఁ దలఁచుకొనెను. ఈ తెగకు సంబంధించిన ప్రబంధములు పూర్వమే రచింపఁబడియున్నవి. కీచకవధ, శుకసంభాసంవాదము, సారంగధర చరిత్రము, మనుచరిత్రము మొదలయిన ప్రబంధములు ఈ కోటిలోనివె. ద్రౌపదీ కీచకులయందు రతి ఉభయనిష్ఠము కానందువలననే కీచకుఁడు దుర్మరణము పొందెను. చిత్రాంగీ సారంగధరులలోఁగూడ రసము ఉభయనిష్ఠము కానందువలననే సారంగధరునకట్టి పాటు గలిగెను. లాక్షణికుల సిద్ధాంతముల ననుసరించి యిట్టి కావ్యములు, నాటకములు, తగులఁబెట్టఁబడ వలసినవే గదా! వేయి సాహిత్యదర్పణములనైన బుగ్గిచేయనోర్తుము గాని, లోకోత్తర రామణీయకము కనులగట్టించు మనుచరిత్ర మును మంటవేయఁగలమా?

"It is that the artist as such must have no creed;... ...Rules, conventions, theories, principles, inhibitions of any sort *not born of his own immediate feeling* are no concern of his. They proceed from an inferior part of human nature, being the work of gapers and babblers."

—*J. W. Von Goethe*

రతి ఉభయనిష్ఠముకానిచో, రచన హాస్యాస్పదమగు నని రసలుబ్ధుఁడు లక్షణ గ్రంథములలోని కొన్ని ప్రమాణ ముల నుదాహరించెను. ఈ లాక్షణికులు 'శృంగా రాను కృతిర్ఖ్యాతుసహాసః' అను భరత నిర్వచనమునే యనుక రించి లక్షణము లల్లిరేగాని, సొంతముగ నాలోచించి యందలి భేదముల నరయ్దైరి.

రతి ఉభయనిష్ఠముకాని యప్పుడు హాస్యము పుట్టుటకు నాయికా నాయకులలో నొకరియందో లేక యిరువురందో లాఘవము (frivolity) అగపడవలయును. అట్లుగాక, యుభ యులందును గౌరవమును, seriousness of purpose పొడకట్టు నేని హాస్యము పుట్టదు. నాయిక్దైనను నాయకుని్దైనను మానము, ఈర్ష్య, క్రోధము; కసితీర్చుకొన వలయునను తలంపు పుట్టును. ఈ భేదమును లాక్షణికులు (గతానుగతి కులగుటవలన) గు్తింపలేదు. ఇట్టి విషయములందుఁ గేవ లము సచేతనుల యనుభవమేగదా ప్రమాణము!

II

"In short, tragedy is not history in dialogue. History is for tragedy nothing but a storehouse of names where with we are used to associate certain characters,···· ..... For the dramatic poet is no historian, he does not relate to us what was once believed to have happened, but he really produces it again before our eyes, and

produces it again not on account of mere historical truth, but, for a totally different and a nobler aim. Historical accuracy is not his aim, but only the means by which he hopes to attain his aim, he wishes to delude us and touch our hearts through this delusion."

G. E. Lessing.

మీరాబాయి నాటకములోని మీరా కుంభరాణా అగ్బరు తాన్‌సేనులు చరిత్రకు సంబంధించిన వారయ్యు కథమాత్రము చారిత్రకము కాదు. అగ్బరును కుంభరాణాయు సమకాలికులు గారు. రాణా క్రీస్తువెనుక 1419 వ మొదలు 1469 సంవత్సరము వఱకును, అగ్బరు 1556 మొదలు 1605 వ సంవత్సరము వఱకును రాజ్యమేలిరి. రాణా సింహాసన మధిష్ఠించిన 137 సంవత్సరములకు అగ్బరు పట్టము గట్టు కొనెను. కాని, సంప్రదాయాగతముగ లోకమున వ్యాపించి యున్న కథయందు మీరా అగ్బరులకు సంబంధము కల్పింప బడియున్నది. మీరా కథ మూడు నాలుగు విధములుగ గ్రంథస్థమై యున్నది. ఒక కథకును మఱియొక కథకును భేదములున్నవి, అచ్చమాంబగారి "అబలా సచ్చరిత్ర రత్నమాల" యందును "మీరా గీతావళి" అను హిందీ గ్రంథమునందును, "భక్తవిజయము" నందును మీరా కథ గలదు "రాజస్థాన కథావళి" యందు రాణాచరిత్ర కనఁబడు చున్నదేగాని మీరావిషయమై అందుఁగానఁబడదు. కాలము మీరా కథకుఁ గొంత 'పౌరాణిక స్పర్శ' కలిగించినది; యథార్థచరిత్రము పురాణ గాథలలో లీనమైనది.

హిందూదేశ చరిత్రాంశములను బోధించుటకు కవి యీ యితివృత్తమును గ్రహించి యుండఁడు; తాను రూపిం పఁదలఁచుకొన్న భావస్ఫూర్తికు ఈ యితివృత్తము అనుకూల ముగ నుండునని యూహించి దీనిని గ్రహించి యుండును. పాత్రపోషణ సరణికూడ చారిత్రకముగాదు. అగ్బరు ఒక క్రొత్త మతమును స్థాపించిన వాఁడయ్యు ఈ నాటకమునఁ జూపఁబడినంత భక్తితత్పరుఁడు కాఁడు. రాణా అంత హేతు వాదియుఁగాఁడు. కథ చారిత్రకము కానియపుడు పాత్ర పోషణము చరిత్ర సమ్మతమా కాదా యను విచారముతో మనకుఁ బనిలేదు. ఈ నాటకమున నాయికా నాయకుల పాత్రపోషణము 'ట్రాజెడి' లక్షణములకు సరిపోవునా లేదా యను విషయమే ప్రస్తుతము విచారింపవలసిన యంశము. ట్రాజెడీ తత్త్వనిరూపణము దేశకాల పాత్రాను గుణముగ మాఱుచుండెను. గ్రీకు ట్రాజెడీలనుండి అరిస్టాటలు సమ కూర్చిన లక్షణములె చాల కాలమువఱకు అనుసరింపఁబడు చుండినవి. స్థూలముగ, ఈ ట్రాజెడీలను గ్రీకులవి, ఎలిజెబెతు కాలమునాటివి, ఆధునికులవి, అని మూడు వర్గములుగ విభజింపవచ్చును. గ్రీకు ట్రాజెడీయందు హాస్యజనకములగు సంభాషణము లుండకూడదు. వస్తువు కాలస్థల క్రియైక్యములను బొంది యుండవలయును ఒక్క దినమున జరుగఁ గలవిషయమై నాటక నిబద్ధము కావల యును. కాలము చెల్లుకొలఁది ట్రాజెడీ రచనయందు కొన్ని మార్పులు అజ్ఞాతముగను, అనివార్యముగను గలుగు

చుండెను. కొందఱు పండితులు ఇట్టి మార్పులకు సాధుత్వము ప్రసాదించు కొఱకు అరిస్టాటలు లక్షణసూత్రములను సాగదీసి క్రొత్తవ్యాఖ్యానములు చేయుచుండిరి. మఱింత లాగునప్పటికి ఆసూత్రములు తెగిపోయెను. అప్పటినుండియుఁ బ్రాఁతలక్షణములు క్రొత్త నాటకములకు మార్గదర్శకములు కావు అను వాదము బయలుదేరినది. షేక్స్పియరును అతని సమకాలీనులును నాటకములను రచియించిరి. ఈ నాటకములలోని విశిష్టత యేమనఁగా: స్థలైక్యముండదు—కథ కొన్నేండ్లపాటు జరిగినదిగనైన ఉండవచ్చును. ట్రాజెడీ చూచునప్పుడు కలుగు జాలి, భయము, చిత్తసంక్షోభము మున్నగువానియొక్క యొత్తిడివలన జనించు మనోనిర్భరత్వమును సడలించు హాస్యము కొన్ని పాత్రలమూలమున సంపాదింపఁబడును. ఈ కాలమునసే Tragi—Comedy అను మిశ్రనాటకము ప్రభవించినది. ఇటువంటి నాటకము గ్రీకు నాటక లక్షణములకు వ్యతిరేకము కావున గ్రాహ్యముకాదు అని కొందఱు ఆకాలపు రసలుబ్ధులు వాదించిరి. కాని, ఈ తరగతి నాటకము గ్రీకు లక్షణములకు వ్యతిరేకముగనున్నను, మానవ జీవితమునకుఁ బ్రతిబింబకముగనున్న దనియు ఇట్లు రచించుట కళానైపుణ్యమనియు జాన్సను పండితుఁడు సిద్ధాంతము చేసెను. పూర్వలక్షణ విరుద్ధములయ్యును బ్రజానురంజకము లగునేని అంగీకృతములయి అట్టి నాటకములు భావినాటక లక్షణములకు లక్ష్యములై పెంపొందఁగలవు.

కొంతకాలము జరిగినది. రాజకీయ సాంఘిక విప్లవములు, మానవసంఘమునఁ జిరకాలము వేళ్ళునాటుకొనియున్న పూర్వనీతులను, భావములను, పెకలించివైచినవి. మానవుని విజ్ఞానప్రపంచము దినదినము విరివియగుచున్నది. ప్రజాస్వామ్యములు గుర్తింపఁబడినవి. ప్రజాప్రభుత్వమే ఆదర్శకమను మూలసూత్రము అంగీకరింపఁబడినది. సర్వ మానవ సమత్వము నిరూపించుటకుఁ బ్రవక్తలు, వక్తలు, సంస్కర్తలు తమజీవితముల ధారవోయుచున్నారు. ఈవిప్లవము, ఈ సంచలనము కళలయందును బ్రతిఫలింపదా? ప్రతిఫలించినది. ఈ నవయుగ ప్రభాతమును సూచించు వేగుఁజుక్కయో యనునట్లు 1828-వ సంవత్సరమున నార్వేదేశమున ఇబ్‌సన్ అను నాటకకర్త జన్మించెను. ఈతని సిద్ధాంతము లేవియనిన: స్వగతము, జనాంతికము, అకాశభాషణము మొదలయిన నాటక సమయములు రచనయొక్క బాల్యావస్థను దెలుపునవి. ఇట్టి అస్వాభావిక సాధనసంపత్తి సాహాయ్యమపేక్షింపకయె నాటకములు రచింపవచ్చును. ట్రాజెడీ కథానాయకుఁడు రాజుగా నుండవలసిన యవసరము లేదు. కడపటి రంగమున నెత్తురు కాలువలు పాఱింపకయె అద్భుతమైన ట్రాజెడీని సృజింపవచ్చును. సామాన్య మానవుఁడు సాంఘిక జీవితమునందుఁ బ్రతిదినము అనుభవించు విషయములో నెంతో ట్రాజెడీకలదు. నాటకము వినోదముకొఱకై రచింపఁబడునది కాదు, సంఘమును శుద్ధిపఱచుటకు. ఈ సిద్ధాంతములే "Problem Plays" అను సాంఘిక నాటకములకు మూలములైనవి. షేక్స్పియరు నాటకములలోని "విధి బలీయము"

అను ధ్వని యిబ్బన్ నాటకములలో "వంశపారంపర్యాగత మానసిక శారీరక గుణావగుణము"ల బలముగా మాఱినది. ఈవిధముగఁ బ్రౌఢవంతమైన మానవసంఘముయొక్క మార్పులననుసరించి శిల్పతత్త్వ నిర్ణయమునందును భేదములు తలయెత్తుచుండగా ఈ రహస్యమును గుర్తింపలేక, విత్తనము నుండి చెట్టు మొలచినను వేళ్ళకు నంటుకొని నిరుపయోగ మయి క్రుళ్ళిపోవుచున్న ప్రాఁత బొళ్ళెములను పట్టుకొని ప్రేలాపు రసలుబ్ధుల సంకుచితస్వభావము అనుకంపనీయము కదా!

ఇట్లనుట మన పూర్వీకుల లక్షణ గ్రంథములనెల్లఁ ద్రోసిపుచ్చుటకాదు. వారి శక్తిసామర్థ్యములను గుర్తెఱుఁగక పోవుటకాదు. అనితరసాధ్యములగు వారి సిద్ధులను విస్మరించుట కాదు. వారి కీర్తికి భంగము కలిగింపవలయునను తలంపును కాదు. అట్లుచేయుట మనకాలి క్రింది కొమ్మను మనమె నఱుకు కొనఁజూచుటయె. నేఁజెప్పవచ్చినది ఏమనఁగా: ఎవ్వరును-అనుభవలననే మన పూర్వీకులును సర్వజ్ఞులుకారు. ఎప్పుడో వేయిసంవత్సరములకు జరుగఁబోవుమార్పులను ముందే యూహించి వానికెల్ల లక్షణములు వ్రాయుట మనుజులకు సాధ్యముకాదు. అందుకయి పూర్వులపయి ధ్వజమెత్తవలసిన యవసరమునులేదు. కాని, మనకులేనివి యితరులవలన గ్రహించినఁదప్పేమి? మనవిజ్ఞానమంతయు మనసొంతము దేనా? ఎన్నిజాతులు హిందూదేశముపై దాడివెడలినవి? ఎన్నివిధము లైన నాగరకతలతో మనకు సంబంధము కలిగినది? ఇట్టి సాంగత్యమువలన మనజాతియందును, విజ్ఞానమునందును, మార్పులు

కలుగలేదా? ఇది క్రొత్తయా? కులము చెడుటకు రసలుబ్ధుడు ఇప్పుడు ఉలుకనేల? ప్రాతవానిపై గౌరవము క్రొత్తవానిపై ద్వేషముగ మాఱకూడదు. సనాతన లాక్షణికుల యజ్ఞవేదికల కడ ఆధునిక కవికుమారుల సృష్టులను బలి యీయరాదు, సృష్టికిఁ గ్రొత్తప్రాఁతలు లేవు. అది యెప్పటికిని అభినవమే.

III

నాటకము రచింపఁ దలఁచుకొన్నపుడు, కవి భావము నందు ముఖ్యపాత్రలు పొడకట్టి భావింపను భావింపను ప్రస్ఫుటములగును. వాని చుట్టును, అచిరస్థాయంతముకడకు ఇనుప ముక్కలు పరుగెత్తుసట్టులఁ దక్కినపాత్రలు మూఁగుదురు. ఈ భావ ప్రతిమలు ప్రాణవంతములై యథార్థములట్లు తోఁచును. ఈయంతర్నాటకము బహిర్నాటకృతి దాల్చఁబోవునప్పటి యావేదనమును, మనో నిర్భరత్వమును, సృష్టిప్రేరకములగును– కళాసృష్టికి ఆదిమధ్యాంతములు గలవు. అది యవయవ సమన్వితమైన యాకృతి. అందు అవయవములకు అనురూపత్వము సహజముగఁ బొసఁగియుండును.

నాటక స్వరూపము "గోపుచ్ఛాకృతి" అని పూర్వులు నిర్వచించియున్నారు. నాటక వస్తువు ఏదియైన నొక స్పర్ధను (conflict.) ఆశ్రయించుకొని యుండును. ప్రాణికిని విధికిని, వ్యక్తికిని సంఘమునకును, మంచితనమునకును చెడ్డతనమునకును, భిన్న సంకల్పములు గల మనుష్యులకును, భిన్న మతములకును స్పర్ధపుట్టినపుడు దాని యుత్పత్త్యున్మీలనోపసంహారములే నాటకరూపమును ధరించును. ఈ పరస్పరస్పర్ధ వధాంత నాటకములయందు మఱింత వ్యక్తమగు చుండును.

ట్రూజెడి లక్షణములను గొన్నిటిని వివరించి యీ లక్షణములకు మీరానాటక మెంతవఱకు సరిపోవునో చూతము: కథానాయకుఁడు రాజుగాఁగాని లేక యంతటి గొప్పవాఁడుగాఁగాని యుండవలయును. ఇట్లనుట సర్వాజనీనత సంపాదించుట కొఱకు. రాజు దురవస్థయు, మరణమును రాష్ట్రమునకెల్ల సంబంధించి యుండును. కావున అట్టి నాయకుని యధఃపతనముఁ జూచినప్పుడు మనకును సహానుభూతి కలుగును. నాయకునకు ధీరత్వము, ఉదాత్తత, దృఢ సంకల్పశక్తి, మానవ సహజములగు గుణదోషములును ఉండవలయును. నాయకుఁడు సకల సద్గుణ సముపేతుఁడగా నుండెనేని మనకు జాలిపుట్టదు, విక్షణము కలుగును. నాయకుఁడనుభవించు దుఃఖమునకు ఆతఁడును గొంతవఱకు బాధ్యుఁడను సూచన లేనిదె మనము సహించియుండలేము. ఎట్టి కొఱంతయు లేనట్లు నాయకుని శీలము చిత్రించుట నీతిసూత్రులకు గుణమైనను, శిల్పులకు అది అవగుణమనియె నామనవి. ముఖ్యముగ వధాంత నాటకముల లోని నాయకునకు ఏవైన కొన్ని గుణలోపములు లేనియెడల దురవస్థ సంభవింపదు; నాయకుని పూర్వసుఖస్థితిని బ్రదర్శింపవలయును, లేక, సూచింపవలయును. ఉత్తరోత్తరము సంభవించు దురవస్థకును మున్నటి సౌఖ్యమునకుఁ గల తారతమ్యము వలన నాయకుని కష్టపాటు మఱింత నిశితముగ మనస్సున నంకితమగును. ఈ వధాంత నాటక ప్రపంచమున నాయకుని యుద్దేశములు, కోర్కెలు, కార్యరూపమునఁ బరిణమించునప్పుడు విరుద్ధ ఫల ప్రదములగును. "తానొకటి తలఁచిన దైవమొకటి తలఁచె" నను నానుడి యీనాయకుని యెడ

ముఖ్యముగ వర్తించును. తనకుఁగలుగు దురవస్థ ఆకస్మికముగ వచ్చును, కాని అందులోఁ దనకును గొంతబాధ్యతగలదు. నాయకునికిఁ గలుగు కష్టపరంపర వాని చేష్టలనుబట్టి అనివార్యముగను, ఒకొక్కపుడు విధి ప్రేరితమైనట్లును స్ఫురించును. ఉజ్జాతలూఁచు సుడిగాలిలో గిరికీలుగొట్టు ఎండుటాకు వలెఁ, దన్నేశక్తి ఆకర్షించుచున్నదో కనుఁగొనలేక, మనస్సులోని భావోద్వేగమును, బయట సంఘటనముల యుద్వేగమును ఏకమై ప్రవహింప, అందు చుక్కానిలేని నావికుని వలె నాయకుఁడు పయనించి యెట్టకేలకు చర్మ్మరణము నొందును.

నాయకుఁడు తానుజేయుపని దుష్టమని విశ్వసించెనేని న్యాయమార్గమవలంబించినట్లు నటింపఁడు; తాను పోరపాటుపడినను, దానిని పోరపాటని తెలిసికొనఁజాలక, న్యాయముకొఱకు, ధర్మముకొఱకుఁ బాటుపడుచున్నానను దృఢవిశ్వాసముతో దురవస్థకుఁ బాల్పడును. కావునసే మనకు జాలిగలుగును. ఒకేదృష్టియందుఁ బక్షపాతము, ఒకే మార్గమునందుఁ బట్టుదలయు నతనికి సహజము. ఇందేదియుఁ గార్యకారణ సంబంధమునకు వెలియై యుండదు. నాయకునకు సంభవించు కష్టములు దైవదత్తములుగావు; మానవచేష్టా జనితములు. నాయకుని యధఃపతనము, అతని దుష్టత్వము వలన కలుగునదికాదు; పోరపాటువలననో తొందరపాటు వలననో కలుగును. గొప్పగుణములతోఁబాటు అజాగరూకతయు, కొన్నిటియందు అజ్ఞానమును, గర్వమును, ఉద్రిక్తభావమును, సంశయమును ఈ నాయకున కుండును. కావునసే

యొక యింగ్లీషు విమర్శకుఁడు షేక్స్పియరు ట్రాజెడీలలోని నాయికా నాయకులను గుఱించి యిట్లు చెప్పెను:—

"Hamlet, the "religious" and the lover, doomed to set the world aright; Othello, stupid and unintellectual, fiery in his passions, set opposite to Iago; Iago, unscrupulous and clever; literally tempted by Othello's imbecility; Lear conceited and proud, unobservant and credulous, faced by his evil daughters and Cordelia; Macbeth, emotional and weak, yet ambitious, met by the witches and goaded on by his wife; Lady Macbeth hard and self seeking, confronted by temptation; Coriolanus over weening in his pride condemned to stoop to plebians; Antony, amorous and doting met by Cleopatra; all of these are placed in the exact situation which they are incapable of mastering"

నాయికా నాయకులలోని యిట్టి గుణలోపములవలననే ట్రాజెడి సంభవించును.

"మఱియు యీ చావు నాటకముల మార్గమున మీరా నరయుదుమేని" అని రసలుబ్ధుని వ్యంగ్యచమత్కారము! "కుంభుని యుదాత్తత తటాలున ఉపస్థితముకాదు. నిపుణముగ చూచినను కాదు. ఎంత గొప్పవాఁడురా అని సూక్ష్మమైనను సూటియైన సూచన వినంబడదు. అభిమాని, విషయలోలుఁడు, ఉద్ధతుఁడు, మొండికట్టె, జాల్మాఁడు, అని గ్రహింపఁబడుచుండును. ఎంత పదోచ్చితుఁడో అంత గుణోచ్చితుఁడు చిత్తమునం బాదుకొనని వాని పతనము ఏపాటి యుపదేశపటువు?" అని దోషారోపణము. ఈ రసలుబ్ధుఁడు "ఉపపత్త్యుపన్యాసపూర్వకముగ వాగారంభముం బొర

యించు" వాఁడయ్యు నేకారణముం జూపక యిట నిట్లు వాగారంభముం బొరయించుటఁ దనతర్కమునందే తనకుఁ బ్రత్యయము చాలమిని సూచించుచున్నది.

రాణా హేతు వాది (Rationalist) గా నగపడు చున్నాఁడు. అతని యభిప్రాయములు కొన్ని హిందూమత విరుద్ధములు. ఆతనికి స్వర్గనరకములయందు నమ్మకము లేదు. ప్రజలను భయపెట్టి ధర్మమాచరింపఁజేయుట కొఱకును, బర లోక సుఖముపై నాసపెట్టుకొని యిహలోక కష్టములను సహించియుండుటకును, నరకము స్వర్గము పౌరాణికులు సృజించిన గాలిమేడలని ఆతని నమ్మకము. ఊహామాత్రమైన పాలసముద్రమునమ్మి చేతిలోని పాయసపుఁ బాత్ర జాఱి విడువఁడు. యౌవన సౌందర్యము లెట్లు కాలబద్ధములో మానవుని భోగాభిలాషకూడ నట్లె యనియు ఆకామ్యాను రాగమె అనుభక్తమయి వార్ధక్యమునందుఁ దప్తకాంచనము వలె నిష్కల్మషమయి బహుకాల సహవాస జనిత బాంధ వ్యముగ మాఱుననియుఁ దలంచుకొని సామాన్యగృహస్థ ధర్మములను కుంభుఁడు ఆచరించుచుండెను. కపటగురువులు లోకమును మోసగించు చున్నారనియు, వారి పలుకుబడి సన్నగిల్లిన నేగాని లోకులకు మూఢభక్తి నశింపదనియు నాతఁడు తలంచెను. లోకాతీత ధర్మములు కుక్కమూతి పిందియలని యాతని భావము. వైదిక మతమునకు విరుద్ధములైన మత ములు లేవదీసిన ఆచార్యులందఱు అవివేకులుకారు, అవి వారి మత విశ్వాసములు.

రాణా పౌరుషవంతుఁడు: మొగలాయీలు హిందూ రాజ్యమును ధ్వంసముచేయ నుద్యుక్తులై నప్పుడు వారికిఁ బ్రతిస్పర్ధి గనిల్చి రసపుత్ర గౌరవమును నిల్పిన మహా యోధుఁడు; మాన సింహాదులవంటి కొందఱు రసపుత్రులు అగ్బరునకు లోఁబడి చుట్టఱికములు కల్పించుకొని గులాములై యుండ తానొక్కఁడె యగ్బరును ధిక్కరించెను. పౌరుషము నందును వీరత్వమునందును గొప్పతనము లేదా? రాణా అగ్బరునకుఁ బ్రబల ద్వేషి. అతని నామము నుచ్చరించుట గూడఁ దనరాజ్యమున అపరాధము. అగ్బరు హిందూమత పక్షపాతమను ఆచ్ఛాదనము మఱుగునఁ దాఁగి మెల్ల మెల్లగ హిందూరాజ్యములఁ గబళించు చున్నాఁడు; ఆతని రాజనీతి అతలస్పర్శి అని రాణా యెఱుంగును. కావుననే అతనిపై రాణాకు ద్వేషము. ఇది క్షత్త్రియ సహజము, వారు సన్న్యాసులు కారుగదా!

రాణా సంస్కరణాభిలాషి: ప్రజల మనస్సులే కాదు పాలనాయంత్రముకూడ సంస్కరింపఁ బడవలయును అని తలంచెను. లౌకిక విజ్ఞానమును, జీవితమును ద్వేషింపఁజేయు ప్రతిమతమును మానవుని మనోవికాసమునకు అంతరాయ మనియు, అట్టి సంకుచిత మతములను దనరాజ్యమున సమ్మార్జింప వలయుననియుఁ గుంభుని అభిప్రాయమును సంకల్ప మునై యుండెను. కాని, కాలము ప్రతికూలము. పాపము! ఈ సంస్కర్తలు ఎప్పటికిని 'Tragic hero' పాత్రములుగానే పరిణమించు చుందురు. ఏసుక్రీస్తు మతమును సంస్కరింపఁ బోయి "సిలువ" పైఁ ప్రాణములు విడిచెను. అమానుల్లా

సంఘమును సంస్కరింపఁబోయి రాజ్యభ్రష్టుఁడాయెను. ఇట్టి వీరిపతనమునందును గొప్పతనము గలదు!

రాణా మేవాడు రాజ్యాధిపతి యయ్యు సర్వసుల భుఁడు. తలారి దర్శనము కోరినపుడు మంత్రులాటంక పెట్టినను "నా దర్శనముఁ గోరిన వారినెవ్వరిని ఆటంక పెట్టకుఁడు. నాకంతకంటె నుత్తమ కార్యమేమున్నది", అని వారిని మందలించి తన విధిపరత్వమును స్ఫురింపఁజేసెను.

రాణా ధీరుఁడు: న్యాయైక పక్షపాతి. "నిజమెఱింగిన వెనుక నాకర్తవ్యమును అనుకూలముగ మఱచు నంతటి భీరువునుగాను; స్వార్థపరుఁడను గాను. నా సంకల్పము న్యాయ్యము. నా న్యాయ్య సంకల్పము శాసనము. నాశాస నము పొల్లుపోవక కొనసాగి తీఱవలయును" అను వీరుని దృఢ నిశ్చయమున గొప్పతనము లేదా?

రాణా అభిమాని. అభిమానము దానునియందు అవగుణముగ నుండవచ్చును; రాజునందు అది గుణమె యగును.

రాణా ఉద్ధతుఁడు. అవును. తప్పేమి? అగ్గబరునంతటి వానినే యెదిరించి మొగలాయి ప్రభువులకు గుండెగాలమయి శిశోదియా వంశకీర్తి దిగంత విశ్రాంతము గావించిన కుంభ రాణాయందు గర్వము అస్థానికముగాదు. ఉచితమే.

రాణా విషయలోలుఁడా? సంస్కృత నాటకముల లోని నాయకులతో సరిపోల్చిచూచిన, వారికంటె రాణా విషయలోలుఁడుకాఁడు; వారికంటె నెల్లవిధముల నుత్త

ముఁడు. వేఁటకుగాఁ దపోవనమునకుఁబోయి, బ్రాహ్మణ ఋషియైన కణ్వుని యాశ్రమమున అపూర్వ లావణ్యవతిని శకుంతలనుజూచి కామప్రేరితుఁడై తండ్రియనుమతిలేక ఆమెను (అంతఃపురము దేవేఁగులచే నిండియున్నను) గాంధర్వ విధిఁబరిణయమాడి గర్భవతినిఁజేసి, ఆర్యమైన మనసు ఉచిత మైనదానినే కోరినదని తనతప్పును దుడిచివేసికొని, ధర్మ ప్రకారము పట్టమహిషి కుమారునకే రాజ్యము చెందవలసి యుండఁగా, మోహాంధీకృత చిత్తుఁడయి శకుంతల కుమారు నకే రాజ్యము నొసఁగునట్లు వాగ్దానముచేసి, పరారియైన దుష్యంతుఁడు విషయలోలుఁడు కాకుండునెట్లు? ఏకపత్నీ వ్రతుఁడయి, విరాగిణియైన తనభార్యను ఏయుపాయముచేత నైనను దనవంకకుఁ ద్రిప్పుకొని పూర్వమువలె గార్హస్థ్య జీవితము గడుపుకొన ప్రయత్నించిన రాణా విషయలోలుఁడగునెట్లు? రాణా పరస్త్రీ పరాఙ్ముఖుఁడైనందుననేగదా మీరాకొఱకంత పాటుపడెను. గృహస్థులకుఁ దమభార్యలతో సంసారము చేయువలయుననుకోర్కె విషయలోలత్వమైన యెడల ఇఁక గార్హస్థ్యము గతియేమియగును?

రాణా మొండికట్టెయా? కాఁడు; తనకు యథార్థమని తోఁచినదానిని నిర్వహించుకొను పట్టుదలయు సంకల్పశక్తి యుఁగల తేజశ్శాలి.

రాణా జాల్మఁడా? జాల్మఁడనుటకు మూడర్థములు గలవు. యోచించి పనిచేయలేనివాఁడు. క్రూరుఁడు. అజ్ఞుఁడు. అజ్ఞతయేదో యొకవిషయమునందు; అది తాత్కాలికము. క్రూరత్వము కడపటి దశయందు వచ్చును; అదియుఁదాత్కా

లిక మే, స్వభావముకాదు. తానుజేయు ప్రతికార్యము నిశ్చల మును నిర్వికారమునగు మనస్సుతో యోచించి చేయునేని 'ట్రాజెడి' అసంభవము. ఈర్ష్యాగ్రస్తుని చిత్తము యోగి మనస్సువలె నిర్వికారముగ నుండదు. ఆసమయమున నెట్టి వానికిని బుద్ధి మందగించును. బంగారుజింక లోకమునసుం డునా యుండదా అను వివేచనముకూడ లేదాయెఁగదా రామునకు? రాక్షసుల మాయా తంత్రములు ఆయన యెఱుఁ గనివికావు. రాముఁడా జింకనేల తరుముకొని పోవలయును? మొట్ట మొదటినుండియు సీత లక్ష్మణుని భక్తివిశ్వాసముల నెఱుంగునుగదా! అతనిని శంకించి సీత యేల కర్కశోరముగ దూషింపవలయును? అంతమాత్రము తెలియదా? వారిరువురు "నిశ్చలముగ నిర్వికారముగ" యోచించుకొని చరించియుండిన సీత రావణాపహృతయైయుండదుగదా, దీనికి సమాధానమేమి? కాలముకానియపుడు ఎట్టివారికైనను బుద్ధిమాంద్యముకలు గును– అట్లనుటచేత వారు స్వాభావికముగ మందబుద్ధులని చెప్పుటకు వీలుకలదా?

రాణా యధఃపతనమునకు హేతువులయిన స్ఖాలిత్యము లేవి?—అతిలోక మనస్తత్వమును గుర్తెఱుఁగలేని యజ్ఞానము, పౌరాణిక మతము నెడ సహానుభూతిలేకయుండుట, భ్రాతృప్రతాపము, సంశయశీలత, అభిమానము, తొందరపాటు, అగ్గిబు ద్ధి పైని ప్రబలద్వేషము, నిశ్చలన్యాయైకనిరతి, దృఢసంకల్పము. వీనిలోఁగొన్నిగాని అన్నియుంగాని కొఱంతపడియుండిన కుంభ రాణా జీవితము మఱియొక తీరుగా నుండి యుండెడిది.

V. R. NARLA MEMORIAL LIBRARY
V. R. NARLA
P. P. R. I.
Acc. No.

IV

"ఆ మీరాదేవి సౌజన్య సతీత్వాములు ఇతర స్త్రీజన విలక్షణములు; పతి దేవత కాకున్నను మీర కృష్ణైక నిరతచిత్త; మీర మహిమ యిల్లుదాటి ఊరుదాటి హిమశైల నలసేతువు లందు విశ్రమించినది... మీరపాట భూలోక దుర్లభము... పతియెడ ఆమెకావించిన యపచారము కానరాదు. అట్టి తేజోమూర్తియందుఁ దొలుత అపరాగ శంకయుఁ దరువాత (కృష్ణగతమునందె) అన్యరాగశంకయు వహించి హిందువు, వివేకి, రాజు, ఉపశ్రుతి కులికినవాఁడు ఆస్తికుఁడు కానేకాఁడా? ఆమెసర్వము చేతను బవిత్రీకరింపఁబడిన భావములనడుమ నుండువాఁడయ్యు కుంభుఁడు భ్రాంతిచెంది ఈర్ష్యపొంది...దాని నిముడ్చుకొనఁజాలక.....అమాత్యులును బ్రజలును బెడిసి పోగా..... మీరను ఆచావునకు పాత్రీకరించెను. తరువాత ఒకయలంతిపొరచే తానునుంజచ్చెను - ఇదేమి ట్రాజెడి! దీన నేమి యుపదేశము? నాస్తికపితయు ఆస్తికపుత్రుఁడు హిరణ్య ప్రహ్లాదులు... మఱి పతియు పత్నియు మీరా కుంభులు... ప్రజామాత్య కింకరాది సర్వజనాంగీకారానంగీకారములు వినంబడుచు పదరనీక విమర్శకు ఎడమిచ్చుచునే యుండగా అట్లుచంపను చావను అంత అననురూపులా? అసంభావ్య వస్తువు చిత్తమున కెక్కదు." అని రసలుబ్ధుని వాదధోరణి. దీనినుండి కొన్ని సిద్ధాంతములు ప్రశ్నలు విడఁదీయవచ్చును.

మీరా భక్తురాలు; కృష్ణధ్యానపరాయణ. రాజు హిందువు, వివేకి; (ఇంతకుముందు జాల్మాఁడని నిందించియుండెను) పవిత్రభావముల మధ్యనుండిననాఁడు ఆస్తికుఁడెట్లు కాక

యుండును? అట్టివాఁడు మీరాకు అట్టిచావు ఎట్లువిధించును? అట్టిసతిపై శంక యెట్లు కలుగును? ట్రూజెడి సంభవించుటకు కులభేదము, మతభేద ముండవలయును. ఏడెనిమిది సంవత్సరములు సుఖజీవనము చేయుచుండిన భార్యాభర్తల నడుమ ట్రూజెడి పుట్టదు. రాణా నెమ్మదిగ నాలోచించుకొని తన భ్రాంతిని తొలగించుకొని యుండవలయును. అట్లు జరుగలేదు కావున ఇది అసంభావ్య వస్తువు. కావుననే ఈవస్తువు రస లుబ్ధునిచిత్తమున కెక్కలేదు!

రసలుబ్ధుఁడు మీరాను ఆటఁజూచు సామాజికుల దృష్టితోఁ జూచుచున్నాఁడేగాని కుంభరాణా దృష్టితోఁ జూచుటలేదు. ఇదిగొప్ప పొరపాటు. ఈ పొరయే రసలుబ్ధునిఁ 'ట్రూజెడి'కి హేతువైనది. రాణాకు మీరా ఎట్లగపడును? ఆతని మనస్తత్త్వమేమి? అని విచారింపవలదా? పాండవులు, భీష్ముఁడు, విదురుఁడును శ్రీకృష్ణుని దైవస్వరూపమని తలంచినను, రాజబంధువు బంధించుటకుఁ దగినవాఁడు అనియేగదా దుర్యోధనుఁడు తలంచెను. వేనవేలు సంవత్సరములు ఘోర తపమాచరించి చావులేని వరముఁగొన్న హిరణ్యకశిపుఁడు పరమభక్తుఁడైన ప్రహ్లాదుని భక్తిప్రభావము నడుమనుండియు ఏల విష్ణుభక్తుఁడుగ మాఱలేదు? ఎవరి ప్రభావము నడుమనుండి విభీషణుఁడు రామభక్తుఁడాయెను? అది వారివారి మనస్తత్త్వములఁ బట్టియుండును. హిందువుల కుటుంబములలోఁ బుట్టిన యందఱును ఆస్తికులు కావలయునను నియతియున్నదా? మతము వంశపారంపర్యాగతముగు ఆస్తి వలె వారసులకు లభించునదిగాదు. అది వ్యక్తుల చిత్తసంస్కా-

రముల ననుసరించి భిన్నభిన్నముగ నుండును. మీరా పరమ భక్తురాలని ప్రజలు అమాత్యులుతలంచిరి. రాణా మాత్రము "మతావేశము కూడ నొక మానసిక వ్యాధి" యని తలంచెను. 'Modern Psychology' 'Abnormal Psycholoyg' అను మనస్తత్త్వశాస్త్ర గ్రంథములఁ జదువుదుమేని రాణా నిశ్చయమునకు హేతువులు కలవని తెలియకపోదు- మన మతాభిప్రాయములకును రాణా అభిప్రాయములకును భేదము కలిగినంత మాత్రమున నాటకమును నిందింపఁదగదు- నాటక మున నాయకుని కవి యెట్లు చిత్రించెనని మాత్రమే విచారింపవలయును.

ఈ సందర్భమున T. G. Wainewright గారి యభిప్రాయ మెంతయు సమంజసముగ నున్నది: "I hold that no work of art can be tried otherwise than by laws deduced from itself : whether or not it be consistent with *itself* is the question."

మీరారాణాలకు రసలుబ్ధుఁడు కోరిన మతభేదమును గలదు. కాని ఆమత భేదమే ఈ నాటకమున ట్రాజెడీకి మూల కారణము కాదు. అది ట్రాజెడీ బీజములు; సులువుగా నంకురించి వృద్ధిచెందుటకు దగిన ద్వేషమును బుట్టించి అనుకూల పరిస్థితుల సంపాదించినది. ఏడెనిమిదేండ్లు సుఖజీవనముసలిపి అన్యోన్యము మనసు కలసియుండిన భార్యాభర్తల మధ్య 'ట్రాజెడీ' సంభవించిననే అది మతాంత ఘోరముగ నుండును. మీరా యందు సద్గుణములేకాక యామె చరమదశకుఁ గారణమైన గుణలోపములుకూడఁ గొన్నికలవు. వాని ఫలిత

మేమి? అవి కుంభునెట్లు సంక్షోభపెట్టినవి? అనువిషయములే మనకుఁ జర్చనీయాంశములు. అతిలోక మతావేశము, నిశ్చల వైరాగ్యముగల కులకాంత సామాన్యగృహస్థుల కుటుంబములో ఇముడదు. పతి యిష్టానుసారము వర్తింపకుండుట, గృహకృత్యములందు నిరాదరణము, పతి హృదయమును తన మాటలు ఎట్లు నొప్పించునో దెలిసికొన నేరక తాను విన్న సంగతి దాఁపరికములేక మాటలాడు అమాయకత్వము, విషయ పరాఙ్ముఖతచే అజ్ఞాతముగ నలవడిన తృణీకరణ భావము, మీరాశీలములోని రంధ్రములు. మీరామాటలు కొన్ని సామాన్య ధర్మ ప్రవచనములుగ నుద్దిష్టములయ్యును శాప ప్రాయములుగ నగపట్టును. ఈసంగతి మీరా యెఱుంగదు. బేడిసను గుఱించి చెప్పినపుడు "మీనరాజ, విధియదృశ్య హస్తము వెనువెంట నంటి మృత్యుపదములకడకు నిన్నీడ్చునయ్యె!' అనియు మఱియొకచోట "పాలనా దండశక్తి నశ్వర మటన్న పిడుగువంటి సత్యంబును వినెద వెపుడో" అనియు మీరా యన్నపుడు రాణా ఏవిధముగ నర్థముచేసికొనును?

రాణా పదరక యేల ఆలోచింపలేదు అను ప్రశ్న అవిచార మూలకము. కొందఱు విమర్శకులు రాణాను ఒథెల్లోతో సరిపోల్చిరి. పాత్రపోషణమునందుఁ జూపట్టు ఇతర భేదము లేకాక వారిరువురకు ఈక్రింది భేదముకలదు: ఒథెల్లో యేమాత్రము విచారించినను ట్రాజెడి జరిగియుండదు. ప్లాటును కూలిపోయియుండును. డెస్‌డెమోనాను ఒథెల్లో సంశయించు చుండెనేగాని అయాగోను ఒక్కక్షణమైన సంశయింపలేదు. "కాసియోకు నేను చేతిగుడ్డను ఈయలేదు-విచారింపుము"

అని భార్య చెప్పినను ఒకథల్లో విచారింపలేదు. అట్లు విచారించిన అయాగో కుట్ర బయటబడును; డెస్ డెమోనా చావదు. ఈనాటకమున అట్లుగాదు. రాణావిచారించెను. విచారించుకొలఁది ఆతని సందేహము బలమగుచుండెను. ప్రత్యక్ష సాక్ష్యము దొరకినది. దానిని రాణా దృఢముగ నమ్మెను. అతఁడు న్యాయాధిపతివలె "నిష్పక్షపాతముగ" విచారించుచున్నానని యనుకొనెనేగాని సాక్ష్యమును మానేర్ష్యాసంక్షుబ్ధ చిత్తుఁడగు భర్తవలెఁ దనముక్కునకు సూటిగ సమన్వయము చేసికొనుచుండెను. మొగలాయి, అందులోఁ దనకుఁ బ్రబలవిరోధి, తనయంతఃపురము జొచ్చి రాజపుత్ర కులమునకె కళంకముఁ దెచ్చెను. మానవంతుఁడగు క్షత్త్రియుని చిత్త మెట్లుండును? పదరక యోచించుటకుఁ దగియుండునా? ఇది భ్రాంతిగాదాయని యందురేమొ. అది భ్రాంతియని తెలిసినది యితరులకు. రాణా యథార్థమనియే గదా నమ్మియుండెను. అట్లయ్యు సహజముగ సంశయశీలుఁడు గాన తన్నుఁ దానె శంకించుకొనెను. "అందఱు వెడలిపోయిరి" అని కుమారసింహుఁడు చెప్పినపుడు "అమాత్యులు, ప్రజలు, సైనికులు, మీరాసతీత్వమును సంశయింపరు. నేనేమైనఁ బొరపడితినా?" అని యొక్కింత ఆలోచించును. తక్షణమె అగ్గబరు అంతఃపురమును జొచ్చెనన్న స్మృతి ఆతని భావవీథినిఁ బిశాచన్యత్యము గావించును. మనస్సులో నుడిగాలి రేఁగును; వేయి అగ్నిపర్వతములు ఒక్కమ్మడి ప్రేలి యగ్నితప్త పాషాణద్రవమును బైకెగఁజిమ్మును. క్రోధానల జ్వాలలు ఊర్ధ్వమై బయటికి వెడలును; ఇఁక రాణా యెవ్వరి యభి

ప్రాయములను సరకు గొనఁడు "న్యాయమని తోఁచినయెడలఁ బ్రపంచమునకుఁ బ్రతిస్పర్ధిగనైన నిలువగలను" అని గర్జించును. ఇట్టి మూర్తిని మనము భావించుకొనఁ గలుగుదుమేని "passion rising to tragic grandness" అనువర్ణనమునకు నుదాహరణప్రాయముగా నుండదా? మనసులో నిట్టి విప్లవము చెలరేఁగుచుండఁగా రాణా "పదరక" యోచించుటకు అతఁడేమి జీవన్ముక్తికి యత్నించుచున్న యోగియా?

"ప్రహ్లాద భృగుపతన గరళ పానాదులంబోలె నే సౌజన్యము ఇట్లు పీడింపఁబడుచున్నదను జాలి కలుగక ధార్జన్యము ఎట్లు భంగపడునో చూతము అను కుతూహలము వినోదము కలుగుచుండును. ఇదే అతిమానుష సంభావమునకు ఫలము! ఇందేమి ట్రాజెడి!.....రాత్రి పడుకింట ఏకాంతమున కంఠమున తదాలింగనము ఎదురు చూచుచున్నట్టిది, అకాండముగ ఆకంఠమె ఆచేతనే నులుమంబడి చచ్చుట! అదిట్రాజెడి!" అని రసలుబ్ధుఁడు డెస్ డెమోనా బాయిని స్మరించినాఁడు! మీరాబాయి పాత్రపోషణమునందు అమానుషత్వము లేదు. ఆమె పరమ భక్తురాలు; కృష్ణధ్యాన పరాయణ; గాన కుశల, అయినను అట్లుండుట యమానుషముగాదు. ఆమె మహిమలు (miracles) చూపింపలేదు. ప్రహ్లాదుఁడు ఏనుఁగులచేఁ ద్రొక్కింపఁబడియుఁ, గొండచరులనుండి క్రిందికిఁ ద్రోయబడియు, విషమిప్పింపఁబడియుఁ జావలేదు. ఇదిగదా యమానుషత్వము! మీరాబాయి ప్రహ్లాదునివలె మృత్యువును జయింపలేదు. ఆమెయందు మానవ సహజములగు కొన్ని లోపములును గలవు. అవి యింతకు ముందే ప్రస్తావింపఁ బడినవి.

డెస్ డెమోనా వధ అట్లు చూపింపఁ బడవలయునా లేదా అనువిషయమును గుఱించి ఆంగ్లేయ విమర్శకులలోనే భిన్నాభిప్రాయములు గలవు.

"To some readers again, parts of Othello appear shocking or horrible. They think...that in these parts Shakespeare has sinned against cannons of art, by representing on the stage a violence or brutality the effect of which is unnecessarily painful and rather sensational than tragic."

ఇట్టి విషయములందు సామాజికుల మన స్తత్వముల ననుసరించి భిన్నాభిప్రాయములు పొడసూపుచుండును.

"పురుషేర్ష్యాకారణమును" రచ్చకెక్కించి మంత్రుల యెదుట విచారించుట మందమనియు, ఇందు రహస్యముండ వలయుననియు మఱియొక యూహ్యాపము. కుంభరాణా మంత్రులను బిలిపించినది పురుషేర్ష్యాకారణమును విచారించుటకు గాదు. అమూల్యమైన వజ్రహారము తన యంతఃపురదాసి సుశీల ధరించుకొనియున్నదను సంగతివిని, బలవంతరావు వలన కొన్నిసంగతులు తెలియఁగా, ఆ విషయములను విచారించుటకు మంత్రులను రానించెను. ఆవిచారణయందు వైద్యుల వృత్తాంతమును ఆ వైద్యులలో నొకఁడు అగ్గబరగుటయుఁ దెలియవచ్చెను. పురుషేర్ష్యాకారణము రహస్యముగ నుండుటకు వీలులేదు. రాణా ఈర్ష్యాగ్రస్తుఁడగు భర్తయేగాదు; న్యాయాధిపతికూడ. ఈరెంటికింగల భేదమును గ్రహించుటవలననే రాణాగొప్పతనమును ధర్మబుద్ధియు గోచరించుచున్నవి. ఏదో యొకనాటకమును దీసికొని దానికిని ఈనాటక

మునకును సాదృశ్యము కల్పించి 'అందుండినట్లే యిందేల యుండలేదు' అని ప్రశ్నించుట కూడ ఒకవిమర్శన చమత్కృతికాఁబోలు!

అగ్బరు తాక్ సేనుల సంభాషణము మెట్టవేదాంతము కాదు– ఆసంభాషణమూలమున మనకు వారి మనస్తత్త్వము చక్కగ స్ఫురించును. ఇట్టిభాగములు చదువునప్పుడు ఇంపుగనే యుండును. కాని ప్రదర్శన పరముగఁ జూచినపుడు, కార్య ప్రచలనము లేనందువలన, కొంత (విసువు) monotony గోచరించును. కవి యీ "సీనును" కొంత సంస్కరించిన బాగుగ నుండుననియే నాయాశయమును.

V

"కొన్నియసంభవములు" అనుశీర్షిక క్రింద పదునేడు అసంభవములను మీరా నాటకమునందు రసలుబ్ధుఁడు చూపించెను. ఈ యసంభవములను గుఱించి కొంత తెలిసి కొనవలయును. నాటకమును గొందఱు "ప్రతిరసంబునఁ దన్మయ భావమొంది" చదువుదురు. అట్టి పఠితలు, ఆటచూచునప్పుడు ఎట్టి యానందమునుంబొందుదురో అట్టి యానందమునే చదువునప్పుడును పొందుదురు. కొందఱు దోషనిరూపణము కొఱకే చదువుదురు. ఇట్లు చదువువారికి అసంభవములని తోఁచినవి ఆటచూచు వారికిగాని, మొదటివిధమునఁ జదివిన వారికిఁగాని తోఁపవు. నాటకమునఁ జదువునపుడు కొన్ని సంభవములుగఁ దోఁచినవి ప్రదర్శింపఁబడినపుడు అసంభవములుగ నగపడును. ఉదాహరణము: ఉత్తరరామచరితమున, దండ

కాటవియందు రాముఁడు సీతను స్మరించుకొని దుఃఖించు ఘట్టమున, వనదేవతల ప్రభావముచే అదృశ్యమానయగు సీత రాముని ప్రక్క నిలఁబడియుండును. ఈభాగముఁ జదువు నప్పుడు అసంభవమేమియు గోచరింపదు. ఏలయన సీత అదృశ్యగానున్నదని యనుకొనుటకు మనభావము ఉపకరించును. కాని, యీఘట్టము ప్రదర్శింపఁబడినపుడు, సీత యగపడు చుండఁగా అగపడలేదని భావించి మనకన్నులను వంచించు కొనఁజూచుట యసాధ్యము.

వ్యవహార సిద్ధమైన ప్రపంచము వేఱు; నాటక ప్రపంచము వేఱు; ఒకదానిని వేఱొకదాని దృష్టితో విమర్శించుట-ఉభయము నెఱుంగమికిఁ దార్కాణము. కొన్నిదినములు, నెలలు, సంవత్సరములలో జరిగిన విషయము మూఁడు నాలుగు గంటలలోఁ బ్రదర్శింపఁబడవలసిన రూపకముగ నిర్మిత మగుటచేతఁ గొన్నిసమయములను నియమములను కవులు అంగీకరించిరి. సామాజికులు నాటక ప్రదర్శనములోని కాల సంకోచమునకు అలవాటుపడిన వారగుట అందు అసంభవత్వము గోచరింపదు.

ఒకప్పుడును సంభవములుకొన్ని అసంభవములుగ నగపడును. "Truth is stranger than fiction" అను సామెత మనము విననిది కాదు. నాటకము చూచువారికిని జదువువారికిని అసంభవములని తోఁపఁదగువానినే కవి ఆలోచింపవలయును.

రసలుబ్ధుఁడు నాటకములోని విషయములను జ్ఞప్తి పెట్టుకొని యుండిన ఇన్ని సందేహములకుఁ బ్రశ్నలకు అవ

కాశముండి యుండదు; వ్యాసమును ఇంతనిడివియై యుండదు. తన ప్రశ్నలకుఁ జాలవఱకు నాటకమునందె ప్రత్యుత్తరము లున్నవి. అసంభవనముల విచారించునపుడు రసలుబ్ధుని సంఖ్యా క్రమమునే అనుసరించెదను.

(1) ప్రబల శత్రువైన కుంభరాణా రాజ్యమునఁ దాను బ్రవేశించుట సాహసకార్యమని అగ్బరెఱుంగును; అయినను మీరా సందర్శనము అవశ్యకర్తవ్యమని తలఁచెను. ఇందువలన అగ్బరుని సాహసికత్వము (Adventurous spirit) మనకు గోచరించును. రహస్యముగఁ బరదేశమును బ్రవేశించు వారు రాజులయ్యను మందుగుండుసామగ్రి వెంటఁబెట్టుకొని పట్టపు టేనుఁగు నెక్కి రాచుగదా! అగ్బరు, విరోధి రాష్ట్రి మున నిస్సహాయుఁడై కాలువెట్టఁడు అను ప్రజల నమ్మిక మె వానికి రక్షక కవచమైనది. యూరపుదేశమున జరిగిన మహా సంగ్రామమున కైజరు పుత్రులలో నొకఁడు మాఱువేసమున, సీ నదిప్రక్క విడిసిన ఫ్రెంచి పటాలపు బిడారునఁ బ్రవేశించి కావించిన యద్భుత సాహసకార్యములు చదివిన అవి సత్య ములా లేక కల్పితములా యను సందేహమునకుఁ బాల్పడుదుము.

అగ్బరు వజ్రహారమును గురుకట్నముగ సమర్పించెను. తానట్లుచేయుట పొరపాటని వెనుకచింతించెను. ఇట్టి పొర పాటులుపడు మనుష్యులొకచోటఁజేరినప్పుడే ట్రాజెడీ కలు గును.

(2) ఇచ్చట రసాలుబ్ధుఁడు పొరపడినాఁడు. రాణా కుమారసింహుని మొదటితూరి పంపినపుడు అగ్బరును చంపు

టకుగాఁ బంపలేదు; మీరాను అనుసరించుటకు బంపెను. చంపుటకుఁ దనకు ఆజ్ఞ లేదుగావున రాణాయొద్దకు వచ్చెను. రసలుబ్ధుఁడు తలఁచినట్లు "చంపుమన్న యాజ్ఞను" దాను దాఁటలేదు. ఆయాజ్ఞ రెండవతూరిది.

(౩) రసలుబ్ధుఁడు తన సంచిలోని "రేడియం కాటుక"ను దానుకన్నులకుఁ జరుముకొన్నట్లు తోఁపదు. అట్లయిన అప్పటి పరిస్థితులు చక్కగ గోచరించియుండును. ఆసమయమున మంత్రులును ఇతరసేవకులును బెడిసిపోయి యుండిరి. కుమారసింహుఁడొక్కఁడే రాణాకుఁ బట్టుఁగొమ్మ. కావున వానినే పంపెను. ఇదంతయు రాత్రికాలమున రాజప్రాసాదమున జరిగెను. బెడిసిపోయిన మంత్రులకును దండనాథునకును ఈసంగతి యెట్లు తెలిసి రాణాకు సహాయపడుదురు? రాణా సొంతముగ వారి సహాయ్యముకోరునా? అగ్బరు సిబ్బందితో రాలేదని రాణా యెఱుంగును. అట్లు వచ్చియుండిన వేగుల వారు తెలిసికోకయుందురా? తలారి చెప్పినపుడుగూడ ఇద్దఱు బాటసారులనియేగదా చెప్పెను. అగ్బరును జంపుటకు ఒక్క రసపుత్రుని బంపుట తప్పఁట! పద్మినీ సందర్శనమునకై వచ్చిన యల్లాయుద్దీనుని ముప్పదివేల సైన్యమును ఏడు వందలమంది రసపుత్రవీరులేగదా చించి చెండాడినది.

(4) సంభవమే. ఏలయన అగ్బరు మరణము రాజునకుఁ బ్రియము - ఆజ్ఞాతృణీకరణాపరాధము వలనఁగలుగు నప్రియముకంటె ఈ వృత్తాంతము నెఱింగించుటవలన గలుగు ప్రియము హెచ్చుగా నుండునని తలఁచి కుమారుఁడు రాణా యొద్దకి పరుగెత్తెను.

(5) ఇచ్చట రసలుబ్ధుని సందేహము సహేతుకము. మీరా మరణవార్తను అగ్బరుచే నొకమాటలో చెప్పించి యున్న ఈ సందేహమునకుఁ దావుండదు.

(6) తనయాజ్ఞను నిర్వర్తించుమనను నమ్మకముచేతనే రాణా మీరాను ఆజ్ఞాపించెను. ఆమె తిరస్కృతియుఁ గాన రాదు. రెండవతూరి కుమారుఁడు అగ్బరు ఉదంతము చెప్పవచ్చినపుడు మీరా యమునామార్గమునఁ జనుచుండెనని చెప్పెను. రాణా సేవకవర్జితుఁడయ్యును ఆజ్ఞాపింపఁగల స్థితిలోనేకదా యున్నాఁడు. మీరా తనయాజ్ఞను తృణీకరించిన అప్పటి యతని నిర్ణయమెట్లుండునో మనమెట్లూహింపఁగలము?

(7) కుమారసింహుఁడు ముందు బయలుదేరెను; అగ్బరు తాఁతసేనులున్న స్థలమున వెదకెను. వారచ్చటలేరు. అతఁడు వారిని వెదకుచుండెను. కుంభరాణా అతనికన్న అయిదు (లేక) పదినిమిషములకు వెనుక బయలుదేరెను. అడ్డదారిబట్టి కుమారునికన్న ముందు ఆస్థలమునకుఁ బోయి వెదకుచుండెను. వెనుకవచ్చు కుమారసింహునికి ముందుఁ బోవు రాణా యగపడుటయెట్లు అసంభవము? కుమారుఁడు "తండ్రీ, నీవేల యింతలో నిచ్చటికి వచ్చితివి?" అనెను. తాను వచ్చుటకు ముందుగనే యెట్లువచ్చితివను భావమెగదా ఆ వాక్యమున ధ్వనితమగుచున్నది.

(8) కుమారుఁడు తన్నుఁదాను పొడుచుకొనెను; పొడుచుకొన్నట్లు నటించి రాణాచేఁబొగడించుకొనుటకుఁగాదు; దుఃఖభారమును సహింపలేకయే, పొడుచుకొనెను. తన్నుఁ

దానే కుదురుపాటునఁ బొడుచుకొనెను గావున 'ఆయప్పఁ బట్టు' చూచి పొడుచుకొనెను. అప్పటికిని గ్రుక్కు-మిక్కు మనక చావలేదు. తన విషాదమును వెలిపుచ్చు మాటలు పలికియే మరణించెను. ఇచ్చట కుమారుఁడు మహోపన్యాసము నొసఁగలేదని కాఁబోలు రసలుబ్ధుని కొఱఁత!

కుమారసింహుఁడు కుంభుని చీఁకటివఱుఁగునఁ బొడిచెను. ఆసమయమునకుఁ దనవైపున కేప్రక్క కనఁబడుచుండెనో ఆప్రక్కనే పొడిచెను. బహుశః వెనుక ప్రక్కగ నుండవచ్చును. ఆపోటు సద్యోమరణ సంపాదికాక పదినిమిషములు బ్రతుకనిచ్చునదిగా నుండును. ఇందేమి నిర్వాహణంపు తబ్బిబ్బు కనఁబడుచున్నది? అది యెచటనున్నదో రసలుబ్ధుఁడు తన బుద్ధిని శోధించుకొనవలయును.

(9) (a) ఒకేవిధమైన యాక్షేపములు చర్వితచర్వణముగ అందందుఁ దలయెత్తుచున్నవి. అందువలన నేనును బునరుక్తిదోషమునకు అగ్గము కావలసియున్నది. రాణా హేతువాదియని యిదివఱకే తెలిపియుంటిని. మీరా మతము నెడ నతనికి సహానుభూతిలేదు; తన గార్హస్థ్య సుఖమునకు భంగము కలుగుటవలన మతద్వేషము మఱింత నిశితమైనది. కాని, యీమతద్వేషమొక్కటియే యైన ఇట్టి ట్రాజెడీ జరిగియుండదు. అగ్బరు అంతఃపురములోనికి వచ్చుటయె ట్రాజెడీకి కారణము. మీరా ప్రసిద్ధభక్తి అగ్బరును రప్పించుటకు హేతువైనది. రాణా మీరాను శిక్షించుట తనమతము కన్న భిన్నమతము నవలంబించినందుకుఁగాదు; అగ్బరుపై మరులుగొన్నందుకు. అగ్బరు ఒట్టుపెట్టుకొని చెప్పిన మాటల

వలన మీరా నిరపరాధయనియుఁ దానే భ్రాంతి పడె ననియుఁ దెలిసికొని చింతించెను. కష్టములు తలదాఁకినపుడు మనస్సులోఁగొంత మాఱుపాటు సహజమేగాని, అవి మనఃప్రకృతిని మునుముట్ట మార్పఁజాలవు. మతముమాఱుదు– శైవుఁడు వైష్ణవుఁడుకాడు, వైష్ణవుఁడు శైవుఁడుకాఁడు. క్రైస్తవుఁడు మహమ్మదీయుఁడు కాఁడు, నాస్తికుఁడు ఆస్తికుఁడుకాఁడు. భ్రాంతిచే నిరపరాధను, భార్యను, చంపితినిగదా యను దుఃఖాగ్ని హృదయమును బరితపింపఁజేయుచుండ మతభేదముల మంచిసెబ్బరలు తలపోయుటకేమి యవకాశము గలదు ఆ దశలో?

(9) (b) రాణా మీరాను నిర్బంధమునందుంచినది—తనభార్య వీథుల వెంబడి పిచ్చిపట్టి తిరుగుచున్నదను అపవాదమునుండి కాఁచి కొనుటకును, కృష్ణమందిరమునకుఁ బోనీయకుండుటకును. మిగతదానికి సమాధానము (9) (a) లోనే కలదు.

(10) ఇది స్టేజిలో సరియైన దీపసౌకర్యములు లేనందున కలిగిన లోపము. నాటకమున నట్లులేదు.

(11) ధ్యాననిర్మగ్న చిత్తులై యొడలెఱుంగనివారు ఎల్లకాలమట్లే యుండరు; కొంతసేపటికి వారికి సామాన్య మనఃస్థితి గలుగును. రామకృష్ణ పరమహంసయు నిట్లె కొన్ని గంటలో (లేక) యొకటి రెండు దినములో ధ్యాననిర్మగ్నుఁడై యుండి మరల సామాన్య మనఃస్థితిని పొందుచుండెను. ఇది సహజమే. యమునాతీరమునకు వచ్చుచుండినపుడు మీరా

బాయి సామాన్య మనఃస్థితియుండే యుండెను. కావుననే అగ్బరు తాకసేనులతో సంభాషించెను.

(12) నాటకమునకు సంబంధింపని హల్లకల్లోలముతో రసలుబ్ధునకుఁ బనియున్నను ఇతరులకుండదు- మీరాబాయి రాముఁడు కాదు. ఉదయపుర ప్రజలు అయోధ్యా ప్రజలు కారు.

(13) మేవాడ్ అనగా మధ్యదేశము. అది రసపుత్రుల రాజ్యము. చితోడ్‌గడు పూర్వరాజధాని, తరువాత రాజధాని ఉదయపురమునకు మార్చఁబడినది. యమున మేవాడులో ప్రవహించుటలేదు. బనాస్‌నది ఉదయపురముప్రక్క ప్రవహించుచున్నది. ఈ యుపనదియు యమునలో గలయును. ఈ నదికేమైన యమున యని మాఱుపేరున్నదో యేమొ తెలియదు- కథలో మాత్రము యమున యనియున్నది. కవియు ఆ యముననే గ్రహించియుండునేమొ.

(14) సుశీల యెల్లపుడును దొంగలించు స్వభావము కలదియో కాదో చెప్పటకు నాటకమున ఆధారములులేవు. సుశీల తాను సొగసుకత్తెనను భ్రాంతికలది; తన్నలంకరించుకొనుట కాహారమును దొంగిలించియుండును. దానికి ఆహారపు విలువ తెలియదు. సహజముగ దొంగ కాకపోయినను ఒకొక్కప్పుడు ఒకనికి దొంగలించుబుద్ధి కలుగుట అసంభవముకాదు. ఈప్రశ్నలు నాటక విమర్శకుఁడు అడుగవలసినవికావు- ఇట్టి ప్రశ్నలు పోలీసు స్టేషనులో ఉచితముగా నుండును.

AOUA102B131

BC2

born on 30th

class in London

A ++er hi

మతము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA102B131
పుస్తకం పేరు	కవికోకిల గ్రంథావళి04 వ్యాసములు
తారీఖు	31 December 2025
ముందు అట్ట	
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేవి పేజీలు	
తయారు చేసెవరి	
పేజీలు విడదీసెవరి	
స్కాన్ చేసెవరి	
పరీక్ష చేసెవరి	
పేజీలు సరిచూసెవరి	
బైండింగు చేసెవరి	
ప్యాకింగు చేసెవరి	
పరిస్థితి	

277

anusha